"ఫౌండ్రీలో పనివాడుగా ఉండాలని నామటుకు నేనూ అనుకోలేదు. కాని నేను ఫౌండ్రీలో పని చేస్తున్నాను. ఎవరైనా అంతేమరి అని బదులు చెప్పాడు నెస్ట్రెంకో.

"అది మీ స్వవిషయం. కాని నాకుమాత్రం వేరే ఉద్దేశాలున్నాయి."

"అయితే నీకు ఉద్దేశాలున్నాయి. అవునా?

ఆ ఉద్దేశాలుండడానికి నీ వేమైనా నేర్చుకున్నావా? వింటున్నావా శాంకోజోరిన్? ఇతనికి యంత్రభాగాలు అతికించే పనివాడుగా ఉండాలని ఉద్దేశం లేదట. అంచాత అతను పని చెయ్యడట. ఇతని బాధ్యత అంతా నీదే. అతనికి అర్థంకాకపోతే ఆ విషయాలన్నీ నీవు వివరించి చెప్పు."

అన్నీ వివరించి చెప్పడానికి శాంకోజోరిన్ సంతోషంగా అంగీకరించాడు. వచ్చి తన ప్రక్కనే బెంచీమీద కూచోమని సైగ చేస్తూ ఇగోర్‌ను పిలిచాడు.

"అవును వివరిస్తాను. ఇలా వచ్చి కూచో. నీకు అంతా అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్లు చెపుతాను."

ఇగోర్ వెగటుగా చిరునవ్వు నవ్వుతూ అతను చెప్పే పాఠ మేమిటో చూద్దామని వచ్చి కూచున్నాడు. విచారకరంగా ఉన్న ఆ స్టేడియం అతనికి జ్ఞాపకం వచ్చింది. సాలొమన్ డవిడొవిచ్ పలికిన పేదపలుకులు జ్ఞాపకం వచ్చాయి. అంతా అతనికి విసుగుదలను, నిరుత్సాహాన్ని పుట్టించింది. ఈ గోలంతా దేనికి? దీంతో ఏమిటి అవసరం?

"నీవెందుకిలా బద్ధకంగా ఉంటావు చెర్నియావిన్?" అంటూ చెప్పడం మొదలుపెట్టాడు శాంకోజోరిన్. "ఇది నీకు మంచిదికాదు. నీవిలా ఉండడానికి కారణం నాకు తెలియదనుకోకు! నీ ధోరణి ఇలా ఉందికదూ? 'ఈ కాలనీలో ఉండేవాళ్ళంతా ఎందుకు నామీద ఇలా విరుచుకపడతారు? నేను – చెర్నియావిన్‌ను. నా గోల వీళ్ళ

కెందుకు? నేనేదో నాలుగైదు రోజులు వీళ్ళతో గడుపుతాను. తరువాత ఇక్కణ్ణుంచి ఉడాయించి ఈ విశాలపు ప్రపంచంలోకి వెళ్ళిపోతాను' ఇదీ నీ ఆలోచన. అవునా? ఏం? నేను సరిగ్గా చెప్పానంటావా లేదా?"

"ఇగోర్ మాటమాట్లాడలేదు. "కాని వాస్తవానికి నీవిక్కడ మాతో నాలుగేండ్లయినా ఉంటావు."

"ఉండి ఏం చెయ్యాలి?" అని అడిగాడు ఇగోర్.

'ఉండి ఏం చెయ్యాలా?' అంటే ఏమిటి నీ ఉద్దేశం? నీకేమైనా కాస్త జ్ఞానం ఉన్నట్లయితే... కొంచెం ఊహించుకో-నాలుగేండ్లు! సరేనయ్యా, ఇవాళ నీవు యంత్రభాగాలను అతికించేచోట పనిచెయ్యావు. రేపు ఫౌండ్రీలోకూడా పనిచెయ్యాలంటావు. తరువాత టర్నర్‌గాకూడా ఉండాలంటావు, 'నేను డాక్టర్ కావాలని ఉంది' అంటావు చివరకు. నన్ను ఆస్పత్రికి పంపండి, రోగులను బాగు చేస్తాను!' అంటావు. అంటే ఈ నాలుగేండ్లునీవు మమ్మల్ని ఇలా వేధించుకుతింటావన్నమాట! అదికాదు ఇది. ఇదికాదు అది అని నీవు కాలయాపన చేస్తూ ఉండడం, అందుకు మేమేమో నిన్ను గోలపెడుతూ ఉండడం, ఇదన్నమాట! ఇంతేనా నీ వ్యవహారం?"

శాంకోజోరిన్ అల్లిన ఈ కథ ఇగోర్‌లో ఉత్సుకతను రేకెత్తించింది. కాని ఇంతకంటెకూడా అతనిలో ఉత్సుకతను కలిగిస్తున్న విషయం వేరే ఒకటి ఉన్నది. తను అనుకునేదానికి అతను చెప్పేదానికి ఎక్కడా పొత్తులేదన్న విషయం సాధారణమైన మాటల్లో అతనికి వ్యక్తం చెయ్యాలనేదే అది. శాంకోజోరిన్ తన సరసనే కూచుని ఉన్నాడు. మిలమిల మెరిసే కళ్ళతో చూస్తున్నాడు. కాని ఎంచిచూస్తే శాంకోజోరిన్ ఏమంత చమత్కారి కాదుకదూ?

"నీవు చెప్పింది తప్పు కామ్రేడ్ జోరిన్" అన్నాడు ఇగోర్.

"సరే. నే చెప్పింది తప్పే అనుకుందాం. మరి అయితే ఒప్పు ఏమిటో నీవు చెప్పు."

"నీవు చెపుతున్నది ఇది: చెర్నియావిన్ డాక్టరు కావాలని కోరుకుంటున్నాడు. సరే. అలా కోరుకుంటే తప్పేమిటి? అనేక మంది డాక్టర్లు అవ్వాలని తహతహలాడుతున్నారు. అవునా? కాని మీరున్నారే-ఇక్కడవుంటే ప్రియమైన కామ్రేడ్స్ ఇలా అంటారు: 'నీ కిష్టమయ్యేదీ కాకపోయేదీ నీవు యంత్రభాగాలు అతికించేచోట పనిచేయ్యాల్సింది.' ఇహదానికి నేనిలా సమాధానం చెప్పవలసి ఉంటుంది: 'చాలా మంచిది కామ్రేడ్ కమాండర్! నేను అక్కడికే వెళ్ళి పనిచేస్తాను' కాని అలా చెప్పాలని లేదునాకు."

"కాని నిన్ను ఎవరు బలవంతపెడుతున్నారు చెర్నియావిన్? మేమా? కాని మేంకాదు! ఇదిగో, ఒకమాటు ఇలాచూడు!" అంటూ శాంకోజోరిన్ కిటికీవంక చూపించాడు: "ఇక్కడ నేం ఏమీ చుట్టూ కంచెలు పాతలేదు. కాపలావాళ్ళను పెట్టలేదు. నీ వెనకాతే తిరుగుతూ నిన్ను ఒక కంట కనిపెట్టేవాళ్ళుకాని లేక నిన్ను ఎదుర్కొనేవాళ్ళుకాని ఇక్కడెవరూ లేరు. మరి నీవు ఈ క్షణంలోనే ఎందుకు వెళ్ళిపోకూడదు?"

"వెళ్ళడానికి సిద్ధంగా......"

"వెళ్ళడానికి సిద్ధంగా - అంటే ఏమిటి నీ ఉద్దేశం? యంత్ర భాగాలు అతికించే షాపులో పని చెయ్యనని నీవు ఇప్పుడు చెప్పు; లేదా? డాక్టర్లు అవ్వాలని నీవు ఇప్పుడు అనలేదూ?" అన్నాను "అంటే అప్పుడు నేను ఎక్కడికి వెళ్ళాలి"

"ఎక్కడ డాక్టరువు అవుతావో అక్కడికి వెళ్ళాలి. వెళ్ళి చదువుకో లేదా దానికి అవసరమైనవి ఏమేమిటో అవన్నీ నేర్చుకో. అయినా వెళ్ళి ఒకమాటు ప్రయత్నించిచూడు."

"అంటే అది ఇక్కడ నేర్చుకోలేమంటావా?"

"అదిక్కడ నేర్చుకోవచ్చును సరే. కాని అది మనకు కొంత కాలం పోయిన తరువాతకాని లభించదు."

"అందుకని ముందు ఈ షాపులో పని ప్రారంభించాలంటావు?"

"ఏం ? ఆ షాపులో పని ప్రారంభిస్తే నీకొచ్చే ఇబ్బందేమిటి? షాపులో పనంటే అంత పాడుదనుకుంటున్నావా?"

"లేదు అసలువిషయం అదికాదు. కాని నీవు నాకు ఏవిషయం వివరించి చెప్పలేదు. దీని తాత్పర్యమేమిటి?"

"తాత్పర్యం ఏమిటంటే అది మనకు అవసరం. నీవిక్కడ రెండు రోజులున్నావు. ఉండలేదూ? నీకు భోజనం పెట్టారు. బట్ట ఇచ్చారు. పడుకోవడానికి పరుపు ఇచ్చారు. ఇవ్వలేదూ ? మరి నీవేమో ఇవాళ భోజనశాలలోకి వెళ్ళి అప్పుడే 'ఈ పని చెయ్యడానికి మీకు హక్కులేదు!' అని కేకలు వెయ్యడం మొదలు పెట్టావు. మాకు హక్కు ఎందుకు లేదూ ? నీవు ఎక్కడనుంచో ఇక్కడ ఊడిపడితే మేం నీకు అన్నీ అమర్చిపెట్టాలి. కాని మాకు హక్కులేదు. 'నేను ఇగోర్ చెర్నియావిన్ ను, నాకు మీరన్నీ ఇవ్వండి, నేను డాక్టర్ ను అవ్వాలనుకుంటున్నాను!' అని నీవు మా నెత్తినెక్కి స్వారీ చేస్తావన్నమాట. అయితే మాకుకూడా మాటలొచ్చును! మేముకూడా ఏదో ఒకటి అనవచ్చును! 'చెర్నియావిన్! ముందిక్కడ నుంచి కదులు. వెళ్ళి ఏ గంగలోనైనా కలువు డాక్టర్ చెర్నియావిన్!' అని మేంకూడా అనగలం.

"మీరామాట అనడానికి వీల్లేదు."

"వీల్లేదూ ? అలా అనుకుంటున్నావన్నమాట నీవు? అబ్బాయ్ నీకింకా మా సంగతి తెలీదు! 'నా ఇష్టం, నే వెళ్ళిపోతాను' అని నీవుమాత్రం అనవచ్చనుకుంటూన్నావు. కాని వాస్తవం చెప్పాలంటే నీవాపని చెయ్యకముందే మేము నిన్ను ఇక్కడనుంచి గెంటివెయ్యగలం నీవల్ల ఏమిటి మాకు ప్రయోజనం ? నీ వెవరవనికాని లేక నీ వెక్కడనుంచి వచ్చావనిగాని మేం ఒక్కమాట అయినా నిన్ను అడగలేదు నీవు ఎక్కడనుంచి వచ్చావో ఎక్కడ ఉంటావో ఎవడికి తెలుసు ? కాని నిన్ను మా స్నేహితుణ్ణిగా అంగీకరించాం. నీకు భోజనం పెట్టాం. బట్టలిచ్చాం. పడుకోడానికి జాగా ఇచ్చాం. మేమంతా ఒక కాలనీలో ఉంటే నీవు నీ తోవన ఉంటున్నావు.

డాక్టర్‌ను అవ్వాలని ఉండనీ, ఇంకా అదనీ ఇదనీ, మాటిమాటికొచ్చి డాబులు కొడుతున్నావు. అయినా నీవు మామీద పీసమెత్తయినా విశ్వాసం ఉంచావు కావు. మమ్మల్ని మాత్రం మా సర్వస్వం నీకు ధార పోయమంటున్నావు ఏం? మామీద చిన్నమెత్తయినా విశ్వాసం ఉంచకూడదూ? కాస్తయినా మమ్మల్ని నమ్మకూడదూ?"

"ఎవర్ని నమ్మమంటావు? అని అడిగాడు ఇగోర్ సాలోచనగా. శాంకో తను అనుకున్నంత అమాయకుడు కాదని ఇప్పుడతను ఊహించాడు.

"ఎవరినేమిటి? మా అందర్నీను!" అన్నాడు శాంకోజోరిన్.

"మిమ్మల్ని నమ్మమంటావా?"

"ఆ, ఆ. మమ్మల్ని నమ్మమంటున్నాను. చూడు! మేమంతా కలిసి జీవిస్తున్నాం, చదువుకుంటున్నాం, పనిచేసుకుంటున్నాం, వ్యవహారాలు నడుపుకుంటున్నాం. ఇన్ని పనులు వీళ్ళు చేస్తున్నారే ఇందులో ఏదో ఒక అంతరార్థం ఉండకపోతుందా అని నీ మనస్సుకు తట్టలేదూ? అవును డాక్టర్ చెర్న్యయావిన్! నీకు నీ అభిరుచులు తప్ప మరి వేటితోనూ పనిలేదు! ఏమైనా డాక్టరును అవ్వాలనే ఆ ఉద్దేశం ఏమిటి? మనమంతా లేబర్ కాలనీలో ఉంటున్నామని మనందరికీ స్పష్టంగా తెలిసిన విషయమే. అలాంటప్పుడు నీవు డాక్టర్‌వు అవుతావని ఎవరనుకుంటారు, ఎవరికి తెలుస్తుంది?

అప్పటికి చీకటి పడింది. వారింకా పడకగది బెంచీమీద కూర్చుని ఉన్నారు. అవతల ఆవరణలో దీపాలు వెలిగించారు. పిల్లలంతా ఎక్కడికో వెళ్ళారు. నడవలో అప్పుడప్పుడుమాత్రమే పద ధ్వని వినవస్తోంది. "సెవ్‌కా! సెవ్‌కా!" అని ఎవరో పిలుస్తున్నారు.

అంతా నిశ్శబ్దమైంది. శాంకోజోరిన్ మాటలు ఇగోర్‌ను సమాధానపరచలేదు. కాని ఇగోర్‌కు ఇహ అతనితో వాదించాలనే తలంపు పోయింది. అతనిలో ఇంకా ఏదో సులభసూత్రమైన కోరిక

మొలకెత్తింది: పోనీ ఎందుకు ప్రయత్నించకూడదూ ? ఈ మనుష్యుల మీద ఏంతో కొంత విశ్వాసం ఉంచడానికి అతను సిద్ధపడ్డాడు.

"ఓ ! ఈ విషయాలన్నీ నేనేదో లోకాభిరామాయణంగా మాట్లాడుతున్నాను." అన్నాడతను జోరిన్ తో. "అంతేకాని నిజంగా నేనంత నిరంకుశుణ్ణని అనుకుంటున్నావా ? నీ వెక్కడా పనిచేసేది?"

"యంత్రభాగాలతికించే షాపులో."

"అక్కడపని బాగా ఆసక్తి కలిగించేదేనా ?"

"లేదు. ఏమీా ఆసక్తి కలిగించదు."

"ఇంకేం, అలా చెప్పనాయనా."

"అయితే, నీకు ఆసక్తిగల పనులలోనే నిన్ను ఉంచుతారని నీ వనుకుంటున్నావన్నమాట ? ఏదో సంగీతంలాంటిదైతే హాయిగా ఉంటుందనుకుంటున్నావు, ఏం? ఏదే ఆసక్తిలేని పనే చెయ్యవలసి వస్తుందనుకో అది చెయ్యవన్నమాట ?"

"ఏదో ఆసక్తిలేని పనే చెయ్యవలసివస్తుందనుకో !" అన్నాడు మళ్ళీ ఇగోర్. ఇలా అని జోరిన్ కళ్ళల్లోకి చూచాడు. జోరిన్ కళ్ళు సవాలు చేస్తున్నట్లుగా తళతళ లాడుతున్నాయి. "ఆసక్తిలేని పని చెయ్యాలి ! అయితే ఇందులో ఏదో ఆసక్తి కలిగించే అంతరార్థం ఉన్నదయ్యా బాబూ" అన్నాడు.

24

పార్కులో అమ్మాయి

కాలనీలో రెండవనాటి ఉదయం ఇగోర్ బిగిల్ కూత వినిపించగానే ఎవరితోనూ పని లేకుండా నిద్రలేచాడు. అతి చులాగ్గా, గభాలున పక్కమీదనుంచి లేవడం అతనికెంతో హాయిగా ఉంది. కాని లేచిన తరువాత చేయవలసిన పనులుమాత్రం అతనికి అసాధ్యంగా అగుపించసాగాయి. తక్కినవాళ్ళ పక్కలను ఒక కంట కనిపెడుతున్నాడు. వారంతా ఎలా చేస్తే తనూ అలాగే చెయ్యడానికి ప్రయత్నించాడు. కాని అది మరీ అధ్వాన్నమైపోయింది. అతని పక్కచుట్ట ఒక కొసన ముద్దముద్దయి ఇంతలావున తయారైంది. పక్కచుట్ట మధ్యభాగమంతా అష్టవంకరలు తిరిగింది. దుప్పటి ఒకేచోట కుక్కి పెట్టడంవల్ల ఇలా జరిగింది. అతని అవస్థ గమనించాడు శాంకో జోరిన్. వెంటనే అతనిదగ్గరికి వచ్చి పక్కచుట్టంతా విప్పితీసి గుడ్డలు విడివిడిగా పరిచాడు.

"ఇప్పుడు నేను చుడతాను చూడు" అన్నాడు ఇగోర్‌తో.

ఇలా శాంకోజోరిన్ చేసి చూపుతోంటే ఆ పనిలోని మెలుకువలు ఏమిటో గ్రహించుకున్నాడు ఇగోర్. దుప్పటిని రెండుగా మడిచాడు జోరిన్. తరువాత దాన్ని పరుపుమీద పరిచాడు. ఇప్పుడు గుడ్డ అంతటా సఫేనుగా వచ్చింది. ఇహ పరుపు చుట్ట చుట్టాడు. అది ఎక్కడా హెచ్చుతగ్గులన్న మాట లేకుండా స్తంభం నిలుచున్నట్లు నిలుచుంది.

"థ్యాంక్స్." అన్నాడు ఇగోర్. అతనిపనికి మెచ్చుకుంటూ "థ్యాంక్సు చెప్పవలసిన పనిలేదు" అన్నాడు జోరిన్.

ఆనాటి ఉదయం ఇగోర్ మహా ఉల్లాసంగా ఉన్నాడు. డ్యూటీలో ఉన్న కమాండరు పడకగదిలోకి వచ్చి చూచేసరికి అందరిలాగానే తనూ వెళ్ళి వరుసలో నిలుచున్నాడు శాల్యూట్ చెయ్యడానికి. ఆనాడు వచ్చే కమాండరు నాలగవదళానికి చెందిన వాడు. అతని పేరు అల్యోషా జిరియాన్స్కీ— కాలనీలో అతని పేరు తెలియనివాళ్ళు లేరు. అతను "వెయ్యి కళ్ళ"తో చూస్తాట్ట. దళం మానేటర్లందరూ ఉరుకులు పెరుగుతూ ఎవరుపనులు వారు చేసేశారు. మరో పది నిముషాల్లో తనిఖీ జరుగుతుందనగా నెస్త్రెంకో స్వయంగా ఒక తుడుపుగడ్డ తీసుకుని వొరొషిలోవ్ చిత్రపటమును తుడిచి శుభ్రం చేశాడు.

"ఇవాళ డ్యూటీలో ఉన్నదెవరో మీరు మరిచిపోయినట్లున్నారు కదూ?" అని అతను పడకగది మానేటరైన ఖారిటన్ సావ్చెంకోను అడిగాడు.

ఖారిటన్ గబగబ పక్కచుట్టల క్రింద, తాళాలు పరిశీలించాడు.

"మరి చేతిగోళ్ళ మాటేమిటి? అని అడిగాడు నెస్త్రెంకో, వారంతా వరుసలో నిలుచున్న తరువాత: "అందరూ గోళ్ళు కత్తిరించుకున్నారా?"

వెంటనే ఒక కుర్రవాడు తన చేతులు చూచుకుని "కత్తెర్లు ఎక్కడ పాడయినాయయ్యా?" అని అరిచాడు.

"దప్పిక అయినప్పుడు బావి త్రవ్వితే ఏం ప్రయోజనం? తనిఖీకి బిగిల్ కూత వినిపించింది. ఇప్పుడు నీవు కత్తెర్లకోసం వెదికితే ఎక్కడ కనిపిస్తాయి?...మరి నీమాటేమిటి చెర్నియావిన్? నీ గోళ్ళు శుభ్రంగా ఉన్నాయా?" అన్నాడు నెస్త్రెంకో.

"శుభ్రంగానే ఉన్నట్లున్నాయి!"

"ఉన్నట్టున్నాయి అంటే సరిపోదయ్యా. గొంటార్! నీ వతనికి కత్తెర తెచ్చి ఇవ్వు. ఏవోయ్! నీవు గోళ్ళు కత్తిరించి ఎక్కడ పడేస్తున్నావో అది చూడు. ఓ! మిషా! ఏం పనిచేశావయ్యా!"

కాని తనిఖీచేసేవాడు పడకగదిలోకి రానేవచ్చాడు. నెస్ట్రెంకో వసారాలో ఉన్న వాళ్ళందరినీ అటెన్షన్‌లో ఉండమని హెచ్చ రించాడు. జిరియాన్‌స్కీకి పదహారేండ్లుంటాయి. అంత పొట్టీకాదు, అంత పొడుగూకాదు. బాగా ఎదిగిన శరీరం అతనిలో అందరికీ కొట్టొచ్చేటట్లు కనిపించేవి అతని గోధుమరంగు కళ్ళు. ఆ కళ్ళల్లో ఎంతో తెలివి కనిపిస్తుంది. ఆ చూపులు గుచ్చుకునేటట్లు ఉంటాయి. కనుబొమలు పొట్టి నిటారుగా ఉండి, ముడిపడ్డట్లు దట్టంగా పెరుగు తున్నాయి

దళం తనను ఇంకా ఆహ్వానిస్తుండగానే జిరియాన్‌స్కీ అక్క డంతా గమనించాడు. కాని అతనలా ప్రతిదీ గమనిస్తున్నట్లు ఎవరూ తెలుసుకోలేరు. నెస్ట్రెంకో అందించిన సమాచారమంతా విని అతని వంక కులాసాగా చూచాడు.

జిరియాన్‌స్కీ పడకగదంతా తిరిగి పరిశీలించలేదు. ఏదీ తాకిచూడడంకాని తొంగి చూడడంకాని చెయ్యలేదు. కాని వెళ్ళి పోయేముందు తనతోపాటు డ్యూటీలో ఉన్న అమ్మాయివంక తిరి గాడు. ఆరోగ్య కమిషన్‌కు చెందిన అమ్మాయి ఆవిడ. డ్యూటీ మీద అతనితోపాటు వచ్చింది. నెమ్మదస్థురాలులాగాను, విధేయత కలదానిలాగాను కనిపిస్తోంది.

"దళం పడకగది అసహ్యంగా ఉన్నదని రిపోర్టులో వ్రాసుకో" అన్నాడు జిరియాన్‌స్కీ. ఆ అమ్మాయితో.

"అసహ్యంగా ఉన్నదా! అంటే ఏమిటి మీ ఉద్దేశ్యం అలోష్యా?" అని అడిగాడు నెస్ట్రెంకో.

"మరి దీన్ని ఏమంటావు? మొదట నేలంతా తుడిచి శుభ్రం చేశారు. తరువాత దానిమీదే గోళ్ళన్నీ కత్తిరించి పడేశారు! దీన్ని మీరు అసహ్యం అని అనరా ఏమిటి?"

నెస్ట్రెంకో మాట్లాడలేదు.

"నీకు తెలియందేమీ లేదు వాస్యా. డ్యూటీమీద వచ్చిన కమాండర్‌పై కస్సుమంటే ఏంలాభం చెప్పు" అన్నాడు జిరియా

న్స్కీ వాకిలిదగ్గరికి వెళ్ళిన తరువాత. "పోతే మరో విషయం, మీ దగ్గర ఆ కొత్తకుర్రవాడున్నాడే, అతనసలు గోళ్ళు కత్తిరించు కోనేలేదు. ఇంతింత పొడుగున ఉన్నాయి. అతను శాల్యూట్ చేసే టప్పుడు చూశాను. అతని చెయ్యి తోడేలు పంజాలాగా ఉంది" అన్నాడు.

తనిఖీ అయిపోయిన తరువాత నెస్ట్రెంకో ఇహ ఊరుకోలేక పోయాడు.

"ఛా, ఛా! ఎంత మడ్డిమనుషులు!" ఇలా పదే పదే అనడం మొదలుపెట్టాడు. అంతా నీదే తప్పు మిషా. గోళ్ళంటే ఎందుకయ్యా అంత మక్కువ? ఎవడైనా గోళ్ళు కత్తిరించుకుని అవి అక్కడే పారేస్తాడటయ్యా? అక్కడే-శుభ్రంగా తుడిచిన గదిలో! ఛా, ఛా! ఇలాంటిపని ఎలా చెయ్యగలిగావు? జఖరోవ్ ఆ రిపోర్టు తీసి పారేస్తే బాగానే ఉంటుంది. కాని ఆ విషయం సర్వసభ్య సమావేశంలో చర్చకు పెడితే - అప్పుడేం కావాలి."

ఇందుకు మిషాగోంటార్ ఏమీ సమాధానం చెప్పలేదు. అతను క్రిందికి వంగి నేలమీద పడిఉన్న గోళ్ళన్నీ పోగుచేసి చేతిలోకి తీసుకున్నాడు.

"అలా సంభవిస్తే సర్వసభ్య సమావేశంలో నేనే ఉన్నదున్నట్టు చెప్పేస్తాను: ఈ తప్పంతా మిషా గోంటారిది. ఒట్టు, ఇదే మాట చెపుతాను. అంతేకాదు. మళ్ళీ ఇలాంటి అసహ్యమైన పని చేశావా. అంటే నిన్ను మూడుగంటలసేపు అరెస్టులో ఉంచమని జఖరోవ్‌తో చెపుతాను. ఇంకేంకావాలి? జరిగిన కథంతా ఒక్సానాతోకూడా చెపుతాను. ఆవిడకూడా తెలిసికొని ఉండడం మంచిది. గోంటార్ ఇప్పటికీకూడా కమాండర్‌కు ఏమీ సమాధానం చెప్పలేదు. సాటివారి సమక్షంలో అతనికింత వస్తైంది. ఇంకేం కావాలి? నెస్ట్రెంకో ఇహ అతన్ని ఇంతటితో వదిలిపెట్టి ఇగోర్ వంక తిరిగాడు:

"నీవు షాపులో పనిచెయ్యడానికి వెడుతున్నావా లేక కులాసాగా కబుర్లాడుకుంటూ కూచుంటావా ?" అంటూ నెస్ట్రెంకో విసుగుదల, అసంతృప్తి వ్యక్తంచేసే కంఠస్వరంతో ఇగోర్‌ను అడిగాడు.

గోంటార్‌లాగా కాక తన నింతమాత్రం తేలిగ్గా వదిలిపెట్టి నందులకు ఇగోర్, కమాండర్‌పట్ల కాస్త సక్రమంగా ప్రవర్తించాలనుకున్నాడు.

"సరే. అలాగే వెడతాను" అని బదులు చెప్పాడు.

భోజనాలయిన తరువాత రెండవతడవ పనిచేసేవారితోపాటు ఇగోర్ కూడా షాపులో పని ప్రారంభించాలన్నారు. అది ఇగోర్‌కు నచ్చింది. అంటే ఈలోపల తనావిషయాన్ని అవతలకు నెట్టి కాస్త కులాసాగా తిరగొచ్చునన్నమాట. ఉపాహారం అయిన తరువాత అతను ఒకమాటు అలా పార్కువైపు వెళ్ళి కోనేట్లో ఈతకొట్టి వద్దామని నిశ్చయించుకున్నాడు. కాని అతనలా పార్కువైపు కాస్త లెక్క పోగానే ఒక "చక్కని రూపం" - ఒక అమ్మాయి ఎదురు పడింది.

"స్వేచ్ఛాజీవితం" గడిపేరోజుల్లో ఇగోర్ ఆడపిల్లల అభిమానం సంపాదించాలని కొన్ని ప్రయత్నాలు చేశాడు. అందుకోసం రకరకాల పద్ధతులు అవలంబించాడుకూడా. చక్కగా క్రాపు దువ్వుకోవడం, చొక్కా బొత్తాములను సరిగ్గాఅమర్చి పెట్టుకోవడం, శుభ్రంగా ముస్తాబు చేసుకోవడం; ఇంకా ఏవేవో ఇలాంటివి. కాని ఇన్నిచేసినా చెప్పుకోదగ్గవిధంగా ఒక్క అమ్మాయికూడా అతనిపట్ల ఉత్సుకతను కనపర్చలేదు. అయినా తను ఈ విషయాల్లో సమర్థుడనని అనుకుంటూ ఉండేవాడు. కాని ఏ అందమైన అమ్మాయిని అయినా చూచినప్పుడు తప్ప తరువాత వారి విషయం పూర్తిగా మరిచిపోయేవాడు. ఈకారణంవల్ల కొత్త అమ్మాయిని కలుసుకోవడం తటస్థించినప్పుడల్లా ఆవిడ విషయం తెలుసుకోవాలనే తొందరపాటు కలిగేది.

ఈ ఉత్సుకతతోనే ఇప్పుడతను పార్కులో కనిపించిన ఆ అమ్మాయిని సమీపించాడు. ఆవిడ ఎంతో "చక్కనిది"గా కనిపించింది అతనికి. ఈ "చక్కనిది" అనే మాట అతనికి దాచుకున్న ఒక గొప్ప నిధిలాంటిది. భావంలో ఏమి, విలువలో ఏమి ఆ మాటలో ఎంతో విశేషం ఉన్నదని అతని ఊహ. నిజానికీమాట తన తండ్రివల్ల సంక్రమించింది. అతని తండ్రి ఎప్పుడూ ఏ విషయం చెపుతున్నా ఇదేమాట ఉపయోగించేవాడు. 'అతను చక్కనివాడు!' ఆవిడ ఎంతో చక్కనిస్త్రీ! అదిచక్కనివ్యూహా'అని ఇలా అ సమానం చక్కని, చక్కని అని విశేషణం చేరుస్తూ ముచ్చట చెప్పేవాడు. ఇగోర్ మాత్రం తనతండ్రి చెప్పగా తనకు ఈ మాట అలవడినదన్న విషయం మరిచిపోయాడు.

అంచాత పార్కులో తన కెదురుగా వస్తున్న ఆ అమ్మాయి 'చక్కనిది'గా కనిపించింది అతనికి. ఆ పిల్ల చాలా హీనంగాను, అనాకర్షణీయంగాను ముస్తాబు చేసుకున్నది. కనుకనే ఆవిడ అందం ఎంతో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఆవిడ కాలనీలో సభ్యురాలు కాదని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. కాలనీలో వాళ్ళయితే కొత్తగా నవనవలాడుతూ ఉంటారు.

ఆవిడ ముఖం ఆలివ్ వర్ణంలో అసాధారణంగా కనిపిస్తోంది. చక్కని గులాబీరంగు చెక్కిళ్ళు. ముఖంలో ఎక్కడా ఒక్క మొటిమ కాని మచ్చకాని లేదు. మెరుగేమీ లేకుండా అంత స్వచ్ఛంగా, అంత నిర్మలంగా ఉండే ముఖాలను సాధారణంగా చూడం, గోధుమ రంగు కళ్ళు ఆ పిల్లవి. నల్లటి కనుబొమలు, సన్నగా తీర్చి దిద్దినట్లున్నాయి. ఆవిడ జుట్టు నల్లగా, నిగనిగ లాడుతోంది. చక్కగా జడ అల్లుకున్నది. కణతలదగ్గర వెంట్రుకలు స్వేచ్ఛగా ఉంగారాలు తిరిగి ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆవిడ చక్కనిది. చూడ ముచ్చటగా ఉన్నది.

ఇగోర్ ఆగిపోయాడు.

"అంత అందమైన కళ్ళు నీ కెవరిచ్చారమ్మాయ్?" అంటూ నిర్ఘాంతపోయి అడిగాడు.

ఆ అమ్మాయి ఆగింది. త్రోవన ఒక ప్రక్కకు తప్పుకుని చెయ్యిపై కెత్తి ముఖందాకా" పోనిచ్చింది.

"ఏం? నా కళ్ళ కేమైంది ?" అని అడిగిందాపిల్ల,

"చాలా అపురూపమైన కళ్ళు నీవి !"

ఇప్పుడావిడ కళ్ళల్లో కోపం కనిపించింది. తరువాత కళ్ళు దించుకుంది. సిగ్గుతో ఎర్రబారిన ముఖాన్ని ఒక ప్రక్కకు తిప్పు కుంది. గబగబనడుస్తూ త్రోవతప్పించి పచ్చికలోకి వెళ్ళింది.

"నిన్నెవరూ కొరుక్కుని తినరులే అమ్మాయీ!"

ఆవిడ ముఖం వెనక్కు తిప్పి అతనివంక కఠినంగాను, అను మానంగాను క్రీగంట చూచింది.

"నీపని నీవు చూసుకో నీ త్రోవన నీవు వెళ్ళు!" అన్నది.

"వెళ్ళేందుకు వేరే మార్గం ఉంటే వెళ్ళేవాణ్ణే కాదు కనుకనే ఊరుకున్నాను. అది సరేకాని నీ పేరేమిటి?"

ఆవిడ తన రెండు పాదాలు అటూ ఇటూ ఊరికె కదపడం మొదలుపెట్టింది. ఆవిడ కాళ్ళకు జోళ్ళు లేవు.

"నీవు కాలనీనుంచి వస్తున్నావా?" అని అడిగింది చిరునవ్వు నవ్వుతూ.

"అవును" అన్నాడతను.

"నీవు చాలా తమాషా అయిన కుర్రవాడివే!"

ఆవిడ నిజంగా ఎంతో ఉత్సాహంతో ఈ పరాచకం ఆడింది. మళ్ళీ అతనివంక క్రీగంటచూపు ఒకటి విసిరింది. పచ్చికమీదినుంచి చరచర నడుస్తూ మళ్ళీ అతనివంక తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

25

షాపులో పని

షాపులో ఉండే ఫోర్‌మన్ చాలా లావుగా దృఢంగా ఉన్నాడు. ఎర్రటి - గులాబీరంగు చెక్కిళ్ళు. అతనిపేరు ఫైవెల్. ఇగోర్ వంక ఆశ్చర్యంగా చూచి.

"అయితే ఎక్కడా పని చేయలేదంటావు, అంతేనా?" అని అడిగాడు.

"అవును, ఎన్నడూ పని చేయలేదు" అని చెప్పాడు ఇగోర్.

"కొత్తగా వచ్చావు, ఏం!"

"అవును. ఇదే మొదలు"

"పోనీ ఇంటిదగ్గర నీవు ఎన్నడూ నేల అయినా ఊడ్చుకో లేదా?"

"లేదు. ఎన్నడూ ఊడ్చుకోలేదు."

"సరే. నీకు అంతగా అనుభవం లేదంటావు, అంతేనా? అయినా మరేం పరవాలేదు......ఇహ మనం మొదలు పెడదాం. మొదట నీకు కుర్చీల బందులు నునుపు చెయ్యడం నేర్పుతాను. అది చాలా తేలికఅయిన పని".

"కుర్చీల బందులా! అంటే ఏమిట వి?"

ఫోర్‌మన్ అక్కడ పూర్తిచేసి ఉన్న ఒక కుర్చీని తన కాలితో తాకి చూపించాడు.

"ఇదిగో, ఈ కుర్చీకి బందు ఉన్నది చూచావా? వాళ్ళు ఈ కుర్చీని అంతా తయారుచేసి ఇక్కడ పెట్టారు. కాని దీన్నింకా

నునుపు చెయ్యాలి. అంటే బందుమీద అక్కడక్కడ బుడిపెలు అలాగే వదిలేశారన్నమాట చూడు, ఎంత అసహ్యంగా అగుపిస్తున్నాయో. నీ విప్పుడు వాటిని ఆకురాయితో రుద్ది నున్నగా సాన పట్టాలి. వాళ్ళు కుర్చీ అంతా నున్నగా మెరుగు పెట్టారు. కాని ఆ బందులుమాత్రం అలాగే ఉంచేశారు. వాటినలా గరుకుగా వదిలేసినా ఫరవాలేదని వాళ్ళ ఉద్దేశం".

ఫోర్ మన్ కేవలం మాటలతో వదిలిపెట్టేవాడుకాదు. చేసే చూపించేమనిషి. అతని చేతులు ఊరికలేవు ఒకవైపున నోటితో మాట్లాడుతూనే మరోవైపు చేతులతో పని చేస్తున్నాడు. ఇగోర్ కు ముందున్న బెంచీమీద కుర్చీల బందుకట్లు గుట్టగా పడేసి ఉన్నాయి. అక్కడే ఒక పెద్ద ఆకురాయి, కొన్ని మెరుగు కాగితాలుకూడా ఉన్నాయి. ష్రైవెల్ ఒక కుర్చీ బందుకట్టు తీసుకుని దానిమీద ఆకురాయి పెట్టి పైకీ క్రిందికీ రుద్దాడు. తరువాత మెరుగు కాగితంతో మెరుగుపెట్టి నున్నగా వచ్చిందో లేదో అరచేతితో తాకి చూచాడు.

"చూడు ఎంత చక్కగా తయారైందో! చేతికి నున్నగా తగులుతోంది. ఇహ నీవు చెయ్యి చూద్దాం!"

ఫోర్ మన్ ఇలా చెప్పడం, చేసి చూపించడం అయింది. ఇగోర్ అతనివంక అక్కడున్న ఆకురాయి, మెరుగుకాగితం మొదలైన పనిముట్లువంక కుతూహలంతో చూచాడు. ఫోర్ మన్ 'ఫరవా లేదు నీవు పని నేర్చుకోగలవు' అని ప్రోత్సహిస్తున్నట్లుగా ఇగోర్ ను భుజంమీద తట్టి అక్కడనుంచి వెళ్ళిపోయాడు. ఇగోర్ ఒక కుర్చీ బందుకట్టును తీసుకుని దాన్ని ఆకురాతితో రుద్దడం మొదలుపెట్టాడు. కాని ఆ పని అతనికి చాతకాలేదు .అంతా అడ్డదిడ్డంగా చేస్తున్నాడు. బందుకట్టు దాని ఇష్టంవచ్చిన తీరుగా ఎటుపడితే అటు తిరిగి పోతోంది. పదునుగా, కోసుగా ఉన్న ఆకురాయి అంచు అతని చేతివ్రేళ్ళకు తగిలి కొద్దిగా కోసుకపోయింది. రెండువ్రేళ్ళకు కొద్దిగా దెబ్బ తగిలి నెత్తురు కారడం మొదలుపెట్టింది. అతని ప్రక్కనే ఉన్న

మలో పాఠా "భలే, భలే! పని బాగా ప్రారంభించావుకొత్తమీద!"
అన్నాడు.

అది తనకు పరిచయమున్న కంఠస్వరం కావడంచేత ఇగోర్ వెనక్కు తిరిగి చూచాడు. ఆ మాట్లాడింది సెరెడిన్ అనే కుర్రవాడు, అతను ఇగోర్‌కు పరిచయమే. అతను నెస్ట్రెంకో పోకిలా అని పిలిచేవాడు. అతన్ని ఎనిమిదవ దళంలో ఉంటున్నాడు. క్రాపు ఒత్తుగా కత్తిరించుకున్నాడు. తల కొంచెం వెనక్కు వాల్చుకున్నాడు. కుర్చీలకు వెనకవైపు వేసే పల్చని చట్రాలు చాలా పట్టుకొని ఉన్నాడు. రూళ్ళకర్రకు మెరుగు కాగితంచుట్టి దాంతో ఆ చట్రాలకు మెరుగు పెడుతున్నాడు. పని చెయ్యడంలో అతనెంతో శ్రద్ధను, ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఇగోర్ అతనివంక సరిగ్గా చూసీ చూడకముందే అతను ఆ కాసేపట్లోనే వాటికి మెరుగుపెట్టి అవతల కుప్పమీద పడేసి, మరికొన్ని చట్రాలు చేతపుచ్చుకున్నాడు.

"అక్కడ బీరువాలో టించర్ అయొడిన్ ఉంది కాస్త తెచ్చుకో. మరేం భయంలేదు. మొదట్లో అందరికీ ఇలాగే అవుతుంది" అన్నాడు సెరెడిన్ చిరునవ్వు నవ్వుతూ.

ఇగోర్ బీరువాదగ్గరికి వెళ్ళి చూచాడు. అక్కడొక పెద్ద సీసాలో టించర్ అయొడిన్, గాయాలకు కట్టుకట్టే పల్చటిగుడ్డ అగుపించాయి. వేళ్ళకు గీచుకపోయినచోట కొంచెం టించర్‌తో అద్దుకున్నాడు. తరువాత కొంచెం గుడ్డతీసుకొనిపోయి వేళ్ళకు కట్టు కట్టమని సెరెడిన్‌ను అడిగాడు.

"ఓహోహో, భలేవాడివి! కట్టుకట్టమనల్లా అడుగుతున్నావూ? అరె ఎంతగుడ్డ తెచ్చావు ఏంకథ! ఈ కాస్తదానికి కట్టుకట్టాలా? ఆ? ఇంకాసేపటికి ఏకంగా డాక్టర్‌నే పిలువమనేటట్లున్నావు!" అన్నాడు సెరెడిన్.

"మరి నెత్తురు కారుతోంది."

"ఏమయ్యా! కారితే? ప్రాణంపోతుందా ఏమిటి? కాస్త టించర్ దానిమీద పడేస్తే తీరిపోయె. నెత్తురు నెత్తురంటావు, ఏం

కారింది నేతుడు? ఒక్క బొట్టు. ఈపాటిదానికే ఎంతహంగామా చేస్తున్నావు!"

ఇగోర్ ఈ సమయంలో అతనితో వాదించదలుచుకోలేదు. కట్టుగుడ్డ తీసుకుపోయి మళ్ళీ బీరువాలో పెట్టి వచ్చాడు. కాని అతని వ్రేళ్ళు చిమచిమ లాడుతున్నాయి. చేతులు నొప్పిగా ఉన్నాయి. మరో బందుకట్టు తీసుకుని పని చేయడానికి కష్టమనిపించింది. అలాగే తీసుకుని ఆకురాయితో రుద్దడానికి ప్రయత్నించాడు. కాని హఠాత్తుగా కోపము తెచ్చుకుని ఆ వస్తువులన్నీ అవతల పారేశాడు. బెంచీ కానుకుని షాపుఅంతా కలయచూడడం మొదలు పెట్టాడు.

నిజంగా ఇదొక వర్క్‌షాపు అనడానికి వీల్లేదు. పాడైపోయిన పొరలచెక్కలు కొన్ని ఒకదానికొకటి చేర్చి గోడకు ఆసరాగా అమర్చిపెట్టాడు. నిజానికి ఇదొక షెడ్డు దీనికి వాళ్ళు యంత్రభాగాలు అతికించే షాపుఅని ఒకపెద్ద పేరుపెట్టి పిలుస్తున్నారు. ఇంకా వాస్తవం చెప్పాలంటే ఒకొక్కజట్టుగా పని చేయడానికివచ్చే ఇరవైమంది పిల్లకాయల్లోనూ ఒక నలుగురుమాత్రమే ఈ షెడ్డుక్రింద కూచుని పని చేయటానికి బాగాఉంది. తక్కినవాళ్ళందరూ కూడా వట్టి ఆరు బయటనే కూచుని పనిచేస్తున్నారు. యార్డుకొసన పొడుగ్గా పెరిగిన కొన్ని పోప్లార్ చెట్లనీడ కాస్త ఆధారం చేసుకున్నారు పాపంవాళ్ళు. ఆరుబయట ఒకదానికొకటి దగ్గరగా చేరవేసిన బెంచీలు చాలా పడిఉన్నాయి. రకరకాల బెంచీలు- కొన్ని పొడుగువి, కొన్ని పొట్టివి. అన్నీకూడా ఏవో కర్రముక్కలు ఒకదానికొకటి జతచేసి ఏదోనామ మాత్రంగా తయారుచేసినవని స్పష్టంగా తెలుస్తోంది. చాలామంది కుర్రవాళ్ళు వట్టి నేలమీద కూచుని పనులుచేస్తున్నారు. మధ్యమధ్య మెషీన్‌షాపు నుంచి ఒక పొడుగాటి కార్మికుడు వచ్చి కట్టలు కట్టలు విడిభాగాలు అక్కడపడేసి పోతున్నాడు కాలనీలోని వడ్రంగం షాపులో తయారయ్యే వస్తువులల్లా నాటకశాలకు పనికివచ్చే సింధూరపు కర్ర కుర్చీలుమాత్రమే. ఇహ మెషీన్‌షాపు పనల్లా కుర్చీల వెనకభాగాలు, సీట్లు, కాళ్ళు, బందుకట్లు తయారుచేసి ఇవ్వడం.

నాటకశాలకు పనికివచ్చే కుర్చీలు, మూడుకుర్చీలు ఒకదానికొకటి అతికించి ఒకటిగా తయారుచేస్తారు. కాని ఇలా సెట్లు తయారుచేసే ముందు వేర్వేరుభాగాలు- అంటే సీట్లు, చట్రాలు మొదలైనవి ఒక దానికొకటి అతికించవలసి ఉంటుంది. వేర్వేరు భాగాలు అతికించడం, తరువాత వాటిని పూర్తి సెట్లుగా తయారుచెయ్యడం; ఈ రెండు పనులు పనిలో ఇంకా బాగా తర్ఫీదుపొంది ప్రవీణులైన కుర్రవాళ్ళకు మాత్రమే ఒప్పగిస్తారు. ఇలా తర్ఫీదుపొంది ప్రవీణులైన కుర్ర వాళ్ళలో శాంకోజోరిన్ ఒకడు. వారంతా ఎంతో శ్రద్ధగా, దీక్షతో పని చేస్తున్నారు. వారి చేతులలో ఉన్న కొయ్య సమ్మెటలు తెంపు లేకుండా పైకీ క్రిందికీ ఆడుతున్నాయి. విడిభాగాలన్నీ .అతికించి వాటిని ఆ ప్రక్కనే గుట్టగా పడేస్తున్నారు. మూడుసీట్లుగల కుర్చీలు తయారైన తరువాత వాటిని జోరిన్ పరిశీలించవలసి ఉంది. జోరిన్ అక్కడే ఉన్నాడు. అప్పుడే మూడుసీట్ల కుర్చీ ఒకదానికి చట్రాలు, కాళ్ళు అతికించి అక్కడ నిలవబెట్టారు. ఇహ దానికి సీట్లుమాత్రమే అతికించాలి. పిల్లవాళ్ళల్లో ఎక్కువమంది ఇగోర్ చేస్తున్న పనిలాంటి పనులే చేస్తున్నారు. వారిచేతుల్లో ఆకురాళ్ళు తెంపులేకుండా పైకీ క్రిందికీ ఆడుతున్నాయి. బరబరమని, గరగరమని, గణగణమని ధ్వనులు తెంపులేకుండా వినిపిస్తున్నాయి.

ఇగోర్ అలాగే పాపులంతా కలయచూస్తూ కూచున్నాడు. తుదకు సెరెడిన్ అతన్ని ఇలా ప్రశ్నించాడు:

"నీవు పనిచెయ్యడం లేదేం? ఇష్టంలేదా!"

ఇగోర్ మళ్ళీ తన బెంచీవైపుకు తిరిగి మాట్లాడకుండా ఆకు రాయి చేతపుచ్చుకున్నాడు. మొద్దుగా, బరువుగా, గరుకు గరుకుగా అక్కడక్కడ రంపంపోట్లు అతుక్కుని వున్న ఆకురాయిని చేత్తో పట్టు కోవడం అతనికి కష్టం అనిపించింది. వెంటనే దాన్ని అవతలపెట్టి బంకుకట్టు ఒకటి తీసుకున్నాడు. ఇది అతనికి కొంచెం తేలిగ్గా ఉన్న ట్లనిపించింది. దానివైపు పరీక్షగా చూచాడు. బంకుకట్టు పైభాగం ఎగుడు దిగుడుగా ఉన్నది. మెషీన్ - కట్టర్‌తో కోయగా మిగిలి

పోయినదాని అంచులు గరుకుగా, వాడిగా ఉన్నాయి మళ్ళీ ఆకు రాయి తీసుకుందామని చెయ్యి చాపాడు. కాని ఆ క్షణంలో ఎక్కడిదో ఒక తేనెటీగ మొయ్‌మంటూ లోపలికి వచ్చింది. వడ్రంగి చేసే షాపులోకి ఈ తేనెటీగ ఏ లోకంలోనుంచి వచ్చిందయ్యా ? అది ఒకమాటు అలా షాపు అంతా తిరిగిచూచి తనకిక్కడ పనేమీ లేదని తెలుసుకుని వెళ్ళిపోతుందనుకున్నాడు ఇగోర్. దానివంకే చూస్తున్నాడు ఆ తేనెటీగ అక్కడనుంచి వెళ్ళిపోలేదు. అక్కడున్న బెంచీమీద పదేపదే వాలింది. తరువాత అప్పుడే కోసిపెట్టిన సింధూరపు నిలువుబద్దలమీద వాలటం మొదలుపెట్టింది. చివరకు ఇగోర్ దెబ్బతగిలిన చేతిమీద ఎండిపోతున్న నెత్తురు రుచిచూడాలనుకున్నదో ఏమో తుర్రునవచ్చి అతని చేతిమీద వాలింది. ఇగోర్‌కు భయము, బాధకలిగాయి. చేతిలోఉన్న బందుకట్టుతో దాన్ని విసురుకున్నాడు. వెంటనే అది ఎగిరిపోయింది. పెద్ద బరువు తగ్గినట్లు అతనొకమాటు దీర్ఘంగా నిశ్వసించాడు. చుట్టూ కలయచూచాడు. హఠాత్తుగా వేడిగా ఉన్నట్లు. ఉక్కపోస్తున్నట్లు అనిపించిందతనికి. నెత్తి మీద ఎండ తీవ్రంగా కాస్తోంది, మెడంతా చెమటలుపోసింది. అకస్మాత్తుగా మెడమీద ఏదో బరువుగాను చిమచిమ లాడుతున్నట్లుగాను ఉంది. ఇగోర్ తనచేత్తో విసురుకున్నాడు. ఒక పెద్దదయ్యమంత ఆకుపచ్చని జోరీగవచ్చి సరిగ్గా అతని కళ్ళముందు ఆడింది. కొంచెం కళ్ళు పైకెత్తి చూచేసరికి. అలాంటి ఈగలే మరి రెండు కనిపించాయి. జోరీగల గోల, మొయ్‌మని మ్రోత. ఇగోర్‌కు కోపం ఆగలేదు.

"పీటి పాడుగాను!" అని కళ్ళనీళ్ళ పర్యంతంగా అరిచాడు. "ఈగలయ్యా, జోరీగలు!"

జోరిన్, సెరెడిన్, ఇంకా మరికొందరు పకపకనవ్వారు. సెరెడిన్ తలవెనక్కు వాల్చుకుని తనలోతాను నవ్వుకున్నాడు. కాని, జోరిన్‌మాత్రం విరగబడి నవ్వసాగాడు. అతనినవ్వు యార్డంతా వినిపించింది.

"అవేమీ చెయ్యవు ఇగోర్. అవి కుట్టే ఈగలు కావులే" అన్నాడు జోరిన్.

"బహుశా అవి నీవొక గుర్రానివని అనుకుని ఉంటాయి! అందుకే నీ దగ్గరికొచ్చాయి" అని ఒక చిన్నకుర్రవాడు పరాచిక మాడాడు.

"వాటి పాడుగాను!" చేతిలో ఉన్న బందుకట్టు బెంచీమీద విసిరేస్తూ అన్నాడు ఇగోర్.

"నీవు పనిచెయ్యవా?" అని అడిగాడు సెరెడిన్.

"ఊహూ. చెయ్యను!"

జోరిన్ తనపని అవతలపెట్టి అతని దగ్గరికి వచ్చాడు.

"ఏమైంది చెర్నియావిన్?" అని అడిగాడు.

ఇగోర్ ముఖమంతా కళ్ళు చేసుకుని- కోపంతో జోరిన్ మీద విరుచుకపడ్డాడు:

"ఏమైందా, తగలడింది! మీ కుర్చీల బందుకట్లు, ఆకురాళ్ళు తీసుకపోయి అవతల పారెయ్యండి. అవి ఎట్లా తగులబడితే నాకేం? వాటితో నాకేమిటి పని? పైగా ఇదొక వర్కుషాపు అని చెప్పతున్నారా! ఇందులో ఈగలు కుక్కపిల్లంత లావున్నాయే!" అని అరిచాడు.

ఒకమూల సెరెడిన్ తల ఆడించుకుంటూ తన పని చేసుక పోతున్నాడు. తక్కినవాళ్ళు మాత్రం ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్ళబెట్టి ఇగోర్ వంక గంభీరంగా చూడసాగారు.

"సరే!" అన్నాడు జోరిన్. "నిన్ను ఇక్కడ ఉండమని మేం బలవంత పెట్టడంలేదు. వెళ్ళదలచుకుంటే చక్కగా ఇదే త్రోవ - దయచేయి" అన్నాడు.

"ఆ. హాయిగా వెడతాను."

ఎవరివంక కన్నెత్తి చూడకుండా ఇగోర్ గుట్టగుట్టలుగా పడి ఉన్న కుర్చీ కర్రలు, ఇతరసామగ్రి దాటుకుంటూ వెళ్ళిపోతున్నాడు.

జోరిస్ మరేదో చెప్పాలనుకున్నాడు. కాని ఇగోర్ అతన్ని పట్టించుకోలేదు. ఇహ అతనికి ఏ విషయం పట్టలేదు. దేనిమీద అతని దృష్టి మళ్ళలేదు. తలవని తలంపుగా ప్రొద్దున ప్రార్కులో చూచిన అమ్మాయి ఇప్పు డతనికి ఇక్కడ కనిపించింది. కొంచెం అవతలగా ఆ అమ్మాయి ఒక పేళ్ళ బుట్టమీద వంగి, అతనివంక ఎగతాళి చేస్తున్నట్టుగా చూస్తున్నది.

26

ఒకనాటి నాయకుడు

తక్కిన ఆ రోజంతాకూడా ఇగోర్ పెద్ద సంకటంతో ఉండిపోయాడు! అతనికి ఊపిరి సలిపిందికాదు. ఎవరితోనూ కలియకుండా ఏదీ పట్టించుకోకుండా ఒంటిగా ఉండిపోయాడు. భోజనశాలలో భోజనాల వేళప్పుడు, షాపులో జరిగిన సంఘటన కళ్ళారా చూడని గోంటార్ ఆ విషయాన్ని తనతోటి స్నేహబృందంతో కులాసాగా నవ్వుతూ ప్రస్తావించాడు.

"మీరే ఊహించండి, కుక్కపిల్లలంత ఈగలు!" అన్నాడు.

"సిగ్గు, సిగ్గు! ఆ మాటంటే పరువుపోతుంది. నిజంగా కుక్కపిల్లలంత ఈగలే కనుక ఉంటే వాటిని గొలుసుపెట్టి కట్టెయ్యాలి!" అన్నాడు అవతల టేబిల్ దగ్గర ఉన్న ఒక కుర్రవాడు.

ఇగోర్ కిటికీకెదురుగా కూచున్నాడు. కోపావేశాలతో బుసలు కొడుతున్నాడు.

"అయితే నీకు పని చెయ్యాలని లేదన్నమాట" అన్నాడు నాస్త్రెంకో.

"ఉహూ! నేను చెయ్యను" అని చెప్పాడు ఇగోర్.

"కాని నీ విలాగే కాలనీలో ఉంటూఉంటావు!"

"ఇక్కడికొస్తానని నేనేం అడగలేదు. వాళ్ళే నన్నిక్కడికి పంపారు."

"అదింకా బాగుంది!" అన్నాడు జోరిన్, గంభీరంగా

అందరూ నవ్వులు ఆపారు. అనేకమంది తనవైపు ఉత్సుకతతోనో లేకఒకవేళ గౌరవంతోనో చూస్తున్నట్లు ఇగోర్ గమనించాడు, తనస్థితికి తాను గర్వపడ్డాడు. లేచి నిలుచున్నాడు! అక్కడున్నవాళ్ళం దరికీ వినిపించేలా, బిగ్గరగా జోరిన్‌తో ఇలా అన్నాడు.

"చూడండి! మీ కుర్చీల బందుకట్లు బాగుచేసి దానివల్ల చేతులు తెగకోసుకోడానికికాదు నేనిక్కడికి వచ్చింది."

ఇలా అతను భోజనశాలలోనుంచి అవతలికి వెళ్ళిపోయాడు.

ఇప్పుడతనికి హాయిగా ఉంది. ఆత్మ సంతృప్తి కలిగింది. అతని ముఖం మళ్ళీ ఎప్పటిలాగా అయింది. ముఖంలోకికళ, పెదవులపైకి చిరునవ్వు వచ్చాయి. "పడుకునే వేళయిందని" సిగ్నల్ ఇవ్వడానికి ముందు అతను అలా ఒకమాటు పార్కులో తిరిగివద్దామని వెళ్ళాడు. పార్కులో వాలీబాల్ ఆట సాగుతోంది. అతనక్కడ నిలుచుని ఆట చూడసాగాడు. చూడడానికి వచ్చినవారిలో ఒకజట్టు ఆడపిల్లలు ఉన్నారు. క్లావాకపిరినాకూడా ఉన్నది. ఆవిడ ప్రక్కనే మరో అమ్మాయి నిలుచుని ఉంది. గుండ్రని ముఖం. ముఖంనిండా రంగు రంగుల మచ్చలు. ఆకర్షణీయంగా అగుపిస్తోంది. ఆ పిల్ల ఇగోర్ వంక చూచి చిరునవ్వు నవ్వింది. తరువాత ప్రక్కనున్న తన స్నేహితురాలి చెవిలో ఏదో గుసగుసలాడింది. ఆవిడ జుట్టు ఎర్రగా వంకులొంకులు తిరిగి ఉంది. ఇగోర్ ఆవిడ చేరువకు వెళ్ళాడు.

"చెర్నియాఖిన్ అంటే నీవేకదూ ? నీకు వాలీబాల్ ఆడడం ఎలాగో తెలుసా ? అని అడిగింది ఆ అమ్మాయి.

ఆ, ఆడగలను" అన్నాడు ఇగోర్.

"మరి ఈగలనుచూచి భయపడవు కదూ ?"

ఆడపిల్లలంతా పక్కున నవ్వారు. ఒక్క క్లావామాత్రం అతనివంక అసమ్మతిగా చూచింది. నవ్వురాకుండా తనముచ్చటైన పెదవులను గట్టిగా బిగబట్టుకుంది. కాని ఇగోర్‌మాత్రం కోపం తెచ్చుకోలేదు.

"ఈగలు నన్ను ఇబ్బంది పెట్టేదల్లా మీ షాపులోనే. అక్కడ జోరబడి పనిచేసేవారికి ఆటంకం కలిగిస్తుంటాయి. అది కుర్చీల బందు కట్లు బాగుచేసే స్థలం. ఈగలకేంపని అక్కడ ?"

"నీవు ఎన్ని బందుకట్లు బాగుచేశావు ?"

ఆడపిల్లలంతా ఇప్పుడు నిశ్శబ్దంగా ఉన్నారు. కాని ఇగోర్ ఏం సమాధానం చెప్తాడోనని ఇంకా బిగ్గరగా, పగలబడి నవ్వుదా మనిమాత్రమే వారలా కాచుకునూచున్నారు. ఇగోర్ మాత్రం వాళ్ళకు వినోదం కలిగించాలనుకోలేదు.

"ఆ ముష్టిపని ఎవడు చేస్తాడు? నేను చెయ్యనని చెప్పేశాను. ఆ పనికిమాలిన బందుకట్లు బాగుచేయడానికి నాలాంటివాళ్ళు బోలె డంతమంది ఉన్నారు. నేను లేకపోతే మునిగిపోయే దేమీలేదు" అన్నాడు ఇగోర్.

"అయితే నీవు ఏంచెయ్యాలనుకుంటున్నావు ?"

ఇలా అడిగి ఎర్రజుట్టుగల అమ్మాయి మెల్లగా చిరునవ్వు నవ్వింది. ఆవిడ కంఠస్వరంలో ఎలాంటి వెక్కిరింత వెదకి చూద్దా మన్నా లేదు. ఇగోర్ తను విజయం సాధించినట్లుగా సంతోషించాడు. ఆ ప్రశ్నకు హుందాగా సమాధానం చెప్పడానికి ప్రయత్నించాడు:

"నేనలాగే చూస్తూ కాలక్షేపం చేస్తుంటాను. ఎప్పుడో ఒకప్పుడు వాళ్ళే నాకో ప్రముఖపాత్ర కల్పిస్తారు."

ఈ సమాధానం అందరిలోనూ కుతూహలాన్ని రేకెత్తించింది. ఆడపిల్లలంతా గౌరవంతో అతనివంక తేరిపార చూచారు. కాని క్లావామాత్రం ముఖం తిప్పుకుంది.

"నీ ప్రముఖపాత్ర నీకు ఉండనేఉన్నది– వగటివేషగాడిపాత్ర" అన్నదావిడ.

మళ్ళీ ఆడపిల్లలంతా పొట్టలు చెక్కలయ్యేటట్లు నవ్వారు. ఇగోర్ వాళ్ళను వదిలిపెట్టి వాలీబాల్ ఆటవంక చూడసాగాడు. మొత్తంమీద ఈ సంభాషణంతా అతనికి చెప్పుకోదగ్గ కష్టాన్నేమీ కలిగించలేదు. ఇహ క్లావా కపిరినా విషయమంటారా? ఆవిడ వాళ్ళందరికీ కమాండర్. ఆవిడే తనను హాస్యగాడని అన్నప్పుడు వాళ్ళందరూమాత్రం ఎందుకు నవ్వరు? కాని ఆ ఎర్రజుట్టు అమ్మాయి మాత్రం అంతగా నవ్వలేదు. ఆ పిల్ల ఎవరైఉంటుందబ్బా!

"ఆ ఎర్రజుట్టు అమ్మాయి ఎవరు?" అని అతను రొగోవ్‌ను అడిగాడు.

"ఓ ఆ అమ్మాయా. ఆమె లిడా! లిడా టలికోవా. పద కొండవ దళానికి కమాండర్!" అని చెప్పాడు రొగోవ్.

ఓహో! ఆవిడకూడా ఒక కమాండరే. అయినప్పటికీ ఆవిడ అందరిలాగా పగలబడి నవ్వలేదు.

పిల్లలందరూ పడకగదిలో పోగైనారు. కాని ఎవరూకూడా షాపులో జరిగిన సంఘటనను గురించి జ్ఞాపకం చెయ్యలేదు. ఇది ఇగోర్‌కు ఎంతో ఆశ్చర్యాన్ని, ఆనందాన్నికూడా కలిగించింది. దళంలో ప్రతివక్కరూ మామూలుకన్నా ఈరోజు విశేషం ఏమీ జరగలేదన్నట్లు ఎవరిపనిలోవారు నిమగ్నులై ఉన్నారు. కొందరు వ్రాసుకుంటున్నారు, కొందరు చదువుకుంటున్నారు. ఒక బెంచీమీద జోరిన్, మిషాగోంటార్‌లు చదరంగం ఆడుకుంటూ కూచున్నారు. నెస్ట్రెంకో నేలమీద కొన్ని వార్తాపత్రికలు పరుచుకుని ఏదో చిత్రమైన చిన్నయంత్రపరికరం స్ప్రింగులు, చక్రాలు–మొదలైన భాగాలు దేనికిదానికి ఊడదీస్తూ కూర్చున్నాడు. ఇగోర్ తన ఇష్టప్రకారం గదిలో అటూ ఇటూ పచారు చేస్తున్నాడు. నెస్ట్రెంకో ఊడదీసే ఆ యంత్రపరికరం ఏమిటో అడగడానికి అతనికి బిడియం వేసింది.

ఇంతలో బయట యార్డులోనుంచి ఒక చిన్న బిగిల్ కూత వినిపించింది. నెస్ట్రెంకో ఆశ్చర్యపోతూ తలెత్తి చూచాడు.

"అప్పుడే రిపోర్టు అందజేసే టైం అయిందా? అరె! కాలం ఇట్టే పరుగెత్తిపోతోంది! అలెగ్జాండర్! నీవు వెళ్ళి రిపోర్టు అందించి రా. చూడు, నేనీ పనిలో మునిగి ఉన్నాను. నీవు వెళ్ళి రా బాబూ" అన్నాడు. ఇలా అని మురికిగా ఉన్న తన చేతులు చూపించాడు.

డిప్యూటీ కమాండర్ అయిన అలెగ్జాండర్ ఆస్టాప్ చిన్.

"మన కమాండర్ అసలే జిత్తులమారి మనిషి! మరినన్ను మిషా గోళ్ళవిషయం అలెగ్జీతో మాట్లాడమంటావా?" అన్నాడు అలెగ్జాండర్.

గదిలో అందరిముఖాల్లోనూ ఒక్కమాటు మందహాసాలు కనిపించాయి.

"సరే, మాట్లాడు. ఇంతలో నీకొచ్చే ప్రమాదం ఏమీ లేదు!" అన్నాడు నెస్ట్రెంకో బద్ధకంగా. "మన పోకిల్లా అబ్బాయి తొందరపాటువల్ల అలా చేశాడని చెప్పు. మాట్లాడమంటే నీకు మహా సరదా కదూ. ఇంకేం, మాట్లాడు. ప్రొక్యురేటర్ గా పనిచేయాలంటే ఇలాంటివి అభ్యాసం చేయడం ఎంతో అవసరం. సరే, గోంటార్ కు కోపం వస్తుందేమో. వస్తేరానీ. మరేం ముంచుకపోదులే" అన్నాడు.

ఇలా అని గోంటార్ వంక వేలవంగా చూచాడు. గోంటార్ కు కోపంవచ్చింది. ఏదో మూలిగాడు. నుదుటమీద చెయ్యి పెట్టుకున్నాడు.

అలెగ్జాండర్ ఆస్టాప్ చిన్ మరొకమాటు అద్దంలో చూచుకుని పడకగదిలోనుంచి చకచకా వెళ్ళిపోయాడు.

కామ్రేడ్ నెస్ట్రెంకో! మీరు చేస్తున్న ఆ పనేమిటి? ఏమిటా వస్తువు?" అని అడిగాడు ఇగోర్.

సెస్ట్రిన్ తలెత్తి ఇగోర్ వంక అసమ్మతి సూచకంగా చూశాడు? ఏదో అంటున్నట్లు చెయ్యి ఊపాడు. అలా చెయ్యి ఊపడంలో "నా గొడవనన్ను చూచుకోనివ్వు!" అన్నభావం మాత్రం అభివ్యక్తమౌతోంది.

ఇగోర్ చదరంగం ఆడేవాళ్ళదగ్గరికి వెళ్ళాడు. గోంటార్ ఇంకా నుదటిమీద చెయ్యిపెట్టుకుని అలాగేకూచుని ఉన్నాడు. ఇగోర్‌ను గమనించలేదు. మెల్లగా జోరిన్‌తో ఇలా అన్నాడు:

"అయితే అలెగ్జీ నన్ను పిలిపిస్తాడంటావా?" "దేనికోసం."

"అదే - జిరియాన్‌స్కీ రిపోర్టు విని పిలిపిస్తాడేమోనని!"

"ఓ! అదా! ఏమోనబ్బా, అలా పిలిపిస్తాడని నే ననుకోను. అలెగ్జీ ఇలాంటి చిన్న చిన్న విషయాలు పట్టించుకునే మనిషికాదు" అన్నాడు జోరిన్, చదరంగం ఆటలో బంటును జరుపుతూ "కాని ఒకవేళ పిలిపిస్తే ఏమిటని?"

"పిలిపించడు, అంతే ఒకవేళ ఈ విషయాన్ని గురించి ఏదైనా అనదలుచుకుంటే ఆ స్టాఫ్‌చిన్‌నే అంటాడు."

జోరిన్ ఇగోర్‌వంక చూచి తల ఊపాడు. గోంటార్ తన నుదుటిమీద చెయ్యి తీసివేసి ముఖం ఒక ప్రక్కకు తిప్పి ఇగోర్ వంక చూచాడు:

"అవతలికి వెళ్ళు, దీపానికి అడ్డంగా నిలుచున్నావు" అన్నాడు.

జోరిన్ చివరసారి అన్నమాటలు ఇగోర్‌లో కుతూహలాన్ని రేకెత్తించాయి.

"నా కోసం కబురు చేస్తాడా? ఎప్పుడనుకుంటే అప్పుడే! ఇప్పటికే నేను గొడవల్లో ఉన్నానయ్యా!"

తానేదో విజయం సాధించినట్లు ఇగోర్ అక్కడున్న వారందరి వంక కలయచూచాడు. కాని ఎవ్వరూకూడా అతని విషయం ఏ మాత్రం పట్టించుకోలేదు.

అయిదు నిముషాల తరువాత అలెగ్జాండర్ ఆస్టాప్‌చిన్ మళ్ళీ పడకగదిలోకి వచ్చాడు. మనిషి ఉద్విగ్నుడై ఉన్నాడు. ముఖం కంద గడ్డలా అయింది. తల్లక్రిందులైపోయినట్లు అగుపిస్తున్నాడు.

"ఓ గంటసేపు కావలాలో పెట్టమన్నాను! అని అందరివంక చూచి అరిచాడు.

గోంటార్ గబుక్కున బొటనవ్రేలు తనకేసి చూపుకుంటూ "ఎవర్ని? నన్నేనా?" అని అడిగాడు.

"కాదు, నన్ను!" అని చెప్పాడు అలెగ్జాండర్ ఆస్టాప్‌చిన్ అదేమాదిరి తన బొటనవ్రేలితో తనను చూపుకుంటూ:

"నిన్నా!" అంటూ అందరూ ఎగిరిపడ్డారు. నివ్వెరపోయి ఒకరివంక ఒకరు చూచుకున్నారు. ఆఖరుకు ఖారిటన్ సావ్‌చెంకో కూడా అలాగే చేశాడు.

"ఓ, నిన్నా!" అని బిగ్గరగా అరిచి నెస్ప్రింకో ~~దగ్గర~~ క్రింద వెల్లి కింతలపడ్డాడు. రెండుకాళ్ళు పైకెత్తి పొట్ట చెక్కలయ్యేటట్లు నవ్వసాగాడు. గోంటార్ మళ్ళీ నుదుటిమీద చెయ్యి పెట్టుకుని, సిగ్గుపడుతున్నట్లు చిరునవ్వు నవ్వుకున్నాడు. అందరిలోకి జోరిన్ మహా కులాసాగా అన్నాడు. ఎగిరి దుమికాడు. చేతులు అటూ ఇటూ ఊపుకుంటూవచ్చి అలెగ్జాండర్ ఆస్టాప్‌చిన్ చెయ్యిపుచ్చుకున్నాడు.

"గోళ్ళుతీసి అక్కడ పారేసినందుకేనా?" అని అడిగాడు.

"అందుకే అనుకో! ఆ పాడువాడు 'వెయ్యికళ్ళ మనిషి' కేవలం రిపోర్టు చెయ్యడంతో సంతృప్తిపడక పూసగుచ్చినట్లు వివరాలన్నీ చెప్పాడుకూడా. అవంతా విని నేను 'అలెక్సీ స్టెపానొవిచ్! గోంటార్‌కు మనం ఇంకా కాస్త చురుగ్గా శిక్షణ ఇవ్వాలి' అన్నాను. అందుకతను 'మీ అందరికీ తర్ఫీదు ఇవ్వడం నా పనికాదు. ఇగోర్ చెర్నియావిన్ విషయమంటారా, అది వేరు. అతను నిన్ననే వచ్చింది. మరి గోంటార్ అలాకాదు. గత అయిదేండ్ల బట్టీ అతనిక్కడ మనతో ఉంటున్నాడు" అని సమాధానం చెప్పాడు. అప్పుడు నేను అతనితో

'ఎప్పుడుబట్టినా జిరియాన్స్కీకి ఏదో ఒకవంక చూచి ఫిర్యాదు చెయ్యడమే పని' అన్నాను. దాంతో అతను మారు మాట్లాడకుండా ఊరుకున్నాడు. అతనుచెప్పిన మొదటమాట ఏమిటంటే రిపోర్టు చేసేటప్పుడు మధ్యలో ఎవరూ వాదనకు దిగకూడదట. అది నిబంధనలకు వ్యతిరేకమట. పోతే రెండవది ఎనిమిదవ దళానికి సంబంధించిన రిపోర్టులో నీవు మిషాగోంటార్ చేసే అసహ్యామైన పనులుగురించి ఒక చిన్న వివరణ వ్రాసిపెట్టావట. రిపోర్టు చేస్తున్న తరుణంలో ఎలా ప్రవర్తించవలసిందీ, తెలీనందువల్ల, ఎనిమిదవదళంలో జిరిగిన ఈ అపరిశుభ్రమైన పనివల్ల - నన్ను ఒక గంటసేపు కాపలాలో పెట్టమన్నారు."

వారంతా మౌనంగా అతనివంక నోళ్ళు తెరుచుకుని చూస్తూ విన్నారు.

"అయితే నీవు అతనికి మళ్ళీ సమాధానం చెప్పలేదా ?" అని అడిగాడు ఇగోర్. అతని కీవిషయం ఎంతో నివ్వరపాటు కలిగించడం వల్ల తన స్వంత దిగుళ్ళుకూడా మరిచిపోయాడు.

వెంటనే అందరికళ్ళు ఇగోర్ మీదికి మళ్ళాయి. అతనొక పీడలాగా వదలకుండా ఉన్నాడనుకున్నట్లు అందరూ అగుపించారు. అయినా అలెగ్జాండర్ ఆస్టాప్చిన్ మాత్రం అతనడిగిన ప్రశ్నను అవతలికి నెట్టలేదు.

"అవును, నేను మళ్ళీ అతనికి 'ఒకగంట కాపలా చాలా మంచిది కామ్రేడ్ డైరెక్టర్, అని నేను సమాధానం చెప్పాను."

నెస్ట్రెంకో మళ్ళీ పగలబడి నవ్వడం మొదలుపెట్టాడు.

"చాలా అద్భుతంగా ఉంది! నేను నిన్ను పంపడంవల్ల ఎంత మంచిపని చేసినవాడనయ్యాను!" అన్నాడు.

"ఇహ మళ్ళీ ఎన్నడూ మీరు నన్ను పంపలేరు......"

"సరే వెళ్ళకుండా ఉండడానికి ప్రయత్నించు అన్నాడు నెస్ట్రెంకో కుశాసాగ్గాను, స్నేహపూర్వకంగా పిడికిలి ఆడిస్తూను "ఇదంతా కూడా నీ స్వయం కృతాపరాధంవల్లనే వచ్చింది కాని

నావల్ల తప్పేమీ లేదు. నీవు పట్టి వదరబోతావు. రిపోర్టు చదువుతున్నప్పుడు దాన్ని సహనంతో విని అవగతం చేసుకునే శక్తి నీకు లేదు, లేకపోతే డ్యూటీలో ఉన్న కమాండర్‌తో ఎవరైనా అలా ప్రవర్తిస్తారా? ఒక్కమాటు ఆలోచించు! ఏ విషయాన్నయినా నీవంత తేలిగ్గా తీసిపారేయడమే నాకు ఎంతో ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇవాళ అలెగ్జీ ఎంతో శాంతంగా ఉండిఉంటాడు. లేకపోతేనా..."

హఠాత్తుగా ఇగోర్ మనస్సు నొచ్చుకుంది. వీళ్ళింత పాడుపని చేస్తున్నారేమిటి? ఏ పాపమూ ఎరుగని అలెగ్జాండర్ ఆస్టాప్‌చిన్‌ను ఒక గంటసేపు కాపలాలో పెట్టారు. నిజంగా శిక్షార్హుడైన మిషా గోంటార్ ఏమో పూలరంగడులా తిరుగుతున్నాడు. కాని నిజానికి ఇగోర్ మనస్సుకు బాధ కలిగించిన విషయం మరొకటున్నది. అలెగ్జీ స్టెపానొవిచ్‌తో సహా అందరూ ఆ పనికిమాలిన విషయంలో—గోంటార్ తన గోళ్ళుతీసి అక్కడ పారేసినందుకు తమ కొంపలన్నీ మునిగిపోయినట్లు అంత హడావుడి చేస్తున్నారు. అందరి ఎదుటా నిర్లక్ష్యంగా, నిరుత్సాహంగా పని చెయ్యనని చెప్పి పొగరుబోతుతనంగా ప్రవర్తించిన తననేమో ఎవరూ కొంచెంకూడా పట్టించుకోలేదు.

అందరూ పడుకోవడానికి తయారైన తరుణంలో జిరియాన్‌స్కీ పడకగదిలోకి వచ్చాడు ఇప్పుడతను చేతికి బాడ్జీ తగించిలేదు. పిల్లలందరూ కుతూహలంతో అతనిచుట్టూ మూగారు అతను వారందరివంక ఉల్లాసంగా చూస్తూ బెంచీమీద కూలపడ్డాడు.

"అలెగ్జాండర్ ఆస్టాప్‌చిన్ నెత్తిన బండ పడింది! ఈ క్షణంలో కూడా అలెగ్జీ తన ఆఫీసుగదిలో కూచుని, ఆస్టాప్‌చిన్ ఎలా రిపోర్టు ఇచ్చాడో తలుచుకుని పొట్ట ఉబ్బనవ్వుతూ ఉంటాడు నిజం చెప్పాలంటే ఆస్టాప్‌చిన్ రిపోర్టు ఇవ్వడంలో తక్కినవాళ్ళందరికంటె చాలా మెరుగు!" అన్నాడు జిరియాన్‌స్కీ.

కాని జిరియాన్‌స్కీ, ఇగోర్‌ను గురించి ఒక్క మాట అయినా అనలేదు. అసలతను పడకగదిలో ఉన్నాడన్న విషయం

కూడా జ్ఞాపకం ఉంచుకోలేదు. ఆరోజు అతను షాపులో పని చెయ్యడానికి సుతరామూ అంగీకరించలేదన్న సంగతికూడా జరియాన్‌స్కీ పూర్తిగా మరచిపోయాడు.

27

నీ ప్రవర్తన ఎలాంటిదో చెప్పుకోవాలి

మరుసటిరోజు ఉదయం ఇగోర్ మామూలు వేళకు నిద్ర లేచాడు. పక్కచుట్టి పెట్టుకోవడంలో చాలాసేపు గడిపాడు. ఆ వేళ డ్యూటీ ఎవరిదైనదీ అతను ఆ క్రిందటిరోజు సాయంత్రం విచారించి తెలుసుకున్నాడు. లేకపోతే ఆ వేళకూడా ఎంతో పొద్దెక్కేవరకూ పడుకునేవాడే. "ఆడవారి" సమక్షంలో తనలా పక్కమీద పడుకుని ఉండడం మరెన్నడూ చెయ్యకూడదనుకున్నాడతను. ఆ వేళ డ్యూటీలో ఉన్న కమాండర్ జకరోవ్. అతనివెంట లిడావిటలికోవాకూడ ఉన్నది. వారిద్దరూ తనిఖీ పూర్తిచేశారు. ఇగోర్ తన విధులన్నీ సక్రమంగా నిర్వహించి తనిఖీలో మాటరాకుండా చూచుకున్నాడు. డ్యూటీలో ఉన్న కమాండర్ జఖరోవ్, రష్యన్ పద్ధతిలో పనులు చొక్కా ఒకటి తొడుక్కుని, మనిషి ఉల్లాసంగా ఉన్నాడు.

"గుడ్ మార్నింగ్ కామ్రేడ్స్!" అంటూ కమాండర్లందరిలాగానే చెయ్యెత్తి శాల్యూట్ చేశాడు

పిల్లలందరూ అతనిపట్ల ఎంతో స్నేహపూర్వకంగాను, అనురాగంతోను ప్రవర్తిస్తారనీ, బదులు చెపుతారనీ అనుకున్నాడు ఇగోర్. కాని మళ్ళీ అదే సమయంలో జఖరోవ్‌ను చూచి పిల్లలందరూ ఎంతో భయంతో దూరదూరంగా నిలుచుండిపోయినట్లు భావించుకున్నాడు. ప్రతి చిన్న విషయాన్నీ పట్టిపట్టి చూడకుండా జఖరోవ్ పడకగదిలో తనిఖీ ముగించాడు. తక్కిన చాటుమాటున

ఉన్న ప్రదేశాలను తనిఖీచేసే పనిని ఆరోగ్యశాఖకు చెందిన ఆ చిన్న అమ్మాయికి వదిలిపెట్టాడు. కాని జఖరోవ్ మిషాగోంటార్‌ను చేతిగోళ్ళను చూపించమని అడగడంమాత్రం మరిచిపోలేదు.

"అలెక్జీ స్టెపానొవిచ్! ఇవాళ సినిమా ఏమిటో నీకు తెలుసునా?" అని అడిగాడు నెస్ట్రెంకో.

'యుద్ధనౌక పొటెమ్‌కిన్' అని విన్నాను. వాళ్ళు ఫిలించూడ డానికి వెడుతున్నారా విడా?"

"అవును."

వెళ్ళిపోయేముందు జఖరోవ్ పైనఉన్న విద్యుద్దీపంవంక చూచాడు. వెంటనే అన్నివైపులనుంచీ అభ్యంతరం వచ్చింది:

ఆ గ్లాసులో చిన్న చిన్న మచ్చలున్నాయి! గ్లాసు తయారు చేయడంలోనే ఆ మచ్చ లేర్పడ్డాయి! దీని విషయం మేం ఎప్పుడూ చెపుతూనే ఉన్నాం. కాని ఇంతవరకూ ఎవరూ ~~మాకు~~ కొత్తది తెచ్చి ఇచ్చిన పాపానపోలేదు!"

"ఏమిటీగోల? అని అడిగాడు జఖరోవ్ తలుపు దగ్గరనుంచి.

"మీరు ఆ విద్యుద్దీపంవంక చూచారు."

"ఏం! నేను దాన్ని చూచినంతమాత్రాన మీరలా గోల పెట్టాలని ఉందా?"

"ఓ! మీ చూపుల్లోని భావాలేమిటో మాకు తెలీక పోలేదు!"

ఇగోర్ ఉపాహారం తీసుకోడానికి వెళ్ళాడు త్రోవలో ఎవరూ అతన్ని పలకరించలేదు. టేబిల్‌దగ్గరమాత్రం జోరిన్, గోంటార్‌లు తమకు జ్ఞాపకమున్న ఏదోవిషయాన్నిగురించి ఒకరితో ఒకరు బిగ్గరగా ముచ్చటించుకున్నారు. నెస్ట్రెంకో ఎవరితోనూ మాట్లాడకుండా, మౌనంగా తింటున్నాడు. మధ్యమధ్య గదంతా కలయ చూస్తున్నాడు.

భోజనశాలలో తడవకు ఒక వందమంది జట్టుగా కూచుని ఉపాహారాలు ముగించుకొని పోతున్నారు. వారందరిముందూ చిన్న చిన్న టేబిళ్ళు వేసి ఉన్నాయి. టేబిళ్ళపైన తెల్లటి గుడ్డలు పరిచి ఉన్నాయి నిజానికి వారందరినీ చూస్తుంటే ఇగోర్‌కు ఎంతో ముచ్చట వేసింది. అతను కాలనీకి వచ్చి నాలుగు రోజులుమాత్రమే అయినప్పటికీ అక్కడ ఉండేవారిలో చాలా మంది అతనికి పరిచయమైనారు. ఆరోగ్యశాఖకు చెందిన మగపిల్లలను, ఆడపిల్లలనుకూడా అతనెరుగును. వారందరూ ఎంతో పరిశుభ్రంగాను, తమ విధులు నిర్వహించడంలో ఎంతో నిష్కర్షగాను ఉండడం అతనికి తెలుసును. వారిలో చాలామంది పద్నాలుగు, పదిహేనేండ్ల వయస్సులో ఉన్నవాళ్ళు, తక్కిన ముఖాలతోకూడా అతనికి బాగా పరిచయం ఏర్పడింది. ప్రతిఒక్కరిలోనూ యజమానిలో ఉండే రెండు విధాలయిన ప్రవృత్తులను అతను అనుకోకుండానే.విభాగించుకుని చూడాసాగాడు. ప్రతి వక్కరికీ ఎవరిచూపు వారికున్నది. ఏదో బాల్యసంబంధమైన చూపు అది. దానికి తను స్పష్టంగా పేరు పెట్టలేకపోతున్నాడు. కాని ప్రతి ముఖంలోనూ ఒక శక్తి, ఎదిరించే లక్షణం, కుతంత్రం, జగడగొండితనం, స్వాతంత్ర్యేచ్ఛ, మోసకారితనం, ఇవన్నీ స్పష్టంగా ఇగోర్‌కు కన్పిస్తున్నాయి. ఇంతేకాక ఆయా వ్యక్తుల మనస్తత్వాలలో మరొక లక్షణాన్నికూడా అతను స్పష్టంగా దర్శించగలుగుతున్నాడు. ఈ లక్షణాలు ప్రత్యేకమైనవి. ఇంతకుముందు తానెన్నడూ చూడనివి విశేషించి కాలనీలో నివసించడంవల్ల జనించిన ఈ లక్షణాలు అతన్ని ఆకర్షించాయి. ఆకర్షించడంతోపాటు వాటిపట్ల ధిక్కారభావాన్ని తలిగించాయి.

అయితే ఇందులో ఒక విశేషముంది. భోజనశాలలో కూచున్నవారందరిలోనూ ఒకేఒక సోదరభావం, అంతా ఒకటేననే అనురాగం ద్యోతకమవుతూ ఉండడం అతను అంగీకరించక తప్పదు. అంతా ఏకకుటుంబం. తాను ఉన్న ఈ నాలుగురోజుల్లోనూ ఒక్కపూటకూడా ఎవరూ దెబ్బలాడుకోలేదు. ఎవరికీ అభిప్రాయభేదాలు

రాలేదు. ఒకరిమీద ఒకరు కోపగించుకోలేదు. అంతా సరళంగా, సవ్యం
గాంగా మెలగుతున్నారు. ఇది అతన్ని మరీ ఆశ్చర్యపరిచింది. ఇలా
ఉండడానికి కారణం జఖరోవ్, తదితర కమాండర్ల క్రమశిక్షణాపద్ధతి
అని అనుకున్నాడు. బహుశా అది కారణం కావచ్చును. అయితే ఎవరి
ముఖంలోకూడా భయమన్నది కనిపించడంలేదు. నిజమే. కమాండర్లు
తమ ఆజ్ఞలను ఎంతో నిర్దుష్టంగా అమలు జరుపుతున్నారు. వాళ్ళ
ప్రవర్తన సుశిక్షితంగానే ఉంది. ఎక్కడా జంకూ గొంకూ
లేదు: ఎంతో కాలంనుంచి ఈ విధులను నిర్వర్తిస్తున్నవారికి
మల్లే అన్నీ సక్రమంగా చేసుకపోతున్నారు. కాని శాంకోజోరిన్
తనతో ఒక మాట చెప్పాడు. ఇక్కడ కమాండర్లంతా కొత్తవాళ్ళే
నట. నెస్ట్రింకో, జెరియుఎన్‌స్కీ పీఠమువురు మాత్రం వచ్చి ఆరు నెల
లకు పైగా అయిందట కమాండర్లేకాదు; అక్కడ ఉన్న ప్రతివ్యక్తీ
తనకుగల శక్తిని, అధికారాన్ని ఎంతో ఆత్మవిశ్వాసంతో నిర్వహిస్తు
న్నారు. ఏపని చేసినా తొట్రుపాటన్నది ఉండదు. అంతా సహజంగా
సంభవిస్తున్నట్లు పనులు చేసుకుని పోతున్నారు. ఏదీ అపురూపంగా
కనిపించడంలేదు. కాలనీలో ఉండే ఆరోగ్యశాఖ, ఆహారశాఖ,
అన్నీ అంతే ఎవరి విధులు వారివి అన్నీ సక్రమంగా, సాఫీగా సాగి
పోతున్నాయి.

సింహద్వారంచెంత కాపలాఉండే రక్షకభటులు సహితం
యథాలాపంగా తమ విధులను నిర్వర్తిస్తున్నారు. కాపలా సైనికు
లుగా చిన్నపిల్లలను నియమిస్తారు. వాళ్ళు పార్కులో ఆనందంతో
కేకలు పెడుతూ పరుగెడుతూ ఉంటారు. కొలనులో ఈదుతూ
కేరింతలు కొడుతారు. క్రీడాస్థలాల్లో పిల్లిమొగ్గలువేస్తూ ఆటలాడు
కుంటారు. వీరిలో రకరకాల పిల్లలున్నారు. పొట్టివాళ్ళు, పొడుగు
వాళ్ళు కొందరివికోలముఖాలు, కొందరివిగుండ్రని ముఖాలు.
వాళ్ళు మాట్లాడే తీరు, వాళ్ళ ప్రవర్తన వివిధ రకాలుగా ఉంటుంది.
అనేక ఊహాపోహాలతో ఈ పిల్లలు రకరకాల చేతి పరిశ్రమలలో
పాల్గొంటూ ఉంటారు. కొందరు మగ్గంమీద, మరికొందరు రాట్నం

దగ్గర పనిచేస్తూ ఉంటారు. ఇంకా కొందరు నార పేనుతూ ఉంటారు పనులు అయిపోగానే తమ తమ డ్యూటీల్లోకి వెడతారు. దుస్తులు ధరించి, రైఫిలు పట్టుకుని నిలుచుంటే అంతా మార్పే. తను కాలనీకి రాగానే ఎదుటపడిన పెట్కా క్రావ్‌చెక్ వలె అవే దుస్తులలో కాపలా సైనికులందరు కనిపిస్తారు. పెట్కా వలె గంభీరంగా అప్రమత్తతతో తమ విధులను నిర్వర్తిస్తారు. మాట్లాడినప్పుడు అధికారంతో కూడిన స్వరం స్ఫురిస్తూ ఉంటుంది. వాళ్ళ విధులు సంకీర్ణమైనవి కావు. భవనంలోనికి ఏ ఆగంతకుణ్ణీ రానివ్వరు. కాళ్ళు తుడుచుకోకుండా ఎవరినీ లోపల అడుగు పెట్టనివ్వరు. కాలనీలోకి రావడానికి కాలనీలో ఉండేవారికి కాని, పెద్దవాళ్ళకు అనుమతిపత్రాలు అవసరం లేదు. ఎవరు లోపలికి రావడానికి అర్హులో, ఎవరు అనర్హులో, ఎవరికి అనుమతి పత్రాలున్నాయో, ఎవరికి లేవో కాపలా సైనికులు ఇట్టే కనిపెట్టేస్తారు, కాళ్ళు తుడుచుకునే విషయంలో మాత్రం వాళ్ళు చాలా నిష్కర్షగా ఉంటారు. ఆ విషయం ఇగోర్ మొన్ననే గమనించాడు. పెట్యా టార్‌స్కీ ఏదో జరూరుపనిమీద గబగబలోనికి వస్తుంటే కాపలా సైనికుడు అతన్ని మధ్యలో ఆపుచేశాడు:

"కాళ్ళు తుడుచుకో, కాళ్ళు తుడుచుకో పెట్యా."

"త్వరగా వెళ్ళాలి, త్వరగా వెళ్ళాలి షురా."

షురా తన ఉత్తర్వును మళ్ళీ జారీచేయకుండానే తనమాట వినితీరాలన్నట్లు టార్‌స్కీ వంక చూచి వెళ్ళిపోయాడు. ఈ కాలనీ పెద్దల్లో ఒకడు. అయినా సరే అతను ఒక క్షణం ఆలోచించి వచ్చిన దారినే మేడ మెట్లు దిగి బూట్లు తుడుచుకునే చోటికివచ్చి నిలుచున్నాడు. అతను గుడ్డతో తన బూట్లు తుడుచుకుంటూ ఉంటే షురా పరిశీలిస్తూ అక్కడే నిలుచున్నాడు.

ఈ కాలనీలో ఉన్న మనుష్యులంతా ఒక సంఘం. ఈ సంఘం అవినాభావసంబంధం కలది ఒకరికీ మరొకరికీ మధ్య ఉండే ఐక్యత ఎంతో దృఢమైనది. ఇలాంటి దృఢమైత్రిభావం దేనివల్ల పెంపొందిందో ఇగోర్‌కు అంతు చిక్కలేదు. వాళ్ళ అనుబంధాన్ని చూచి

నవ్వేడు అతనికొక విచిత్రమైన భావం కలుగుతూ ఉండేది: ఇక్క-డున్న సభ్యులందరూ రహస్యంగా సమావేశమై 'ఇలా ప్రవర్తించాలని' కొన్ని నియమాలను రూపొందించుకుంటారు. ఆ నియమాలు ఉన్నతమవుతున్న కొద్దీ మరీ గర్వపడుతున్నారు కాబోలు. ఇంతేకాక ఇదంతా అతనికొక క్రీడవలె కనిపించసాగింది. ఈ విధంగా ఆడాలని క్రీడావిధులను నియమించుకుని ఆ నియమాలను తనకు తెలియనీయకుండా వాళ్ళు తనను నవ్వులపాలు చేద్దామనుకుంటున్నారులాఉంది. అయితే ఈ క్రీడసహితం సహజంగానే సాగిపోతున్నది. ఒకపని ఎలా జరిగితే బాగుంటుందో అలాగే జరుగుతోంది. అంతా యధాలాపంగానే సాగిపోతోంది. కాని ఒక విషయంమాత్రం వింతగా ఉంది. కమాండర్ కనిపించేసరికి శాల్యూట్ చెయ్యడం, వర్క్-షాపుల్లోకి వెళ్ళడం, ఏవేవో పనులు చేసుకోవడం; ఎప్పుడూ ఒకటే గొడవ, మార్పేమీ లేదు.

ఈ భావమే ఇగోర్‌ను వాళ్ళనుంచి వేరుచేసింది. ఆత్మగర్వంతో, ఆనందంతో ఉన్న ఈ కాలనీ కుటుంబం అతన్ని ఆకర్షించినా, దానికి ఒదిగి ఉండడం అతనికి ఇష్టంలేకపోయింది. తన విషయం ఎవరూ అంతగా పట్టించుకోకపోవడం, తనను మామూలుగానే చూడడం, అతనికి ఆశాభంగం కలిగించి. ఇక్కడ ఉండే పిల్లలు, యువకులు, అందరూకూడా తను అక్కడ ఉన్నట్టే గుర్తించడంలేదు. కాని అతనికొక విషయం తెలుసును ఎప్పుడో ఒకప్పుడు పనిచెయ్యమని తనను నిర్బంధిస్తారు. తనచేతవాళ్ళెలా పనిచేయించగలరో చూద్దాం. తనను కొట్టి తిట్టి ఎప్పుడూ పనిచేయించరు. నిర్బంధించరు. అయితే పనిచేసేవరకూ భోజనం పెట్టరేమో? ఊహు, అలాగా చెయ్యరు. అందుకు న్యాయశాస్త్రం అంగీకరించదు. అయితే ఎన్నాళ్ళు ఇలాగ పనిచేయకుండా కాలనీలో ఉండనిస్తారు? ఉండనివ్వరు. మరి ఉండనివ్వక బయటికి వెళ్ళగొడతారా? వెళ్ళగొట్టను. అదివాళ్ళ పద్ధతికాదు. మరి వాళ్ళపద్ధతేమిటో చూద్దాం.

భోజనశాలలో కూచుని ఇగోర్ భోజనం చేస్తున్నాడు. కాలనీ లోని పిల్లలను, యువకులను లోలోపల అభినందిస్తున్నాడు. కొందరు సూ్కలు దుస్తులు వేసుకున్నారు. చాలా నిర్మలంగా ప్రశాంతంగా ఉన్నాయి వాళ్ళ ముఖాలు. ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ నవ్వుకుంటూ బల్లలముందు కూచుని భోజనాలు చేస్తున్నారు. కమాండర్ లిడావికోవా అటూ ఇటూ పచారు చేస్తూ భోజనాల వంక పరిశీలనగా చూస్తోంది. ఒక బల్లదగ్గరనుంచి మరోబల్లదగ్గరికి వెడుతోంది.

ఆమె ఒక బెంచీదగ్గరికివచ్చి నిలుచుంది. బెంచీదగ్గర కూచున్న ఒక కుర్రవాడు ఆమెవంక చూచాడు.

"భోజనశాలలోకి అన్ని పుస్తకాలు ఎందుకు పట్టుకొచ్చావు ఫిల్కా?" అని ఆమె అడిగింది.

ఫిల్కా లేచి నిలుచున్నాడు: "అలా పట్టుకరావలసివచ్చింది. రూల్సు మళ్ళీ ఇంకొకమాటు చదవాలని తెచ్చాను" అన్నాడు.

"భోజనం అయిన తరువాత గదికి వెళ్ళి పుస్తకాలు తెచ్చు కోవడానికి నీకు ఒద్దకం అంతేకదూ?" అన్నదావిడ.

ఫిల్కా మారుమాటాడలేదు. ముఖం ఒక ప్రక్కకు తిప్పు కున్నాడు.

"ముఖం ఎందుకు అలా తిప్పుకుంటున్నావు ? అడిగినదానికి సమాధానం చెప్పు" అన్నదావిడ మళ్ళీ.

"అంతకన్నా ఇంకేం చెప్పను?" అన్నాడతను.

"మళ్ళీ ఇలాంటి పొరబాటు చెయ్యకు భోజనశాల్లోకి సూ్కలు పుస్తకాలతో రాకూడదు. మరో విషయం నేను నీతో మాట్లాడుతూ ఉంటే నీవలా ముఖం తిప్పుకోకూడదు."

"సరే. అలాగే చేస్తాను కామ్రేడ్ కమాండర్ ఇంకెప్పుడూ పుస్తకాలిక్కడికి పట్టుకరాను.

లిడా అక్కడనుంచి రెండడుగులు ముందుకు వేసింది. కావలా సైనికులు నలుగురు గుసగుసలాడుకున్నారు. టేబిల్ముందు కూచున్న

కుర్రవాళ్ళు తమలోతాము ఏదో మాట్లాడుకున్నారు. లిడా ఇగోర్ దగ్గరికి వెళ్ళింది. అందరిదృష్టి అతనిమీాద పడింది.

"ఇవాళ నీవు పనిలోకి వెడుతున్నావా చెర్నియావిన్?" అని ఆవిడ ప్రశ్నించింది.

ఇగోర్ నోరు తెరిచి అలాగే కూచుండిపోయాడు. మిషా గోంటార్ ఇలా గద్దించాడు.

"ముందు లేచి నిలుచో."

వెంటనే ఇగోర్ లేచి నిలుచున్నాడు.

"నేను పనిలోకి వెళ్ళడంలేదు" అన్నాడు.

"మాకు మనుష్యులు తక్కువగా ఉన్నారని నీకు తెలియదా"

"వడ్రంగంపని నాకసలు ఇష్టంలేదు."

"అలాగా! శత్రువువచ్చి నీమీాదపడితే ఏమిటిచేస్తావు? సోల్జరుకావడం నాకిష్టంలేదని చెపుతావా?"

"ఒహో! అది వేరే విషయం"

ఇగోర్ ఇలా అనగానే ఫిల్కా అందరికీ వినిపించేటట్లుగా ఇలా అన్నాడు:

"అది వేరే విషయమట! శత్రువు మీాదపడితే మంచంక్రింద దూరతాడు కాబోలు!"

లిడా, ఫిల్కావంక తీక్షణంగా చూచింది. అతను ఆమెవంక చూచి నవ్వాడు. లిడా ఇగోర్ వంక తిరిగి మళ్ళీ ఇలా అడిగింది:

"అయితే నీవు పనిలోకి వెళ్ళడంలేదన్నమాట?"

"వెళ్ళడంలేదు."

లిడా తన చేతిలోని కాగితాల ఫైలులో ఏదో వ్రాసుకుని అక్కడనుంచి వెళ్ళిపోయింది.

భోజనాలయిన తరువాత ఇగోర్ పుస్తకం చదువుకుంటూ కూచున్నాడు. దానిపేరు "పార్టిజాన్సు". జోరిన్ మంచం ప్రక్కన ఆ

పుస్తకం ఉంది. ఇగోర్ చదువుకుంటూ ఉంటే పడకగదిలోకి బిగోనక్ వచ్చి ఇలా పిలిచాడు:

"కామ్రేడ్ చెర్నియావిన్! కమాండర్ల కౌన్సిల్ కార్యదర్శి ఇవాళ అయిదు గంటలకు కౌన్సిల్ మీటింగు వేశాడు. సమావేశానికి నీవు రావాలి. నీవు నీ ప్రవర్తననుగురించి అక్కడ చెప్పుకోవాలి."

"అలాగే."

నీ అంతట నీవు అక్కడికి వస్తావా? లేక నీకోసం మనిషిని పంపించాలా?"

"అక్కర్లేదు. నేనే వస్తాను."

"గుర్తించుకో అయిదు గంటలకు కౌన్సిల్ సమావేశం ఉన్నది! సమావేశానికి నీవు హాజరు కావాలి."

ఇగోర్ మాట్లాడలేదు.

"జవాబు చెప్పవేం?" అని అడిగాడు బిగోనక్.

ఇగోర్, బిగోనక్ వంక తేరిపార చూచాడు.

"అలాగే, అయిదు గంటలకు కౌన్సిల్ సమావేశానికి వస్తాను" అన్నాడు.

"గుర్తుంచుకో. విధిగా రావాలి" అని హెచ్చరిస్తూ బిగోనక్ వెళ్ళిపోయాడు.

28

వాన వెలిశాక

నాలుగు గంటలకు ఉరుములు మెరుపులతో గాలివాన వచ్చింది. మహాప్రళయంగా గాలి వీచి చెట్లు చేమలు విరుచుకు పడ్డాయి. కాలనీ అంతా నీళ్ళు వరదలుకట్టాయి. వాన కురుస్తూ ఉంటే పిల్లలు దుస్తులు విప్పుకుని సరదాగా వానలో తడుస్తూ ఆడుకుంటున్నారు కొంతసేపు సుడిగాలి వీచి నగరంవైపు మళ్ళింది. కాలనీలో ఇప్పుడు సుడిగాలి అణగిపోయింది. ఆకాశంమీద అక్కడక్కడ కొన్ని మబ్బుతునకలు చెదురువాటుగా ఉన్నాయి.వాన వెలిసినతర్వాత పిల్లలు వరండాలలోకి, గదులలోకి వెళ్ళి దుస్తులు వేసుకున్నారు. వాన వెలిసేవరకూ ఉండి కాలనీవాసులు మళ్ళీ తమ తమ పనులు ప్రారంభించారు. సింహద్వారందగ్గర చక్కగా దుస్తులు వేసుకుని, చేతిలో రైఫిల్ పట్టుకుని రోట్‌షీన్‌ల్యూబా నిలుచున్నది. ఆవిడకు చేరువగానే వరండాలపైన గోనెపట్టా విశాలంగా పరిచి ఉన్నది. ఇవాళ అందరూ ఎంతో ఉత్సాహంగా సరిసమానంగా, ఏమాత్రం భేదంలేకుండా కనిపిస్తున్నారు. ఎక్కడ చూచినా గొంతులు విని పిస్తున్నాయి.

"కాళ్ళు తుడుచుకో."

"పాదాలు తుడుచుకో బొగెటోవ్."

"మరిచిపోయేవు, మరిచిపోయేవు బెలిన్‌కీ."

పిల్లలు వానలో తడిసిపోవడం రోట్‌షీన్‌కు ఇష్టంలేదు. ఆవిడ తన అయిష్టతను దాచుకోలేకపోతుంది.

"నీవు ఎన్నైనా చెప్పు నేను మాత్రం నిన్ను లోపలికి వెళ్ళ నివ్వను" అన్నది.

"అలా అంటే ఎలాగ రోటేషీన్" నా పాదాలు శుభ్రంగా తుడుచుకున్నా నే.

"పాదాలకేమొచ్చెగాని, నీ వళ్ళంతా తడిసి ముద్దయి పోయింది."

"అయితే వళ్ళు ఆరేదాకా లోపలికి వెళ్ళనివ్వవన్న మాట!"

"అంతే."

"మరి వళ్ళు ఆరడానికి చాలాసేపు పడుతుందే ?"

రోటేషీన్ ల్యూబా ఇందుకు సమాధానం ఏమీ చెప్పక కోపంగా మాత్రం చూచింది. ఆ కుర్రవాడు ఏదో గట్టిగా మాట్లా డాడు. మేడమీద కిటికీదగ్గర ఉన్న ఎవరి వంకనో చూపించాడు.

"కోల్యా, కోల్యా, కోల్యా !" అని అరిచాడు.

కిటికీలోనుంచి ఒక వ్యక్తి తొంగి చూచాడు.

"ఎందుకు పిలుస్తున్నావు ?" అని అడిగాడు.

"ఒక తువ్వాలు ఇలా పారెయ్యి."

అతను మేడమీదనుంచి క్రిందికి తువ్వాలు విసిరేశాడు. ఆ కుర్రవాడు తువ్వాలుతో వళ్ళాంతా తుడుచుకుని, ల్యూబావంక నవ్వుతూ చూచి లోపలికి వెళ్ళిపోయాడు.

అయిదు గంటలైంది. కమాండర్ల కౌన్సిలు సమావేశానికి వేళ అయిందని సూచిస్తూ బిగోనక్ ఇవతలికొచ్చి బిగిల్ ఊదాడు. బిగిల్ ఊది వానసీరు చూస్తూ మళ్ళీ లోపలికి వెళ్ళిపోయాడు.

ఇంతలో అక్కడికొక కుర్రవాడొచ్చాడు. అతను వానకు తడిసి ముద్దయిపోయాడు. తలమీద టోపీలేదు. సరాసరి వచ్చి సింహం ద్వారంవద్ద నిలుచున్నాడు. అతనే వాన్యాగల్చెంకో. ద్వారం చెంత ల్యూబా గస్తీ కాస్తున్నది. ఆ కుర్రవాణ్ణి చూచి ఇలా అడిగింది:

"అబ్బాయ్! పేరేమిటి నీది? ఎక్కడ నుంచి వచ్చావు?"

"నేనా......చాలా దూరంనుంచి నడిచివచ్చాను......"

"నడిచివచ్చావని నీవు వేరే చెప్పక్కర్లేదు. నిన్ను చూడగానే తెలుస్తోంది. ఇక్కడికి ఎందుకొచ్చావు? ఏం కావాలి?"

"నన్ను కాలనీలో చేర్చుకుంటారా?"

"నిన్ను చేర్చుకోవాలా! నీ దగ్గర నోచరు ఉన్నదా?"

"నోచరా?"

"అవును ఏదో ఒక పత్రం"

"నాం దగ్గర ఏమీ లేదు."

"పత్రం లేనిది నేనేమీ చెయ్యం? ఏ పత్రం లేకుండా నిన్ను లోపలికి వెళ్ళనివ్వరు."

ఈ మాట వినగానే వాన్యా భుజాలు దించుకున్నాడు. ఆవిడ వంక తదేకంగా చూచాడు. ఆవిడ అతన్ని చూచి నవ్వింది.

"అక్కడెందుకు నిలుచున్నావు? ఇలారా ఈ ప్రక్కన నిలుచో......నిన్ను వాళ్లు లోపలికి రానివ్వరు" అన్నది.

వాన కురుస్తోంది. వాన్యా వరండాలోకి వచ్చాడు. వరండాలో వానచినుకులను చూస్తూ నిలుచున్నాడు. అతని కళ్ళవెంట నీళ్లురాలజొచ్చాయి. వాన్యా ఆవంక కళ్ళెత్తిచూచి చేతితో కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు.

ఇదే సమయంలో గదిలో కమాండర్ల కౌన్సిలు సమావేశం జరుగుతోంది. సమావేశంలో కమాండర్లేకాక మరికొందరు కాలనీ వాసులుకూడా పాల్గొంటున్నారు. గదిలో పెద్దపొడుగైన బల్లఉంది. బల్లమీద నలభైమంది వరుసలొరుసలుగా కూచున్నారు. నెస్త్రెంకో ఒకచోట కూచున్నాడు. అతనిప్రక్క జోరిన్, గోంటార్, అస్టాప్ చిన్‌లు ఆశీనులయ్యారు. మ్యార్క్ గ్రీన్‌హాస్, అనే అతను కొమోసో మోల్ కార్యదర్శి. అతను వినోదంగా నవ్వుతూ, ఆలోచిస్తూ కూచు

న్నాడు. అతని ఆలోచన తన వ్యక్తిగత విషయాలను గురించో, లేక ఇగోర్ చెర్నియావిన్‌ను గురించో అయిఉంటుంది. సెక్రెటేరియట్ బల్ల చెంత విట్యాటార్‌స్కీ, అలెగ్జీ స్టెపానోవిచ్ జఖరోవ్‌లు కూచు న్నారు. ద్వారందగ్గర బిగోనక్, మరికొందరు పిల్లవాళ్లు నిలుచు న్నారు. ఇగోర్ చెర్నియావిన్ గదిమధ్య నిలుచుని తన ప్రవర్తనను గురించి చెప్పుకుంటున్నాడు. అతను చెప్పే ప్రతీమాటనూ అందరూ శ్రద్ధగా వింటున్నారు.

నాకు పని చేయాలనే కుతూహలంలేక కాదు. సామానులు కొకదానికొకటి అమర్చే షాపులో పనిచెయ్యడం నాకిష్టం లేదు. అది నాకు సరిపడదు. అక్కడ పనిచేయడలో అర్థం ఏముంది? అని ఇగోర్ ప్రశ్నించాడు.

ఇలా ప్రశ్నించి మౌనంగా ఊరుకున్నాడు. తనచుట్టూ ఉన్న మనుష్యులవంక తేరిపార చూచాడు. సమావేశంలో ఉన్నవాళ్ళు కొంచెం కోపగించుకున్నట్లు కనిపించారు. వాళ్ళు అశాంతి చిత్తులై ఉండడం అతనికి సంతోషం కలిగించింది. నవ్వుతూ డైరెక్టర్ వంక చూచాడు. జఖరోవ్ చూపుల్లో ఏ భావమూ వ్యక్తం కాలేదు. అతను చిన్న చాకుతీసుకుని పెన్సిలు చెక్కుతున్నాడు.

“ఇగోర్ ఉపన్యాసం అయిపోయాక నేను మాట్లాడవచ్చా?” అని గోంటార్ అడిగాడు.

టార్‌స్కీ తలఊపాడు. గోంటార్ లేచినిలుచుని కుడిచేతిని కదిలిస్తూ ఇలా అన్నాడు:

“అతను మాట్లాడినదంతా నట్టి చెత్త! అర్థం పర్థం లేదు. ఇలాంటివాళ్ళను ఇంకా ఎంతమందిని మనం ఇక్కడ చేర్చుకుంటాం? నేనీ కాలనీలో అయిదేండ్ల నుంచీ ఉంటున్నాను. ఈ గదిలో అతని లాంటివాళ్లు ముప్ఫయిమందిఉన్నారు.”

“అంతకంటె ఎక్కువే ఉన్నారు!” అనేమాట మధ్యలో వినిపించింది.

"ప్రతివాడూ అతనిలాగానే మాట్లాడుతుంటాడు. అదేవరస. ఈ చెత్తవాగుడు వినలేక విసుగెత్తిపోతోంది. అతనికి ఫిట్టర్ కావడం ఇష్టంలేదట. సరే నేనొక ప్రశ్న వేస్తాను. గుర్రుపెడుతూ నిద్రపోవడం కంటె అతనింకేం పనిచెయ్యగలడో ఏనాడైనా అడిగారా? ఠీవిగా తయారై మనందరి మధ్యకూ వచ్చి దర్జాగా 'నాకు ఫిట్టరు కావాలని లేదు' అని రొమ్ములు విరుచుకుని చెపుతున్నాడు. అయితే ఇంకేం చెయ్యాలని ఉంది అతనికి? ఏం చెయ్యాలని ఉందో అతను చెప్పకుండానే మీరు పోల్చుకోవచ్చును. పనీపాటా లేకుండా ఇతర్లు కష్టపడుతుంటే హాయిగా పరాన్నభుక్కులలె మెక్కి కూచోవడం అతనికి సరదా. ఇలాంటివాళ్ళు మన మధ్య ఒకరో ఇద్దరో ఉంటే నేను అర్థం చేసుకోగలను. కాని మీరంతా ఆలోచించి చూడండి. ఇలాంటివాళ్ళు ఒకరు ఇద్దరు కాదు. మనం చాలామందిని చేరనిచ్చాం. నేను ఒకటే ప్రతిపాదిస్తున్నాను. ఇలాంటి వ్యవహారాలు ఇక్కడ కుదరవు. అతనికిచ్చిన దుస్తులు అవి తీసుకుని, అతను ఏ గుడ్డలతో వచ్చాడో ఆ గుడ్డలు ఇచ్చేసి అతన్ని బయటికి పంపించేద్దాం. ఒక్కణ్ణి ఇలా పంపించివేస్తే తక్కినవాళ్ళకు బుద్ధి వస్తుంది."

ఇలా గోంటూర్ చెప్పేసరికి

"నిజం, నిజం!" అని జిరియాన్‌స్కీ అరిచాడు.

"మధ్యలో అడ్డురాకు నీవు చెప్పేదేదో తరువాత చెపుదువు గాని" అని అతన్ని వారించాడు టార్‌స్కీ.

"ఓ! నేను కొత్తగా చెప్పేదేమీ లేదు. ఇగోర్ మాటల్లో ఏమీ సబబు కనిపించదు. ఏమిటా ఉపన్యాసం? అతనికి వడ్రంగం పని ఇష్టంలేదు. మరి మేమంతా వడ్రంగంపని చేసేవాళ్ళమే. మేమంతా పనిచేస్తూ, పని చెయ్యని అతనికి ఎందుకు భోజనం పెట్టాలి? అదీ నాకు కావలసింది. అతన్ని పంపించెయ్యండి. గేటు తీసి బయటికి త్రోవ చూపించండి."

"మనం అలా పంపించలేం. అలా పంపించివేస్తే అతనిపాట్లు కుక్కలు, నక్కలుకూడా పడవు!" అన్నాడు నెస్ట్రెంకో, ప్రశాంతంగా.

"పడనివ్వండి పడితే బుద్ధి వస్తుంది."

"చర్చ ముగిద్దాం. అతన్ని ఇక్కడ ఉంచాలో పంపించి వెయ్యాలో ఓటు తీసుకుందాం" అన్నాడు. సభ్యుల్లో ఒకతను

తన వాదనకు సుముఖంగా ఉండే గొంతుకలు వినిపిస్తాయేమోనని ఇగోర్ ఆశతో చూచాడు. జఖరోవ్ పెన్సలు చెక్కుకుంటున్నాడు.

"నన్ను వీళ్లు బయటికి పంపించివేస్తారు కాబోలు" అనే భావం ఇగోర్ మనస్సులో మెరుపులా తళుక్కుమన్నది. వెంటనే అతనికి ఒక వింతభయం ఆవహించింది.

......అవతల సింహద్వారం వద్ద ల్యూబా, వాన్యాను ప్రశ్నిస్తూనే ఉంది.

"నీవు ఎక్కడుంటున్నావు?"

"ఎక్కడాలేను."

"ఎక్కడా లేదూ! అంటే నీ ఉద్దేశం? మాటవరసకు అడుగుతున్నాను - నీవు బ్రతికున్నావా చనిపోయావా?"

"మాటవరసకు అడుగుతున్నారా? మాటవరసకు బ్రతికే ఉన్నాను. కాని నేను బ్రతికే విధానంమాత్రం... నేనెక్కడా ఉండడంలేదనే చెప్పాలి."

"రాత్రిళ్ళు నీవు ఎక్కడ గడుపుతున్నావు?"

"ఈ ప్రశ్న మామూలుగానే అడుగుతున్నారా?"

"అదేం ప్రశ్న? నిన్నరాత్రి నీవు ఎక్కడ గడిపావని అడుగుతున్నా."

"అక్కడ...ఒకఇంట్లో...ఒకశాలలో పడుకున్నాను. నన్ను లోపలికి వెళ్ళనివ్వరా ?"

"ఇక్కడ మాకు గదిలేదు. ఇంతకూ నీవెవరో మాకు తెలీదు."

ఈ మాట విని వాన్యా దుఃఖంతో క్రుంగిపోయాడు. అతనికి బిగ్గరగా ఏడవాలనిపించింది.

29

మీరు ఏది చెపితే అది

క్రమాండర్ల కౌన్సిలు సమావేశంలో మార్క్ గ్రీన్‌హౌస్ మాట్లాడుతున్నాడు. బెంచీదగ్గర నిలుచుని ఒక చెయ్యి బల్లమీద ఆనించుకుని ప్రసంగం కొనసాగిస్తున్నాడు. జఖరోవ్ పెన్సలు చెక్కుకోవడం పూర్తి అయింది. కాగితంమీద పెన్సలుతో వ్రాసుకుంటు న్నాడు. ప్రతిమాటా స్పష్టంగా వినిపించేటట్లు మార్క్ మెల్లగా ఉపన్యసిస్తున్నాడు.

"ఆ విధంగా మనుష్యులను ఇక్కడనుంచి బయటికి పంపించి వేయమని ఎన్ని తడవలు చెప్పలేదు కనుక? ఈ విషయంలో అలెగ్జీ సెమానొవిచ్ అభిప్రాయంకూడా అంతే. ఇక్కడనుంచి అతన్ని ఎక్కడికి పంపించాలి మనం? వీధుల్లోకేనా ? అలా చెయ్యడానికి మనకు ఏమాత్రం హక్కులేదు. లేదంటే లేదు."

మార్క్ గ్రీన్‌హౌస్ నల్లని కళ్ళు తళతళ మెరుస్తున్నాయి. జిరియాన్‌స్కీవంక చూచాడు. గ్రీన్‌హౌస్ కళ్ళల్లో ద్యోతకమవుతున్న మానవకారుణ్యాన్ని జిరియాన్స్కీ చూడగలిగాడు. అతని చూపులను తప్పించుకుని మళ్ళీ అతనివంక తేరిపార చూచాడు.

"లేదు అలెగ్జ్యాసా. మనకా హక్కులేదు. సోవియట్ న్యాయ సూత్రాన్ని మనం పాటించాలి, గౌరవించాలి. ఆ న్యాయసూత్ర

ప్రకారం ఎవరినీ వీధుల్లోకి నెట్టడానికి వీల్లేదు. అయినప్పటికీ కామ్రేడ్ కమాండర్స్! ఇంతసేపూ మీరు ఒకేమాట చెపుతున్నారు. అతన్ని బయటికి పంపించమని న్యాయవిరుద్ధంగా ఒత్తిడి చేస్తున్నారు."

"అయితే మేం ఏమిటి చెయ్యాలి? అతను ఆడింది ఆట, పాడింది పాటానా? ఏంచేసినా గంగిరెద్దులా తల ఊపుతూ ఊరుకోవడమేనా?" అని అరిచాడు మిషాగోంటార్.

"మనం అతన్ని పంపించలేం" అంటూ గ్రీన్‌హౌస్, తను అనే ప్రతిమాటనూ నొక్కి నొక్కి చెపుతున్నాడు. "అంతమాత్రంచేత అతని ప్రవర్తనను మనం ఆమోదిస్తున్నామనికాదు. అల్లా ఎవరు ప్రవర్తించిన తప్పే. మనం సామ్యవాద సమాజానికి చెందినవాళ్ళం. సామ్యవాదజీవితరంగంలో ప్రతిఒక్కడూ పనిచేయవలసిందే. ఎక్కడో ఒకచోట పనిచేస్తానని ఇగోర్ చెపుతున్నాడు. దాన్ని సహితం మనం అంగీకరించలేం. సామ్యవాద వ్యవస్థలో క్రమశిక్షణ అవసరం. కాలనీలో ఉన్న మనుష్యులను ఎవరికి వారిని ప్రశ్నిస్తే ఎవరూ వర్క్‌షాపులో పనిచేయడానికి ఇష్టపడరు. మనముందు అనేకమార్గాలున్నాయి. ఈ మార్గాలన్నీ గొప్పవే, అద్భుతమైనవే. ఒకొక్క వ్యక్తికి విమానం నడపాలని ఉంటుంది. మరొకడు భూగోళశాస్త్రజ్ఞుడు కావాలని ఉబలాటపడతాడు. ఇంకొకడు సైన్యంలో చేరతానంటాడు. ఎంతసేపూ ఇలా కోరుకుంటారే తప్ప, యంత్రాలు అమర్చే కార్మికుడుగా పనిచేస్తానని ఒక్కడూ ముందుకురాడు. ఇదిమాత్రం ఒక ఉద్యోగం కాదా! ఒక వృత్తికాదా! మనకాలనీలో అర్థరహితమైన ఆలోచనలకు, నడవడికి స్థానంలేదు. అయితే ఒక్క విషయం. ఎవరు ఎలాగైనా ఉండనీ, కాలనీలోనుంచి బయటికి పంపడానికి మనకు హక్కులేదు."

"అయితే అతన్ని ఒక చక్కటి గాజుకూజాలో స్పిరిట్ వేసి, ఊరగాయి ఊరవేసినట్లు భద్రంగా పదిలపర్చండి" అని సభ్యులలో నుంచి ఎవరో అనడం వినిపించింది. ఈ మాటలు ఎవరు అన్నారో కని పెట్టాలని గ్రీన్‌హౌస్ అటువక్క తిరిగాడు. పెట్కా క్రావ్ చెక్,

గ్రీన్‌హౌస్ వంక చూచాడు. అతనికి గ్రీన్‌హౌస్ ఉపన్యాసం ఏమీ నచ్చలేదు.

"మధ్యలో అడ్డుచెప్పకు!" అని విట్యాటార్‌స్కీ అతన్ని వారించాడు.

"నీకంత బాధగా ఉంటే నోరుమెదపక కూచో."

గ్రీన్‌హౌస్ అతనివంక అలాచూస్తూ ఉండిపోయాడు. "అతన్ని మనం బయటికి పంపించలేం. అయితే అతను ఇక్కడ ఉండాలని నేను ప్రతిపాదించడంలేదు. సామ్యవాద క్రమశిక్షణను గౌరవించడం అతనికి ఇష్టంలేకపోతే అతన్ని మరొకచోటికి మనం పంపించాలి."

నెస్ట్రెంకో గ్రీన్‌హౌస్ వంక ప్రశాంతంగా చూస్తున్నాడు.

"అయితే మరి అతన్ని ఎక్కడికి పంపించాలనుకుంటున్నావు మార్క్ ?" అని అడిగాడు.

సమావేశంలోనివారంతా పకపక నవ్వారు. వాళ్ళతోపాటు కమాండర్లుకూడా నవ్వారు. జఖరోవ్ వ్యంగ్యంగా గ్రీన్‌హౌస్ వంక చూచాడు. గ్రీన్‌హౌస్ విచారంగా నవ్వుతూ

అతన్ని బాలల శిబిరానికి పంపించాలి" అన్నాడు.

ఈమాట వినడంతోనే పెట్కా క్రావ్‌చెక్ సంతోషంతో పొంగిపోయాడు. బెంచీమీద నిలుచుని, ప్రక్కనున్నవాణ్ణి సహితం త్రోసివేసి, ఆవేశంతో ఇలా అరిచాడు:

"అది చాలామంచిపని. ఎంతో గొప్పపని. అతన్ని మన కిండర్‌గార్డెన్‌లోకి పంపించివేద్దాం ఆఫీసర్ల బిడ్డలకు కిండర్ గార్డెన్ ఉందికదా. ఇతన్ని అక్కడికి పంపిస్తే సరిపోతుంది."

విట్యాటార్‌స్కీ అందరూ నవ్వుతుంటే తనుకూడా నవ్వాడు కాని, పెట్కా ప్రవర్తనను చూచి కోపగించుకున్నాడు.

బయటికి వెళ్ళు పెట్కా."

"ఎందుకు వెళ్ళాలి."

"బయటికి వెళ్ళమన్నాను, అంతే"

క్రావ్ చెక్ శాల్యూట్ చేశాడుకాని అందులో తన అసంతృప్తిని వ్యక్తపరిచాడు.

"అలాగే వెడతాను కామ్రేడ్ కమాండర్" అంటూ బిగోనక్ వెంటరాగా క్రావ్ చెక్ అవతలికి వెళ్ళిపోయాడు.

అవతల మాటలు, నవ్వులు, గదిలోనికివారికి స్పష్టంగా విని పిస్తూనే ఉన్నాయి. జఖరోవ్ కాగితంమీద ఏదో గీస్తూ కూచున్నాడు. అతని కళ్లు జాగ్రత్తగా గీస్తున్న దానిని పరిశీలిస్తున్నాయి.

వరండాలోకి వెళ్ళివెళ్ళగానే బిగోనక్‌కు వాన్యా గల్చెంకో కనిపించాడు. కనిపించగానే చకచకా అతనిదగ్గరికి వెళ్ళాడు.

"నీవుకూడా వచ్చేశావన్నమాట?" అన్నాడు.

"ఆ వచ్చేశాను. ఇహ ఇప్పుడు నేనేం చెయ్యాలి?" అని సంతోషంతో అడిగాడు వాన్యా.

"ఇక్కడే నిలబడి ఉండు నేనిప్పుడే వస్తాను."

ఇలా అని బిగోనక్ ఫలహారశాలలోకి వెళ్ళి తిరిగొచ్చాడు.

తినడానికేమైనా కావాలా? అని అడిగాడు.

"తినడానికా నీకు తెలుసుకదా. నాకు......"

"ఉండు. ఇప్పుడే వస్తాను"

బిగోనక్ కౌన్సిలు గదిలోకి గబగబా వచ్చాడు. ఇదివరకటి లాగానే ఇగోర్ గదిమధ్య నిలవబడి ఉన్నాడు. అక్కడ ఉన్న సభ్యులంతా తనవంక అదోలా చూస్తూఉంటే తనక్కడ ఆస్థితిలో నిలుచుని ఉండడం అతనికి సిగ్గనిపించింది. టార్‌స్కీకి సహితం అతనిపై సానుభూతి కలిగింది.

"నిలుచుంటావెందుకు? కాసేపు కూచో. జరగండర్రా - కాస్త అవతలికి జరగండి......ఇప్పుడిహ ఒలెంకో మాట్లాడతాడు."

ఇంతలో బిగోనక్ చెయ్యెత్తి నిలుచున్నాడు. "మన కమాండర్లను ఒక్కమాటు బయటికి రానివ్వండి విట్యా."

"ఎందుకూ?"

"చాలా జరూరు పని ఉంది."

"లిడా! నీవు వెళ్ళవచ్చు. అవతల ఏమిటి విశేషం?"

లిడాటవిశోవా గది బయటికి వచ్చింది. బిగోనక్ ముందు త్రోవ చూపిస్తుంటే అతన్ని అనుసరించింది. ఒలెంకో ప్రసంగించడా నికి లేచి నిలుచున్నాడు:

"ఎప్పుడూ జిరియాన్‌స్కీ వద్దతే అంత - పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రం: బయటికి పంపించెయ్యండి - అతన్ని బయటికి పంపించెయ్యండి. ఇదీ అతని వరస. అతని వద్దతే కనుక అనుసరించి ఉంటే ఈపాటికి ఈ కాలనీలో ఒక్క జిరియాన్‌స్కీ మాత్రమే ఉండేవాడు."

"అది అబద్ధం, అది అబద్ధం! కాలనీలో చాలామంది మంచి కార్మికులు ఉన్నారు" అంటూ జిరియాన్‌స్కీ అతని ప్రసంగానికి అభ్యంతరం తెలిపాడు.

"అవును ఉన్నారు. అయితే అకస్మాత్తుగా వాళ్ళు మంచి వాళ్ళు కాలేరు. మంచిగా ప్రవర్తించడానికి కొంతకాలం పడుతుంది. కాదంటావా? అతన్ని ఎక్కడికి గెంటివేస్తావు నీవు? ఎక్కడికి పంపిం చాలనుకుంటున్నావు? ఇది ఎంతో దురదృష్టకరం. ఇక్కడికి రకరకాల వాళ్ళు వస్తారు. వాళ్ళ మంచిచెడ్డలు మనం చూడాలి. అందుకే మనం ఇక్కడ ఉన్నాం. ఇసోర్ చెర్నియావిన్ ఎవరి అజమాయిషీ క్రింద ఉన్నాడు?"

"అతని మంచిచెడ్డలు జోరిన్ చూస్తున్నాడు."

(అయితే సరే. అతని బాధ్యతను జోరినే స్వీకరిస్తాడు.")

సమావేశంలో అసమ్మతి సూచకంగా కొన్ని గొంతుకలు వినిపించాయి. జోరిన్ లేచి నిలుచున్నాడు.

"ధన్యవాదాలు ఒలెంకో! చాలా ధన్యవాదాలు. అతన్ని మొదటిదళంలోకి తీసుకుని ఆ మంచిచెడ్డలేవో నీవేచూడు.

ఒలెంకో జోరిన్‌వంక చూచాడు "మంచికార్మికమైన మాట్లాడే పద్ధతి అదికాదు జోరిన్. మీా ఎనిమిదవ దళంలో అంతా పాతవాళ్ళే కొత్తవాళ్ళెవరూ లేరు. సభ్యులంతా తత్త్వవేత్తలు. నా దళంలో అలా కాదు. చూడు, ఎంతమంది ఉన్నారో! నలుగురు కొత్తవాళ్ళు లెవిటిన్, నొజిక్, మాక్సీమ్ చెంకో, రస్లాన్, ఈ నలుగురూ మొన్న మొన్ననేకదా వచ్చారు. ఒక కొత్తవాణ్ణి రెండురోజులు క్రితం చేర్చుకున్నానో లేదో అతన్ని అప్పుడే బయటికి పంపించివెయ్యాలని గొడవ పెడుతున్నావు" అన్నాడు ఒలెంకో.

ఇంతసేపూ నిలుచుని ఉన్న ఇగోర్, నెస్త్రెంకో, పోర్‌షినేవ్‌ల మధ్య కూచున్నాడు. పోర్‌షినేవ్ రెండవ దళానికి కమాండర్. ఒలెంకో ప్రసంగం అతనికి కొంత ఊరట కలిగించినా, కొంతసేపటికి మళ్ళీ మనస్సు గాయపడింది. తనను పిల్లందరూ ఒక చీమలాగా, దోమలాగా ఎందుకు చూస్తున్నారు? అవును వాళ్ళ దృష్టిలో తనొక దోమ తమ తోటలోకి వచ్చి వాలిన ఒక కీటకం. ఆకీటకాన్ని చూచి ఇది మంచి చేస్తుందా చెడ్డ చేస్తుందా అని తమలోతాము వితర్కించుకుంటున్నారు. తమకు జ్ఞాపకం తనవంటి ఇతర కీటకాలనుగురించి కూడా మాట్లాడుకుంటున్నారు. తమ మధ్య కూచున్నది ఇగోర్ చెర్నియావిన్ అన్న విషయం వాళ్ళెవరూ గమనించడంలేదు. ఇగోర్ అంటే నొజిక్ కాదు. రస్లాన్ అంతకంటె కాదు. పని చెయ్యలేమని చెప్పే ధైర్యం వాళ్ళిద్దరికీ లేదు.

...సింహద్వారంవద్ద లిడాటలిక్కోవా, వాన్యావంక జాలిగా చూస్తూ నిలుచుంది. ఇవాళ ఆవిడ కమాండర్. విధులను నిర్వర్తిస్తోంది. జాలి పుట్టినా తన విధులప్రకారం ఆవిడ అతన్నిలా ప్రశ్నించింది :

"నీవు కాలనీలోకి వస్తానంటున్నావు అంతేకదూ? కాని నీవు ఎవరివో ఎవరికి తెలుసును? బహుశా ఇదంతా తమాషా ఏమో!"

తన హృదయంలో కొట్టుకలాడుతున్న భావాన్ని వాన్యా వ్యక్తపరచడానికి ఎంతో ప్రయత్నించాడు. తన ఎదుట నిలుచుని,

తనను ప్రశ్నిస్తున్న పిల్ల ప్రధాన ఉద్యోగివలె అతనికి అగుపించింది. తీరా నోరు తెరిచేసరికి మాటలు తడబడ్డాయి.

"నాకేమీలేదు. ఆస్తిపాస్తులు లేవు. చేతిలో చిల్లి కోపెక్కు లేదు. ఏంతినాలో బోధపడదు. ఎక్కడ పడుకోవాలో తోచదు. కొమెండెంట్ కు వెళ్ళాను. స్టాన్ కు వెళ్ళాను ..ఎక్కడికి వెళ్ళినా ఒకటే. అంతా వృధా."

"మరి నీకు అమ్మా, నాన్నా లేరా ?"

"అమ్మా, నాన్నా ?" అంటూ వాన్యా బోరున ఏడ్వసాగాడు. అంతలోనే మళ్ళీ దుఃఖాన్ని అణుచుకుని, కన్నీళ్ళు తుడుచుకుంటున్నాడు.

బిగోనక్, లిడాచెయ్యి పట్టుకున్నాడు :

"అతని స్థితి ఎలాఉందో చూడు లిడా ! మనం అతన్ని చేర్చుకుందాం" అన్నాడు.

లిడా జ్వలిస్తున్న అతని కళ్ళల్లోకి చూచింది.

"చేర్చుకుందా మంటావా ?" అన్నది.

"ఆలోచించి చూడు."

"ఇక్కడే ఉండు" అని వాన్యాతో చెప్పి లిడా, తిరిగి భవనంలోకి వెళ్ళిపోయింది. బిగోనక్ కూడా ఆవిడవెంట వెళ్ళాడు. వెళ్ళే ముందు వాన్యాకు,

"భయపడకు. ధైర్యంగా ఉండడమే పురుషలక్షణం" అని ధైర్యం చెప్పాడు.

వాన్యా తల ఊపాడు. అతని మాటలు వాన్యాకు అర్థమైనాయికాని ధైర్యంమాత్రం కలగలేదు.

...కమాండర్ల కౌన్సిలులో అలెగ్జిస్టెపానొవిచ్ ఉపన్యసిస్తున్నాడు. అతనిచేతిలో ఇంకా పెన్సిలు ఉంది. ప్రతిమాటను తూచి తూచి పలుకుతూ మధ్య మధ్య ఇగోర్ వంక చూస్తూ ఇలా ప్రసంగించాడు:

నిన్ను నీవే ఒక్కసారి ప్రశ్నించుకుని సమాధానం చెప్పుకోవాలి చెర్నియావిన్. నీవు మా దగ్గరికి వచ్చావు. మాలో చేరావు. చేరినందుకు మాకు సంతోషం. మాది ఒక కుటుంబం. ఈ కుటుంబంలో నిన్నొక సభ్యుణ్ణిగా మేము భావిస్తున్నాం. ఇప్పుడు నీవు నీ ఒక్క విషయాన్ని గురించే ఆలోచించకూడదు. మా అందర్ని గురించి కూడా ఆలోచించాలి. కాలనీలో నీవూ ఒకడివి. మాతోపాటు సభ్యుడివి. ఈ సమిష్టి భావం ఎప్పుడూ నీ దృష్టిలో ఉండాలి. ఏ వ్యక్తీ తనకు తానే, ఒక్కడూ, ఏకాకిగా జీవించలేడు. సామూహిక దృష్టిని అలవర్చుకోవాలి. సమిష్టి కుటుంబాన్ని ప్రేమించడం నేర్చుకోవాలి. దాని ప్రయోజనం ఏమిటో అవగతం చేసుకుని సమిష్టి కుటుంబ సుఖ దుఃఖాలలో నీవు కూడా పాలుపంచుకోవాలి. అలా చేయనినాడు నీవు నిజమైన మానవుడివి కాలేవు. వడ్రంగం పని చేయడం నీకు ఇష్టం లేకపోవచ్చు. కాని అది కాలనీ క్షేమం కోసమని గుర్తుపెట్టుకో. దాని క్షేమమే నీ క్షేమం. సమిష్టి మానవులు క్షేమంగా ఉన్నప్పుడే నీవూ హాయిగా ఉంటావు. ప్రయత్నించు. రోజుకు నీవు ఎంత పని చెయ్యగలవో అంత పనీ చెయ్యి. నాలుగు గంటల్లో అరవై బందులు సిద్ధం చెయ్యగలవనుకుంటాను అలా చేస్తే ఎంతో పని చేసినట్లు లెక్క. ఇందులో కష్టమేమీ లేదు. మనోనిగ్రహం, ఓర్పు, కావాలి. అంతే అలా పని చేస్తే ఎంతో ఉత్సాహంతో ఉంటావు. సాయంకాలానికి నీ చేతులు, గూడలు నొప్పులు పుడతాయి. ఈ పని సోవియట్ నిర్మాణంలో గొప్ప కృషి. మనం ఇక్కడ తయారుచేసే కుర్చీలు నాటకశాలల్లో, సినిమా థియేటర్లలో ఉపయోగిస్తున్నారు. సోవియట్ ప్రభుత్వం ఏర్పడకపూర్వం మహానగరాలలో నివసించే వాళ్ళు మాత్రమే ప్రదర్శనశాలలకు వెళ్లేవారు. ఇప్పుడలా కాదు. నెలకు మనం ఒక వెయ్యి కుర్చీలను, సోఫాలను తయారుచేస్తున్నాం, ఇలా చేస్తున్నవాళ్ళం మనం ఒక్కళ్ళమే కాదు. ఇది ఎంత మహత్తరమైన కృషో నీవే ఆలోచించి చూడు. ఈ కాలనీలో నుంచి ప్రతి నెలా కుర్చీలతో సోఫాలతో ఒక ట్రక్కు, మాస్కో ఒడెస్సా, ఆస్త్రఖాన్,

ఒక్ సెజ్ ముద్రలైన సోవియట్ నగరాలకు వెడుతోంది. ఇక్కడ మనం తయారుచేసిన ఆసనాలలో ఆయా నగరవాసులు కూచుని నాటకాలు చూస్తున్నారు,సినిమాలు చూస్తున్నారు, ఉపన్యాసాలు వింటున్నారు, పాఠాలు నేర్చుకుంటున్నారు. అలాంటప్పుడు ఈ పని ఎందుకు చెయ్యాలని నీవు ఇక్కడ మమ్మల్ని అడుగుతున్నావు! మరొక విష యం. మనం ఏపనీ ఊరికే చెయ్యడంలేదు. చేసిన శ్రమకు ప్రతిఫలం వస్తోంది. డబ్బు వస్తోంది. మనకు వచ్చిన డబ్బుతో రెండు మూడేం డ్లలో మనం కొత్తగా ఒక ఫ్యాక్టరి నిర్మిస్తాం. ఆ ఫ్యాక్టరీ మనకు, మన దేశానికి అత్యవసరం. ఇన్నాళ్లనుంచి నీవు అంటున్నావుకదా: 'పని చేయడం నా కిష్టంలేదు. యంత్రభాగాలను అమర్చడం నాకు బొత్తిగా గిట్టదు. నేనసలు పనివాణ్ణే కాదలచుకోలేదు.' ఇలాంటి నీ ఊహాలు ఎంత నష్టదాయకమో నీవే యోచించు. ఇక్కడ నీవు ఏం కాదలుచుకున్నా మేము నీకు సహాయం చేస్తాం. కాని నీవు వడ్రంగి పని చెయ్యనని చేసిన అల్లరి అంతా పరమ అసహ్యకరం. తినడానికి ప్రజలకు ఒకపూట మాంసం దొరకదనుకో, రొట్టె మాత్రమే దొరు కుతుందనుకో - అప్పుడేం చేస్తారు. అదేతిని సంతృప్తి పడతారు.''

జఖరోవ్ ప్రసంగాన్ని ఇగోర్ అతి శ్రద్ధగా విన్నాడు. అతని ఉపన్యాసం ఇగోర్‌ను ఉత్తేజ పరిచింది. అతను బోధపరిచే విధానం మనస్సుకు నచ్చింది. ఇంతసేపూ తన మనస్సులో ఒక చిత్రాన్ని ఊహించుకున్నాడు. దేశమంతటా తాము తయారుచేసిన కుర్చీలు, సోఫాలు సరఫరా అవుతున్నట్లు భావించుకున్నాడు. తనేకాదు, సమావేశంలో ఉన్నవారంతా జఖరోవ్ ఉపన్యాసాన్ని ఊపిరి బిగ పట్టుకుని అత్యంత శ్రద్ధాసక్తులతో విన్నారు. జకరోవ్ ఇలా ఉపన్య సించడం బహు అరుదు. కాలనీలో ఉన్న సభ్యులంతా ఒకే కుటుంబీ కులమని ఎలా భావించగలుగుతున్నారో, జకరోవ్ చెప్పిన ప్రతి మాటకూ ఎందుకంత గౌరవాన్ని ఇస్తున్నారో, ఇగోర్‌కు ఇప్పుడు బోధపడింది.

లిడాటలికోవా, బిగోనక్‌లు వాకిలి దగ్గరకివచ్చి నిలుచు న్నారు. జఖరోవ్ తన ఉపన్యాసం ముగించి పెన్సలువంక చూస్తూ చిరునవ్వు నవ్వాడు:

"ఏమిటి గాభరాగా ఉన్నావు లిడా?" అని అడిగాడు.

"అలెగ్జి స్టెపానొవిచ్! అవతల ఒక కుర్రవాడు నిలుచుని లోపలికి రానివ్వమని ఏడుస్తున్నాడు" అన్నది లిడా.

"ఈ రాత్రికి ఉండమను. కాని కాలనీలో గదులు ఖాళీగా లేవు. అతన్ని ఎక్కడికైనా పంపిద్దాంలే."

"ఆ కుర్రవాడెంతో మంచివాడు"

లిడా తత్తరపాటునుచూచి జకరోవ్ సుదొకమూటు నవ్వాడు.

"అలాగా! సరే...లోపలికి తీసుకరా"అన్నాడు.

లిడా, బిగోనక్‌లు వాయువేగంతో బయటికి పరుగు తీశారు.

టార్‌స్కీ నలువంకల చూచి ఇగోర్‌ను ఇలా అడిగాడు:

"ఆఖరుసారి నీ అభిప్రాయం చెప్పు. మాట్లాడేదేదో జాగ్రత్తగా మాట్లాడు. మధ్యకురా. మాట్లాడు."

ఇగోర్, మధ్యకువచ్చి గుండెలమీద చేతులు వేసుకున్నాడు.

"కామ్రేడ్స్!" అన్నాడు.

అందరి ముఖాలను పరిశీలించాడు. కూచున్నవాళ్ళు కూచు న్నట్లే ఉన్నారు. ఎవరిముఖంలోనూ ఏభావమూ వ్యక్తంకాలేదు. అతను ఏం చెపుతాడో అని అంతా నిరీక్షిస్తున్నారు.

"నేను బద్ధకస్తుణ్ణికాదు కామ్రేడ్స్! మీకు పనిచెయ్యడం సులువు అందుకు మీకు అలవాటు పడ్డారు. పనిచెయ్యడం నాకిదే మొదటిసారి. అందుకే పనిచేస్తూ మొన్న చేతిలో వస్తువుల్ని జార విడిచాను..."

"ఈగలను చూచికూడా గాభరా పడ్డావు!" అన్నాడు జోరిన్

అంతా నవ్వారు.

"అవి ఈగలుకావు. జంతువులు - ఎగిరే జంతువులు....." అన్నాడు మళ్ళీ ఇగోర్.

"అరుస్తున్నాయికూడా, కదూ!" అని ముగించాడు జోలిన్.

అందరూ పకపక నవ్వుతూఉంటే తలుపు తెరుచుకుని లిజా, వాన్యాలు గదిలోకి వచ్చారు. ఇగోర్, వాన్యాను చూడగానే సంతోషం పట్టలేక ఎగిరి గంతువేసి, ఒక్క కేక పెట్టాడు.

"వాన్యా!"

"ఇగోర్!" అంటూ వాన్యా, కీచుగొంతుతో అరిచాడు.

"ఇక్కడికెలా వచ్చావు, ఇక్కడికెలా వచ్చావు?" అని అరిచాడు ఇగోర్.

"నిశ్శబ్దం, నిశ్శబ్దం! నీ విప్పుడెక్కడున్నావో మర్చిపోయావా ఇగోర్?" అని గద్దించాడు టూర్‌స్కీ.

ఇగోర్ వెంటనే సర్దుకుని లేచి నిలుచుని, చేతులు పైకెత్తి ఇలా అన్నాడు.

"అవునవును."

అతని మాటలలో ఉత్సాహం, ఉద్రేకం, అభిమానం ప్రస్ఫుటమైనాయి. అందరి పెదవులమీదా చిరునవ్వు కనిపించింది. అందరూ అతనివంక చూస్తున్నారు. వాళ్ళ చూపులలో ఆప్యాయత గోచరిస్తోంది.

"కామ్రేడ్స్! మీరు ఏ పని అప్పగిస్తే ఆపని చేస్తాను బందు కట్లు కానివ్వండి, కుర్చీ చేతులు కానివ్వండి - ఏవైనా సరే. మీరు ఏది చెపితే అది అలెక్సీ స్టెపానొవిచ్! కాని ఒక్కమాట. ఈ కుర్రవాణ్ణి మాత్రం ఇక్కడ ఉండనివ్వండి" అన్నాడు ఇగోర్.

"మరి ఈగల మాటేమిటి?"

"వాటిదారి వాటిది ఎలా చస్తే మనకేం?"

విక్టర్ ఒక ఖాళీకుర్చీని చూపించి "కూచో. కాసేపు కూచో" అన్నాడు.

30

అద్భుతమైన నాలుగవ దళం

"నీకు ఏంకావాలో చెప్పు?" అని వాన్యాను అడిగాడు టూర్‌స్కీ.

వాన్యా చుట్టూ కలయచూచాడు. కంటికి కనిపించిన ప్రతిదీ అతనికి ఆనందం కలిగించింది. ఇగోర్ అతనికి పరిచితుడే. అతను నవ్వు ముఖంతో పలకరిస్తున్నాడు బిగోనక్ స్నేహితునివలె ప్రవర్తిస్తున్నాడు లిడావిటలిక్గోవా సహితం అతనిపట్ల అప్యాయత చూపిస్తోంది.

"నాకేంకావాలో మీకు తెలుసు. ఇక్కడ నేను ఉండిపోవాలనుకుంటున్నాను". అన్నాడు వాన్యా.

"ఉండగలవో లేదో ముందుముందు చూడాలి."

తన భవిష్యత్తు ఏమిటో వాన్యాకు నిశ్చయంగా తెలుసు.

"ఆ, ఉండగలను. ఈ ఊళ్ళో నెలరోజులున్నాను." అన్నాడు వాన్యా.

"నీవు వీధులుతిరిగే కుర్రవాడివా?"

"కాదు...ఇంకా ఆ స్థితి రాలేదు."

"నీ పేరుమిటి?"

"వాన్యా గల్చెంకో."

"నీకు అమ్మా నాన్న, ఉన్నారా?"

ఈ ప్రశ్నకు వాన్యా సమాధానం ఇవ్వకుండా ముఖం ప్రక్కకు తిప్పుకుని, అతనివంక చూస్తూ నిలుచున్నాడు.

"మాట్లాడకపోతే దాని అర్థం నీకు అమ్మా, నాన్న లేరనా? పోనీ నీకు పెద్దవాళ్ళు ఎవరున్నారు ?"

కొందరుండేవారు...కాని వారు వెళ్ళిపోయారు." అని చెప్పాడు వాన్యా.

"ఇద్దరూనా ? అమ్మ, నాన్న ?"

"కాదు. మా అమ్మ, నాన్న కాదు"

"నీవు చెప్పేదేమిటో నాకర్థంకావటంలేదు. కాస్త విశదంగా చెప్పు."

విశదంగానా ? అయితే వినండి. చాలాకాలంక్రితం యుద్ధ కాలంలో మా అమ్మ, నాన్న చనిపోయారు నాన్న యుద్ధభూమికి వెళ్ళిపోయాడు. అమ్మ చనిపోయింది."

"అయితే నీకు అమ్మ, 'నాన్న లేరన్నమాట ? మరి నిన్ను ఎవరు పెంచేవారు ?"

"మా అమ్మ, నాన్న పోయిన తరువాత ఒకతను నా బాగోగులు విచారించేవాడు. కొంతకాలనుయ్యాక అతను పెళ్ళి చేసుకున్నాడు, వెళ్ళిపోయాడు."

నిన్ను వదిలిపెట్టి వెళ్ళిపోయారా ?"

"కాదు. నన్ను ఒక పౌనుమాంసం కొనితెమ్మని స్టేషనుకు పంపించారు. స్టేషనుకు వెళ్ళి అన్నీ వెతికాను. మాంసం దొరికింది కాదు. వాళ్ళు మూటముల్లె కట్టుకుని వెళ్ళిపోయారు."

"అంటే నీవు ఇంటికి వచ్చేసరికే వాళ్ళు వెళ్ళిపోయారన్న మాట?"

"అవును, వెళ్ళిపోయారు. ఎవరూ లేరు. ఏమీలేదు. అంతా అంతా పట్టుకపోయారు. ఇంటి యజమాని 'ఎందుకింక ఇక్కడ తాపత్రయపడతావు ?' అన్నాడు నాతో."

"తరువాత ఏం జరిగింది ?"

"తరువాత జోళ్ళస్టాండు తయారు చేసుకుని బూట్లు బాగు చేయడం మొదలుపెట్టాను. నగరానికి వెళ్ళాను."

"అదా సంగతి" అంటూ టూర్‌స్కీ, కమాండర్ల వంక చూచాడు. "ఏమిటంటారు కామ్రేడ్స్ కమాండర్స్?" అని అడిగాడు.

"అతనిచ్చిన భోగట్టాను బట్టి కుర్రవాడు. సవ్యమైనవాడేనని తెలుస్తోంది. ఇంతకూ అతనెక్కడికి పోతాడు? మనం అతన్ని చేర్చుకోవడం మంచిది" అన్నాడు నెస్ట్రెంకో.

"మన కిక్కడ గదులు ఖాళీ లేవం దే" అని ఎవరిదో గొంతుక వినిపించింది. వాకిలిదగ్గర నిలుచున్న బిగోనక్.

"నన్నొకమాట చెప్పనియి టూర్‌స్కీ" అన్నాడు.

"చెప్పు"

"అతన్ని నావెంట తీసుకు వెడతాను. ఇరువురం ఉంటాం. ఇరువురం ఒకే పక్కమీద పడుకుంటాం."

ఇంతసేపూ వాన్యావంక ప్రసన్నంగా చూస్తున్న జిరియానోస్కీ తన ఆమోదాన్ని తెలియపరిచాడు. అతన్ని దగ్గరికి తీసుకున్నాడు.

"నిజమే బిగోనక్. మనం ఇతన్ని నాలుగవ దళంలోకి తీసుకుందాం" అన్నాడు.

ఇగోర్ లేచాడు.

"సాధ్యమైతే అతన్ని నాతోపాటు ఎనిమిదవ దళంలో ఉంచండి. నాకున్న జాగాలో కొంచెం అతనికి ఇస్తాను" అన్నాడు.

ఈ మాటకు బిగోనక్ కొంచెం కోపగించుకున్నాడు.

"అతను చెప్పేవి ఎపాటి సబబో వినండి!" అంటూ బిగోనక్ ఇగోర్ వంక చూచి మళ్ళీ ఇలా అన్నాడు. "నీవు వచ్చింది మొన్న,

నీవే కొత్తవాడివి. నీ దళంలో దళాధిపతి ఏమాట చెప్పకుండానే ఈ కుర్రవాణ్ణి చేర్చుకోమంటున్నావు. అతని తరపున నీవు మాట్లాడితే మాట్లాడవచ్చును."

"మాట్లాడే విధానం అదికాదు బిగోనక్." అని వారించాడు టార్‌స్కీ.

బిగోనక్ వాకిలిదగ్గరికి వెళ్ళాడు. అతని పెదవులు కదిలాయి. ఇగోర్‌ను గురించి ఏదేదో సణుక్కుంటున్నాడు. కాని అతని మాటలు పైకి వినిపించలేదు.

సమావేశంలో ఉన్న కమాండర్లు తమ తమ అభిప్రాయాలను క్లుప్తంగా చెప్పారు:

"కుర్రవాడు చెడిపోలేదు. మనం అతన్ని చేర్చుకుందాం."

"పిల్లవాడు తెలివైనవాడిలాగానే కనిపిస్తున్నాడు. ముందు ముందు ఆ విషయం మనకే తెలుస్తుంది."

"ఇక్కడ ఉంటే త్వరలోనే గట్టిపడతాడు. బుద్ధిమంతుడు. అతన్ని కాలనీలోనుంచి బయటికి పంపించెయ్యమని ఎవరూ కోరరు."

"ఎవరు చెప్పినా ఒకటే చెపుతున్నారే? నిజమే. అతన్ని చేర్చుకోవాలి. బాగానే ఉంది. కాని ఇక్కడ ఉండే నియమాలు, చట్టాలు, అందుకు అంగీకరిస్తాయో లేదో అలెగ్జైస్టెపానొవిచ్ చెప్ప వలసి ఉంటుంది" అంది క్లావా ఖుషీరినా.

ఈ సూచనను అందరూ బలపరిచారు. అలెగ్జైస్టెపానొవిచ్ జఖరోవ్ చెప్పే మాటలను వినడానికి అందరూ కుతూహలపడ్డారు. కాని డైరెక్టర్ సమాధానం చెప్పేలోపునే బిగోనక్ ఇలా అన్నాడు.

"కొంచెం ఆగండి, కొంచెం ఆగండి! నేనొకమాట చెప్పాలి. మధ్య అడ్డురాకండి. నిరుడు ఒక మనిషి—అతని పేరేమిటబ్బా? — ఆ గుర్తొచ్చింది — గ్రిష్కా సినిచ్‌కా — వచ్చాడు జ్ఞాపకముందా? ఇప్పుడు పదవదళంలో ఇల్యూషాతో కలిసి ఉంటున్నాడు. అతను వచ్చినప్పుడు ఏం జరిగిందో నీకు జ్ఞాపకముందా అలెగ్జైస్టెపానొవిచ్?

అంతా అతన్ని చేర్చుకోవద్దన్నారు. గనులు ఖాళీలేవన్నాయి. స్కూల్సు ఒప్పుకోవన్నారు. అతన్ని చేర్చుకోలేదు. అతను అడవిలోకి వెళ్ళి పదిహేనరోజు లున్నాడు. ఉండి మళ్ళీ వచ్చాడు. అప్పుడూ అతన్ని చేర్చుకోలేదు. 'ఎప్పుడూ తీసుకోం' అన్నావు నీవు. అతన్ని జనతలికి పంపించివేశాం. అయినప్పటికీ ఈ చుట్టుప్రక్కల అడవిలో ఉంటూ వచ్చాడు. అప్పుడు నీకు జ్ఞాపకముందా నెస్టెరెంకో? అతన్ని నీవేకదూ స్టాఫ్‌కు తీసుకువెళ్ళింది?"

"అవునవును" అన్నాడు నవ్వుతూ నెస్టెరెంకో.

"అవును. నీవు తీసుకెళ్ళావు. ట్రాంలో వెళుతుంటే అతను పారిపోయాడు జ్ఞాపకముందా?"

"ఉందికాని. ఇహ నువ్వు ఊరుకో."

"పారిపోయి అతను మళ్ళీ అడవుల్లో ఉంటూ వచ్చాడు. అప్పుడు అలెగ్జీ స్టెపానొవిచ్! నీవు కలుగచేసుకున్నావు 'మొండి ముండాకొడుకు. ఇతన్ని మనం చేర్చుకుందాం' అన్నావు. అంతే మేమంతా నవ్వాం."

బిగోనక్ మాటలకు అంతా నవ్వారు. అతనికి అభ్యంతరం చెప్పినవాడల్లా బ్రాట్‌సన్ ఒకడే. అతను మూడవదళానికి కమాండర్.

"బిగోనక్ వంటి చిన్న కుర్రవాళ్ళకు ఎక్కడలేని స్వాతంత్ర్యం మనం ఇస్తున్నామని నా అభిప్రాయం. బిగిల్ పట్టుకొని రోజల్లా కమాండర్ వెంట తిరుగుతూ ఉంటే తాను గొప్పవాణ్ణని అనుకుంటున్నాడు పాపం. కమాండర్ల కౌన్సిలులో ఇష్టంవచ్చినట్లు ఉపన్యాసాలివ్వవచ్చు ననుకుంటున్నాడు...బిగోనక్! నీవు చెప్పిన ప్రకారమైతే ప్రతివాణ్ణీ మనం చేర్చుకోవాలి. ఈ కాలనీ ఏ పద్ధతులమీద నడుస్తూ ఉందో నీకు తెలీదు!" అన్నాడు బ్రాట్‌సన్.

"తెలుసు, తెలుసు అన్నీ తెలుసు" అన్నాడు బిగోనక్.

"తెలిస్తే అలా ఎందుకు మాట్లాడతావు?"

"తెలిసే మాట్లాడాను."

"చదవేస్తే ఉన్నమతి పోయిందట! అలా ఉంది మీ వ్యవహారం——ఇహ ఊరుకోండి" అంటూ ఇరువురినీ గదిమాడు టార్‌స్కీ.

ఒలెంకో దృష్టిలో ఇది అసాధారణమైన సమస్య.

"అలాకాదు టార్‌స్కీ బ్రాట్‌సన్ లేవనెత్తిన ప్రశ్నకు సమాధానం కావాలి" అన్నాడు ఒలెంకో.

"అయితే ఆ సమాధానం నీవే ఎందుకు చెప్పకూడదూ?"

"ఎవరైతేనేం? అతనికి సమాధానంమాత్రం చెప్పాలి. బ్రాట్‌సన్‌కు చాలాకాలంబట్టీ విచిత్రమైన అభిప్రాయాలేర్పడ్డాయి."

"అంటే ఏమటి నీ ఉద్దేశం? విచిత్రమైన అభిప్రాయాలా?"

"అవును. నేనన్నమాటకు అదే అర్థం!

"కానీ, కానీ ఒలెంకో - తరువాత చెప్పు."

"నీ అభిప్రాయంలో బాలనేరస్థుల శిబిరమే మహా గొప్పది. తక్కినదంతా వట్టి చెత్త? నీవు బాలనేరస్థుడివో కాదో నాకు తెలీదు. తెలుసుకోవాలనికూడా లేదు. నీవు మంచి కామ్రేడ్‌గామాత్రమే నాకు తెలుసును. కొమ్సొమోల్ సభ్యుడిగా మంచివాడివి. కోర్టుముందరనిలబడడానికి గర్వపడుతున్నావా నీవు బ్రాట్‌సన్? మీ దళంలో గొలోటొవిస్కీ విషయమే చూడు. అతనెప్పుడూ నేరస్థుడుకాదు. అయినా నేనతన్ని నమ్మను. నేనేకాదు. మీరంతా అంతే. అతను మూడోదళంలోచేరి ఏడాది అయింది. అయినా కాలనీవాసులకుండే అర్హతలను అతను సంపాదించుకోలేకపోయాడు."

తాను చెప్పవలసిందంతా ఒలెంకో చెప్పివేశాడు. కాని బ్రాట్‌సన్‌మాత్రం అతనితో ఏకీభవించలేదు. ఎప్పటిలాగే కోపంతో చూస్తూ కూచున్నాడు.

"ఇప్పుడిహ అలెగ్జీ సెమ్యొనొవిచ్ మాట్లాడతాడు."

"అలా వాదించడంలో పసలేదు బ్రాట్‌సన్. నీ వాదనకు అర్థమేమిటి? నేరస్థులు చిన్నపిల్లలేకదా. అందరికంటె ముందు వాళ్ళకే సహాయం చెయ్యాలి. ఈ సమస్యను సోవియట్ ప్రభుత్వం

ఇలాంటిదృష్టితోనే పరిశీలిస్తోంది. పెడసరంగా ఎందుకు ప్రవర్తించాలి. ఒక కుర్రవాడిక్కడికి వస్తాడనకో. అతనిక్కడికి ఎందుకొచ్చినట్లు? కాలం కలిసిరాలేదు కనుక, దురదృష్టం ముంచుకొచ్చింది కనుక ఆ కుర్రవాడు. అలా అయ్యాడు. అతనికే మనం సహాయం చెయ్యాలి."

"ప్రథమ చికిత్స చేయడంకోసం కాలనీలో వాళ్ళం ఎందుకు వెళ్ళాలి?"

"ఎందుకా? మనం అద్భుతంగా పనిచేస్తున్నాం కనుక. మహా అద్భుతంగా జీవిస్తున్నాం కనుక. మనకు స్పాన్ ఉంది. కొమోనస్ ఉంది. అక్కడివాళ్ళు ఈ కాలనీని తమదిగా భావిస్తున్నారు. మనం మరోకలా ప్రవర్తిస్తే మన ప్రవర్తననుబట్టి అక్కడి వాళ్ళదృష్టి కూడా మారుతుంది. ఇది మనకు సంబంధించిన వ్యవహారంకాదని వాళ్ళు చెప్పనూ చెపుతారు. నిజానికి ఈ కాలనీ......"

"మనదీ"—అని అరిచాడు పెట్కా.

అందరూ పెద్దగా నవ్వుతూ ఉంటే టార్స్కీ కోపంగా ఇలా అన్నాడు.

"సరే. ఇప్పుడినా చర్చనీయాంశం స్పష్టపడిపోయింది. దాని మీద ఓటు తీసుకుంటాను. నాలుగో దళంలోకి వాన్యాను చేర్చుకోవాలి అనేవాళ్ళు ఎంతమంది ఉన్నారో చేతులెత్తండి"

తనచుట్టూ ఉన్నవాళ్ళు చేతులెత్తేసరికి వాన్యా హృదయం ద్రవించిపోయింది. బ్రాట్సన్ వంక చూచాడు. అతనుకూడా నవ్వుతూ సంతోషంగా కనిపించాడు.

"అతన్ని చేర్చుకోమని అంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇహ ఏ గొడవలేదు. మునుపటిలాగే ఇగోర్ యంత్రాలు అమర్చే షాపులో ఉంటాడు. అతను పని చేస్తానని మాటయిచ్చాడు. ఇంతటితో ఈ సమావేశం ముగిసింది".

ఆ సాయంకాలం నాలుగోదళంలో అంతులేని ఉత్సాహం వెల్లివిరిసింది. జిరియానిస్కీ నవ్వుతూ వాన్యాను కులాసాగా అనేక

ప్రశ్నలు అడిగాడు. అతనితో పరాచకాలాడాడు. తరువాత అందరూ బల్లచుట్టూ కూచున్నారు. నాలుగోదళం మహా అద్భుతమైనదనీ, సాహసోపేతమైనదనీ, అందులో ఉన్న సభ్యులంతా వీరులే అనీ, అదేవిధంగా 'ఫస్ట్ ఆఫ్ మే' లేబర్ కాలనీ అంతా ధైర్యవంతులతో విలసిల్లుతోందని వాన్యా తెలుసుకున్నాడు. సాధారణంగా జెరియా న్‌స్కీ అంటే కాలం గడగడలాడిపోతుంది. అతను తనిఖీకి వస్తా డంటే గంటకు ముందుగానే అందరూ తగిన బందోబస్తులో ఉంటారు. ఎప్పుడోకాని నవ్వని జెరియాన్‌స్కీ ఈ పూట ఉల్లాసంగా ఉన్నాడు. అతని చూపులలో మందహాసం, మాటల్లో ఉత్సాహం తొణికిసలాడు తున్నాయి. నాలుగోదళం చాలా ఉత్తమమైనదని అతనికీ తెలుసును.

"ఇది మామూలు దళం కాదు. అందులోనివాళ్ళు మణి పూసలు. ఎంతమంచివాళ్ళనుకున్నావు వాన్యా? ఒకళ్ళనుమించి ఒకళ్ళు కృషిచేస్తుంటారు. ఎవరు ఎక్కువవాళ్ళో చెప్పడం కష్టం, అంతా ఆరితేరిన ప్రతిభావంతులే. ఇదిగో! ఇతను టోస్యాటలికోవ్. అతికాలంలోనే కమాండర్ అవుతాడు. ఇతని అక్క పదకొండవ దళానికి అప్పుడే కమాండర్ అయిపోయింది. అదిగో, అతను బిగోసక్ వాడు ఫిలాక్-షాకీ. అక్కడకూచున్నది. కిరిల్ నోవక్. ఫెడ్యా, కొల్యాఇవనోవ్, సెమియాన్ జైడ్‌పిస్కీ, సెమియాన్ గ్లాడన్. ఆ మూల ఉన్నది పెట్కా క్రావుచెక్ ఇప్పుడంతర్నీ తెలుసుకున్నావు కదూ?"

వాళ్ళంతా వాన్యావంక చూచారు. కొందరు తెల్లగా ఉన్నారు. మరికొందరివి గులాబీ చెక్కిళ్ళు. కొంతమంది చాలా చక్కగా ఉన్నారు. మరికొందరు మామూలుగా ఉన్నారు. కొందరి ముఖాల్లో విశ్వాసం తొంగి చూస్తోంది ఇకా కొందరిలో ఒక విధ మైన విశ్వాసంతో కూడిన నిర్లక్ష్యభావం, వ్యంగ్యవైఖరి కనిపిస్తు న్నాయి. కొందరు సంతోషంగా ఉన్నారు. మరికొందరు ఇట్టే కోపం తెచ్చుకోగలరు. ఇంకా కొందరు ప్రయత్నించినా కోపం తెచ్చుకో లేరు. అందరిముఖాల్లోనూ అనంతం, గర్వం, అగుపిస్తున్నాయి.

తాము ఒకానొక దళ సభ్యులమనీ, ఆ దళమేకాక కమాండర్ సహితం గొప్పవాడనీ, సోవియట్ ప్రపంచంలో నివసించే మానవుల మనే ఆత్మగర్వంతో అందరూ తమ గౌరవ ప్రతిష్టలను కాపాడుకు నేందుకు సంసిద్ధులుగా ఉన్నారు.

కొంతసేపు గడిచింది. ఎవరి పొరపాట్లు వారికి తెలియచెయ్య డానికి జిరియాన్‌స్కీ పూనుకున్నాడు.

బిసోనక్ తనకు గల ప్రాధాన్యతకు ఎక్కువ అతిశయపడు తున్నాడు. తాను బాలనేస్తుణ్ణి కాననే గర్వంతో పెట్యా క్రావు చెక్ డాంబికాన్ని ప్రదర్శిస్తున్నాడు. నోవక్‌కు తాను అందరికంటె అందగాణ్ణనే అతిశయం ఉన్నది ఒక్కమాటలో చెప్పాలంటే సభ్యుల్లో ఎవరూ లోపాలులేకుండా లేరు. తమనుగురించి తాము గొప్పగా భావించుకుంటున్నారు. దర్పాన్ని చూపిస్తున్నారు, గర్విస్తు న్నారు......సభ్యుల లోపాలను ఎత్తిచూపి జిరియాన్‌స్కీ ఇలా ముగించాడు:

"మీ గొప్పతనాలు చూచి మీ రెప్పుడూ గర్వపడకూడదు. అలా గర్వపడడం మూర్ఖత్వం. నాలుగోదళంలో గర్వమన్నది కని పించకూడదు. మీ ప్రతిభను ఆయా సమయాల్లో నేనే మెచ్చు కుంటాను. ఏయ్ మానేటర్! ఇలారా."

బిసోనక్ ముందుకువచ్చి కమాండర్ ఎదుట నిలుచున్నాడు. "వాన్యాను కావలసినవేవో వెంటనే ఇవ్వు" అన్నాడు కమాండర్.

"అలాగే కామ్రేడ్ కమాండర్."

ఒక్క క్షణంలో బిసోనక్ అనేక వస్తువులు తీసుకొచ్చాడు.

"ఇదిగో వాన్యా! ఇటుచూడు! ఇవి నీ చొక్కాలు. ఇది నీ లోపలి చొక్కా. ఇది నీ టోపీ. ఇది సబ్బుబిళ్ళ, బెల్టు, తువ్వాలు- అన్నీ చూచుకున్నావా? నీ సూట్లు దుస్తులు నీకిస్తాను. రా వెళదాం...అదిగో! అది వేడినీళ్ళతొట్టి...వాన్యా ఎవరి అజమా యిషీలో ఉంటాడు?

"ఆ పని నీవే చెయ్యాలి."

"అలాగే కామ్రేడ్ కమాండర్" అంటూ బిగోనక్ తాళాలు తెమ్మని చేతులాడించాడు.

అదే సమయంలో ఇగోర్ తలుపుదగ్గరికి వచ్చి ఇలా అడిగాడు:

"నన్ను మీలో చేర్చుకుంటారా?"

"ఆ. లోపలికి రా"

"నన్ను పంపించివెయ్యాలని మీరనుకున్నారు కాని అందుకు మీమీద నాకు కోపం రాలేదు" అన్నాడు ఇగోర్.

"ఒకరిమీద ఒకరు కోపగించడం ఇక్కడ ఆచారంకాదు."

వాన్యా ఇగోర్ వంక చూచాడు:

"నిన్ను పంపించివెయ్యడమా? ఏంచేశావని?" అని అడిగాడు వాన్యా.

"అతను ఆకతాయి! జేబులు కత్తిరించేవాడు ఇక్కడికి డబ్బు కోసం వచ్చాడేమో ఎవరికి తెలుసును!"

"ఆ డబ్బు, వాళ్ళ నాయనమ్మ పంపించిందేమో!" అంటూ నవ్వాడు వాన్యా.

ఇగోర్ సంతోషంతో వాన్యాచుట్టూ చేతులువేసి మీదికి ఎత్తాడు.

"వాన్యా! నీ జోళ్ళస్టాండు ఏదీ?" అతన్ని క్రిందికి దింపుతూ మెల్లగా అడిగాడు.

"ఆ రైజ్‌కోవ్ లేడూ అతను ఎత్తుకపోయాడు. స్టాండు ఒక్కటేకాదు. దాంతోపాటు పది రూబుళ్ళుకూడా" అని చెప్పాడు వాన్యా.

"ఇప్పుడు వాండా ఎక్కడుంది" మళ్ళీ అడిగాడు ఇగోర్

"ఏమో నాకు తెలీదు"

ఇహ పోదాం పదమని బిగోనక్, వాన్యా చెయ్యి పట్టుకున్నాడు. ఇరువురూ బాటను సమీపించారు.

1

అది సాధ్యం కాదు!

ఫస్ట్ ఆఫ్ మేకాలనీ స్థాపితమై ఏడేండ్లు అయింది. కాని దాని సమిష్టిరంగం 1917 అక్టోబరు విప్లవానంతరం, ఆ మరునాడే ప్రారంభింపబడింది. దీని పరిసరాలు అందమైనవి. చుట్టూ పొలాలు, పోల్టావా పచ్చికమైదానం ఉన్నాయి. దీని "స్థాపకసభ్యులు" చాలా విచిత్రమైనవ్యక్తులు. సాహసోపేతమైన మనుష్యులు. వాళ్ళవన్నీ అదోరకమైన భావాలు. ఎప్పుడూ పొంగిపోతున్న రక్తంతో, ఒక క్రమంలేని ఉద్రేకాలతో, మిడిమిడిజ్ఞానంతో, ఒక్కొక్కప్పుడు ఎందుకూ పనికిరాని కబుర్లతో ఉంటూ ఉంటాయి వీరి ప్రవర్తనలు. పెట్టుబడిదారీ నాగరికతాచిహ్నమైన వారి సంస్కృతిలో కొంచెం నేరస్వభావం ఇమిడి ఉండకపోలేదు.

ఈ రంగంలో ఎవరు ఏపని చెయ్యాలో నిర్ణయించుకునేటప్పుడు కాకతాళీయంగా జకరోవ్ దీనికి పెద్ద అయినాడు. విప్లవ రంగం విద్యార్థికుల, సామాన్య మానవుల ఆధిపత్యంలోకి వచ్చింది. దానికి అధిపతి జకరోవ్. అతనూ సామాన్య మానవుడే. ఆ రోజులలో మహోన్నతమైన సంఘటన అక్టోబరు విప్లవం. అక్టోబరు విప్లవ ప్రాదుర్భావంతో నూతన దిఙ్మండలాలు, వినూత్న పద్ధతులు, ధోరణులు పొడకట్టాయి అందువల్ల తమ కర్తవ్య మేమిటో జకరోవ్‌కూ అతని అనుయాయులకూ స్పష్టంగా తెలుసును. చరిత్రలో నూత్న మానవులను తయారు చేయడమే వారి కర్తవ్యం. అయితే ఇది ఏమంత సులభం కాదని వాళ్ళకు త్వరలోనే తెలియవచ్చింది. ఎన్నో వేల పగళ్ళు రాత్రిళ్ళు గడిచిపోయాయి. ఈ కాలంలో వాళ్ళకు విశ్రాంతి లేదు

ఆనందం లేదు. విరామంలేదు. అయినప్పటికీ ఆ నూత్న మానవుడు దరిదాపుల్లో కనిపించడంలేదు. ప్రాచ్యయూరప్ మండలాలలో ప్రస్ఫుటమయ్యే ఉత్సాహాతిరేకం, భవిష్యత్తుపట్ల అచంచల విశ్వాసం, ఇవన్నీ జకరోవ్‌లో ఒకవరంలా మూర్తీభవించాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది ఒకవరం కాదు. విచక్షణా జ్ఞానం, తారతమ్య పరిశీలన, నిశితదృష్టి ఉన్న రష్యాదేశస్థునికి ఈ సుగుణాలు పుట్టుకతో అబ్బినవి. ఈ లక్షణాలు అతనికి మేధా సంబంధమైన నిధి. అక్టోబరు విప్లవానికి పూర్వపు పరిస్థితులు వేరు. అప్పుడు దేశాన్ని పరిపాలించే వాళ్ళు ప్రజల ప్రాణాలతో, దేశభవిష్యత్తుతో, నైతిక సంపత్తితో, విశ్వాసాలతో జూద మాడేవారు. నమ్మకాలను అంధవిశ్వాసాలుగా, ఉత్సాహ ఆవేశాలను అలక్ష్యంగా, నిర్లిప్తంగా రూపొందించారు. ఈ అవలక్షణాలన్నీ రష్యన్‌ల ప్రత్యేకతకు తార్కాణమనీ. వారి క్షమకు నిదర్శనమనీ, డాంబికంగా పేరుపెట్టారు. తత్ఫలితంగా ప్రజల తార్కికశక్తి మందగించింది. ప్రత్యక్ష జీవితానికి సంబంధంలేని విలువలపట్ల మోజు హెచ్చింది. జీవిత సత్యానికి దూరమైన పిట్టకథలు, కట్టుకథలు వినోదంలో సంకల్పితమైనాయి. రష్యన్ జాతికి సహజసిద్ధమైన ఈ ఉత్సాహాభావం ప్రక్కదారులను మళ్ళింది. తనను తాను క్షోభపెట్టుకునే గుణంగా మారి నవ్వులపాలయింది. "కావచ్చును, కాకపోవచ్చును. బహుశా ఎలాగో ఒకలాగ, ఏదో ఒకటి"- ఇలాంటి మాటలు ఎక్కడ చూచినా వినిపిస్తున్నాయి. ఆశాభావం అన్నది ఒక మూలకు ఒదిగిపోయింది. ఆమూల కూనుని యూరోపియన్ కృత్రిమ స్వభావంతో నవ్వనూవచ్చును; రష్యన్ సహజభావంతో దుఃఖించనూవచ్చును.

ఈ రెండు గుణాలను అభివర్ణిస్తూ రష్యన్‌కవి యఫ్. ఐ. ట్యూట్చెవ్ (1803 1873) తన "పేదపల్లెలు" అనే కావ్యంలో ఇలా వ్రాశాడు:

అపరిచితుని అహంకార నేత్రం
అనాథుల అంతరంగములందు

గుప్తంగా జ్వలించే అగ్నిహోత్రం
ఎలా అవలోకించగలదు ముందు—

బరువైన శిలువవాడు, గంభీర ముఖలక్షణములవాడు
దేవుని కుమారుడు, చూడబోతె బానిసీకు
దేశమంతట తిరుగుతున్నాడు
అడుగుపెట్టినచోట అవని నాశీర్వదిస్తాడు—

ఇరవయ్యో శతాబ్దం మొదట్లో రష్యన్‌ల ఆశాభావం ఇలా సహజంగా, హృదయాన్ని ద్రవింపచేసే కరుణతో సాగిపోతూ వచ్చింది. అంతులేని అమాయకత్వంతో కూడుకున్న ఎవరో కొందరు మాత్రం "గుప్తంగా జ్వలించే అగ్నిహోత్రం" ఏమిటో తెలుసుకో లేకపోయారు. అనుభవజ్ఞులైనవారు కొందరు తమలో తాము నవ్వుకున్నారు. రష్యన్ ప్రజలు పూర్తిగా కొల్లగొట్టబడినారు. వారి ఆశాభావం చివరకు దానికి అభ్యంతరం చెప్పనిస్థితికి దిగజారి పోయింది. 1917 వరకూ కూడా ప్రచారంలో ఉన్న ఈ ఆశాభావం ఎక్కువ బలీయమైనదని కాని, తక్కువ నిరపాయకరమైనదనికాని వ్యక్తపరచడమంటూ జరగలేదు. "కావచ్చును, బహుశా ఎలాగో ఒకలాగ," ఇలాంటి మాటలమీద ఏమాత్రం ఆధారపడకుండా, అసాధారణమైన పరిపూర్ణత్వంతోను, నిజంగా అనుభవసిద్ధమైన విధంగాను రష్యన్‌ప్రజలు పాతకాలపు కళాప్రియత్వాన్ని, రసజ్ఞానాన్ని పూర్తిగా తుడిచిపెట్టివేశారు. "నల్లసముద్రం" అవతలివరకూ తరిమివేశారు. వాటిస్థానంలో నూతన ఆశాభావాన్ని, నూతన కళాప్రియత్వాన్ని, రసజ్ఞానాన్ని పాదుకొలిపారు. ఇలా మేమంతా ఏక మనస్కులం కావడానికి, మహాకార్యాలు సాధించిన మావిశ్వాసానికి మూలమేమిటో పశ్చిమయూరప్‌లో ఈనాటివరకూకూడా అర్థంచేసుకోని ప్రజలు కొందరున్నారు. సోవియట్ మానవుడు కాంతితో జ్వలిస్తున్న కళ్లతో చూస్తాడు. అంతేకాదు అతని సంకల్పశక్తి భగ్నమవ మండేశక్తి. దినకృత్యాలలో అతను, పట్టుదలి, పరిపూర్ణమైన విశ్వాసం చూపుతాడు. అలా అతని పనులన్నీ అదృశ్యంగానే జరిగి

పోతుంటాయి. ఇందుకు ప్రత్యేకమైన అర్హతలేవీ అతను కావాలని కోరడు. భవిష్యత్తు మొదలైందన్న విషయం చాలా చమత్కారంగానూ, సున్నితమైన సంఘటనల ద్వారానూ దృగ్గోచర మవుతుంది. అసలు మూలాన్ని విడువకుండా, ఎవరికి వారు దానిమీద నిలుచుని ఏమాత్రం ఏమరుపాటు లేకుండా గమనిస్తున్నవారికి మాత్రమే భవిష్యత్తు మొదలైందన్న విషయం దృగ్గోచర మవుతుంది. కనుక అంత సున్నితమైన విషయం ఇది. అనేక రాత్రులు, పగళ్ళు గడిచిన తరువాత, అనేక విపత్కర విఘాతాలు, అడ్డంకులు తరువాత, నిరాశ నిస్పృహాల తరువాత, మానవ దౌర్బల్యం తరువాత, అన్నీ సక్రమంగా కొనసాగించే పర్వదినం వచ్చింది. అప్పుడు ఒక్కొక్కరే గమనించడం మొదలు పెట్టారు ఏవో కొన్ని భాగాలు, కొన్ని వివరాలు మాత్రమే కాకుండా, బహుముఖమైన జీవితాన్ని-పరిపూర్ణమైన జీవితాన్ని పరిశీలించసాగారు. దాంతో అప్పటివరకూ కేవలం మొండిగా ఊహించుకుంటున్న ఆ వాదంలోని స్వప్నాలన్నీ పటాపంచలైనాయి. ఈ దివ్యమైన పర్వదినం ప్రారంభం కావడంతో తర్కానికి విజయం చేకూరింది. ఆతర్కం గుండెలు జల్లుమనేట్లు చేసింది. విషయాలు ఏదో ఇష్టమొచ్చినట్లు మరోత్రోవకు మళ్ళలేదన్న భావం ప్రతి ఒక్కరిలోనూ జనించడం మొదలుపెట్టింది. ఈ పథకాలన్నీ ముందుగానే లెక్క ప్రకారం క్రమమైన పద్ధతిలో వేసుకున్నవనీ, వివేకంతో కనుగొనబడినవనీ, వాస్తవమైన విలువలపై అంచనా వేయబడినవనీ అందరూ అంగీకరించారు. అంతాత ఇది కేవలం ఆశాభావం కాదనీ-వాస్తవికమైన దృఢసంకల్పమనీ గుర్తించారు మరి దీన్ని ఆశావాదం అని పిలవడం ఎంచేతనంటే దీన్ని అసలు పేరుతో పిలవడానికి ప్రజలు ఒకప్పుడు చాలా సిగ్గుపడ్డారు.

ఈ కఠినమార్గాన్ని- ఈ ఆశావాదాన్ని చేపట్టినవారిలో జకరోవ్ ఒకడు. పాతలోనుంచి కొత్త పుట్టుకొచ్చి ప్రాణాలు పుంజుకుంటోంది. పాతలోని దురదృష్టాలు, ఆకలి, అసూయ, కోపం-మానవ సంకుచితతత్వం, నీచమనస్తత్వం, ఇంకా ప్రమాదకరమైన

ధోరణులు, పాతకోరికలు, పాత అలవాట్లు, సౌఖ్యాన్ని గురించిన పాతభావాలతో గతం అనేకవిధాల వ్యక్తమవుతూ వచ్చింది. మెల్లగా మరుగుపడిపోయే ఉద్దేశం దానికిలేదు. అది పైకిపొంగి త్రోవను అడ్డగించింది. మారువేషం వేసుకుని, కొత్తరకమైన మాటలతో సాక్షాత్కరించింది. కాళ్ళూవేళ్ళూ చుట్టుకుని ప్రసంగాలు చేయడం మొదలుపెట్టింది. విద్యావిషయక సూత్రాలను, చట్టాలను సృష్టించింది. ఈగతం ఉన్నదే- ఇది "సోవియట్ బోధనాశాస్త్ర పద్ధతుల"ను సమర్థించుకుంటూ వ్యాసాలు వ్రాయడంకూడా నేర్చుకున్నది. గతానికి ప్రతినిధులైన వీరు జకరోవ్ కార్యక్రమాలను చూచి పరిహసించడానికి, తిరస్కరించడానికి అనువైన అత్యంత అధునాతన విధానాలు అవలంభించారు. నీవు చేస్తున్న 'అద్భుతమైన, మానవాతీతవిద్యలు, ఏమిటో మాకు తెలుసుని' అతన్ని అపహాస్యంచేశారు. విపరీతమైన, అవివేకమైన సమస్యలను నూతనశాస్త్ర పద్ధతులకు అన్వయింపచేసి, వాటిని విడమర్చి చెప్పమని అతన్ని కోరారు. ఈ విపరీతాలకు అతనేవిధంగాను చెక్కుచెదరకుండా ఉండేసరికి, అతన్ని వ్రేలెట్టిచూపుతూ "ఇతను పనికిరాడు, ఇతని కార్యక్రమాలు విఫలమైనాయి" అంటూ వదరసాగారు.

కాని ఈ అపోహాలన్నీ ఆవరించివున్నకాలంలో, ఏ పేటికావడు ఏదో నూతనత్వం వెల్లివిరుస్తూ, ఎప్పటికప్పుడు అందరిలోనూ చక్కని ఆలోచనలను రేకెత్తిస్తూవచ్చింది. కాలనీ అన్నివిధాలా గొప్పగొప్ప ఉద్దేశాలను, తనకు కావలసిన అవసరాలను, అన్ని వైపులనుంచీ స్వీకరిస్తోంది. సోవియట్ దేశంలో సంఘటిల్లే ప్రతిసంఘటన నుండీ దేశం మొత్తంమీద ద్యోతకమయ్యే అభివృద్ధికరధోరణులనుంచి అనేక అనుభవాలను, సోవియట్ మానవుల అనుభూతులను కాలనీ పరిగ్రహిస్తోంది.

అవును. ఇప్పుడు దేశంలో ప్రతివస్తువుకూ పాతపేరు మార్చి కొత్తపేరు పెట్టాలి. ప్రతిదాన్ని నూతనంగా నిర్వచించాలి. పాత విలువలు పోయాయి, కొత్తవిలువలు వచ్చాయి. పూర్వంవలె వేలాది

పిల్లలు ఇప్పుడు చిన్న "అనాథ మృగాలవలె" పరిగణింపబడడంలేదు. వాళ్ళశక్తి ఎంతటి మహత్తరమైనదో జకరోవ్‌కు పూర్తిగా తెలుసును. ఈపిల్లలందరినీ నూతన పౌరులుగా తర్ఫీదు చెయ్యాలి. నిజమైన మానవులుగా శిక్షణ గరపాలి.

నిజమైన మానవులుగా రూపొందాలనే నినాదంపట్ల సర్వత్రా ఉత్సాహం వెల్లివిరిసింది. యువకులను ఈ నినాదం సమ్మోహనపరచింది, మంత్రముగ్ధుల్ని కావించింది. పాతకాలపు బోధనా పద్ధతులు కలిగించలేని ఆత్మస్థైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని యువకులకు కలిగించి ఉత్తేజితులను చేసింది. ఈ నూతన విద్యావిధానం పూర్వకాలపు ఛాందస మనస్తత్వ జనితంకాదు. కేవలం ఊహాజనిత మూర్ఛనలవల్ల ఇది రూపొందలేదు. ప్రజల సామూహిక శక్తిసామర్థ్యాలవల్ల, దేశ సంప్రదాయాను సిద్ధంగా, నూతన స్నేహ వాత్సల్యంతో క్రమశిక్షణా పద్ధతులను ఇనుమడింపచేసుకుని ఇది ఉద్భవించింది. అయితే ఈ విజ్ఞాన శాస్త్రపు పద్ధతులు దేశమంతటా ఆచరింపబడుతున్నప్పటికీ అంతటా ఒకే ఉత్సాహం, అవసరమైనంత ఓరిమి కనిపించడంలేదని అంగీకరించక తప్పదు. ఈ శాస్త్రంవల్ల కలిగే సత్ఫలితాలను చవిచూడాలంటే కొంతకాలం పడుతుంది. అప్పటివరకూ వేచి ఉండేపాటి సహనం కొన్నిచోట్ల కనిపించడంలేదు.

పాతపద్ధతులు అనుకున్నంత సులభంగా చెరిగిపోవడం కష్టం. అవి ఇంకా అక్కడక్కడ తమ స్థానాలను పట్టుకుని వ్రేలాడుతూనే ఉన్నాయి. పనికిరాని ఛాందస అభిప్రాయాలను వదులుకోవాలని జకరోవ్ మథనపడుతూనే ఉన్నాడు. కాని అప్పుడప్పుడు వాటి ఛాయలు కొద్దికొద్దిగా అతనిమీద పడకపోలేదు. ఇదివరకు బోధనా పద్ధతులలో ఒకసూత్రం ఉండేది. ఆ సూత్రం ప్రకారం పిల్లలు చదువుకోవడానికి మాత్రమే పుట్టారని అర్థం. పిల్లలు చదువుకునే బొమ్మలవంటివాళ్ళు. జీవితంలో ఇంకొక ఆసక్తిఅంటూ వాళ్ళకేమీ ఉండదు. కాని ఇప్పుడాసూత్రం సడలిపోయింది. జకరోవ్ దీనినుంచి బయటపడ్డాడు. పిల్లలు అద్భుతమైన జీవితాన్ని గడపాలి. వాళ్ళు

ముందు పౌరులు కాబోతున్నారు. వాళ్ళను గౌరవించాలి. స్నేహితుల్లా చూడాలి. జీవితాన్ని అనుభవించడానికి వాళ్ళకు హక్కు ఉన్నది. బాధ్యతలను స్వీకరించే స్వేచ్ఛ ఉన్నది. పాత విద్యాసూత్రం సడలిపోయిన తరువాత జకరోవ్ కొత్తదనాన్ని ప్రతిపాదించాడు. నిస్పృహకు ఎక్కడా తావివ్వకూడదు ఎప్పుడూ ఉత్సాహంగా ఉండాలి. ప్రతిరోజూ పండగలా గడపాలి. పిల్లలు అతను ఆశించినట్లుగానే నిత్యోత్సాహంతో ఉంటూవచ్చారు.

కాలం గడుస్తున్నకొద్దీ కాలనీ జీవితం మధురంగా మారుతూ వచ్చింది. పూర్వంలాగా ఇప్పుడు ప్రాతఃకాలంలో షికారుకు వెళ్ళడానికి భయంలేదు. పాతధోరణులు క్రమక్రమంగా మాసిపోతున్నాయి. అవి పుట్టినవెంటనే జయించడానికి సామ్యవాద ధోరణులు సదా సంసిద్ధంగా ఉన్నాయి.

ఇప్పుడు కాలనీలో కొత్తసభ్యులు వచ్చి చేరతారనే భయం లేదు. ఇప్పుడెంతమందైనా చేరవచ్చు. మనంమటుకు మనం ఊరుకుంటే మార్పు దానంతట అదేవస్తుందనే సిద్ధాంతం తప్పు. మార్పుకోసం ఎదురు చూడాలనే తత్వం జకరోవ్‌కు ఎప్పుడూ లేదు. తానే ఒక మార్పు తీసుకురావాలి. ఇందుకోసం అతను వేసవికాలంలో ఒక ప్రయత్నం చేశాడు, పరిశోధన చేశాడు. తాను చేస్తున్న ప్రయోగం ఫలిస్తుందని అతని విశ్వాసం. రెండురోజుల్లో యాభైమంది పిల్లవాళ్ళను కాలనీలో చేర్చుకున్నాడు. సరాసరి రైలుస్టేషనుకు వెళ్ళి రైలుపెట్టెల్లో, గూడ్సుబండ్లమధ్య పనీపాటా లేకుండా తిరుగుతున్న పిల్లవాళ్ళను పట్టుకున్నాడు. మొదట వాళ్ళు ఒప్పుకోకపోయినా చివరకతను వాళ్ళను ఒప్పించాడు. పారిపోతున్న పిల్లకాయలను పట్టుకునేందుకు కాలనీనుంచి ప్రత్యేకంగా దళాన్ని తనవెంట తీసుకెళ్ళాడు. ఈ కొత్తపిల్లవాళ్ళు చెప్పుకోదగ్గ మనుష్యులు. ఎండలో తిరిగి అందరూ నల్లబడిపోయారు. చిరిగిన గుడ్డలు వేసుకుని, శిథిల సమాజపు దుర్గంధాన్ని వెదజల్లుతున్నారు. వేసవికాలం వచ్చింది. కనుక వాళ్ళు హాయిగా రైళ్ళలో ఎటుబడితే అటు తిరగవచ్చునని

బయలుదేరారు. కాని జకరోవ్ వాళ్ళను పట్టుకొని "రండి మాతో రండి; కాలనీలో చేరండి" అన్నాడు.

ఈ కుర్రవాళ్ళను స్టేషను చౌకుదగ్గర కాలనీలోని దళాలు స్వాగతమిచ్చాయి. వరుసలొరుసలుగా బారులుతీరి జండాలు పట్టుకుని విన్యాసంచేస్తూ కొత్త కామ్రేడ్సుకు దళాలు స్వాగతమిస్తూ ఉంటే వేలాదిప్రజలు గుంపులుగా చేరి ఆదృశ్యాన్ని తిలకించారు. లోలోపల సంతోషంతో కొత్తస్నేహితులు అధికారుల ఆజ్ఞలప్రకారం మూడు, నాలుగు దళాలమధ్యకు వచ్చి నిలుచున్నారు. ఇంత అట్టహాసం జరుగుతూ ఉంటే సిగ్గుపడుతూ ఆ పిల్లలు కోట్లు సర్దుకుంటూ గుంపువంక చూడసాగారు.

కాలనీదళాలు పట్టణపువీధుల్లోనుంచి నడవసాగాయి. ఇదివరకు 'ఫస్ట ఆఫ్ మే' కాలనీ స్థితివేరు, ఇప్పుడు వేరు. వీధుల వెంట నడిచివెడుతున్న దళాలను వేలాదిప్రజలు బారులుగాతీరి పరిశీలించసాగారు. ఈ దృశ్యం ఇటు దళసభ్యులకు, అటు పౌరులకు ఒక అనుభూతిని కలిగించింది. కాలిబాటలమీద నిలుచుని చూస్తున్న మహిళల, పత్రికావిలేఖరుల కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

దీనితో జకరోవ్ భాషలో మొదటి 'ప్లేటు' ముగిసింది. ఇక రెండవది ప్రారంభమయింది. కుర్రవాళ్ళంతా జుట్లు కత్తిరించుకున్నారు. స్నానాలుచేసి యూనిఫారాలు ధరించారు. ఇక్కడ ఉండే క్రమశిక్షణకు, ఆదరణకు కొత్త స్నేహితులు ఆశ్చర్యపోయారు, ఆనందించారు. వాళ్ళ చెక్కిళ్లు ఎర్రబారాయి వాళ్ళు విడిచిన పూర్వపు దుస్తులు కుప్పగా పడేశారు. వాటిమీద పారాఫిన్ చల్లి నిప్పు అంటించారు. క్షణంలో ఆ బట్టలన్నీ కాలిపోయాయి. మిషానోం టార్ చీపురు తెచ్చి ఆ బూడిదనంతా బాల్చీలోకి ఎత్తి ఆవతల పోశాడు.

"ఈ బట్టలతో పూపాత జీవితం మాయమైపోతోంది." అంటూ నవ్వాడు గోంటార్.

దళసభ్యులు పకపక నవ్వుతూఉంటే అపరాధకులకుమల్లే కొత్తస్నేహితులు అటు చూడసాగారు.

మంటల ఉత్సవం అయిపోయాక మామూలు కార్యక్రమం మొదలైంది. కాలనీలో ఇప్పుడు ఎవరి అభిరుచులకుతగ్గ విధానాలు వారికి ఏర్పాటు చేయబడినాయి. పూర్వపు కృత్రిమ విద్యాపద్ధతులు ఇప్పుడు లేవు. కొత్త స్నేహితులు దళ సభ్యులకుగాని, జకరోవ్ కు గాని కష్టం కలిగించలేదు.

సోవియట్ వాస్తవికతకు పిల్లల సమిష్టి భద్రత, జీవితం అత్యావశ్యకమైనదనీ, ఈ రెండింటినీ విడదీయలేమనీ జకరోవ్ అర్థం చేసుకున్నాడు. ఈ అవగాహన కొందరికి లేదు. జకరోవ్ దృష్టిలో నూతన విద్యావిధానం మహత్తరమైనది. బోధనా శాస్త్రపద్ధతుల పరిధిలోనే మానవులను మహోన్నత సంస్కారులుగా రూపొందించ వచ్చునని అతని విశ్వాసం. ఇది ఆనందకరమైన కృషి. సాధారణంగా పిల్లలలో పనికిరాని వాండ్లంటూ ఎవరూ ఉండరు. "బడుద్ధాయి కుర్రవాళ్ళు" ఉపాధ్యాయుల సృష్టి. జకరోవ్ ప్రకటిస్తున్న కొన్ని విశ్వాసాలపట్ల కొందరికి నమ్మకంలేదు. పైగా అవి వాళ్ళను రెచ్చ గొడుతున్నాయి.

ఏ స్వభావమైనాసరే అంత త్వరగా రూపుమాసిపోదు. కొంతకాలం అంటిపెట్టుకుని ఉన్న స్వభావం ఒక దానికి అలవాటు పడుతుంది. జీవితాన్ని వదలకుండా అంటిపెట్టుకునే గుణం పాతకు ఉన్నట్లు మరిదేనికీ లేదు. ఎంతపొమ్మన్నా పోని పాతస్వభావం, జీవితపు సందుల్లోనుంచి సమయం చూచుకుని తొంగిచూస్తూనే ఉంటుంది. అది అలా పొంచిఉన్నట్లు కనుక్కోవడమే కష్టం. ఏ సన్ని వేశం తలఎత్తినా అది నేర్పుతో, దానికి హత్తుకుంటుంది. ఏసంఘటన లోనైనా ఒదిగిపోయే చాతుర్యం దానికిఉన్నది. భావిపౌరులు కాబోతున్న పిల్లల ఆనందమయ జీవితాలకంటే పవిత్రమైనదేదీ లేదని అంతా అనుకోవచ్చును. ఈ సూత్రాన్ని జీవితంలో అనుస

రించాలనీ, ఈ విశ్వాసాన్ని పాటించాలనీ చెప్పవచ్చును. కాని ఆచరణలో కొందరు...

ఉన్నట్టుండి హఠాత్తుగా ఒకాయన కాలనీకి దిగుతాడు. అటూఇటూ కాసేపుతిరిగి చుట్టూ కలయచూస్తాడు. జేబులోనుంచి ఒక నోటుబుక్కు తీసి మహా ఆతృతతో కళ్ళు చెమర్చుకుని, తాను కావిస్తున్న అద్భుతప్రయోగాన్ని తలుచుకుంటూ రకరకాలప్రశ్నలు వేస్తాడు:

"ఇక్కడ వ్యవహారాలు బాగా సాగుతున్నాయా?"

"మీరేం తెలుసుకోవాలను కుంటున్నారు?"

"ఏమిటా?...పిల్లల అజమాయిషీ ఎలా సాగుతోంది?"

"బాగానే చూస్తున్నాం. సక్రమంగానే సాగుతోంది!"

"అయితే, ఏదీ...రెండు మూడు కేసులు చూపించండి... ఎందుకూ పనికిరానివాళ్లు బాగుపడ్డ దృష్టాంతరాలు చూపించండి; చూస్తాను."

జకరోవ్ తొట్రుపాటుతో సిగరెట్టుకోసం జేబు తడుము కుంటాడు.

"ఎందుకండీ ఇదంతా ?" అని ప్రశ్నిస్తాడు.

"చాలా ముఖ్యం. ముఖ్యాతి ముఖ్యం. విద్యాపునర్నిర్మాణ పద్ధతులను మేము అర్థం చేసుకున్నాం. పిల్లలు సంస్కారవంతు లయ్యారు. ఇలా చేయడానికి మీరు ఎంత కష్టపడ్డదీ ఊహించుకో గలం. అయినా..."

"పునర్విద్యా విధానమా?..."

"అవును. అదే! ఈ విధానంలో అత్యుత్తమ దృష్టాంతాన్ని నాకు చూపించండి. అర్థం చేసుకుంటాను. దీనప్రకారం బాగుపడ్డ పిల్లవాడి ఫొటోగ్రాఫు మీదగ్గర ఉందనుకుంటాను...ఏమిటీ! పునర్విద్యావంతుడైన పిల్లవాడు ఇక్కడలేడూ!..."

జకరోవ్ జ్ఞాపకం తెచ్చుకోసాగాడు. పునర్విద్యావిధానం కేవలం కట్టుకథగా వర్ణింపబడడం ఆశ్చర్యకరం.

కొన్నాళ్లకు విద్యాశాఖాధికార్లు కాలనీని పరిశీలించడానికి వచ్చారు. కాలనీలో ఉన్న పిల్లలను పరీక్షించారు. కాలనీ నివేదికలను, ఉత్పత్తి వినిమయాల పట్టికలను చూచారు. ఫైళ్ళన్నీ తిరగవేశారు. కాలనీలో జరుగుతున్న పరివర్తనను వాళ్లు గమనించలేదని, అందులో విశ్వాసంలేదని జకరోవ్ వాళ్ళ ముఖభంగిమలను బట్టి గ్రహించాడు.

"వాళ్లు వీధుల వెంట తిరిగే ఆకతాయి కుర్రవాళ్ళేకదూ?" అని వాళ్ళు ప్రశ్నించారు.

"కాదు వాళ్ళ కాలనీ సభ్యులు."

బెంచీమీద కూచున్న బిగోనక్ సర్దుకున్నాడు.

"మాటవరసకు, ఈ కుర్రవాణ్ణి తీసుకోండి. వాడు ఆకతాయేనా?"

బిగోనక్ లేచి నిలుచుని జకరోవ్ వంక చూచాడు.

"నేను కాలనీ సభ్యుణ్ణి. నాలుగోదళంలో ఉన్నాను." అన్నాడు.

"ఇప్పుడున్నావు సరే—ఇంతకుముందు?" వీధుల్లో తిరిగే వాడివికదూ?"

ఈ ప్రశ్న విని బిగోనక్ ఎందుకో నవ్వసాగాడు. నవ్వుతూనే సమాధానమిచ్చాడు.

"అప్పటి సంగతి జ్ఞాపకంలేదు. అంతా మరిచిపోయాను."

"ఏమిటి నీమాటకర్థం? మరిచిపోయావా? నీవాకప్పుడు ఆకతాయివనే సంగతి నీకిప్పుడు జ్ఞాపకంలేదూ?"

"ఊహూ..."

"మరిచిపోవడం కష్టం"

"నిజం. ముమ్మాటికి నిజం"

ఈమాట బిగోనక్ ఎంత చిత్తశుద్ధితో చెప్పినప్పటికీ పరీక్షకులకు అనుమానంగానే ఉంది. ఇక్కడ ఏవేవో రహస్యసూత్రాలను

వేళ్ళు రూపొందించుకుని తమను మోసగిస్తున్నారని వాళ్లు శంకించ సాగారు. ఈ శంకతోనే వాళ్ళు వెళ్ళిపోయారు. కుట్రదారులలో కూడా ఇంతటి ఏకాభిప్రాయం కనిపించనందుకు ఆశ్చర్యపోయారు. వికలమనస్కులై తిరిగి వెళ్ళిపోయారు. ఏది సత్యమో, ఏది అస త్యమో దురవగాహంగా ఉన్నది. అయినప్పటికీ కాలనీ వ్యవహా రాలు సక్రమంగానే సాగుతున్నాయి.

"అది అసాధ్యం!"

"అది నిజమే అనుకుందాం. అయితే అందుకుపడిన శ్రమ ఏదీ? ఒకపని సాధించడానికి సంఘర్షణ కావాలి. ఆ సంఘర్షణ ఇక్కడ అగుపించదు. శాస్త్రీయ విద్యావద్ధతుల ఆచరణ ఇక్కడ కనిపించదేం? ఇంతకూ ఆకతాయి కుర్రవాళ్ళు ఏరీ? ఆ పిల్లలను వాళ్ళు ఎక్కడనుంచి పట్టుకొచ్చారు?" ఇలా శంకించేవాళ్ళకు ప్రతిదీ అపనవ్యంగానే కనిపిస్తూ ఉంటుంది. ఏమార్పును చూచినా వాళ్ళకు నమ్మకం కుదరదు. ఆశాభావం మచ్చుకైనా వాళ్ళల్లో అగుపించదు.

2

వాన్యా

కమాండర్ల కౌన్సిలు సమావేశం జరిగి ఒకమాసం రోజులు మాత్రమే అయింది. ఆరోజు వాన్యాకు తన జీవితంలో మరపురాని దినం. అది జూన్ నెల. తీవ్రంగా ఎండ కాస్తోంది. కాలనీ అంతటా వెచ్చని సూర్యకాంతి విరజిమ్ముతోంది. వాన్యా తొడుక్కునే స్కూలు యూనిఫారం అతని పెట్టెలోపెట్టి తాళం వేసిఉంది. నాలు గవదళపు కమాండరు ఎవర్నీకూడా స్కూలు యూనిఫారం వేసుకో నివ్వడంలేదు.

"ఇహ మీరు కాసేపు అలా తిరిగిరండి అబ్బాయిలూ!... ఎండలో వెచ్చవెచ్చగా..." అన్నాడు కమాండర్.

ఇకనేం, వాన్యా, తక్కినవారు, కొందరు విడివిడిగాను, కొందరు చిన్నచిన్న జట్లుగాను బయలు దేరారు. పిల్లకాయ లందరూ వదులొదులుగా ఉండే దుస్తులు ధరించారు.నావికులు ధరించేలాంటి లోవలి ఉడుపులు ధరించారు. శుభ్రంగా ఇస్త్రీచేసిన బట్టలవి. అందరూ తళతళ మెరుస్తున్న సరికొత్త చొక్కాలు వేసుకున్నారు. చొక్కాలకు కాలర్లు, ఒక పైజేబు ఉన్నాయి. ఇలాంటి సమయాల్లో వారు నీలి రంగు మేజోళ్లు, పరుగుతీయడానికి వీలయ్యే నునుపు బూట్లు, తలకు బంగారురంగు టోపీలు, ధరిస్తారు. ఈ తీరులో పిల్లలంతా అద్భుతంగా, చూడముచ్చటగా కనిపిస్తున్నారు.

వాన్యా త్వరలోనే కాలనీపద్ధతులకు అలవాటుపడ్డాడు. అక్కడ ప్రతివిషయం అతనికెంతో హాయిగొలుపుతోంది. అతను పొంగిపోతున్నాడు. కాలనీలో రూల్సుప్రకారం రెండురోజులు పూర్తిగా విశ్రాంతి తీసుకుని తరువాత ఫాండ్రీలో పాత్రలు తయారు చేసేవాడుగా పని ప్రారంభించాడు. ఫాండ్రీ ఒక పాతపడిపోయిన రాతిమిద్దెలో ఉన్నది. మిద్దెలో ఒకకొసన లోహాలు కరిగించేకొలిమి ఏర్పాటుచేశారు. రెండవకొసన పనివాళ్లు పనులుచేస్తున్నారు. వారి పనల్లా రాగి కరిగించి పోతపోసి, నూనెపాత్రలు తయారుచేయడం. వీటికి 'స్టాఫర్ నూనెపాత్రలు' అనే చక్కని పేరు పెట్టారు. ఈపేరు వినడానికి ఎంతోముచ్చటగా ఉందనుకునేవాడు వాన్యా. ఫ్యాక్టరీలన్నిటిలోనూ ఈపాత్రల గిరాకీ ఒహుజాస్తిగా ఉన్నది. ఇవి లేకుండా ఏ ఒక్కయంత్రంకూడా నడవడంలేదు. ఈ పాత్రలన్నీ చిన్నచిన్న పెట్టెల్లో భద్రపరిచి, తడవకు ఒక బండెడు పెట్టెలు రైల్వే స్టేషన్‌కు తీసుకొని పోబడుతూఉండడం వాన్యా గమనించాడు. ఈ పెట్టెల్లో నికెల్ పూతపూసి, చక్కగా మెరుగులుపెట్టి కాగితాల్లో చుట్టచుట్టిన నూనెపాత్రలు ఉంటాయి.

ఈ పాత్రలు ఆరవై మిల్లీమీటర్ల మొదలు యనభై మిల్లీమీటర్ల వరకూ, రకరకాల సైజుల్లో తయారు చేస్తారు. పనిలో చేరిన తొలిరోజునే వాన్యా ఉత్సాహం చూపించాడు కాని పనిలో ఉన్న రహస్యాన్ని గ్రహించలేకపోయాడు. వస్తువులు ఎలా పట్టుకోవాలో, పనిలో సులువు ఇంకా అతనికి అలవడలేదు. ఒక్కొక్కసారి పని చేస్తున్నప్పుడు అతనికి భయం వేసేది. పోతపోస్తున్న దిమ్మ చేతిలోనే విడిపోతుందని జంకేవాడు. జాగ్రత్తగా దిమ్మమీది ఇసకను దులిపి, దేవదారు చెక్కలమీదికి చేర్చి, వాటిని ఇంకొకచోటికి పంపించేవాడు. వారంరోజులయిన తరువాత అతనికి పని సులువైంది. దిమ్మల్లోనుంచి పాత్రలను చెడిపోకుండా అవలీలగా తీయడం, అచ్చుపోయడం, అలవర్చుకున్నాడు. అవసరమైనంత డిగ్రీలో తేమను పట్టించి, ఇసుకను వేరుచేయడం ఎలాగో అతనికి బోధపడింది. కాని అందరిలాగా పనిలో వేగాన్ని సాధించలేకపోయాడు. నాలుగుగంటల్లో ఒకవంద పాత్రలు తయారుచేయడమంటే మాటలతో పనికాదు. వాన్యా చేస్తున్న పాత్రలు ఆరవై. ప్రతిపాత్రకూ ఒక కోపెక్కు చొప్పున బ్లమ్ పనివాళ్ళకు చెల్లిస్తున్నాడు. ఇది చాలాతక్కువ అని షాకీ, నోవాల్, పెట్కాలు అభిప్రాయపడసాగారు.

పాత్రల తయారీమాత్రమే కాక కాలనీలో అనేకవిషయాలు వాన్యాకు ఆసక్తిని కలిగించాయి. ప్రతిరోజూ అతనికి కొత్తకొత్త అనుభూతులు కలుగుతున్నాయి. పూర్వపు అభిప్రాయాలు మారిపోతున్నాయి. కాలనీలో ప్రతివస్తువు అతన్ని ఆకర్షిస్తోంది. రోజురోజూ కాలనీలో చేరే కుర్రవాళ్లను వాన్యా అనేకతరహాల ప్రశ్నలు వేస్తున్నాడు. కాలనీసభ్యుల అనుభవాలను తెలుసుకుంటున్నాడు.

కాలనీలో అన్నిటికంటె అతన్ని ముందుగా బ్యాండు వాయిద్యాలు ఆకర్షిస్తాయి. నాలుగవదళంలోని సభ్యులకు సంగీతమంటే ప్రాణం. ఎప్పుడూ దాన్నిగురించే మాట్లాడుకునేవారు. బ్యాండు వరుసలను నేర్చుకునేవారు. ఆపాటలే పాడేవారు. రకరకాలపాటలు– పాటల్లో తమ స్వంతమాటలు కలుపుతూ ఉండేవారు. బిగోనక్,

పెట్యా క్రావ్ చెక్, ఫిల్యా-షారీ. వీరు ముగ్గురూ బ్యాండుదళంలో సభ్యులు. ముగ్గురూ మూడు వాయిద్యాలను మధురంగా వాయించే వారు. వాన్యాకుకూడా ఏదో ఒక వాయిద్యం నేర్చుకోవాలని ఉంది. కాని 'కాలనిస్టు' బిరుదు వచ్చేవరకూ లాభంలేదు. అంతవరకూ వాన్యా ఓపికతో నిరీక్షిస్తూ రిహార్సల్సుకు వెళ్లేవాడు. బ్యాండు దళపు సభ్యులు గదిలో సమావేశం కావాలని అప్పుడప్పుడు నిర్ణ యించుకునేవారు. కొంత వ్యవధి ఉండనగా సమావేశానికి టైం అయిందని సూచించే బిగిల్ వినిపించేది. బిగిల్ వినపించగానే అందరి కంటే ముందు వాన్యా హాజరయ్యేవాడు. రిహార్సల్సుకే కాదు. సంగీత శిక్షణాతరగతులకుకూడా అతను వేళకు ముందుగానే హాజ రయ్యేవాడు. కొత్తలో మూనేటరు వాన్యాను క్లాసునుంచి బయటికి పంపించెయ్యాలని ప్రయత్నించాడు కాని కొంతకాలానికి వాన్యా రాకకు అందరూ అలవాటుపడ్డారు. ముమ్ముందర అతనూ ఒక సంగీత పాటకుడు అవుతాడని అంతా అనుకోసాగారు. ఏ వాయిద్యమైనా సరే వాన్యాకు ఇష్టమే. బ్యాండుదళంలో మొత్తం ముప్ఫయివాయి ద్యాలున్నాయి. సన్నాయిలు, ఫిడేళ్ళు,- ఇంకా అనేకం వెండినగిషీ లతో తెల్లగా మెరిసిపోతున్నాయి. విక్టర్ డెనిసొవిచ్ బ్యాండుదళ నిర్వాహకుడు.

ఒకసారి క్లాసులో నిర్వాహకుడు డెనిసోవిచ్ పాఠం చెబుతూ గొరొవోయ్‌ని ఇలా ప్రశ్నించాడు.

"నీ వెప్పుడైనా వెళ్ళావా ?"

"వెళ్ళాను."

"అయితే బాకా అలా ఊదుతావేం ?" సర్కస్‌లో సము ద్రపు సింహం ఎలా ఊదుతుందో నీవుచూచి ఉండవలసింది!"

గొరొవోయ్ కాలనీలో కమ్మరం నేర్చుకుంటున్నాడు. మనిషి లావుగా ఉంటాడు. నిర్వాహకుడు ఇలా అనేసరికి గొరొవోయ్ కంగారుపడి మెడ అటు తిప్పుకున్నాడు. బాకాతీసి తనతప్పు గ్రహిం

చాడు. వీకె నోట్లో పెట్టుకుని, బాకా జాగ్రత్తగా ఊదడం మొదలు పెట్టాడు.

డెనిసొవిచ్ అతనివంక తేరిపార చూచాడు. వాయిద్యాలు క్రిందపెట్టి నలభై మంది పాటకులు గొరొవాయ్ వంక చూడసాగారు.

"ఇంతా చేస్తే సర్కస్‌లో అంత బాగా బాకా ఊదింది మనిషి కాదు, ఒక సముద్రపు సింహం, చూడు! అదెంత బాగా నేర్చుకున్నదో!" అన్నాడు డెనిసొవిచ్.

గొరొవాయ్ నిశ్చేష్టుడై డెనిసొవిచ్ వంక నిలువుగుడ్లు వేసి చూడసాగాడు. మోటుగా మాట్లాడడం డెనిసొవిచ్‌కి అలవాటు. ఆ సంగతి కాలనీలో అందరికీ తెలుసును. అయినాసరే, ఇప్పుడు తాను ఊరుకుని లాభంలేదు. ఒక జంతువుతో తనను సరిపోల్చడమే కాదు, అది తనకంటె తెలివైనదని మాటల్లో సూచిస్తున్నాడు. ఈ అవమానాన్ని మ్రింగి ఊరుకోకూడదు. నిరసనగా గొరొవాయ్ అతనివంక చూచి, నిర్లక్ష్యంగా తల తిప్పుకున్నాడు.

"ఏమిటి ఆ సింహంగొప్ప? ఆ వాయిద్యం ఏమంత అద్భుతంగా ఉందని?" అని ప్రశ్నించాడు.

గొరొవాయ్ ఇలా అడగ్గానే అక్కడున్న వారంతా విరగబడి నవ్వసాగారు.

అందరితోపాటు డెనిసొవిచ్ కూడా నవ్వినప్పటికీ వెంటనే నవ్వు ఆపుకుని మూతి బిగించుకున్నాను. కోపంతో వాయిద్యగాళ్ళ వంక చూచి చేతిబెత్తంతో స్టాండుమీద కొట్టాడు.

"ఒయ్! నాలుగోఅబ్బాయ్! ఆ వాయిద్యం క్రిందపెట్టు. ఒకటి...రెండు..."

వాన్యా సంగీతంవింటూ అలాగే నిలుచుండిపోయాడు. అతన్ని వాయిద్యాలు సమ్మోహపరిచాయి. అయిదేండ్లనుంచీ బ్యాండుదళం, కాలనీలో ఇలాగే మధురమైన సంగీతాన్ని వినిపిస్తోంది. అదెప్పుడూ విఫలంకాలేదు. జీన్‌గ్రిఫ్ అనే యువకుడు బ్యాండుదళంలో అందరికంటె ముందు చేరినసభ్యుడు. అతను తొమ్మిదవదళంలో

ఉంటున్నాడు. పొడుగైన కుర్రవాడు, నల్లనికళ్ళు. అతనివంక వాన్యా ఇంతసేపూ చూడలేకపోయాడు. గ్రిఫ్ అద్భుతంగా 'సోలో' వినిపిస్తూఉంటే మిగిలిన వాయిద్యాలు అతని వాయిద్యంముందు పనికిరాకుండా పోయాయి. అతని చాతుర్యానికి ఆశ్చర్యపోతూ అంతా అటు చూశారు. అందులో వాన్యా ఒకడు.

కాలనీలోఉన్న ప్రతివస్తువుపట్ల వాన్యా ఎంతో ఆసక్తి చూపిస్తున్నాడు. ఒక్క సంగీతమే కాదు. ఆటలన్నాకూడా అతనికి ఉత్సాహమే. రోజూ ఆటస్థలానికి వెళ్ళేవాడు. పెట్రోవ్ ఆటల్లో మేటి. అందరికీ పెద్ద. అప్పుడప్పుడు కాలనీలో 'వాలీబాల్' పోటీలు జరిగేవి. ఆ పోటీలలో ఎవరు బాగాఆడిందీ కథలుగా చెప్పుకుంటూ ఉంటే వాటిని ఎంతో ఉత్సాహంతో వినేవాడు వాన్యా. 'వాలీబాల్' మాత్రమేకాదు. 'గొరోడ్కీకూడా' అతనికి ఆసక్తిని కలిగించింది. పిన్నులతో రకరకాల ఆకారాలుగాఉన్న బల్లమీద ఆటగాళ్లు ఆడుతూఉంటే వాన్యాకు ఆశ్చర్యంకలిగేది. బల్లమీద విమాన ఆకారంలో పిన్నులు గుచ్చిఉన్నాయి. అలాగే కొన్ని అంకెలు, అక్షరాలుకూడా గుర్తులుగా వేసిఉన్నాయి. ఈ ఆటకు కెప్టెన్ కృలోసవ్.

"ఈ ఆట ఆడడం చాలాకష్టం. కాని మాదళంలో వాళ్ళు ఒక్కవిసురుతో ఏ అంకెనైనా కొట్టగలరు" అన్నాడు కృలోసవ్.

"అబద్ధం. అలా ఎన్నటికీజరగదు."

"అసాధ్యమా? అంటే నీఉద్దేశం? మాదళంలోవాళ్ళు ఈ ఆట సులువుగా ఆడతారు. అక్షరాలనేకాదు, విమానాన్నికూడా కొడతారు."

కాలనీమధ్య ఒకపెద్ద భవనం ఉంది. ఆ భవనానికి వెళ్ళే దారిలో, భవనంముందు గోడకు ఒక 'పజిల్ బోర్డు' ఉన్నది. వాన్యా దానిముందు నిలుచుని అందులోఉన్న బొమ్మలను, రేఖాచిత్రాలను, లెక్కల సూత్రాలను, ప్రశ్నలను, పరికించసాగాడు. వాటి అర్థమేమిటో ఆలోచించసాగాడు. వాటిలో ఒకబొమ్మ ఉన్నది. ఆ

బొమ్మలో ఒక కిటికీ, కిటికీలోనుంచి ఒకపిల్ల చూస్తున్నది. ఆ బొమ్మక్రింద ఈ ప్రశ్న వ్రాసిఉంది: "ఈ పిల్ల వయస్సెంత?"

ఇలాంటిదే మరొక ప్రశ్న: "దక్షిణావైపుకు గుమ్మం ఉంటే ఇలాంటికుటీరం ఎక్కడ తయారవుతుంది?" ఈ ప్రశ్నమీద ఒక ఎగురుతున్న జండాతో చక్కటి కుటీరం బొమ్మలో కనిపిస్తుంది.

వాన్యా అర్థాలను వెదుకుతూ 'పజిల్‌బోర్డు' ముందు నిలుచున్నాడు. ఇంతలో గ్రిగోరీవిస్కీ చటుక్కున వచ్చి అతని ప్రక్కనే నిలబడ్డాడు.

"ఈ బోర్డులో ఉన్న ప్రశ్నలన్నిటికీ పిల్లలు సమాధానాలు చెప్పారు. శిశిరఋతువులో మళ్ళీ కొత్తబోర్డును వాసిలోవిచ్ తయారుచేసిపెడతాడు. పోయిన శీతాకాలంలో నేను 'పజిల్‌బోర్డు'కు సమాధానాలు చెప్పి నాల్గువేల పాయింట్లు సంపాయించాను." అన్నాడతను.

అప్పటినుంచీ వాసిలోవిచ్‌కీ వాన్యాకు స్నేహం ఏర్పడింది. వాసిలోవిచ్ ఇప్పటికీ తన పాత ఇంటిపేరునే అట్టిపెట్టుకున్నాడు. అతని ఇంటిపేరు మలంకీవాను. అంటే పొట్టిని అర్థం కాని నిజానికి వాసిలోవిచ్ పొట్టివాడుకాడు. ఆజానుబాహువు. కాలనీలో అంత పొడగరి ఇంకొకడులేడు. సన్నగా, పొడుగ్గా ఉంటాడు. కాళ్ళు, మెడ, ముక్కు; అన్నీ సన్నగానే ఉన్నప్పటికీ ఎప్పుడూ ఉత్సాహంగా, అలసట అనేదిలేకుండా ఉంటాడు. కాలనీలో పిల్లలందరూ అతన్ని 'పంతమనిషి' అని పిలుస్తుంటారు. అతన్నిగురించి హాస్యంగా అనేక కథలు చెప్పుకుంటారు. కాని అతను కనిపిస్తే చాలు, చుట్టూ మూగుతారు. అతనితో కలిసి అనేక ఆలోచనలు చేస్తారు. కార్య క్రమాలు వేసుకుంటారు. అతన్ని ముందు ఉండి వాటిని నిర్వహించమని కోరుతారు. అతను వాళ్ళకు నాయకుడు.

మలంకీవి డేగచూపులు. మనుష్యుల్ని ఇట్టే పట్టేస్తాడు. కాలనీకి వచ్చిన మర్నాడే వాన్యాతో పరిచయం సంపాదించాడు.

వాన్యా ఆవరణలో పరుగెత్తుకపోతూఉంటే ఒక్క గదుముగదిను అతన్ని టక్కున ఆపివేశాడు.

"ఎందుకలా పరుగెడుతున్నావు?" అని అడిగాడు.

వాన్యా ఆగిపోయాడు.

"ఇలారా. ఏమిటికావాలి నీకు? ఎందుకలా పరుగెడుతున్నావు?" అంటూ మలంకీ వాసిలొవిచ్ మూడు అంగలువేసి వాన్యాను పట్టుకున్నాడు: "కొత్త కుర్రాడివా!" అని అడిగాడు.

తనవంక పొడుగాటి ముక్కుతో, సన్నని మొదవంచి విచిత్రంగా చూస్తున్న వాసిలొవిచ్ ఆకారంచూచి వాన్యా అదిరిపోయాడు. పెదవులమీది నూనూగుమీసాలు, గుచ్చిగుచ్చి ప్రశ్నిస్తున్న చూపులు.

"నీవు కొత్తవాడివికదూ? ఏమిటి నీపేరు?"

"వాన్యా గల్చెంకో."

"ఓ! వాన్యా! నీకు చేపలుపట్టే వల అల్లడంవచ్చునా?"

"చేపలుపట్టే వలా ?"

"అవును చేపలు పట్టేదే. అల్లడం రాదా ? వైర్‌లెస్ సెట్లు చెయ్యగలవా ? అవీ చేయలేవూ ! ఏవీ చెయ్యడం రాకపోతే నీ వాక కవివన్నమాట ! బాగుందిరా అబ్బాయ్ ! అయితే ఇంతకూ నీకునచ్చిన విద్య ఏమిటి ?"

ప్రశ్నల పరంపరతో తుపానులా విరుచుకు పడుతున్న వాసిలొవిచ్‌ని చూచి వాన్యా కంగారు పడ్డాడు. అయినా ధైర్యం తెచ్చుకుని తలపైకెత్తి, కళ్ళు తుడుచుకుంటూ సమాధానమిచ్చాడు.

"నేనొకసారి స్టాండు చేశాను."

"ఏరకం స్టాండు ?"

"జోళ్ళ స్టాండు."

"నీఅంతట నీవే చేశావా, ఎవరిసహాయం లేకుండా ?

"ఆ. నేనే చేశాను"

"నీవు జోళ్ళు బాగుచేస్తావా?"

"ఆ. బాగుచేస్తాను."

"బ్రష్‌లతో కూడానా?"

"అహాహా! మొదట చిన్నది, తరువాత పెద్దది."

"అదా సంగతి! ఇహ పరవాలేదు. నీచేత చేయించుకోవచ్చు."

"ఏమిటీ?"

"నే నన్నది నీకు బోధపడలేదన్నమాట! నీళ్ళల్లో ఈదే కారు ఒకటి ఉంది. దానివిషయం మాట్లాడుతున్నాను. నీపేరు వాన్యా గల్చెంకో. సరిసరి గడుసువాడిలాగే కనిపిస్తున్నావు. పనీ పాటా వచ్చునన్నమాట" అంటూ మారుమాట్లాడకుండా మలంకీ పెద్దపెద్ద అంగలువేసుకుంటూ రెండు భవంతులమధ్య నుంచి దూసుకు వెళ్ళిపోయాడు. మధ్యనఉన్న పూలమొక్కల పనుసలను చెంగున దాటేశాడు.

మలంకీ వాసిలొవిచ్ చెప్పిన మాటలు వాన్యాకు ఆసక్తిని కలిగించాయి. నీళ్ళల్లో ఈదే కారు! ఏమిటబ్బా అది? నాలుగో దళంలో దాన్నిగురించి అతను అందరినీ అడిగాడు. ఆమాట ఎప్పుడూ తాము వినలేదని వాళ్ళు సమాధానం చెప్పారు. అలాంటి కారును నిర్మించడానికి వాసిలొవిచ్ ప్రయత్నం చేస్తున్నాడనీ, అతనికి వాన్యా తోడ్పడనున్నాడనీ కాలనీలో ఒక పుకారు పుట్టింది. నాలుగోదళంలో సభ్యులు మరీ కంగారు పడసాగారు. వాళ్ళకు మలంకీ వాసిలొవిచ్‌తో కలిసి చేయబోయే పనులు చాలాఉన్నాయి. ఆదివారంనాడు సభ్యులకు రకరకాల కార్యక్రమాలను అతను నిర్దేశించాడు. తనవెంట ఒక సభ్యుణ్ణి ఒకానొక అద్భుతమైన కొలనుచెంతకు తీసుకవెడతాననీ, అక్కడ చేపలు పట్టుకోవచ్చునీ అతన్ని మురిపించాడు. మరొక సభ్యుడిచేత రకరకాల ఆటలు ఆడిస్తానని చెప్పాడు. ఇలాగే చాలా మందికి ఏవేవో వాగ్దానాలు చేశాడు.

"ఇంతకూ ఎవరీ వాసిలోవిచ్ ?" అని అడిగాడు వాన్యా.

"వాసిలోవిచ్చా ? అతనేమీ కాదు !"

"ఏమీ కాదూ ? అంటే అర్థం ?"

"అతనొక ఉపాధ్యాయుడు. కాని ఏమీ చెప్పడు. అతను అతనే !"

ఒకవారం గడిచింది. వాన్యాకు మలంకీ వాసిలోవిచ్ ఒక అడవిలో అగుపించాడు. వాసిలోవిచ్ చెట్లమధ్య నడుస్తూ, కొమ్మలను పరిశీలిస్తున్నాడు. వాన్యాను చూడగానే ఇట్టే పోల్చుకున్నాడు.

"ఓహో, వాన్యా ! నీళ్ళలో తిరిగే కారు ! ఎంత చక్కటి ఊహ ! దాన్ని గురించి రేపు మాట్లాడుకుందాం." అన్నాడు.

కాని ఆ మరునాడు మలంకీ వాసిలోవిచ్‌కి జ్వరం తగిలింది. అతనికి క్షయవ్యాధి అంకురిస్తున్నదనే వార్త అందరి చెవిన పడింది. విచారించని యువకుడు లేడు. అతనికి జ్వరం రావడంతో ఈ దేశారు విషయం వాన్యా మరచిపోయాడు. మలంకీకి పట్టుకున్న జబ్బు సాధారణమైనదికాదు. ఒకంతకు నయంకావడం కష్టం. ఈ మాట విన్నాక వాన్యా మరీ విచారించసాగాడు. అతన్నిగురించే ఆలోచించసాగాడు. ఎంత పొడగరి ! ఎంత తెలివైనవాడు ? ఎంత సరదాగా ఉంటాడు ! పాపం...నాలుగోదళంలో జీవితం కులాసాగా ఉన్నది. అందరూ స్నేహంగా ఉంటున్నారు. ఉత్సాహంగా ఉంటున్నారు. జిరియాన్‌స్కీ-కార్యక్రమాన్ని పకడ్‌బందీగా నిర్వహిస్తున్నాడు. త్వరత్వరగా తన పనిని తాను ముగించుకుని వాన్యా విశ్రాంతి మందిరంలోకి వెళ్ళేవాడు. అక్కడ నలుగురితోనూ కబుర్లు చెప్పుకునేవాడు, నవ్వుకునేవాడు వాళ్ళ కబుర్లు విని సరదాపడేవాడు. జిరియాన్‌స్కీ- ఆజ్ఞను అదెంత కష్టమైనదైనాసరే సంతోషంతో కొనసాగించేవాడు. అతను ఆజ్ఞ ఇవ్వడమే తడవు - "అలాగే, అలాగే కామ్రేడ్ కమాండర్ ." అంటూ చకచకా ఆ పని నిర్వహించేవాడు.

3

పూర్వపుద్వేషాలు పనికిరావు

రోజుకురోజూ ఇగోర్ చెర్నియావిన్ పనికి అలవాటుపడుతున్నాడు. చేతులు గీచుకుపోతున్నాయి. పనికి వెడుతున్నా పని మీద విముఖత్వం పోలేదు. తుపాకుల బందుకట్లు చేయడమంటే అతనికి ప్రాణాంతకంగా ఉంది. పనిమీద అసహ్యం వెలిబుచ్చుతున్నా పని తప్పలేదు. తాను సమ్యకంగా పనిచేస్తానని కమాండర్ల కౌన్సిలులో వాగ్దానంచేశాడు. ఆ వాగ్దానం నిలబెట్టుకోవాలి. అతను పని చేస్తూఉంటే బెంచీచుట్టూ ఈగలు, తేనెటీగలు ముసిరేవి. అవి అంటే అతనికి భయమే అయినా ఆభయాన్ని కప్పిపుచ్చుకున్నాడు. అదృష్టవశాత్తూ ఇగోర్ పనిలోచేరిన ఒక వారానికల్లా అతను పని చేసే చోటును స్టేడియంలోకి మార్చారు. ఇగోర్ రోజుకు నాలుగు గంటలు పనిచేసేవాడు. ఆ నాలుగు గంటల్లోనూ ముప్పయి బందుకట్లు తయారు చేసేవాడు. అందుకుగాను చేతికి తొంభయికోపెక్కులు అందేవి. కాని ఇతరులతో పోల్చిచూస్తే ఇగోర్ చేసేపని తక్కువనేచెప్పాలి. 'అవును, ఇగోర్ వంటి మనిషి రోజుకు వందబందుకట్లు తయారుచేయవచ్చు' అనేవాడు స్టైవెల్.

మధ్యాహ్నంపూట నాలుగు గంటలు మాత్రమే పని. మిగతా రోజల్లా హాయిగా గడిచిపోయేది. ప్రొద్దుటిపూట ఇగోర్ స్కూలు భవనందగ్గరికి వెళ్ళేవాడు. అక్కడ క్లాసులో నికోలాయ్ ఇవనోవిచ్‌తో గంటో అరగంటో గడిపేవాడు. ఇవనోవిచ్ ఎప్పుడూ తెల్లని దుస్తులు వేసుకునేవాడు. చాలా మర్యాదగా, దాపరికం లేకుండా మాట్లాడేవాడు. అతనితో పరిచయమైన తొలిరోజుననే

ఇగోర్ ఎంతో సంతోషించాడు. అప్పటినుంచీ తక్కిన ఉపాధ్యాయులను గురించి తెలుసుకోవడం మొదలుపెట్టాడు. ఇక్కడ ఉన్న ఉపాధ్యాయబృందం విశిష్టమైనది. మంచి అలవాట్లతో,వాతవరణంతో స్కూలు నిండి ఉంటుంది.ఎక్కడా పర్యవేట్టుగా కనిపించదు.ఎవరువచ్చినా మర్యాదగావలుకరిస్తారు, గౌరవిస్తారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతారు. గ్రంథాలయం సహితం ఇగోర్ దృష్టిని ఆకర్షించింది. అది విశ్రాంతి మందిరం ప్రక్కనే ఉంది. అరలరలుగా ఉన్న బీరువాలలో రకరకాల బొంతు పుస్తకాలున్నాయి. వేలాది పుస్తకాలు సొరుగుల్లో అమర్చి ఉన్నాయి. ద్వారందగ్గర ఎప్పుడూ పిల్లలు 'క్యూ'లో నిలుచుని ఉంటారు. ఒక్కొక్కరే 'కౌంటర్' దగ్గరికి వస్తారు. తమకు కావలసిన పుస్తకాలు తీసుకుని నెమ్మదిగా వెళ్ళిపోతుంటారు. ఈ గ్రంథాలయంలో ఉండే లైబ్రేరియన్ ఒక స్త్రీ. ఆమెపేరు ఫైడోరోవ్నా. ఆమె వృద్ధురాలు, పూర్వకాలపు మనిషి. ఆమెకు సహాయంగా ముగ్గురు కొలనీ పిల్లలు పనిచేస్తూంటారు. ఆ ముగ్గురిలోనూ ముఖ్యురాలు షురామైట్నికోవా. ఆ పిల్ల సన్నగా, రెబ్బలా ఉంటుంది. నోరు వెడల్పు. ఈ ముగ్గురు సహాయకులు పుస్తకాలు తిరిగి తీసుకుంటూ రిజిష్టరులో సమోదు చేసుకుంటారు. కొత్త పుస్తకాలు ఇస్తూ ఉంటారు.

"పుస్తకం అప్పుడే తెచ్చి ఇచ్చేశావేం? పుస్తకం పూర్తిగా చదివావా? లేక బొమ్మలుచూసి ఊరుకున్నావా?" అని షురా నవ్వుతూ, చమత్కారంగా కొందరిని అడుగుతూ ఉంటుంది.

పుస్తకాలు చదవడమంటే ఇగోర్‌కు చాలా ఇష్టం. చిన్నప్పటినుంచీ అతనికి గ్రంథపఠనాసక్తి మెండు అయినప్పటికీ, వీధుల వెంట తిరగడంవల్ల పుస్తకాలతో పరిచయం పోయింది. ఇప్పుడు మళ్ళీ అవకాశం లభించింది. చదవాలనే నూతనోత్సాహం అతనిలో రేకెత్తింది. ప్రొద్దున్నే లేచి చూచేసరికి ఎదుట పుస్తకం కనపడితే ఎంత ఆనందం! రాత్రిళ్ళు పదకొండు దాటితే అతన్ని మరి చదవనిచ్చేవాడుకాదు సెమ్యోన్. లైట్లు ఆర్పివేసేవాడు. అంచాత ఒక

గంట ముందుగానే లేచి ప్రొద్దున్నే పుస్తకం చదువుతునేవాడు ఇగోర్.

గ్రంథపఠనంతో దినచర్య ప్రారంభమవుతుంది. సాయంత్రం వరకూ అనేక సంఘటనలతో ఉల్లాసంగా గడిచిపోతుంది.

వంతుల ప్రకారం పిల్లలు మానేటర్లు అవుతారు. ఒకనాడు ఇగోర్ వంతువచ్చింది. అంతకుముందు సాయంకాలం నెస్ట్రెంకో "నీవు రేపు దళానికి మానేటరవు" అని ఇగోర్‌కు తెలియచేశాడు.

ప్రొద్దున్నే ఆరుగంటలకు లేచి తనిఖీదళ సభ్యులు వచ్చే లోపునే, అన్నీ శుభ్రంచేసి దేనికది అమర్చిఉంచడం మానేటరు విధులలో ఒకటి. ఇగోర్ లేవడమైతే త్వరగానే లేచాడు కాని, ఎదురుగుండా 'రహస్యద్వీపం' అనే పుస్తకం అగుపించేసరికి తన విధులను విస్మరించాడు. బిగిల్ వినిపించింది. దళసభ్యులు నిద్రలేచారు. వాళ్ళు తనను పిలిచేసరికి ఎందుకు పిలిచారని ఇగోర్ విసుక్కున్నాడు.

బ్రష్‌లు, అద్దుడుగుడ్డలు 'పట్టుకుని పనికి ఉపక్రమించాడు. కాని అప్పటికే చాలా ఆలస్యమైపోయింది. తనిఖీదళం రానే వచ్చింది. పడకగది, హాలు చిందరవందరగా ఉన్నాయి. దుమ్ము, ధూళి అంతటా పేరుకునిఉంది. ఇగోర్ గదిమధ్య కూచున్నాడు. ఆ వేళ తనిఖీదళానికి పెద్ద జకరోవ్. అపరిశుభ్రంగా ఉన్న గదిచూచి జకరోవ్ మండిపడ్డాడు.

"ఇప్పుడు మానేటరు డ్యూటీ ఎవరిది?" అని అడిగాడు.

ఇగోర్ తెల్లబోయి నవ్వుతూ "నేనే" అని సమాధానమిచ్చాడు.

"నీవిధిని నీవు సక్రమంగా నెరవేర్చలేదు. అందుకు నిన్ను శిక్షించక తప్పదు."

ఇగోర్ మళ్ళీ మామూలుగా నవ్వాడు. అతని నవ్వుచూచి ఈసారి నెస్ట్రెంకో జోక్యం కలిగించుకున్నాడు.

"అడిగిన ప్రశ్నకు సరిగ్గా సమాధానం చెప్పు. నీ డ్యూటీ నీవు ఎందుకు చేశావుకావు ?" అని అడిగాడు.

"మర్చిపోయాను. సరే, అలాగే. అందుకు శిక్ష అనుభ విస్తాను." అన్నాడు ఇగోర్.

తనిఖీ అయిపోయిన తరువాత నెస్ట్రింకో ఉపన్యాస ధోరణిలో అనేక విషయాలు ఇగోర్‌కు చెప్పసాగాడు. ఇటువంటిపనులు వ్యక్తిత్వానికి భంగం కలగిస్తాయనీ, దురలవాట్లను మానుకోవాలనీ, చిన్నప్పటినుంచి అలవడిన దగ్గా అలవాట్లను పోగొట్టుతోవాలనీ చెప్పసాగాడు.

"పుస్తకాలయితే చదువుతున్నావు. చదివితేమాత్రం ప్రయోజనం ఏమిటి? కొత్తగా ఏం నేర్చుకుంటున్నావు! ఇక్కడున్నావు కనుక సరిపోయింది. మరొకచోట అయితే నీపని ఏమయ్యేది?" అన్నాడు నెస్ట్రింకో.

నెస్ట్రింకో ఇగోర్ మీద ఇంత కోపించినా, తక్కిన స్నేహితులు కోపం తెచ్చుకోలేదు.

"అందులో ఏముంది నెస్ట్రింకో? ఎందుకలా అతనిమీద విరుచుకపడతావు? అందుకు తగినశిక్ష విధించారుకదా? విధించకపోతే మరీ పాడవును" అన్నాడు జోరిన్.

"నిజమే అనుకో. కాని దళసభ్యుడు శిక్షకు పాత్రుడైనాడంటే అది మొత్తం దళానికే అప్రతిష్ఠ." అన్నాడు నెస్ట్రింకో.

ఆవేళ నాలుగోదళానికి మానేటరు వాన్యా. ఇగోర్‌లాగా కాక, అతను తన విధులను సంతృప్తికరంగా నిర్వహించాడు. సంతృప్తికరంగానే కాదు, ఇదివరకు ఎన్నడూ లేనంత అందంగా ప్రతిదాన్నీ అమర్చి పెట్టాడు. ఇంకా అందరూ పడుకోనే ఉన్నారు. తాను మాత్రం ప్రొద్దున్నే లేచి మెల్లగా ఈల వేసుకుంటూ కిటికీ చివరకు ప్రాకి, కిటికీ చువ్వలు, అద్దాలు తళతళ మెరిసేటట్లు తుడిచాడు. ఇవతలికివచ్చి పూలకుండీలు సొగసుగా అమర్చి నీళ్ళు పోశాడు. సూర్యోదయం అయ్యేవరకూ ఏదోఒక పని చేస్తూనే ఉన్నాడు. సూర్యకాంతి ఎదురుగావున్న స్కూలు భవనంమీద పడుతోంది. బిగోవక్ తొందరగా లేచి బిగిల్ పట్టుకుని డ్యూటీలోఉన్న రొడ్నేవ్‌ను లేపడం

కోసం వెళ్ళాడు. రొడ్నేవ్ పదవ దళానికి అధిపతి. వాన్యా అటు చూచేసరికి బయట బిగిల్ వినిపించింది.

పని చేసుకుంటూనే వాన్యా ఇంకా నిద్రపోతున్న తన స్నేహితులవంక చూచాడు. బిగిల్ కూతవిని నిద్రలోనే షూరీ ఏదో గొణుక్కున్నాడు. కిటికీ అవతల అడుగుల చప్పుడు వినిపించింది. తోటలో నుంచి వస్తున్న ఒలోడ్యా ఇలా ప్రశ్నించాడు:

"ఇంకా నిద్ర లేవలేదూ? పడుకునే ఉన్నారా?"

వాన్యా తల ఊపాడు.

తలుపు తెరుచుకుంది. బయటినుంచి బిగిల్ ఆఖరుసారి వినిపించింది. నిద్రపోతున్న జిరియాన్స్కీని లేపి ఒలోడ్యా వెళ్ళిపోయాడు.

"పాడుముండాకొడుకు! సగంనిద్రలో లేపేశాడు. ఏమిటి వాన్యా? అప్పుడే లేవడం, కిటికీలన్నీ తుడవడం; పనులన్నీ ఇట్టే చేసేశావే!" అన్నాడు జిరియాన్స్కీ.

తన కమాండర్ తననిలా మెచ్చుకోవడంచూచి వాన్యా మరీ విజృంభించాడు. అద్దాలను తళతళ మెరిసేటట్లు ఇంకొకసారి తుడవసాగాడు. మళ్ళీ మరొక్కసారి బిగిల్ వినిపించింది. అదిరిపడి లేచాడు జిరియాన్స్కీ. ఇంతలోనే బిగిల్ పట్టుకుని బినోనక్ లోపలికి వచ్చాడు. రావడంతోనే జిరియాన్స్కీ మీదపడి కాళ్లు, చేతులు పట్టుకున్నాడు:

"రండర్రా, రండి! కమాండర్‌ను తందాం" అని అరిచాడు.

షూరీ, క్రావుచెక్, సెమ్యాన్స్‌లు మంచాలమీది నుంచి లేచారు. అంతా పకపకనవ్వసాగారు. బినోనక్ చేస్తున్న హడావుడి చూచి వాన్యా నవ్వు ఆపుకోలేకపోయాడు. అందరూ ఒకరినొకరు హాస్యాలాడుకున్నారు. గదంతా నవ్వులతో నిండిపోయింది. ఇంతలో ఒక పొట్టికుర్రవాడు గదిలోకివచ్చాడు. అతను రొడ్నేవ్. ఆ వేళ కమాండర్ 'డ్యూటీ' అతనిది. వస్తూనే "లేచార్రా!" అని నవ్వుతూ అడిగాడు.

భోజనాలయిన తరువాత ఇగోర్ కంటికి వాన్యా కనిపించాడు.

"ఏమిటోయ్ సంగతులు వాన్యా? పనులు బాగా సాగుతున్నాయా?" అని అడిగాడు ఇగోర్.

"ఓ! భేషుగ్గా సాగుతున్నాయి. ఇవాళ మరీ బాగుందనుకో! నేనుచేసిన పనిచూచి అంతా మెచ్చుకుంటున్నారు" అని చెప్పాడు వాన్యా.

"ఎందుకయ్యోయ్?"

"ఇవాళ నేను మానేటర్‌ను. నాకర్తవ్యం నేను చక్కగా నెరవేరుస్తున్నాను."

"మానేటరువా! ఓరి నీ తస్సాదియ్యా! ఆ సంగతి చెప్పావు కావేం? ఇవాళ నేనూ మానేటరునే! తెలిసిందా?"

"మానేటరు అవగానే సరిగాదు. దళసభ్యుల మెప్పును పొందావా?"

"మెప్పుమాట దేవుడికి తెలుసు. నామీద చర్యకూడా తీసుకున్నారు. విధించిన శిక్ష అనుభవిస్తేనేకాని నేను మంచి సభ్యుణ్ణి కాలేనట!"

"ఎవరయ్యా ఆ మాట చెప్పింది?"

"శాంకోజోరిన్. అతనే నాకు పెద్ద. అతనే నా మంచిచెడ్డలు చూస్తున్నాడు."

"జోరిన్‌కు మంచి చెడ్డలు తెలీనట్లుందే. శిక్ష అనుభవిస్తేనే కాని మంచి సభ్యుడు కాలేడా! నేను ఒలోడ్యా అజమాయిషీలో ఉన్నాను. అతను జోరిన్‌లాంటివాడు కాదు. తన విధులు తనకు తెలిసిన మనిషి."

వేసవికాలం కనుక స్కూలు ఉండదు. కాలనీలో పిల్లలు పార్కులో చేరతారు. కొందరు కొలను చెంతకు, మరికొందరు క్రీడాస్థలానికి, వెడుతూ ఉంటారు. బెంచీలమీద కూచుని పుస్తకాలు చదువుకుంటూ కాలక్షేపం చేస్తారు, ఇంకాకొందరు.

ఇగోర్ దూరంగా ఉన్న చెట్టుక్రింద బెంచీమీద చతికిలబడి పుస్తకం చదువుకుంటున్నాడు.

అక్కడికి నడిచి వెడుతున్నప్పుడు అతనికి ఆ "అందమైన" నల్లకళ్ళ అమ్మాయి ఎదురుపడింది. ఆ అమ్మాయి ఎదురవడం అతని జీవితంలో ఇది మూడవసారి. తొందర తొందరగా అడుగులు వేసుకుంటూ, అప్పుడే స్నానంచేసిన తడి ఆరని జుట్టు భుజాలమీద పడుతోంటే ఆఅమ్మాయి అతనికి ఎదురుగా వచ్చింది. దారివ్వకుండా నిలుచున్న ఇగోర్ వంక కళ్ళెత్తి చూచింది. ఆ పిల్లకళ్ళు అప్పటిలాగే ఇప్పుడుకూడా అతనికి ఎంతో అందంగా అగుపించాయి. మెరుస్తున్న కనుపాపలు నీలిరంగుతో తళుక్కుమన్నాయి. కాని ఆవిడ చూపులో పూర్వంలా విభ్రాంతిలేదు. ఆవిడకేదో జ్ఞాపకం వచ్చింది కాబోలు, నవ్వుకుంది.

ఇగోర్ ఆవిడ త్రోవకు అడ్డువచ్చాడు. ప్రక్కకు తప్పుకోలేదు. ఆపిల్ల ఒకఅడుగు వెనక్కు వేసింది. ముఖాన్ని చేతులతో కప్పుకుంది.

"భయపడకు. భయమెందుకు? నీ పేరేమిటి?" అని అడిగాడు ఇగోర్.

"నాపేరు నీకెందుకు?" అన్నదా పిల్ల.

"నీతో పరిచయం చేసుకుందామని. నాపేరు ఇగోర్."

"ఓహో!"

"పేరులో పెద్ద విశేషం లేదు. మామూలు పేరే. వట్టి ఇగోర్."

ఆపిల్ల ప్రక్కకు తొలిగింది. అతన్ని తప్పించుకోవాలని ఒక అడుగు ముందుకు వేసింది. ఇగోర్ కూడా ఒకఅడుగు ముందుకు వేసి ఆవిడకు అడ్డు వచ్చాడు.

"నేను ఏమన్నానని? నీపేరు చెప్పమన్నాను. అంతేకదా?" అన్నాడు.

ఆ అమ్మాయి ఆగిపోయింది. అరచెయ్యి పెదవులపై ఆనించుకుని నిలుచున్నది.

"ఆవేళ ఈగలంటే భయపడింది నువ్వేకదూ?" అని అడిగింది.

ఈ ప్రశ్నతో ఇగోర్‌కు ఆనాటి అవమానకర సన్నివేశం జ్ఞప్తికి వచ్చింది. తానొక పిరికివాడిలాగా ఈగలంటే భయపడ్డాడు. అప్పుడే ఆ పిల్లను తొలిసారి చూచాడు. తన పిరికితనం జ్ఞాపకంవచ్చి ఇప్పుడు ఇగోర్ కంగారు పడసాగాడు. అతని తొట్రుపాటు చూచి ఆ అమ్మాయి చెయ్యి క్రిందికి దించుకుని, ప్రక్కకు తొలిగింది. ఇగోర్ దారిలోనుంచి తప్పుకున్నాడు. రెండడుగులు ముందుకు వేసి ఆపిల్ల వెనక్కు తిరిగి తెలివిగా నవ్వుతూ:

"నా పేరు ఒక్సానా" అన్నది.

ఇగోర్, చేతులు ఒక్కసారి ఊపుకుని "ఒక్సానా! ఆరి భగవంతుడా! ఏం పేరు!" అన్నాడు.

కాని అప్పటికే ఆపిల్ల మెరుపుతీగెలా, చాలాదూరం వెళ్ళిపోయింది.

వెనుకనుంచి "ఏమిటయ్యా నీకాదుర్బుద్ధి?" అనే కేక వినిపించింది.

ఇగోర్ వెనక్కు తిరిగిచూచాడు. సెరిడిన్ ఇటేవస్తున్నాడు. అతను ఒక ఇంజనీరుకొడుకు. మేధావుల వర్గానికి చెందినవాడు. కాలనీలో తన హుందాతనాన్ని పోగొట్టుకోకుండా మసలుతూఉంటాడు. కొనపెదవులపై మాత్రమే అతని నవ్వు కనిపిస్తూఉంటుంది. అసలే ఎత్తుగాఉన్న మెడను, ఇంకా నిటారుగాఉంచి గంభీరంగా నడుస్తుంటాడు:

"ఆవిడ ఎవరో నీకు తెలుసునా? కాలనీ సభ్యురాలుకదూ?" అని అడిగాడు ఇగోర్.

"కాదులే" కోపంగా సెరిడిన్ జవాబిచ్చాడు: "ఆపిల్ల పని మనిషి."

"కాదుకాదు. ఎప్పటికీకాదు. అయివుండదు."

"ఎందుకు కాకూడదూ?" అని అడిగాడు సెరిడిన్.

"ఏమన్నావ్? నీవంటున్న ప్రకారం ఆపిల్ల దాసీదన్నమాట?"

"అవును, అంతే. కోనేరు అవతల వేసవి భవనం ఉంది చూచావా? అక్కడ ఆపిల్ల పనిచేస్తోంది."

"ఆఇంటి యజమాని దగ్గరేనా?"

"ఆ ఇంటికి యజమాని అంటూ ఎవరూలేరు. కాని అతనెవరోమాత్రం ఎవరికీ తెలీదు. ఎవరో లాయరయి ఉంటాడు."

"ఈ విషయం నీకెలా తెలిసింది?"

"ఆ అమ్మాయి సంగతి తెలుసుకోవాలంటే గోంటూర్‌ను అడుగు, చెపుతాడు. వాడు ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు."

"ప్రేమిస్తున్నాడా? నిజాని కంటున్నావా, హాస్యాని కంటున్నావా?"

"హాస్యమేమిటి? ఆ పిల్లకోసమే వాడు రోజూ తల దువ్వుకుంటున్నాడు, ముస్తాబవుతున్నాడు. ఎముకలు విరగ్గొట్టగలడు - జాగ్రత్త! ఆపిల్ల జోలికి పోయేవు గనుక!"

ఇగోర్ అతని భుజాలమీద చేతులువేశాడు:

"ఎముకలు విరుగుతాయని భయపడడంలేదయ్యా, స్వామీ! ఆ ప్రశ్నేలేదు. నాకు పట్టుకున్న ప్రశ్నల్లాఒక్కటే- ఆ భవనంలో అతను లాయరేకనుక అయితే, ఈపిల్ల అక్కడ పనిచేస్తూఉండి కూడా అంత మురికిబట్టలు ఎందుకు వేసుకోవాలా అని?" అన్నాడు.

"నీప్రశ్నకు నేను సమాధానం చెప్పలేను. తోటలో మొక్కలకూ వాటికీ నీళ్ళు పోయడానికి ఆ అమ్మాయిని అతను పెట్టుకుని ఉంటాడు. ఇది నాఅభిప్రాయం కాదు. గోంటూర్ ఊహించిన ఊహ. ఆలాయరు కూరగాయలన్నీ తానే పండించుకుంటాడు. అయితే పనిమాత్రం అతను చెయ్యడు. తోటలో పనిచెయ్యడం ఆ పిల్లవంతు, అనుభవించడం అతనివంతు. ఒక్యానా పాలికాపులాగా

పశంతా చేస్తుంది. ఇంతా చేసి ఆమె వయస్సెంతనుకున్నావు? పది హేనేండ్లు! వాడొక తినమరిగిన పంది."

'తినమరిగినపంది' అనేమాట సెరిడిన్ నోటవెంట బహు నాజూగ్గా వెలువడింది. ప్రశాంతంగా, అర్థవంతమైన చూపులతో ఇగోర్ వంక చూచాడు.

ప్రధాన భవనం దగ్గరికి ఇరువురూ బయలుదేరారు. ఒక్సానాను గురించి ఇంకా భోగట్టా చేద్దామని ఇగోర్ దారిలో ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కాని ఇరువురూ మౌనంగా నడక సాగించారు. రోడ్నేవ్, చేతిలో పుస్తకం పట్టుకుని భవనంముందు వసారాలో నిలుచుని ఉన్నాడు. ఇగోర్ కంటపడగానే అతనిలా అన్నాడు:

"అబ్బాయ్! నీకు ఇంకొక శిక్ష ఉన్నది. ఈత్రోవంతా పూర్తిగా నీవే తుడిచెయ్యాలి. దారిలో చక్కగా ఇసక చల్లాలి. అంతా అరగంట పని. భోజనం వేళకు నాకు కనిపించు. ఏంచేశావో చెప్పు."

ఇగోర్ బందోబస్తులో నిలుచున్నాడు:

"అలాగే కామ్రేడ్ కమాండర్" అన్నాడు.

అయితే ఆ త్రోవను దేనితో శుభ్రపరచాలో, ఎక్కడనుంచి ఇసక పట్టుకొచ్చి చల్లాలో అతన్ని అడగడం మరచిపోయాడు ఇగోర్. అప్పటికే రోడ్నేవ్ అక్కడనుంచి వెళ్ళిపోయాడు. ఇగోరే చుట్టూ కలయ చూచాడు. అడుగుదామంటే అక్కడ సెరిడన్ కూడా అగుపించలేదు.

ఇగోర్ మూడు రెమ్మలు విరుచుకొచ్చాడు. వాటితో దారంతా అటూఇటూ చిమ్మాడు. కాని దారి శుభ్రంగా లేదు.

అతనలా పనిచేస్తూఉంటే నెస్టెరెంకో ఎక్కడికో వెడుతూ, అతన్ని చూచి ఆగాడు.

"నీకేమైనా శిక్ష పడిందా?" అని అడిగాడు.

"అవును."

"ఊడుస్తున్నప్పుడు రెమ్మలు ఎవరైనా అలా పట్టుకుంటా రటయ్యా! రెమ్మలతో ఎవరైనా తుడుస్తారా ?"

"అయితే మరి దేంతో తుడుస్తారు ?"

సమాధానం చెప్పకుండా నెస్ట్రెంకో తల ఆడిస్తూ అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. ఇగోర్ ముఖం ఎర్రబారింది. తల ఎత్తి చూచాడు. ఎదురుగా వాన్యా కనిపించాడు. కనిపించినట్లే కనిపించి అతనుకూడా మాయమైనాడు.

ఇగోర్ ఆలోచిస్తూ నిలుచున్నాడు. అతనికేమీ తోచలేదు. రెమ్మలను నేలమీద అటూ ఇటూ పొర్లించాడు. వేసిన శిక్ష అనుభవించవలసిందే. చెప్పినపని చేయవలసిందే. అందుకు తనకు అభ్యంతరం లేదు. కాని పనిచేయడానికి వీలు కలిగించాలి. చీపురు లేకపోతే చిమ్మడం ఎలాగ! త్రోవలో సిగరెట్టు పీకలు, కాగితం ముక్కలు, పూలరేకులు, నానా కంగాళీగా పడిఉన్నాయి. నేల మీద గడ్డిలో ఇరుక్కునిపోయాయి. ఎంత తుడిచిన ఇవతలికి రావు. విసుక్కుంటూ మళ్ళీ ఒకసారి ఇగోర్ చుట్టూ చూచాడు. చేతిలో చీపురు పట్టుకుని వాన్యా తనవైపే వస్తూ ఉండడం గమనించాడు.

"రారా బాబూ. రక్షించావు. ఎక్కడ దొరికింది నీకీ చీపురు ?" అన్నాడు.

"దొరకడమేమిటి ? మనమే తయారు చేశాం! ఇలాంటివి లక్షోపలక్షలు" అన్నాడు వాన్యా.

"ముందా చీపురు ఇలా తే."

"ఇందా, తీసుకో. నీవు తుడుస్తూ ఉండు. నేను వెళ్ళి ఇసక పట్టుకొస్తాను."

అరగంట గడిచింది. అరగంటలో ఇరువురూ ఒక బకెట్టుతో ఇసక తీసుకొచ్చి 'త్రోవపొడుగునా చల్లారు. జకరోవ్ భవనంలో నుంచి అక్కడికి వచ్చాడు.

"వాన్యా! ఎవరినీ సహాయం చేస్తున్నావా? వద్దు. ఒక్కణ్నీ చెయ్యనీ."

"లేదు. లేదు. నేనేంచెయ్యలేదు- అంతా అతనొక్కడే చేశాడు."

"నీవు మంచికామ్రేడ్‌వు."

వాన్యా తలెత్తిచూచాడు. జకరోవ్ తనపనిమీద తాను వెళ్ళిపోయాడు. అతను బిగిగాఉన్న చొక్కావేసుకున్నాడు. తళతళ లాడే బూట్లు తొడుక్కున్నాడు.

ఇగోర్ భవనంవైపు దృష్టిసారించి "ఇవాళ ఎవరో కాలనీకి కొత్త కుర్రవాడొచ్చినట్లున్నాడు" అన్నాడు.

వాన్యా రోడ్డువంక చూచాడు.

అవును. ఎవరుగుండా ఎవరోవస్తున్నారు. వెంట ఇరువురు రక్షకసైనికులుకూడా ఉన్నారు.

"నన్నూ రక్షక సైనికులే తీసుకొచ్చారు. కాని అలారావడం మంచిదికాదు." అన్నాడు ఇగోర్.

వాన్యా మాట్లాడలేదు. తాము శుభ్రపరచిన దారి ఎలా ఉన్నదో పరీక్షిస్తూ నిలుచున్నాడు.

"అక్కడొక గతుకు ఉంది. ఇంకా కొంచెం ఇసక తెచ్చి పోస్తేకాని లాభంలేదు." అన్నాడు వాన్యా.

"ఇంకా చాలాఇసక ఉన్నదే. దాన్ని ఏంచేద్దాం?" అని అడిగాడు ఇగోర్.

"ఆ ప్రక్కదారికూడా బాగుచేద్దాం. ఆట్టేసేపు పట్టదులే. ఇట్టే అయిపోతుంది పని."

దీనికి ఇగోర్ కాదనలేదు. పది నిముషాల్లో ఇరువురూ ప్రక్కబాటను కూడా పరిశుభ్రం చేశారు. ఇగోర్ బాల్చి పట్టుకుని సింహద్వారం చెంతకు వెళ్ళాడు. అక్కడ రోడ్నేవ్, రక్షకసైనికుల నోటు

పుస్తకంలో సంతకంపెడుతూ నిలుచున్నాడు. ఇద్దరూ అక్కడికి వెళ్ళేసరికి ఆరతుక సైనికులు తమ పని ముగించుకుని అభివాదంచేసి మళ్ళీ బస్తీకి వెళ్ళిపోయారు.

"కామ్రేడ్ కమాండర్! శిక్షప్రకారం విధించిన పనిచేశాం" అన్నాడు ఇగోర్.

"ఎలా చేశావో ఇప్పుడేవచ్చి చూస్తాను. ఇదిగో! ఈ కుర్రాణ్ణి టార్‌స్కీదగ్గరికి పంపించి నిముషంలో అలా వస్తాను" అన్నాడు రొడ్నేవ్.

కొత్తగా వచ్చిన ఆ కుర్రవాడివంక చూడడంతోనే ఇగోర్ నిశ్చేష్టుడయ్యాడు. ఎదుట నిలుచున్న ఆ కొత్త కుర్రవాడు మరెవరో కాదు. గ్రిషారైజికోవ్. వాన్యా నోరు వెళ్ళబెట్టి అతనివంక చూస్తూ నిలుచున్నాడు. రైజికోవ్ విలాసంగా నవ్వుతున్నాడు. నవ్వుతున్నాడేకాని నోటమాటరాలేదు.

"ఈ దొంగగాడిదకొడుకు కాలనీలో చేరుతున్నాడా? వీడి పళ్ళు ఊడగొట్టకపోతే నీ మీద ఒట్టు" అంటూ ఇగోర్ ముందుకు ఉరికాడు.

రొడ్నేవ్ అతన్ని మధ్యలో ఆపినా ఆగక, రైజికోవ్ చొక్కా కాలర్లు పట్టుకున్నాడు.

"కుర్రాడని జాలి లేకుండా వాన్యా జోళ్ళూ అవీ ఎత్తుకపోతావా?" అని కేకవేశాడు ఇగోర్.

"కొట్టు, ఎలా కొడతావో చూస్తాను." అంటూ రైజికోవ్ పిడికిలితో ఇగోర్ చేతులు గట్టిగా పట్టుకున్నాడు.

అప్పటికప్పుడే ఇగోర్ చెయ్యి తప్పించుకుని రైజికోవ్ తల మీద గుద్దాడు. కాని వెంటనే రొడ్నేవ్ అతనిజెట్టు పట్టుకుని వెనక్కునెట్టాడు.

"ఆర్డర్! కామ్రేడ్ ఇగోర్!" అన్నాడు.

ఇగోర్, కమాండర్ ఆజ్ఞ వినిపించగానే తలెత్తిచూచాడు. రొడ్స్నేవ్ తెల్లచొక్కా, చేతులమీద ఉన్న బంగారుపతకం అగుపించాయి. రైజికోవ్ ఎవరో అప్పుడతను గ్రహించుకున్నాడు. వెంటనే సర్దుకుని నిటారుగా నిలుచున్నాడు.

రొడ్స్నేవ్, రైజికోవ్ వంక అసహ్యంగా చూడకపోలేదు. కాని, ఆ చూపుల్లోమాత్రం తన భావాన్ని వ్యక్తపరచకుండా దాచుకున్నాడు. కఠినంగా ఇగోర్ వంక చూచి ఇలా అన్నాడు:

"ఇది కాలనీ. పాత కావేషాలు తీర్చుకునేందుకు ఇది చోటు కాదు. పూర్వపు ద్వేషాలు, పగలు ఇక్కడ పనికిరావు. తెలిసిందా ఇగోర్ ?"

ఇగోర్ అతని ధోరణీ, కనుబొమలు, ఎర్రని కళ్ళు, కంఠ ధ్వని చూచి తమాయించుకున్నాడు:

"అవును. అంతే, కామ్రేడ్ కమాండర్"అంటూ అభివాదం చేశాడు.

రొడ్స్నేవ్ ఈ లోపునే రైజికోవ్‌ను వెంటతీసుకుని లోపలికి వెళ్ళిపోయాడు. అతనివెంట రైజికోవ్ నడుస్తున్నాడేకాని, అతని మతి మతిలోనే లేదు. రొడ్స్నేవ్‌వంటి ఒక పిల్లవాడి వెనుక అలా నడిచి వెళ్ళడం అతనికే ఆశ్చర్యంగా ఉంది.

ఇగోర్ జరిగిన ఈ సన్నివేశాన్ని తలచుకుంటూ నిలుచుండి పోయాడు. ఆలోచిస్తూ నిలుచున్న అతని చెంతకు వాన్యా వచ్చి అతని చెయ్యి పట్టుకుని ముందుకు నడిచాడు.

4

కలకాలపు స్నేహితులు

వాన్యా ఆవరణ అవతలికొసన నిలుచున్న ఒబోడ్యా బిగోనక్ చెంతకు వెళ్ళాడు. రైజికోవ్ రాకతో కాలనీకి గ్రహణం పట్టినట్లయింది. దానిఛాయలు భవనంలో, తోటలో, కొలనులో, చివరకు నాలుగో దళంలోకూడా పడుతున్నట్లు వాన్యాకు అనిపించసాగింది. రైజికోవ్ వంటి పుండాకోరు కాలనీకి రావడం? ఎంత విడ్డూరం!

రైజికోవ్ కథంతా వాన్యా, బిగోనక్ తో చెప్పసాగాడు. బిగోనక్ నిశితమైన చూపులతో, కనుబొమలు మీదికినిలిపి, తీవిగా నిలుచుని వాన్యా చెప్పినకథ విన్నాడు.

"నీ వస్తువులు కాజేసింది వాడేనా? వాడొచ్చేసరికి నీవెందుకంత గాభరాపడుతున్నావు?" అని అడిగాడు బిగోనక్.

"దొంగపీనుగ. కాలనీకే వచ్చేశాడు! ఏది దొరికితే అది ఎత్తుకపోతాడు." అన్నాడు వాన్యా.

"ఆదానంగతి. మరేం భయంలేదులే. దొంగతనం నీవనుకున్నంత తేలికకాదు. పోనీ చేసిచూడమను. ఇలాంటివాళ్లు మనకిక్కడ వందలకొద్దీ ఉన్నారు- పీడిబాబులాంటి వాళ్ళు. పట్టపగలు అందరూ చూస్తుండగానే కన్నంవేయగల సమర్థులు!"

"అయితే వాళ్లను ఏంచేశారు?"

"ఏంచెయ్యడమేమిటి? అంతా ఇక్కడే ఉన్నారు. పూర్వంలాగా ఇప్పుడు లేరు. అప్పుడు వేరు."

ఇరువురూ పార్కులోకి వెళ్ళారు. వాళ్ళలా వెడుతోంటే ప్రధాన భవనందగ్గరికి ఒక కారు వచ్చి ఆగింది. కారులోనుంచి ఇరువురు స్త్రీలు దిగారు. వారివెంట వాండా స్టాడ్నిట్స్కాయా కూడా ఉన్నది. ఆరోజు డ్యూటీలో ఉన్న కమాండర్ రొడ్నేవ్. వాళ్ళను చూడగానే ఎదురుగుండా వెళ్లాడు. వాండావైపు ఒకమాటు చూచాడు. ఆవిడ ఎంతో అందంగా అగుపిస్తోంది. నున్నగా, చక్కగా, తలదువ్వుకున్నది. వెంట్రుకలు తళతళలాడుతున్నాయి. తలకు చిన్న టోలుటోపీ కూడా పెట్టుకున్నది. నల్లటిబూట్లు, మేజోళ్లు వేసుకున్నది. తనతో వచ్చిన ప్రయాణీకులవంక చూస్తున్న ఆవిడ చూపులు వింతకాంతిని విరజిమ్ముతున్నాయి. ఉద్యోగపు హుందాతో ఉన్న రొడ్నేవ్‌ను స్నేహపూరిత మందహాసంతో పలకరించింది.

కాని రొడ్నేవ్ మాత్రం ఆవిడ నవ్వుకు సమాధానంగా మళ్ళీ నవ్వలేకపోయాడు. చెయ్యి పైకెత్తి, నిటారుగా నిలుచుని, ఉద్యోగి తరహాలో మర్యాదగా ఇలా అన్నాడు:

"మీకు ఏంకావాలో చెప్పండి. ఏం పనిమీద వచ్చారో - నేను డ్యూటీలో ఉన్న కమాండర్‌ను."

అందులో ఒకామె స్థూలకాయిని. ఎర్రని బుగ్గలమీద సొట్టలు పడుతున్నాయి. కనుబొమలు దళసరివి. చూడగానే జాలిగల స్త్రీ అని తెలుస్తుంది. ఎంతో నమ్రతతో రొడ్నేవ్ ఇలా అడిగేసరికి వెంటనే ఆమె సమాధానం చెప్పలేకపోయింది. సంతోషం పట్టలేక నవ్వింది.

"ఓహో! నీవా డ్యూటీలో ఉన్న కమాండరువి! సరే నయ్యా. మాకు మీ ప్రిన్సిపాల్ ఎక్కడున్నాడో చెపుదూ" అన్నది,

"ప్రిన్సిపాల్ కాదు. డైరెక్టర్" అన్నాడు రొడ్నేవ్.

"ఆయన్ను డైరెక్టరనా అంటారు? సరే, అయితే అతన్నే చూపించూ."

"ఏమిటి మీా పని? అడగవచ్చా?

"ఏమిటీ మనపని!" అంటూ ఆవిడ తన స్నేహితురాలి వైపు మళ్లింది. స్నేహితురాలుకూడా లావుగానే ఉంది.

"ఏంపనిమీాద వచ్చామో నీకు మేం చెప్పాలటయ్యా?"

"ఆ. చెప్పాలి" అన్నాడు రొడ్నేవ్.

"అయితే సరే, అలాగే చెప్తాం - చెప్పడమెందుకూ? ఇదిగో ఈ పిల్ల...వాండా స్టాడ్నిట్స్కయా. ఫ్యాక్టరీ పార్టీ కమిటీ దగ్గరనుంచి వస్తున్నాం! ఉత్తరంకూడా తెచ్చాం."

రొడ్నేవ్ వాళ్ళకు త్రోవ చూపించాడు:

"ఇదిగో, ఇలా వెళ్ళండి."

ద్వారంచెంత కాపలాసైనికుడు కసాట్కిన్, రొడ్నేవ్ వంక ప్రశ్నార్థకంగా చూచి, రొడ్నేవ్ చూపులవల్ల అంతా గ్రహించుకున్నాడు.

కమాండర్ల కౌన్సిలు సమావేశమయ్యే గదిదగ్గరికి వెళ్ళాడు రొడ్నేవ్. తలుపు తెరిచి, ప్రక్కకు తప్పుకుని ఆ స్త్రీలను లోపలికి వెళ్ళమన్నాడు. వాండా తల పైకెత్తింది. తల పైకెత్తగానే అక్కడికి వస్తున్న రైజికోవ్ హఠాత్తుగా ఆవిడ కంటపడ్డాడు. ఆవిడ ముఖం వెలవెలబోయింది. ఒక్క కేకపెట్టి కిటికీలోకి ఒరిగిపోయింది.

"నీ విక్కడే ఉండు. ఇప్పుడే వస్తాను." అంటూ రైజికోవ్‌ను నిలబెట్టి రొడ్నేవ్ ఆ స్త్రీలవంక చూచాడు.

"వెళ్ళండమ్మా, లోపలికి వెళ్ళండి" అన్నాడు.

వాండా కొంచెం తెప్పరిల్లుకున్నది. ఆ స్త్రీలు ఆవిడను లోనికి రమ్మన్నారు. ఆ పిల్ల తలెత్తకుండానే నెమ్మదిగా "నే నెక్కడికీ రాను" అన్నది.

రైజికోవ్ అక్కడనుంచి వెళ్ళిపోవాలనుకున్నాడు. జేబులో చేతులు పెట్టుకున్నాడు. వెక్కిరింతగా ఆ పిల్లవంక చూస్తున్నాడు.

ఇంతసేపూ అక్కడ ఉన్న టార్‌స్కీకి ఈ సంఘటన అంతరార్థం అవగతమైంది.

"ఇతన్ని అవతలికి తీసికెళ్ళిపో రొడ్నోవ్" అన్నాడు.

రొడ్నోవ్, అతని చెయ్యి పట్టుకుని అవతలికి తీసుకెళ్ళాడు.

"లోపలికి పదండి" అని స్త్రీలను హెచ్చరించాడు టార్‌స్కీ.

"నేనెక్కడికీ రాను." అన్నది వాండా.

ఆపిల్ల ఇంకా తలవాల్చుకునే ఉంది. రైజికోవ్ అక్కడనుంచి వెళ్ళిపోతోంటే అతనివైపు అసహ్యంగా చూచింది. ఇహ అతను అక్కడలేడని తెలుసుకున్న తరువాత గదివైపు చూచింది. కళ్ళవెంట బొటబొటనీళ్ళు కారాయి. వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

ఆ ఇరువురు స్త్రీలు ఒకరినొకరు చూసుకున్నారు. టార్‌స్కీ నెమ్మదిగా వాళ్ళను లోనికి తీసుకెళ్ళాడు.

"మీరిక్కడ కూర్చోండి. నేనా అమ్మాయితో మాట్లాడి వస్తాను." అంటూ టార్‌స్కీ గది ఇవతలికి వచ్చాడు.

వాండా భయంతో అలాగే నిలుచునిఉంది.

"వాడంటే నీకెందుకంత భయం? చూడగానే కెవ్వున కేక పెట్టావేం? అతన్ని నీ వెరుగుదువా?" అని అడిగాడు టార్‌స్కీ.

వాండా మారుపలకలేదు. కాని ఏడవడం మానేసింది. చొక్కాతో కళ్ళు తుడుచుకుంది.

"గాభరాపడకు. ప్రతివాడికీ ఇలా భయపడితే జీవించడంలో అర్థంలేదు."

"నేను భయపడలేదు. కాని ఇక్కడమాత్రం నేనుండను" అంటూ వాండా కిటికీ ఊచలవంక చూచింది. "సరే. అలాగే. ఇష్టం లేకపోతే వెడుదువుగాని. మీరు వచ్చినకారు ఇంకా అవతలేఉంది. వెళ్లేలోపుగా ఒకసారి గదిలోకి వెళ్లిరా."

"ఎక్కడికి వెళ్ళాలి?"

"ఒకమాటు ఇలారా."

వాండా ఒకక్షణం మౌనంగా నిలుచుంది. మాటుపలకకుండా గది వాకిలివైపుకు నడిచింది. కమాండర్ల కౌన్సిలు గదిలోకి వెళ్ళాలనుకున్నది కాని, టార్ స్కీ ఆమెను సరాసరి జకరోవ్ ఆఫీసు గదిలోకి తీసుకెళ్ళాడు.

జకరోవ్ వాండావైపు ఆశ్చర్యంతో చూచాడు. ఆవిడ మళ్ళీ కేకపెట్టింది.

"నన్ను ఎక్కడికి తీసుకొచ్చారు?" అని అడిగింది.

ఆవిడకు జవాబు చెప్పకుండా టార్ స్కీ జకరోవ్ వంక తిరిగాడు: "అవతల ఇరువురు స్త్రీలు మీకోసం కూచున్నారు. వెళ్ళి మాట్లాడిరండి" అన్నాడు.

జకరోవ్ గబగబలేచి గది అవతలకి వెళ్లాడు. వాండా అతని వంక బెదురుబెదురుగా చూస్తూ నిలుచుంది. అతను వెళ్ళిపోగానే మళ్ళీ దుఃఖించసాగింది.

"ఇక్కడికి నన్నెందుకు తీసుకొచ్చారు? ఇక్కడ నేనుండను. ఉండనంటే ఉండను."

ఆవిడ గదితలుపు తెరిచి బయటికిపోవడానికి ప్రయత్నించింది. కాని టార్ స్కీ ఆ ప్రయత్నాలను నిరోధించాడు. ఆమె మరీ దుఃఖించసాగింది. టార్ స్కీ కిటికీలోనుంచి బయటికి చూచాడు. బయట కారులో ఆ ఇరువురు స్త్రీలు వెళ్ళిపోతున్నారు.

"ఏడిస్తే లాభంలేదు. విచారించడానికి ఏకారణమూ కనిపించదు. ఇక్కడఅంతా చక్కగా ఉంటుంది. ఎంతోహాయిగాఉంటుంది" అన్నాడు టార్ స్కీ.

వాండా కళ్ళనీళ్ళు తుడుచుకున్నది. దుఃఖం ఆపుకున్నది. కాని జకరోవ్ వచ్చేసరికల్లా మళ్లీ ఆవిడ దుఃఖం పొంగివచ్చింది.

కూచున్నచోటునుంచి లేచిపోయింది. తలకు పెట్టుకున్న ఊలుటోపీ కిందపడింది; ఒక మూలకుపోయి ఆ పిల్ల వెక్కివెక్కి ఏడుస్తూ ఇలా అరిచింది:

"సోవియట్ ప్రభుత్వం? ఇక్కడ సోవియట్ ప్రభుత్వం ఏదీ? ఎక్కడున్నది దాని శక్తి?"

జకరోవ్ కుర్చీముందు నిలుచున్నాడు.

"సోవియట్ ప్రభుత్వమా? ఇక్కడే ఉన్నది. నేనే సోవియట్ ప్రభుత్వాన్ని" అని చెప్పాడు.

వాండా కెవ్వున కేకపెట్టింది. మెడ వాల్చుకుంది. "నువ్వా? నీవేనా సోవియట్ ప్రభుత్వానివి? అయితే ఒక కత్తి తీసుకుని నా కంఠం నరికెయ్యి. ఊ. కానీయి. నాకు బ్రతకాలని ఆశలేదు. ఒక్క నిమిషంలో నరికిపారెయ్యి. ఇంతకంటే చచ్చిపోతేనే సుఖం" అన్నది.

ఆవిడ ఎంత అల్లరిచేసినా జకరోవ్ చలించలేదు. ప్రశాంతంగా కుర్చీలో కూచుని డ్రాయరులోనుంచి కాగితాలు తీసి పరిశీలించసాగాడు. ఆ కాగితాలు ఆ అమ్మాయికి సంబంధించినవి. చాలా సేపటినుంచీ సంభాషిస్తున్న వాడిలాగా మాటలకు ఉపక్రమించాడు:

"ఇలాంటివన్నీ మాకు కొత్తకాదు వాండా! వీటన్నిటికీ అలవాటుపడిపోయాం. నేనూ కొత్తలో నీలాగే బాధపడ్డాను...నీ తలకు పెట్టుకున్న ఊలుటోపీ చాలా బాగుందే! అరెరె! క్రిందపడిపోయిందే! ఇలాతే, చూద్దాం!"

వాండా అతనికేసి మామూలుగా చూసింది. టార్స్కీ క్రిందపడ్డ ఊలుటోపీ తీసి జకరోవ్‌కు అందించాడు.

"టోపీ చాలాబాగుంది. రంగు ముచ్చటగా ఉంది. ఇలాంటి వాటికోసం మనవాళ్ళు వెతుకుతూనేఉంటారు. కాని దొరకడం కష్టం. ఎక్కడకొన్నావు దీన్ని? ఎంతఖరీదూ?" అన్నాడు మళ్ళీ జకరోవ్.

"నాలుగురూబుళ్ళు." అని చెప్పింది వాండా.

"నాలుగేనా! ఏమంత ఎక్కువఖరీదు కాదు. చాలాబాగుంది టోపీ."

నిజానికి అతనికి ఊలుటోపీ అంతగా నచ్చలేదు. అయినా ఆపిల్ల మనస్సును మళ్ళించడంకోసం టోపీనిగురించి ఇంతసేపు మాట్లాడాడు. జకరోవ్ కనుసైగచేయగానే టార్‌స్కీ అక్కడ నుంచి వెళ్ళిపోయాడు. వాండా దిక్కులుచూస్తూ గదిలోకూచుంది. టోపీ దులుపుతూ జకరోవ్ ఆపిల్లచేరువకు వచ్చాడు వాండా ముఖం ప్రక్కకు తిప్పుకున్నది.

"ఇటుచూడు వాండా. చచ్చిపోవడం ఎవరికైనా సులభమే. ఎప్పుడైనా సాధ్యమే. ముఖం అలా ప్రక్కకు తిప్పుకుంటావెందుకు? నేను నీకేం అపకారం చెయ్యలేదే! నేనెవరో నీకు తెలీదు. అలాంట ప్పుడు నేను మంచివాణ్ణి అయితేమాత్రం ఏంలాభం? ఇక్కడ అంతా నన్ను మంచివాడనే అంటారు." అన్నాడు జకరోవ్.

వాండా విసురుగా ఒక్కమాటు చూసింది. ఛీత్కారంగా ఇలా అంది:

"తన్నుతాను పొగుడుకుంటే తన్నుకున్నట్లే ఉంటుంది! ఎందుకా బడాయి?"

"ఏం? ఎందుకు చెప్పుకోకూడదు? ఎవరికున్న గుణాలు వాళ్ళు చెప్పుకోవడంలో తప్పులేదు. నీవూ అలా చెప్పుకోమనే నా సలహా. తన్నుతాను పొగుడుకుంటే చాలాలాభం ఉంది. ఇక్కడి వాళ్ళంతా నా స్నేహితులు."

"అయితే నన్నేంచేయమంటారు?" అంటూ వాండా నవ్వింది.

"మనిద్దరం స్నేహంగా ఉందాం. ఈ క్షణంనుంచీ మనం స్నేహితులం."

"స్నేహితులమా? మీ స్నేహం నాకక్కర్లేదు. ఇదివరకు చాలామందితో స్నేహం చేశాను. ఈ స్నేహాలసంగతి నాకు బాగా తెలుసు."

"నీకెలాంటి స్నేహితులు పోగడ్డారో నాకూ తెలుసు. నేను చెప్పేది మామూలు మాటలు కావు. హృదయపూర్వకంగా చెప్తున్నాను. మనం జీవితాంతంవరకూ ప్రాణస్నేహితులం. జీవితాంతం వరకూ అంటే ఏమిటో తెలుసునా?"

వాండా అతనికేసి నిశ్చలంగా చూచింది: "తెలుసును" అన్నది.

"నీ తల్లిదండ్రు లెక్కడున్నారు?"

"ఈ దేశంలో లేరు. పోలెండు వెళ్ళిపోయారు."

"పోలెండు దేశస్థులా?"

"అవును."

"మరి నీవిక్కడ ఎందుకుండిపోయావు?"

"అప్పుడు నేను చాలా చిన్నపిల్లను. స్టేషనులో మారుపడి పోయాను."

"అయితే నీకిప్పుడు తల్లిదండ్రులు లేరన్నమాట?"

"అవును. అలాగే అనుకోవాలి."

"సరే, అయితే నేను మీ తండ్రిలాగా నిన్ను ఆదుకుంటాను. అన్నివిధాలా నీ యోగక్షేమాలు విచారిస్తాను. నేను ముక్కుకు సూటిగా పోయ్యేమనిషిని. ఒక్కొక్కప్పుడు నా మీదనాకే కోపం వస్తుంటుంది. ఇలా అంటున్నానని భయపడతావేమో కొంపదీసి! నీమీద నాకు ఆప్యాయత కలిగిందీఅంటే దానికి కారణం వేరు. నీవు అందగత్తెవే అయినా, అందుకోసం నేను నిన్ను అభిమానించడంలేదు.

అనుకోకుండా ఆవిడకళ్ళు నీళ్లతో నిండిపోయాయి. "అందమైన పిల్ల" అనేమాట విని ఆవిడముఖం ప్రక్కకు తిప్పుకుంది.

"నేనలాంటిదాన్నో మీకింకా తెలీనట్లుంది" అన్నది.

"అయితే విను. నీవెలాంటిదానివో, నీచరిత్ర ఏమిటో– నాకంతా తెలుసును. ఇంతకూ తెలుసుకునేందుకు ఏమీలేదు. ఆ విషయాలన్నీ అర్థం పర్థంలేనివి. వాటిల్లో ఏమిఃటుంది?"

"మీరెందుకిదంతా చెపుతున్నారో నాకు తెలుసు. ఇక్కడ నన్ను ఎలాగైనా అట్టిపెట్టాలని మీ ఉద్దేశం."

"నిజమే. అందులో అబద్ధంలేదు. నేను ఊరిక చెప్పడంలేదు. ఊసుపోని కబుర్లాడడం నామతం కాదు. నీవీకాలనీలో ఉండడం నాకెంతో ఇష్టం– ముమ్మాటికీ ఇష్టం."

ఆపిల్ల సందేహంతో కనుబొమలు పైకెత్తి చూచింది. అతను మౌనంగా ఆవిడ పాదాలవంక దృష్టి సారించాడు. అతని ధృక్కులలో చిత్తశుద్ధి ద్యోతక మవుతోంది. ఆ అమ్మాయి తన ప్రక్కనే ఉన్న ఆసనంమీద అతన్ని కూచోమని కోరింది.

"మీతో ఒకవిషయం చెప్పాలి. ఇలాకూచోండి." అన్నది.

అతను మౌనంగా కూచున్నాడు.

"ఏం చెప్పదామనుకుంటున్నానో మీకు తెలుసునా ?"

"ఈ ఊలుటోపీ తీసుకో."

"నేను చెప్పబోయేది ఏమిటో గ్రహించరా ?"

"ఏమిటది ?"

"నాకు నిజంగా ఈ కాలనీకి రావాలనే ఉండేది. కాని ఇక్కడ...నాకు తెలిసిన వ్యక్తి ఒకడున్నాడు. అతను నామీద లేని పోనివన్నీ చెపుతాడు."

జకరోవ్ ఆవిడ తలమీద చెయ్యివేసి ముంగురులను నిమిరాడు.

"అందుకా భయపడ్డావు! మరేం దిగులుపడకు. వాడిష్టమొచ్చినట్లు చెప్పుకోనియ్యి" అన్నాడు.

“వద్దువద్దు” అంటూ ఆవిడ దీనంగా అతనివంక చూచింది. అతను నవ్వి తల ఊపాడు.

“వాడెవరితోనూ ఏమీ చెప్పడు.” అంటూ భరోసా ఇచ్చాడతను.

బిగోనక్ ఆ గదిలోకివచ్చి ఎదురుగుండా నిలుచోవడంతో వారి సంభాషణ ఆగిపోయింది.

“అలెగ్జెస్తెపానొవిచ్! ఈ కొత్తఅమ్మాయిని రోడ్నేవ్ తన అజమాయిషీలోకి తీసుకోవచ్చునా? మిమ్మల్ని అడిగిరమ్మన్నారు” అన్నాడు బిగోనక్.

“వద్దు. ఆ విషయం క్లావా చూసుకుంటుంది...నీవు వెళ్లి క్లావానిలా పంపించు” అన్నాడు జకరోవ్.

“అలాగే, కామ్రేడ్ డైరెక్టర్.” అంటూ బిగోనక్ ఒక్క గంతులో అవతలికి వెళ్లిపోయాడు.

వాండా ప్రక్కకు ఒరిగికూచుని తనలోతాను దుఃఖించసాగింది. జకరోవ్ ఆమెను ఓదార్చలేదు. గోడమీద ఉన్న పటాలను పరిశీలిస్తూ గదిలో పచార్లుచేశాడు. కాని వెంటనే వచ్చి మళ్ళీ ఆవిడప్రక్కన కూచున్నాడు. కన్నీళ్ళతో తడిసిన ఆవిడ చేతులను పట్టుకున్నాడు.

“దుఃఖం దేనికి ? అన్నట్లు ఏంవిటతనిపేరు ? కాలనీలో ఎవరో నీకు తెలిసినవాడున్నాడన్నావు ?” అని అడిగాడు.

“రైజికోవ్.”

“ఇవాళ వచ్చాడు - అతనేనా ?”

అంతలో మళ్ళీ బిగోనక్ గదిలోకి వచ్చాడు వాండావైపు దొంగచూపులు చూసాడు.

“క్లావా బయలుదేరింది. ఒక నిముషంలో ఇక్కడికు వస్తుంది” అని చెప్పాడు.

"సరే ఒలోశ్యా, నీవీ అమ్మాయిని చూస్తూ ఉండు. ఆవిడ కొంచెం దిగులుగా ఉంది. పేరేమిటో తెలుసునా? వాండాస్టాడ్నిట్స్కాయా."

"వాండాస్టాడ్నిట్స్కాయా! చాలా బాగుంది. గమత్తుగా ఉందే!"

"ఏమిటి గమ్మత్తుగా ఉంది?"

"మీకు తెలీదన్నమాట? వాన్యా ఈ పూట నగరానికి వెడుతున్నాడు. వాండాను ఎలాగైనా చూడాలట. నేనూ వెడదామనుకుంటున్నాను. ఆ పిల్ల ఈ పిల్లే నన్నమాట!"

"వాన్యా? ఏమిటేమిటి? వాన్యాగల్చెంకో ఇక్కడున్నాడా?" అని అడిగింది వాండా.

"ఆ, ఇక్కడే ఉన్నాడు. మీరు వచ్చారని వింటే ఎంతో సంతోషిస్తాడు. వెళ్ళి తీసుకరానా? వెళ్ళమంటారా కమాండర్?"

"తక్షణం వెళ్ళు. వెళ్లి ఆ రైజకోవ్‌నుకూడా పట్టుకరా."

"ఓహో! అలా అయితే ఇగోర్ చెర్నియావిన్‌కూడా ఇక్కడికిరావలసి ఉంటుందే..."

"ఇగోర్ చెర్నియావిన్‌ను నీ వెరుగుదువా వాండా?" అని అడిగాడు జకరోవ్.

వాండా వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"చెప్పలేను..." అన్నది.

"ఏమిటి చెప్పలేవు? వెర్రిదానా...బిగోనక్! వాళ్ళందర్నీ ఇక్కడికి పిలుచుకరా."

బిగోనక్ త్వరత్వరగా పరుగెత్తసాగాడు. ద్వారందగ్గర నిలుచున్న క్లావామీద పడబోయాడు. ఆమె లోపలికి వచ్చి "నన్ను రమ్మని కబురు పెట్టారా అలెగ్జీస్టెపానొవిచ్?" అని అడిగింది.

"అవును క్లావా. నేచెప్పేది జాగ్రత్తగా విను. ఈ పిల్లపేరు వాండా స్టాడ్నిట్స్కాయా. ఇప్పుడే వచ్చింది. మీ దళంలో చేర్చుకో.

స్నానం చేయించి బట్టలిచ్చి, డాక్టర్ చేత పరీక్ష చేయించు. అమ్మిల్ల ఏది అడిగితే అదివ్వు. మాటిమాటికీ ఏడుస్తూ ఉంటుంది జాగ్రత్త!" అని చెప్పాడు జకరోవ్.

క్లావా, వాండా భుజాలమీద చేతులు వేసింది: "ఎందుకమ్మా ఏడుస్తున్నావు? రా, నాతో రా!" అన్నది.

జకరోవ్ వంక చూడకుండానే త్వరత్వరగా అడుగులు వేస్తూ వాండా, క్లావా వెంట బయటికి వెళ్ళిపోయింది.

పదినిముషాలు గడిచాయి. ఇగోర్, వాన్యా, రైజికోవ్‌లు అక్కడికొచ్చి నిలుచున్నారు. టార్‌స్కీ, బిగోనక్‌లు తమ ఉద్యోగ హోదాలో హాజరయ్యారు. జకరోవ్ ఇలా అన్నాడు:

"ఇదివరకు- జరిగిందేదో జరిగిపోయింది. అదంతా మర్చిపోవాలి. ఇహమీదట మీరెవరూ ఆ పిల్లనుగురించి కాలనీలో కట్టుకథలు చెప్పకండి. తెలిసిందా? అలా ప్రవర్తిస్తామని వాగ్దానం చెయ్యండి."

వాన్యా ఇదివరకెన్నడూ ఎవర్నిగురించీ కట్టుకథలు చెప్పలేదు. అందులో ఆ పిల్లనుగురించి అసలు చెప్పలేదు. ఇప్పుడు జకరోవ్ ఇలా అడిగేసరికి అతని కేమీ అర్థం కాలేదు. అయినా ఇలా అన్నాడు.

"మీరు చెప్పినట్లు నడుచుకుంటాను."

ఇగోర్ గుండెలమీద చెయ్యి వేసుకున్నాడు: "నేనూ అంతే అలెగ్జి స్టెపానొవిచ్" అన్నాడు.

"నీ మాట ఏమిటి, రైజికోవ్ ?"

"మధ్యన ఆవిడకూ నాకూ సంబంధం ఏమిటి ?"

"సంబంధం ఉండనీ మాననీయి - అది వేరే విషయం. నీవు మాత్రం నోరుమూసుకుని ఉండాలి."

"దానికేముంది, అలాగే."

అందరూ రైజికోవ్ వంక చూశారు. అతను అసంతృప్తితో చేతులూపాడు.

గదిలోనుంచి ఎవరితోవన వాళ్ళు వెళ్ళిపోతున్నారు. ఇవతలి గదిలోకి వచ్చాక రైజికోవ్‌ను చూచి ఇగోర్ ఇలా అన్నాడు.

"ఇదిగో, రైజికోవ్! నా మాటవిను. జకరోవ్ చెప్పినట్లు నడుచుకో. లేదా అతనేంచేస్తాడో నే చెప్పలేనుకాని, నేనుమాత్రం ఊరుకోను. ఆ పిల్లలనుగురించి పల్లెత్తుమాట అన్నావా నీ మెడకు ఒక రాయికట్టి కోనేట్లో ముంచుతాను. తెలిసిందా! నేనిలా చేస్తా వన్నానని నీ నోటుబుక్కులో రాసుకో."

5

ఫౌండ్రీ పరిస్థితి

కాలనీ సభ్యులు ఎక్కడ కలుసుకున్నా ఒకటేమాట. ఎవరి నోటవిన్నా ఒకటే పలుకు. ఎక్కడ చూచినా ఒకటే చర్చ. పడక గదులలో, ఫలహార శాలల్లో, పార్కుల్లో, పాఠశాల ఆవరణలో ఇరువురు సభ్యులు తారసపడితే చాలు— ఏకాగ్రచిత్తంతో చర్చలు సాగిస్తున్నారు. ఉత్పత్తి ఎలా అధికతరం చెయ్యాలన్నదే సభ్యుల చర్చ. ఉత్పత్తి సక్రమంగా, తగినంత పుష్కలంగా కొనసాగడంలేదని కొందరు సభ్యులు తీవ్రంగా విమర్శిస్తూ వచ్చారు. తగిన నిర్మాణ పద్ధతులు అవలంభించక పోవడంవల్ల, పథకాలను రూపొందించకపోవడం వల్ల ఉత్పత్తి కొరవడిందని సభ్యులందరూ అంగీకరించారు. కమాండర్ల కౌన్సిల్లో, సాధారణ సమావేశాల్లో, రభస బయలుదేరింది. ఉత్పత్తి శాఖాధికారి సోలొమన్ డవిడవిచ్ బ్లమ్ దీంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. సభ్యులు రకరకాలుగా అతన్ని ప్రశ్నించసాగారు. ప్రశ్నలకు సమాధానం చెప్పలేక అతనికి ముచ్చెమటలు పోశాయి.

"కొమింటరన్ ఫ్యాక్టరీనుంచి వచ్చిన రస్నర్లు పనీపాటా లేకుండా కూచుంటున్నారేం?"

"ఇనప పనిముట్లు చాలినన్ని లేవేం?"

"నూనెగొట్టం నూనెను పైకి ఎందుకు చిమ్మనివ్వాలి?"

"పొగగొట్టంలోనుంచి పొగపోకుండా అది గాలిమిని ఆవరిస్తే ఎలాగ?"

"కర్మాగారంలో ప్రతిదీ చిందరవందరగానే ఉంది. అంతా అరాచకం. ఎక్కడచూచినా మురికి. పెరిక్రోవ్ ఉన్నాడన్నమాటే కాని, ఎప్పుడూ అలా కూచునేఉంటాడు. అజమాయిషీ చెయ్యడం అతనికి బొత్తిగా చేతకాదు. దీని కేమంటారు?."

"సడొవానిచ్ పనిచేస్తున్న యంత్రానికి ఇంకా పళ్ళచక్రాలు రానేలేదు. పార్షినేవ్ తన పనిముట్లు పెట్టుకునేందుకు ఇమ్మ్ర లేక ఇంకా బాధపడుతూనే ఉన్నాడు. పనిముట్లు లేక, పనిచేసేవాళ్ళను సరిగ్గా అదమాయించలేక దేనికది అరాచకంచేస్తే ఉత్పత్తి కుంటు పడక ఏమవుతుంది?"

త్వరలోనే యంత్రాలను బాగుచేయిస్తాననీ, పనిముట్లు సరఫరా చేస్తాననీ, తగినశ్రద్ధ వహించగలననీ బ్లమ్ వాళ్ళకు వాగ్దానం చేశాడు.

కాలనీలో ఒకయంత్రం ఉంది. ఆ యంత్రం సవ్యమైన పద్ధతిలో లేనిమాట నిజమేకాని, అది పనిచేయుడంమటుకు మానలేదు. దాన్ని మరమ్మత్తు చేయించమని సభ్యులు కోరారు. కాని అందుకు వ్యవధికావాలి. ఇప్పుడప్పుడే సాధ్యపడేటట్లు లేదు. పనిచేస్తున్న దానిని ఒకమూలకు నెట్టడం బ్లమ్‌కు ఇష్టంలేదు. పనిచేస్తున్న ఒక దానిని మధ్యలో ఆపడం అతనిదృష్టిలో ఆత్మహత్యా సదృశమైనది. ఆ విషయమే అతను సభ్యులకెరుక పరిచాడు. పనిచేస్తున్నపుడు, యంత్రం సరైనస్థితిలో లేదు. కనుక దబదబా ఎక్కువశబ్దం చేయ వచ్చు. మాటిమాటికీ కూతకూయవచ్చు. అదిచేసే రణగొణ ధ్వనులు కాలనీ సభ్యులకు వెర్రెత్తించవచ్చు. అయినప్పటికీ అది పనిచేస్తున్న యంత్రమన్నమాట మాత్రం మరిచిపోకూడదు.

కర్మాగారంలో కావలసిన పరికరాలు సమృద్ధిగా లేకపోయినా ఉత్పత్తి ఏమంత తరిగిపోలేదు. యంత్రాలయం ఒకదాని తరువాత ఒకటిగా అంచీలమీద నూనె పాత్రలను సామానుగదికి అందిస్తూనే ఉంటుంది. కాలనీలో దుస్తులు తయారీకూడా బాగానే ఉంది. నీలి, ఆకుపచ్చ, గోధుమ; మొదలైన రకరకాల రంగుల్లో చొక్కాలు, నిక్కర్లు వేలకొలది తయారవుతూనే ఉన్నాయి. ఒక్కొక్క జతకు మూడుకోపెక్కులు లాభం వస్తోంది; అదేవిధంగా కుర్చీలుకూడా తయారవుతున్నాయి. దేశంలో ప్రదర్శనశాలలకు సరఫరా అవుతున్నాయి. వీటి ఉత్పత్తివల్ల కాలనీకి ధనం వస్తున్నా, కాలనీలో మాత్రం చిల్లికోపెక్కు కనిపించదు. కాలనీ డబ్బు బ్యాంకులో ఉంది. సమావేశాల్లో కొందరు పరాచకానికి ఇలా అంటూనే ఉంటారు:

"డబ్బంతా డవిడవిచ్ బ్యాంకులో దాచేస్తున్నాడు. ఎక్కువ పనిచేసినా ఖర్చుపెట్టుకునేందుకు డబ్బు మనచేతికి చిక్కనివ్వడు."

"నాలుగు కోపెక్కులు ఇంట్లో పడగానే ఖర్చుపెట్టడం ప్రతి వాడికీ చేతనవుతుంది. ఖర్చు ముఖ్యంకాదు. చక్కగా నిర్వహించే వాడు అనవసరంగా ఖర్చుపెట్టడు. రెండుచేతుల డబ్బు వెదజల్లడం మీకు బాగా తెలుసు. అందులో వరీక్షపెడితే ఫస్టుమార్కు మీదే. డబ్బు దుబారా చెయ్యకుండా మిగిల్చి సద్వినియోగం చెయ్యడమే తెలివి. అది అందరికీ అబ్బదు. ఇప్పుడు మీరు నేర్చుకోకపోతే మున్ముందు అసలు నేర్చుకోలేరు. బ్యాంకులో వేసినడబ్బుతో కొత్తగా కర్మాగారాలు నిర్మించాలని మనం తీర్మానించుకున్నాం. అలా మిగిల్చి చూపిస్తానని మీకూ స్టెపానొవిచ్‌కీ నేను వాగ్దానం చేశాను. అలాంటప్పుడు పాతవాటిని మరమ్మత్తులుచేసి డబ్బు వృథా చెయ్యడం దేనికి ? ముందు ముందు ఉత్పత్తి అధికమైతే మీరంతా హాయిగా ఉంటారు. సిల్కుసూట్లు, ఉలెన్ దుస్తులు వేసుకుంటారు."

బ్లమ్ ఇలా అనడంతోనే అందరికీ ఒకవంక నవ్వు, ఒకవంక కోపము వచ్చాయి. బ్లమ్‌కూడా నవ్వాడు. అందరూ జకరోవ్ వంక చూశారు. అతను వెనక్కు తిరిగి నవ్వుకున్నాడే కాని ఒక్కమాట

యినా మాట్లాడలేదు. బ్లమ్‌అంటే కాలనీ వాసులకు అంత విముఖత్వం లేదు. అయినా జకరోవ్ అతన్ని ఏమీ అనకపోవడం వాళ్ళకు చిత్రంగానే ఉంది. అతనంటే జకరోవ్‌కు ఎందుకంత నమ్మకమో వాళ్లకు అర్థం కాలేదు.

ఫౌండ్రీలో పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇది ఒక ఇటికెల షెడ్డు. పైన పెంకులన్నీ లేచిపోయాయి. అదిగో, అక్కడే ఫౌండ్రీ పీపాఒకటి పడిఉంది. అటూఇటూ అంచులుపోయి తుప్పుపట్టి ఉంది. ఇదిగో, ఇక్కడున్న రాగితీగె చుట్టలుకూడా దిక్కూ మొక్కూ కనుక్కునేవాళ్లులేక పడిపోయి ఉన్నాయి. న్యూసెటాంకు కూడా తుప్పు పట్టిపోతున్నది. అక్కడక్కడ చిల్లులు పడ్డాయికూడా. అయినా సరే వీటి అతీగతీ ఎవరూ పట్టించుకోవడం లేదు. వీటికి ఫోర్‌మన్ బంకోవిస్కీ. ఇదివరకు చేతిపనులు చేసుకుని జీవించేవాడు. వీటి మర్మమంతా తనకే తెలుసునన్నట్లుగా అభినయిస్తాడు.

ఇప్పుడు ఫౌండ్రీలో పని చురుకుగా సాగుతోంది. లోహాలు కరిగించి పోతపోసేచోట పనివాళ్ళు చకచకా పనులు చేసుకపోతున్నారు. వాళ్ళు పని చేస్తున్నప్పుడు ప్రత్యేకంగా వేసుకునే దుస్తులు చిరిగిపోయి ఉన్నాయి, అవి ఈనాటివి కావు. ఇదివరకటి పనివాళ్ళు వేసుకుని వదలగా ఇప్పటి పనివాళ్ళకు సంక్రమించినవి. కుర్రవాళ్ళవి అసలే సన్నని కాళ్ళు. వాళ్ళు వేసుకునే పంట్లాములు నంచుల్లా వ్రేలాడుతున్నాయి. ఫౌండ్రీలో క్రింద, పోతపోసే దిమ్మలు వరసగా అమర్చారు. పోతపోయడంలో నేర్పరులైన నెస్టెరెంకో, సినిట్సియన్, జిరియాన్‌స్కీ ప్రభృతులు చుట్టూ నిలుచున్నారు. ఎదురుగా గోడలమీద పోతపోసే మిషన్లు ఉన్నాయి. అందరిలోకీ కృకోచ్ బహునేర్పరి. అందరూ పోతపనిలో నిమగ్నులై ఉన్నారు.

ఫౌండ్రీఅంతా పొగతో నిండిపోయింది. ఎటుచూచినా పొగ. పొగ పోయేటందుకు షెడ్డు పైకప్పుకుగల రంధ్రాలు తప్ప వేరే మార్గంలేదు. ప్రతిరోజూ ఇదేబాధ. అందువల్ల నిత్యం ఫోర్‌మన్

బంకొవిస్కీని కాలనీ సభ్యులు పొగపోయేమార్గం చూడమని అడుగు తూనే ఉంటారు.

"ఇక్కడ పని చెయ్యడం చాలాకష్టం కామ్రేడ్ బంకొవిస్కీ".

"ఏం? ఏమిటి సంగతి?"

"చూడు, ఈపొగ చూడు! కళ్ళు పోతున్నాయి. ఊపిరి తిత్తులు చెడిపోతాయి. ఏదో ఏర్పాటు చెయ్యాలి. లేకపోతే ఇది విషం. ప్రమాదం"

"పొగలో విషంలేదు ఏమీలేదు. ఏ ప్రమాదమూ రాదు. పుట్టినప్పటినుంచీ నే నిక్కడే పని చేస్తున్నాను."

పెద్దు పైకప్పులోనుంచి, కిటికీల్లోనుంచి, తలుపుల సందుల్లో నుంచి పొగ గుప్‌గుప్‌న పైకివచ్చి కాలనీఅంతా కమ్ముకుంటోంది. భవనాలమధ్య, భవనాలమీద పొగ చిన్నచిన్నమబ్బుల్లా ఆవరించింది. పొగ ఇలా కమ్ముకరావడం డాక్టర్ నికొలాయ్ వెర్షినేవ్ చూచి గాభరాపడ్డాడు. తొందర తొందరగా ఒక గదినుంచి మరొక గదికి పరుగులు పెట్టాడు. చేతిలో 'విజ్ఞానసర్వస్వం' పట్టుకున్నాడు. మధ్యమధ్య పేజీలు తిరగవేస్తున్నాడు. ఆఫీసుల్లో టేబిళ్ళముందర నిలుచుని ఈ పొగ ఎంత అనర్థదాయకమో ఒల్లగుద్ది చెపుతున్నాడు:

"ప్రొక్యూరేటర్‌ను కలుసుకుంటాను. ఈపొగ ఎంత ప్రమాదమో మీకు తెలుసా? దీనివల్ల ఖాండ్రీ జ్వరం వస్తుంది. కావాలంటే ఈ పుస్తకం చూడండి, మీకే తెలుస్తుంది."

డాక్టర్ వెర్షినేవ్‌ను జకరోవ్ చాలాకాలం నుంచీ ఎరుగును.

"ఎందుకలా గాభరాపడతావు డాక్టర్? ప్రొక్యూరేటర్‌తో చెపితేమాత్రం లాభమేమిటి? పొగపోయేమార్గం చూడడం అతని పనికాదు. అంతగా కావాలంటే ఖాండ్రీ మూసివేస్తాడు. అంతకంటే అత నింకేంచెయ్యగలడు?" అన్నాడు జకరోవ్.

"మా సెయ్యనీ."

"మా నేస్తీ ఉత్పత్తి ఎలా సాగుతుంది? ఇంతకూ మీ ఆఫీసులో ఉండే నీలిదీపం నాకు ఎంతో బాధ కలిగిస్తోంది. దాని కాంతికి నా కళ్లుపోతున్నాయి, ఆరు నెలలనుంచీ అవస్థపడుతున్నాను. నీలిదీపాలు, అబ్బబ్బ! అవి లేకుండా నీవు పని చేయలేవూ?"

"నాకే అన్న మాటేమిటి? ఆస్పత్రిలో ప్రతి శాఖకూ ఈ నీలిదీపాలు ఆవసరం."

"అయితే దానిఅర్థం, అవి లేకపోతే మీ పని సాగదనేకదూ!"

"బాగుంది నీ కుతర్కం. నీలిదీపాలకూ పొగకూ సంబంధ మేమిటి? పొగపీల్చి ఆ విషంతో పిల్లలను చనిపొమ్మంటావా?"

"నేననేది అదికాదు. పొగపోయే మార్గం ఏర్పరుచుకోవడం అవసరమే. గాలి, వెలుతురు సోకేటట్లుగా చేసుకోవడం ఆవశ్యకమే, కాదని అనడంలేదు. నేనూ అదే చెపుతున్నాను. నీవూ అదే అంటున్నావు. ఏంచెయ్యాలో చర్చించేటందుకు ఇవాళ కమిటీ సమావేశమవుతోంది."

అనుకున్నట్లుగానే సమావేశం జరిగింది. సమావేశంలో డాక్టర్ ప్రసంగించాడు. ప్రసంగిస్తున్నంతసేపూ చేతిలో ఉన్న "విజ్ఞాన సర్వస్వాన్ని" అటూ ఇటూ ఊపుతూనే ఉన్నాడు. వైద్య కళాశాలలో తాను అభ్యసించిన పారిభాషిక పదాలను తన ఉప న్యాసంలో గుప్పించాడు. అతని ఉపన్యాస సారాంశం ఇది:

"మీరెన్నైనా చెప్పండి - కాని, కర్మాగారం కుళ్ళుకంపు కొడుతోంది. అంతా అవసవ్యంగా ఉంది."

గ్రీన్‌హాక్ విచార పూర్వకంగా బ్లమ్‌వంక చూచాడు.

"దేశం పునర్నిర్మాణం అవుతోంటే ఇక్కడ ఈ అధ్వాన్నపు స్థితి ఏమిటి? ఉక్కిరిబిక్కిరి చేసే ఈ పొగబాధ ఎలా భరించ గలుగుతున్నారు?"

బ్లమ్ ఒకమూల కుర్చీలో కూచున్నాడు. ముందున్న బెంచి అతని దృఢకాయాన్ని మరుగుపరచలేకపోయింది. మెడ పైకెత్తి ఇలా అన్నాడు.

"నీవు మాట్లాడుతున్నది ఏ పొగనుగురించి?" ఇలా అని వినుక్కున్నాడు.

"ఏపొగేమిటి? ఆరోగ్యాన్ని తలక్రిందులు చేస్తుంది. అక్కడెందుకంత పొగ?" అన్నాడు పొకోజమైె. అతను కుర్రవాడు. కళ్ళల్లో ఎప్పుడూ గాంభీర్యం కనిపిస్తూ ఉంటుంది.

మోకాళ్ళమీద చేతులానించుకుని కూచున్న బ్లమ్ లేచి నిలుచున్నాడు. చెయ్యిచాపి సభ్యుల నుద్దేశించి ఇలా చెప్పాడు.

"ఇంతా చేసి అది ఒక 'వర్కుషాపు'. మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఏమూలేని క్రిమియా వెళ్ళండి. లేదా యాల్టాలో ఉండండి. అంతేకాని ఇదిమాత్రం ఫ్యాక్టరీ. ఆ విషయం మరచి పోకండి."

సమావేశంలో గలభా చెలరేగింది.

"ఏమిటేమిటి? సరే. అయితే సరే. దీనికేం చెయ్యాలో మేమూ ఆలోచించుకుంటాం."

"నీమీద తగిన చర్యలు తీసుకోవలసిందగా కమాండర్ల కౌన్సిలును కోరుతాం."

ఈ మాటలకు బ్లమ్ క్రోధావేశుడైనాడు. ఒకసారి నిటారుగా నిలుచుని, ఒక అడుగు ముందుకు వేశాడు. ముఖమంతా ఎర్రగా చేసుకున్నాడు:

"ఏమిటి మీ మాటల కర్థం కామ్రేడ్స్? కమాండర్ల కౌన్సిలును నామీదికి ఉసికొలపాలనా మీ ఉద్దేశం? ఆ కౌన్సిలు నాదగ్గరున్న డబ్బును స్వాధీనపర్చుకుంటుందనా?, లేక వర్కుషాపులో గాలి, వెలుతురు వచ్చేటట్లు ఏదో నిర్మిస్తుందనా? ఏమిటి మీ

ఊహా ? ఈ అధ్వాన్నపు ఫ్యాక్టరీని నేను కట్టానా ? పోనీ దీని ప్లాను అయినా నేను గీశానా ?

"కాని నీ దగ్గర డబ్బున్నది."

"ఆ డబ్బు దీనికోసం కాదు. మరొకందుకు అది వినియోగించాలి."

"స్టేడియం ప్లాను తయారుచేసింది నీవు కాదూ ?"

"అవును నేనే అందులో ఉన్న దోషమేమిటి ? అందులోనే మీరు పనిచేస్తున్నారు. 'కొమోసొమోల్' సభ్యులయినంత మాత్రం చేత మీ ఇష్టంవచ్చినట్లు మీరు చెయ్యవచ్చు ననుకుంటున్నారేమో ! పనీపాటాలేక హాయిగా తిరగడం అలవాటయింది మీకు."

"పారిశ్రామికవంతం చేయకుండా మనపని మనం సాగించుకోలేం."

"నాకా విషయం తెలీదంటారా ? పరిశ్రమలంటే ఏమిటో నాకు బాగా తెలుసును. మీరు నాకు బోధించేది ఏదో ఉన్నదని మీ ఉద్దేశం. పరిశ్రమలను నెలకొల్పేముందు వాటికి తగినంత ఆర్థిక స్తోమత కావాలి. అందుకు మీరు ధనం ఆర్జించాలి. ఇక్కడ మీ పనల్లా కష్టపడి పనిచెయ్యడమే. మీరెవరూ పనిచెయ్యకుండా గారడీ వాడు మామిడిచెట్టు మొలిపించినట్లు, ఏ దేవతో వచ్చి ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పదు."

"అయితే ఇప్పటికీ ఆఇంటికప్పు కన్నాలు అలాగే ఉంచుతావన్నమాట ?"

"ఆ."

"సరే. మేమూ చూస్తాం."

బ్లమ్ కోపంతో; చివాలునలేచి ఫౌండ్రీకి వెళ్ళిపోయాడు. అక్కడకూడా ఇలాంటి రభసే ఎదురైంది. అతను ఫౌండ్రీలోకి వెళ్ళగానే పోతపనివాళ్ళు చుట్టూముూగారు. పెట్కా క్రావ్చెక్ తను వేసుకున్న పనిదుస్తులు చూపిస్తూ:

"ఇవేనా గుస్తులు? పూర్వం వీటిని నెస్ప్రింకో తొడుక్కునే వాడు. అవే ఇప్పుడు నేనూ తొడుక్కుంటున్నాను. అంతేకదూ? చూశారా? ఇక్కడొక చిరుగు, అక్కడొక చిరుగు" అన్నాడు.

బ్లమ్ బదులు చెప్పలేక చేతులూపుతున్నాడు.

"చేతులూపుతుంటే లాభమేమిటయ్యా? నీ చేతులు పొడుగేలే! చొక్కా బాగానేఉంది. చొక్కాచేతులు అంత పొడుగెందుకూ మడవమంటారా!" అన్నాడు మళ్ళీ పెట్కా.

"అబ్బో! నీవు చాలా గడుసువాడివి. బ్లమ్ టక్కరితనం బాగ నేర్చావు"

"నేనేం టక్కరిని కాను. ఇప్పుడు మీరు ఎన్నిపాత్రలు పోత పోశారో లెక్క చెప్పండి."

"నిన్నటికి నూట ఇరవైమూడు."

"ఒక్కొక్కదానికి ఒక్కొక్క కోపెక్కు - అంటే మొత్తం ఒక రూబులు, ఇరవై మూడు కోపెక్కులన్నమాట."

"అది సరియైన ధరేనా? ఒక కోపెక్కా? పోత పొయ్యాలి, తీగెలు కొయ్యాలి, ఆరబెట్టాలి. ఇంతాచేస్తే ఒక పాత్రకు ఒక కోపెక్కా?"

"బాగుంది. అది సరిపోదూ? ఇంతకన్నా ఎక్కువ ఎక్కణ్నుంచి తెమ్మంటారు? ఇంకానయం. కూచున్నందుకు ఒకకోపెక్కు ఇవ్వమన్నారు కాదు."

సంభాషణ ఇలా సాగుతోంటే ఒకమూలనుంచి నెస్ప్రింకో గొంతుక ఇలా వినిపించింది.

"ఇక్కడికి గాలి, వెలుతురువచ్చే ఏర్పాటు ఎప్పుడు చేస్తావయ్యా మహాప్రభో? చెప్పవయ్యా చక్రవర్తీ?"

"గాలి, వెలుతురు నీ ఒక్కడికే కావాలా? నాకక్కర్లేదనుకున్నావా? బాగానేవుంది నీప్రశ్న. ఆవిషయం ఒలెన్‌చెక్ చూసుకుంటాడు" అన్నాడు బ్లమ్.

"ఒలెన్ చెక్కా! నాకు తెలును అతను ఏం ఏర్పాటు చేస్తాడో."

"కొంచెం నిదానంగా ఆలోచించు. అతను రేపు ఈ ఏర్పాటు చేస్తాడు."

బ్లుమ్, ఒలెన్ చెక్‌ను వెంటబెట్టుకుని సావంతా తనిఖీచేశాడు. పైకప్పును పరిశీలించాడు. ఒలెన్ చెక్‌కు రాని విద్యంటూ లేదు. అంతో ఇంతో అన్నీ వచ్చును, కాని ఏదీ పూర్తిగా రాదు. ఇంటి పైకప్పు చూచి ఒలెన్ చెక్ ఇలా అన్నాడు:

"పైన వెలుతురు వచ్చేటట్లు ఏర్పాటు చెయ్యొచ్చు. కాని; నాకు పెంకులు తిరగవెయ్యడం రాదు."

"అది నాకూ రాదు, నీకూ రాదు. కాని మనంమాత్రం ఏదో ఏర్పాటు చెయ్యక తప్పను."

ఫౌండ్రీలో వాన్యాగల్చెంకో పనిచేస్తున్నాడు. అక్కడ ఉండే మూనెగొట్టాలు, టాంకులు, ఉక్కిరి బిక్కిరిచేసే పొగ; అన్నీ అతనికి సరదాగానే ఉన్నాయి. పొగతోను, బ్లుమ్‌తోను ఘర్షణ పడుతూనే ఉన్నాడు. అయినా అతనికి బ్లుమ్అంటే ఇష్టం. రైజికోవ్ కూడా అక్కడే పనిచేస్తున్నాడు. పైనుంచి ఇసక తీసుకరావడం అతనిపని. అతనక్కడ పనిచెయ్యడం వాన్యాకుమాత్రం ఇష్టంలేదు. వాడితో అంతా లేనిపోని అల్లరి.

6

కుట్టుపని

వాండా స్ట్రాడ్నిట్స్కాయాకు మనస్సు పరిపరివిధాల పోతోంది. దళంలో ఆవిడను చేర్పించారే కాని, మనస్సు అక్కడ నిలకడగా ఉండడం లేదు. దళంతో కాలం గడపడం కష్టమనిపిస్తోంది. దానికి కారణాలు లేకపోలేదు. కాలనీలో నూతన జీవితానికి అలవాటుపడలేదు ఆవిడ మనస్సు. అలవాటు పడడమే కాదు, కాలనీలో ఉన్న ప్రశాంతత, పరిశుభ్రత, నూతనస్నేహితుల ఉత్సాహపూరిత వదనాలు, సాయంకాలపు సంభాషణలు; వీటిని ఆమె దర్శించలేకపోతోంది. క్లావాకపిరినా ఇస్తున్న సూచనలను వింటుంది, తల ఊపుతుంది. మౌనంగా ధ్యానిస్తుంది. అంతే. తరువాత త్వరత్వరగా గదిలోకి పోయి కిటికీ చెంత నిలుచుని, బయటి ఆకాశాన్ని, ప్రకృతిదృశ్యాన్ని దూరంగా కనిపించే చెట్లను, రహదార్లను, కొండలను నిశ్శబ్దంగా పరికిస్తూ కాలం గడుపుతుంది.

భోజనశాలలో ఉన్నప్పుడుకూడా అంతే ఆవిడ మానసిక పరిస్థితి. కుర్చీమీద పడిపోతుందేమో అన్నట్లు కూచుంటుంది. వెళ్ళిపోవడానికి తడబడుతుంది. తల ఎత్తకుండానే, కళ్ళతో చూడకుండానే పళ్ళెంలోని పదార్థాలను నోట్లో వేసుకుంటుంది. కాలనీకి రాగానే ఆవిడకు కొత్తదుస్తులిచ్చారు. అవి స్కూలుకు వెడుతున్నప్పుడు వేసుకునే దుస్తులు. అవి ఎంతో అందంగా ఉన్నా, ఆవిడకు ఏ భావమూ కలిగించలేకపోయాయి. నీలిరంగు ఉన్ని చొక్కా, అందమైన ఉడుపులు ధరించి ఆ అమ్మాయి నిలుచుంటే దేవకన్యలా ఉంటుంది. అవి వయస్సును మరుగుపరచే దుస్తులు. ఆ దుస్తుల్లో ఆవిడ జవ్వనివలె కనిపిస్తుంది.

కాలనీలో ఆవిడకు అతి సులువైన పని అప్పగించారు. ఇది చిన్నపిల్లలకుమాత్రమే లభ్యమయ్యేవని. వాండా చిన్నపిల్ల కాదు కనుక మొదట బాధ్యతాయుతమైనపనినే ఆవిడకు ఒప్పగించారు. కాని ఆమె ఆపని నిర్వర్తించలేకపోయింది. అందుకని దుస్తులు తయారుచేసే షాపులో పని స్వీకరించింది. బొత్తాములు పెట్టుకునేందుకు కాజాలు కుట్టడమే ఆమెపని. అక్కడ ఈపనిని అయిదారుగురు చిన్నపిల్లలు ఎంతో సరదాగా, చాకచక్యంతో నిర్వర్తిస్తున్నారు. కాని వాండా చాలా నెమ్మదిగా, బద్ధకంగా, అడ్డదిడ్డంగా కాజాలు కుడుతోంది. ఆమె కుట్టుపనిని గమనించి ఆడపిల్లలు ఒకరి నొకరు చూసుకున్నారు. కాజాలు కుట్టడమెలాగో ఆవిడకు చెప్పారు. ఆవిడ వాళ్లు చెవుతున్నదంతా మారుపలకకుండా విన్నది. కాని మళ్ళీ యథాప్రకారమే పని సాగిస్తూవచ్చింది.

ఒకనాడు వాండా పనిలోకి ఆలస్యంగా వెళ్ళింది. అప్పటికే పిల్లలంతా ఎవరి పనుల్లో వారు నిమగ్నులై ఉన్నారు. కుట్టుమిషన్లు టకటకమని ధ్వనులు చేస్తున్నాయి.

తనచేతిలోని పనిమానకుండా క్లావా, వాండాను ఇలాఅడిగింది:

"ఇంత ఆలస్యంగా వచ్చావేం వాండా?"

వాండా సమాధానం చెప్పలేదు. "నిన్న అందరికంటే ముందే వెళ్ళిపోయావు ఎందుకని?" అని మళ్ళీ అడిగింది క్లావా.

ఉన్నట్లుండి వాండా నోట మాటలు ధారవాహికంగా వెలువడసాగాయి.

"సరే, అయితే కారణం చెవుతాను. నాకు పనిచెయ్యడం ఇష్టంలేదు. నేను పని చెయ్యను."

"పనిచెయ్యడం ఇష్టంలేదూ? పనిచెయ్యకుండా ఎలా బ్రతుకుదామని!"

"బ్రతుకుతానో, మానతానో- ఇప్పుడదంతా ఎందుకు? ఈ కాజాలుకుట్టే పని చెయ్యకుండానే బ్రతగ్గలను."

"ఏమిటది వాండా? ఆమాటలనడానికి నీకు నోరెలావచ్చింది? సిగ్గువెయ్యడం లేదూ? నేర్చుకోవాలి- ఎన్నో నేర్చుకోవాలి. మేమంతా మొదట బొత్తాములకు కాజాలుకుట్టిన వాళ్ళమే."

చేస్తున్నపని విడిచిపెట్టింది వాండా. ఆవిడ కళం పద్ధమైంది. కళ్ళు ఇంతింతలు చేసుకుని గదంతా కలయజూచింది.

"మీదారి వేరు, నాదారి వేరు మొదట కాజాలుకుట్టడంతో ప్రారంభించారట పని! నేనూ దీంతోనే ప్రారంభించాను. ఇహ దీంతోనే ఆగిపోతాను." అంటూ ఆమె తలుపు తెరుచుకుని అవతలికి వెళ్ళిపోయింది.

సాయంకాలం భోజనానికి వెళ్ళలేదు. పరుపుమీద బోర్లాపడుకుంది. ఆడపిల్లలు గదిలోకివచ్చి దూరంనుంచీ ఆవిడనుచూశారు. భయపడ్డారు. క్లావా కోపగించుకుంది. తనలో తాను ఏదో గొణుక్కుంది.

ఆ మరునాడు వాండా ప్రొద్దున్నే లేచింది. లేచి ఒక్కతే విశ్రాంతిమందిరంలో తారట్లాడుతోంది. జకరోవ్ అక్కడికివచ్చాడు. అతిన్ని చూడగానే ఆవిడ చెక్కిళ్ళు ఎర్రబారాయి. దుస్తులు సర్దుకుంది. విషాదంగానవ్వి బల్లముందు కూచుంది.

"ఏమిటి అలా ఉన్నావు వాండా?'' అని అడిగాడు జకరోవ్.

కాని ఆమె నోరు కదపలేదు. కిటికీలోనుంచి పరధ్యానంగా చూస్తూ కూచుంది. అతనూ కొంతసేపు మౌనంగా ఉండిపోయాడు. తరువాత ఇలా అడిగాడు:

"పోనీ వడ్రంగి షాపులో పనిచేస్తావా? కర్రపని—చాలా బాగుంటుంది. నగిషీలు చెక్కుతూఉంటే సరదావేస్తుంది."

ఆమె గబుక్కున అతనివంక తిరిగింది. "వడ్రంగిపనా ?" అని అడిగింది.

"అవును—చాలా బాగుంటుంది అక్కడ నీవు పనిచేస్తున్నట్లు ఒక్కసారి ఊహించుకో."

"నన్ను చూసి అంతా నవ్వుతారు."

"నవ్వరు—మెచ్చుకుంటారు. మన కాలనీలో నీవే మొదటి పిల్లవు అవుతావు. తక్కిన ఆడపిల్లలెవరికీ వడ్రంగం రాదు. ఇది నీ కెంత గర్వకారణం! కేవలం కుట్టుపని తప్ప ఇంకేమీ చెయ్యలేమని ఆడపిల్లలు అనుకుంటూ ఉంటారు. అది తప్పు."

వాండా కనుబొమలు పైకెత్తింది. ఆవిడ కళ్ళల్లో ఉత్సాహం ఉబికింది.

"చేస్తాను. అక్కడే చేస్తాను. వడ్రంగిషాపులో చేరుతాను. తిన్నగా నేనక్కడికి వెళ్ళిపోవచ్చునా?"

"ఇప్పుడే వెడదాం."

"అయితే పదండి."

జకరోవ్ లేచి నిలుచున్నాడు. తిరిగి చూడకుండా ఇవతలి కొచ్చాడు. ఆ అమ్మాయి అతనితో లేచి అతని చెయ్యి పుచ్చుకుని వెంట నడిచింది.

"ఇది మీరు ముందే అనుకుని ఇక్కడికి వచ్చారా?" అని అతన్ని అడిగింది వాండా.

"అవును." అన్నాడు జకరోవ్.

"ప్రయోజనం లేందే మీరు ఏ పనీ చెయ్యరు. అవునా?"

"అవును, ఏదైనా అంతే." అంటూ అతను నవ్వాడు. తరువాత ఇలా అన్నాడు: "ఈపనిలేని ఇంకొకటి నే నేర్పాటు చేశాను కాని అదేమిటో నీకు చెప్పను."

"చెప్పండి. అది నాగురించేనా?"

"అవును. నీగురించే."

"అయితే చెప్పక తప్పదు అలెక్సీ!"

అతను ఆవిడకు దగ్గరగా వచ్చి చెవిలో రహస్యంగా ఏదో చెప్పాడు. "తరువాత చెపుతానులే." అన్నాడు బిగ్గరగా.

"అయితే సరే, అయితేసరే." అన్నదావిడ.

7

ఒక్సానా

పని అయినతరువాత ఒకరోజున ఇగోర్ కాలనీ బయటికి షికారు వెళ్ళాడు. చేత్తో పుస్తకంపట్టుకుని, పార్కు దాటి ఒక ఆనకట్టదగ్గరికి చేరాడు. ఆనకట్టకు ఎడమవైపు ఒక జలాశయం ఉంది. కుడివైపక్క ఒక నదీ ప్రవాహం లోయల మధ్యనుంచీ ప్రవహిస్తోంది. ఎదురుగా ఎత్తయిన ఒక మిట్టమీద ఒక చిన్న ఇల్లు కనిపిస్తోంది. ఇంటిముందు రకరకాల పూలతీగెలు, పూల పందిళ్ళు, వింత వింత పూలతో శోభిల్లుతున్నాయి. కొన్ని పూలతీగెలు ఇంటిమీద కెగ ప్రాకుతున్నాయి. బాట కిరుప్రక్కలా పోప్లార్ చెట్లు వరుసగా కనిపిస్తున్నాయి. ఆ బాటకు అవతల ఒకతోట ఉన్నది. మరొక ప్రక్క చెట్లు లేవు. కొంతజాగాలో చుట్టూ కంచె వేసి ఉంచారు. బహుశా అక్కడ కూరగాయలు పండిస్తారేమో. అది రైతులు మసలే ప్రదేశంలా అగుపించడంలేదు.

ఇగోర్ కంచెలలోనుంచీ అవతలికి చూశాడు. తోటలో ఎవరూ లేరు. ఒక ఎర్రటి కుక్కమాత్రం ఒక బెంచీముందు పడుకుని ఉంది. ఇగోర్‌ను చూడగానే కుక్క లేచి మొరుగుతూ ఇంటివైపుకు పరుగెత్తింది. ఇగోర్ తోటచుట్టూ ఒకసారి చూసాడు. పూలచెట్లకు అప్పుడే ఎవరో నీళ్ళుపోసి వెళ్ళిపోయినట్లుంది. "వీళ్ళు నీళ్లు ఎక్కడనుంచి తెచ్చుకుంటున్నారు?" అనుకున్నాడు ఇగోర్ తనలోతాను. అతనికి కొంచెందూరంలో చిన్న గేటు కనిపించింది. దానిచుట్టూ తీగె ఉంది. అవతల సన్నని బాట ఒకటి కనిపిస్తోంది. ఆబాటవెంబడే వెడితే దిగువన ప్రవాహంచెంతకు చేరుకుంటాం.

బాటకొనన చిన్న చిన్న దుబ్బులమధ్య ఎవరో నడయాడుతున్నట్లు తోస్తోంది. ఒక పిల్ల నెమ్మదిగా గట్టుమీదకి వచ్చింది. బరువుగా అడుగులు వేస్తోంది. భుజంమీద కావడిఉంది. రెండు బాల్చీలనిండా నీళ్ళు నింపుకుని కావడి మోయలేక మోస్తోంది. అటూ ఇటూ ఊగుతూన్న బాల్చీలలో నీళ్ళు తొణికిపోకుండా జాగర్తగా భుజం సర్దుకుంటోంది. పచ్చటిరంగు బాల్చీలవి.

ఆయాసపడుతూ నీళ్ళు తొణకకుండా కావడిమోస్తున్న ఒక్సానాను ఇగోర్ గుర్తుపట్టి త్వరత్వరగా ఆవిడచెంతకు నడిచి వెళ్ళాడు. కావడి తను ఎత్తుకోవడానికి ప్రయత్నించాడు. ఒక్సానా భయపడుతూ అతనివంక చూసింది. కెవ్వున కేకపెట్టింది.

"ఆ కావడిని నేనెత్తుకుంటాను." అన్నాడు ఇగోర్.

"అక్కర్లేదు! కావడిమాత్రం ముట్టుకోకండి. తూగిపోతుంది" అన్నది ఒక్సానా.

అతనికి ఎంతశక్తిఉన్నదో ఆక్షణంలోకాని తెలిసిందికాదు. తనశక్తికి తానే ఆశ్చర్యపోయాడు. గభాలున ఒకచేత్తో కావడి కొమ్ము పట్టుకొని రెండోచెయ్యి అటుచాచి కావడి భుజానికెత్తుకున్నాడు. ఆవిడ ప్రక్కకు తప్పుకుంది. బాల్చీలుగిర్రున తిరిగాయి. ఆవిడ కోపంగా "మిమ్మల్ని ఎవరు ఎత్తుకోమన్నారు? ఇలా నామీద ఎందుకు పడబోతున్నారు?" అని గద్దించింది.

"ఎవరికి హక్కు... హక్కు..."

ఇగోర్‌కు నోటివెంట మాటరాలేదు. వాక్యం పూర్తి చేయలేకపోయాడు. కావడి సరిగ్గా ఎత్తుకోకపోవడం వల్ల ఒకకొమ్ము పైకిలేచింది. రెండవకొమ్ము క్రిందకు వ్రాలింది. ఒక్సానా పగలబడి నవ్వింది.

"కావడి ఎత్తుకోవడం మీకు చాతకాదు. అలవాటుపడితే కాని ఎత్తుకోవడం కష్టం. మీపని తికమకలయింది. ఇహ కావడి దించండి. ఎలా ఎత్తుకోవాలో నేను చెబుతాను" అన్నది.

కావడిని సమతూకంలో ఎత్తుకోవాలని ఇప్పుడు ఇగోర్‌కు తెలిసింది. ఒక్సానా స్నేహపూర్వకంగా మాట్లాడేసరికి అతనికెంతో హాయి అనిపించింది !

"ఒక్సానా! మంచిమాట చెప్పావు. నిజమే- నీవు చెప్పిందీ నిజమే. అలాగే క్రిందపెడతాను. దీని అమ్మకడుపు బంగారంగాను ఇది ఎంత బరువుంది! దీన్ని ఏమంటారు?"

"కావడి అంటారు."

"కావడి అంటారా ? బాగుంది !"

ఇగోర్ కావడిమట్లు విడిదీసి రెండు బాల్చీలనూ రెండు చేతులతో పట్టుకుని నడవడం మొదలుపెట్టాడు. అవి చాలా బరువుగా ఉన్నాయి. ముందుకు తూలి పడబోయాడు. కాని నిలవరించుకున్నాడు. ఒక్సానా అతని వెంట నడుస్తోంది.

"సహాయం చేస్తానంటూ గొప్ప బలశాలురు దిగివచ్చారే ! చాలు చాలు ! ఇహ దించండి. ఎలా ఎత్తుకోవాలో నేను చెవుతాను." అన్నది.

ఇగోర్ బాల్చీలు క్రిందపెట్టి ఆవిడవంక చూశాడు. ఆవిడ కనుబొమలు తిప్పుతూ, మెరిసే కళ్ళతో అతన్ని చూసి నవ్వింది.

"చూడు, ఎంత బరువుగా వున్నాయో ! వీటిని రోజూ మోస్తూనే ఉన్నావా ? నీచేత శక్తికి మించిన పనులే చేయిస్తున్నారే! పరపీడన—కేవలం పరపీడన" అన్నాడు ఇగోర్.

"ఇంతకన్నా నేనింకేం చెయ్యగలనని మీ ఊహ ? నీళ్ళు లేకపోతే ఇబ్బంది. మొక్కలు ఎండిపోతాయి."

అలాంటప్పుడు తోటకు కుళాయిగొట్టాలతో నీరు పెట్టడం మంచిది. ఈ కావళ్ళేమిటి ?"

"మా ఊళ్ళో అందరూ కావడే మోస్తారు, మా ఊరిక్కడికి దగ్గరే. అక్కడ నీళ్ళు తియ్యగా ఉంటాయి. చెలమనీరు."

ఒక్సానా తోటలోకి వెళ్ళింది. బాల్చీ చేత్తో పుచ్చుకుని మొక్కలకు నీళ్ళు పొయ్యడం మొదలుపెట్టింది. తోటలో ఒకచోట

బంగాళాదుంపల మొక్కలకు నీళ్ళు పెడుతుంది. ఆవిడ వంగి నీళ్లు పోస్తుంటే ఆవిడ ముంగురులను, చెక్కిళ్ళను తదేకంగా చూస్తూ తన్మయుడవుతున్నాడు ఇగోర్. ఆవిడ క్రీగంట అతన్ని చూచింది.

"వస్తానుండు, నేనూవచ్చి నీళ్ళు పోస్తాను" అన్నాడు ఇగోర్.

"అయితే అదిగో! అక్కడొక తబుకున్నది. దాంతో మొక్కలకు నీళ్లుపొయ్యి" అన్నది ఒక్సానా.

"అలాగే."

"ఎలా పొయ్యాలో తెలుసునా?"

"ఆ, తెలుసును. నీవు రోజూ ఎందుకింత శ్రమపడడం? మీ ఖామందు నిన్ను పీడుస్తున్నాడు. నీచేత పని చేయించుకుని లబ్ధి పొందుతున్నాడు. పనినీది, లాభం వాడిది."

"పనిచెయ్యని వాళ్ళెవ్వరూ లేరు."

"మీ ఖామందు పనిచేస్తాడా?"

"ఆఁ"

"అయినాసరే, వాడు పీడకుడే— ఖామందంటే అదే అర్థం. తోటలో పనిచేసేటందుకు మనుష్యులను ఇలా వినియోగించుకోవచ్చునా? చెప్పు?"

"నేను తోటలో పనిచేసేదాన్ని కాను. అతను నాకు ఖామందూ కాడు. అతను చాలా మంచివాడు. అలాంటివాణ్ణి మీ రెక్కడా చూచిఉండరు. మీకు తెలీనప్పుడు అతన్నిగురించి అలా మాట్లాడకూడదు" అంటూ ఒక్సానా, అతనివంక బాధతో చూచింది.

మొక్కలకు నీళ్ళుపోస్తూ, ఇగోర్ వైపు తిరిగి ఇలా అడిగింది:

"ప్రతివాళ్ళకూ బంగాళాదుంపలంటే ఇష్టం. మరిమీకూ?"

ఈ ప్రశ్నకు ఇగోర్ ఎంచేతనో జవాబు చెప్పలేకపోయాడు. ఈ ప్రశ్నకు తోడు వెనకనుంచి మరోప్రశ్న వినిపించింది. మిషాగోంటార్ తోటలోకి వస్తూనే:

"నీఅంతట నీవు పండించుకుని, ఆపంట అనుభవిస్తే అది చాలా బాగుంటుంది. అలా బంగాళాదుంపలు పండించుకుని నీ వెప్పుడైనా తిన్నావా?...మీ కబుర్లకు నేను అడ్డు రాలేదుగదా?" అని అడిగాడు.

సైనిక దుస్తుల్లోఉన్న గోంటార్ వంక ఇగోర్ తిరిగిచూశాడు. అతని తెల్లని చొక్కా కాలరు ముఖంమీద పడుతోంది. గోంటార్ చూపులలో ఒకవిధమైన అసంతృప్తి, అనుమానం ద్యోతకమవుతు న్నాయి. అతనడిగిన ప్రశ్నకు ఒక్సానా ఇలా జవాబిచ్చింది.

"అబ్బే, లేదు. మా కబుర్లకు నీవేమీ అడ్డురాలేదు."

గోంటార్ చూపులను పరిశీలించి ఇగోర్ "మిషాగోంటార్ ఎంతో ఈర్ష్య పడుతున్నాడు." అన్నాడు.

ఒక్సానా కోపంతో చలించింది. గోంటార్ కూడా కోపం తెచ్చుకున్నాడు.

"అట్టేవాగక నోరు మూసుకోవడం మంచిది ఇగోర్." అన్నాడు గోంటార్.

ఇంతలో కుటీరంలోనుంచి ఒక యువతి కంఠం వినిపించింది.

"ఒక్సానా! ఇలారా. త్వరగా, త్వరగా రా!"

ఒక్సానా త్వరత్వరగా వెళ్ళిపోయింది.

ఇరువురు యువకులూ మౌనంగా కొంతసేపు నిలుచుండి పోయారు. తరువాత గోంటార్ తన బూటుతో నేలమీద ఒకతన్ను తన్ని, కోపంగా ఇలా అన్నాడు:

"నీవిక్కడికి రాకుండాఉండడం మంచిది ఇగోర్."

"ఏం వస్తే?"

"నే చెప్పేది విను. ఇటురాకు. ఇక్కడ నీకేంపని?"

"పని ఉన్నదికనుకనే రావడం."

"ఇక్కడ నీకు పనిఉందా? ఏమిటాపని?"

"దుంపలకు నీళ్లుపోయడం."

"అదేం పనికిరాదు. నే చెపుతున్నాను, అంతే. నీవిక్కడికి రాకూడదు."

ఇగోర్ కంచెమీద కాలుపెట్టి "అదే ఆలోచిస్తున్నాను." అన్నాడు.

"ఏమిటాలోచిస్తున్నావు?"

"ఇక్కడికి రావడమా, మానడమా అని."

"అవతలికి వెళ్లి ఆలోచించు. ఇక్కడమాత్రం పనికిరాదు." అంటూ గోంటార్ హఠాత్తుగా గొంతు పెద్దదిచేసి అరిచాడు.

ఇగోర్ వెనక్కువెళ్ళి గోంటార్ వంక తీక్షణంగా చూచాడు:

"తెలుసు మహాప్రభో, నాకు తెలుసు" అన్నాడు.

"ఏమిటి తెలుసు?"

"నీవు ప్రేమలో మునుగుతున్నావని"

గోంటార్ కళ్ళు చింతనిప్పుల్లా చేసుకున్నాడు. తల వంచించాడు. జుట్టు ముందుకు పడుతుంటే వెనక్కు సవరించుకున్నాడు.

"ప్రేమలో మునిగేది నేనుకాదు, నీలాంటి బడుద్ధాయిలు" అన్నాడు.

ఇగోర్, భూతంలా ఒక్కపెట్టున నవ్వి గబగబా జలాశయం వైపు పరుగుతీశాడు.

8

ఎవరి అభిరుచులు వారివి

రైజికోవ్ మొదటిదళంలో చేరాడు. కాని అక్కడ అతని కేమీ సరిపడలేదు. సభ్యుల అభిమానాన్ని పొందలేకపోయాడు. అతని నడత, చీటికిమాటికి కోపం తెచ్చుకునే స్వభావం దళ సభ్యులకు సంతృప్తి నివ్వలేకపోయాయి. ఇగోర్, రైజికోవ్‌కు పూర్వపరిచయస్థుడని వాళ్ళందరికీ తెలుసును. అయినా రైజికోవ్ కాలనీకి రాగానే ఇగోర్ స్వాగతం ఇవ్వలేదు. అంతేకాదు. అతనిమీద విరుచుకపడ్డాడు. ఈ సంఘటనవల్ల రైజికోవ్ స్వభావం ఎలాంటిదో అతను కాలనీకి రాగానే సభ్యులందరికీ అవగతమైంది. ఆ మాటకొస్తే తన దళంలో రైజికోవ్ చేరడం ఒలెంకోకే ఇష్టంలేకపోయింది. ఇల్యూ్యా టార్‌స్కీతో వాదన పెట్టుకున్నాడు. ఇదివరకే తనదళంలో వెలిటన్, గస్లాన్ గొరొఖోవ్, నోజిల్‌లు ఉండనేఉన్నారు. ఇప్పుడు కొత్తగా రైజికోవ్ తనకెందుకు? ఇలా ఒలెంకో ఎంతవాదించినా టార్‌స్కీ మాత్రం వినలేదు.

“ఇలాంటివాళ్ళు. నీ ఒక్క దళంలోనే ఉన్నారనుకున్నావా? ఎనిమిదవదళం చూడు!..అందులో నలుగురే ఉన్నారు-గోంటార్, సెరిడిన్, మొనొవిస్కీ, ఇగోర్‌లు. పోనీ పదవదళం చూడు, అక్కడా. అంతే. సిసీచ్‌కా, స్మెఖోటిన్, బొరోడా, ఇల్యూ్యాషాపుడ్నేవ్‌లు. పదవదళం కమాండర్ నీకంటె చిన్నవాడాయె. అదలా ఉంచు. నోజిల్‌నుగురించి సహితం నీవు గొడవపెడుతున్నావు. అతను మంచివాడేనే! కాకపోతే ఏవేవో పెద్దపెద్ద కబుర్లాడతాడు. ఇందులో కొంపలేంమునిగాయి? అదీకాక మీ దళంలో ఉన్నవాళ్ళంతా ఉత్సాహ

వంతులే. సరేలే రైజికోవ్‌ను ఎనిమిదవ దళంలోకి మార్చి, అందులో ఉన్న ఇగోర్‌ను నీ దళంలో చేర్చుకో." అన్నాడు టార్‌స్కీ.

ఒలెంకో మౌనంగా ఈ విషయాన్ని గురించి ఆలోచించు కుంటూ అక్కడనుంచి వెళ్లిపోయాడు.

మొదటి దళంలోని సభ్యులను ఒక్కొక్కర్నే రైజికోవ్‌కు పరిచయంచేసి ఒలెంకో, అతన్ని ఇలా గట్టిగా మందలించాడు:

"నామాట విను రైజికోవ్! ఒక నిర్మాణకృషిలో పని చెయ్యడం నీకు తెలీదు. అందుకు అలవాటుపడు. నాసలహా విను. నీకు వేరే గత్యంతరంలేదు. నీవేమనుకున్నా సరే, నేనీసలహా చెప్పక తప్పదు."

రైజికోవ్ సమాధానమేమీ ఇవ్వలేదు. అప్పటికే అతనికి ఆవేశం వచ్చింది. నిజానికి సమిష్టికృషి అంటే అతనికి తెలీకపోలేదు.

ఆనాడే అతన్ని ఇంకొకదళంలో చేర్చుకున్నారు. అతనిప్పుడు వ్లాడిమిర్ కొలోస్ అనే కుర్రవాడి ఆజమాయిషీలో వున్నాడు. కొలోస్ తెలివైనవాడు. పదవఫారం చదువుతున్నాడు. ఆత్మ విశ్వాసంకల వ్యక్తి. 'కొమోసామోల్' నిర్మాణశాఖకు చెందిన వాడు. అతనికి తీపితీపి కబుర్లు చేతకావు. పనిలేకుండా కమ్మని కబుర్లు చెప్పేవాళ్ళంటే అతనికి మోజులేదు.

రైజికోవ్‌ను తనకు అప్పచెప్పగానే అతనితో కొలోస్ ఇలా అన్నాడు:

"నిన్ను నాకప్పగించారు. అంతమాత్రంచేత నీవేంచేసినా, ఎలా మాట్లాడినా సహిస్తానని అనుకోకు. మంచిచెడ్డలు ఎక్కడి కక్కడ విచక్షణచేసి మనుష్యులను చూచే స్వభావంనాది. నాకు తెలుసు. ఆవులిస్తే ప్రేగులు లెక్కపెట్టేవాణ్ని నేను!- నీకడుపులో ఏముందో నాకు తెలుసు. కాలనీజీవితం కత్తిమీద సాములాంటిది. చూడు, చూచినేర్చుకో. 'నేను చూడను, చూచినేర్చుకోను.' అన్నావూ! అంటే నీవు ఎందుకూ కొరగాకుండా పోతావు..."

"మరేం పరవాలేదు. నేర్చుకుంటాను."

"ఏం నేర్చుకుంటావో చూస్తానుకదా."

ఆ మరునాడు రస్లాన్‌తో రైజికోవ్ స్నేహం సంపాదించాడు. ఇరువురూ ప్రాణస్నేహితులయ్యారు. ముందు రస్లాన్ మాట్లాడాడు.

"నీవు ఫౌండ్రీలో పని చేస్తున్నావుకదూ?"

"అవును."

"ఇసక అందివ్వడమేకదూ నీపని?"

"అవును."

"నే ననుకున్నది నిజమేనే!"

"నీకు దుస్తులు అవీ ఇచ్చారుకదూ?"

"ఆ."

"అంతా నిబంధనల ప్రకారం జరుగుతుంది. బాగుంది. అయితే ఇక్కడ ఉండదలుచుకున్నావా ?!"

ఈ ప్రశ్నకు రైజికోవ్ బిడియ పడ్డాడు. నొచ్చుకున్నాడు. ముఖం ఒకప్రక్కకు తిప్పుకున్నాడు.

"నాకు మతి స్థిరం లేదనుకుంటున్నారా ?" అనిఅడిగాడు.

ఇదివిని రస్లాన్ బిగ్గరగా నవ్వాడు. నవ్వి తనతో అతన్ని షికారుకు రమ్మన్నాడు. ఇరువురూ బయలుదేరి అడవిలోకి వెళ్లారు.

ఆనాటినుంచీ రైజికోవ్ ప్రవర్తనలో హఠాత్తుగా ఒకమార్పు వచ్చింది. ఇప్పుడతను సంతోషంగా ఉంటున్నాడు. ఎవరు కనిపించినా అరమరలేకుండా, నిర్భయంగా మాట్లాడుతున్నాడు. పరాచకాలాడుతున్నాడు. ఒకనాడు పూలతోటలో ఇగోర్ రైజికోవ్‌లు తారసిల్లారు. ఇగోర్‌ను చూడగానే రైజికోవ్ ఇలా ప్రశ్నించాడు.

"ఇంకా నామీద కోపం పోలేదా ఇగోర్ ?",

ఇగోర్ అతన్నివంక జుగుప్సతో చూచాడు. కాని తన కమాండర్ రుడ్నేవ్ చెప్పినమాటలు గుర్తు తెచ్చుకొని ఇలా సమాధానం చెప్పాడు:

"నీవంటే నాకేం కోపంలేదు. నీవు వాన్యాకు చేసిన అవ చారాన్ని తలుచుకుంటేమాత్రం తగని అసహ్యం వేస్తుంది."

"ఆ విషయం ఇహ మరిచిపో ఇగోర్...అయినా అది నీకంత అసహ్యంగా అగుపిస్తోందా? అతనెలాగూ కాలనీలో చేరబోతు న్నాడు. నాదగ్గర చిల్లిగవ్వ లేదు. ఆ స్థితిలో బ్రతికేమార్గం కనిపిం చక ఆనాడు అతని సామాను కాజేసినమాట నిజమే. అందులో తప్పే ముంది చెప్పు?"

"సరే, దానిమాటకేంకాని - ఇంతకూ నీవు కాలనీలో ఉండ దలచుకున్నావా?"

"అదే నీతో ఆలోచిద్దా మనుకుంటున్నాను. ఉండనా, వెళ్ళనా?...మరి నీ మాటేమిటి?"

రైజికోవ్ మనస్సులో ఏమిటుందో కనుక్కోవడం కష్టం అంతుపట్టని మనస్సు అతనిది. తనకు ఎవరిమీద విశ్వాసమున్నదో ఆ స్నేహితుడి సలహాను చిత్తశుద్ధితో అడుగుతున్నట్లు ఒకవంక ద్యోతక మవుతోంది. మరొకవంక తాను ప్రపంచానుభవంకల వ్యక్తిననీ, దాని విలువ ఎంతో తెలుసుననే భావం అతనిలో గోచరిస్తోంది. ఇగోర్‌ను సలహా అడుగుతూనే అతను మధ్యమధ్య కులాసాగా చేతులాడి స్తూనేఉన్నాడు. కనుబొమలు ఎగరేస్తూ, ఈ దిక్కుమాలిన తోటల్లో కాలనీలో ఉంటానా అన్నట్లు, తోటవంక నిరసనగా చూస్తున్నాడు. అతనివాలకం చూచేసరికి ఇగోర్‌కుకూడా తన పాతజీవితం జ్ఞాపకం వచ్చింది. తనలోతాను నవ్వుకున్నాడు.

నేనేంచేస్తానో నా పథకాలు నాకు ఉండనేఉన్నాయి. కాని నీలాగామాత్రం దొంగతనాలు చెయ్యను" అన్నాడు.

."నీవామాట చెప్పక్కర్లేదు. ఎవరి అభిరుచులు వారివి."

ఇరువురూ నడిచి కాలనీభవనం ముందు వసారాలోకి వచ్చారు. భవనద్వారంచెంత వీనా ఇవనోవ్నా రైఫిల్ పట్టుకుని కాపలాకాస్తోంది. వారు దగ్గరికిరాగానే త్రోవ ఇచ్చింది. రైజికోవ్ తివాసీమీద నిలుచుని లీనా అన్నట్లే గమనించక సిగరెట్టుకాల్చడం

మొదలుపెట్టాడు. లీనా కోపంతో ఇలా గద్దించింది: "ఇక్కడ పొగ తాగకూడదు."

రైజికోవ్ మెల్లగా ఆవిడవంక తిరిగి ఆవిడ ముఖంమీద పొగ వదిలాడు.

"ఏమిటూ పని? వళ్ళు తెలీడంలేదూ? పొగ తాగరాదని చెప్పాలా?" అని ఆవిడ మళ్ళీ కసురుకుంది.

రైజికోవ్ విస్సాటంగా తివాసీమీద ఉమ్మేశాడు. దాంతో లీనాకు వళ్ళు మండిపోయింది.

"తుడు, తుడు." అని అరిచింది.

"ఏమిటి తుడిచేది?" అని మండిపడ్డాడు రైజికోవ్.

"ఏమిటూ? ఉమ్మి! తివాసీమీద ఎందుకు ఉమ్మేశావు"

రైజికోవ్ ఆవిడమీదికి వెళ్ళి తన రెండుచేతులతో ఆవిడ ముఖాన్ని కప్పివేశాడు.

"నోర్ముయ్" అన్నాడు.

లీనా వళ్ళుకిలించి అనుకోకుండానే రైఫిల్‌తో అతన్ని ఒక పోటు పొడిచింది.

"ఆ! ఇదా నీవు ఆడేఆట!" అని రైజికోవ్ అరిచాడు.

అప్పుడు ఇగోర్ అతన్ని భుజంపట్టుకు ఇవతలికి లాగాడు. అతన్ని గిరగిరతిప్పి వదిలిపెట్టాడు.

"తియ్యి, ఆ చేతులు తియ్యి" అని అరిచాడు ఇగోర్.

"నేనూరుకోను- చూడు, రైఫిల్‌తో ఎలా పొడిచిందో! దీని అంతు తేల్చుకుంటాను. రైఫిల్‌తో నన్ను పొడుస్తుందా?"

లీనా గొంతు పెద్దది చేసి "నీ పేరేమిటి?" అని అడిగింది: "చెప్పు, నీపేరేమిటో చెప్పు!"

ఇంతలో మేడ మెట్లమీదనుంచి క్లావా కపీదినా వస్తున్న చప్పుడు వినిపించింది. లీనా రైఫిల్ సర్దుకుంది. రైజికోవ్ ఇగోర్‌ను చేత్తోగోకి "పద, పోదాంపద. అధికారిణి వస్తోంది" అన్నాడు.

అవతలికి వెడుతూ లీనాను రైజికోవ్ ఇలా హెచ్చరించాడు:

"ఉండు, నీపని పడతాను. ఆట ఆడుదువుగాని!"

ఇరువురూ వెళ్ళిపోయారు. మేడమీదినుంచి క్లావా దిగి వచ్చింది. లీనావంక ప్రశ్నార్థకంగా చూచింది. లీనా ఏమీ చెప్ప లేదు. బందోబస్తులో నిలుచుని చెక్కిళ్ళపై జారుతున్న కన్నీరు తుడుచుకుంది.

9

సాధారణ సమావేశం

రైజికోవ్ ఆ పిల్లపట్ల ధూర్తంగా ప్రవర్తించిన విషయం మరునాడు కాలనీలో అందరికీ తెలిసింది. జరిగిన సంఘటనవల్ల పిల్లలలో కుతూహలం రేకెత్తింది. అందరూ పరిపరివిధాల చెప్పుకుంటు న్నారు. పార్కులో రస్లాన్, ఇగోర్లు ఈ విషయాన్ని గురించి రైజికోవ్‌తో చర్చిస్తున్నారు.

"అదేమాత్రం మంచిపని కాదు. ఆడపిల్లమీద చేతులు వెయ్యడం నీకే ప్రమాదం" అన్నాడు రస్లాన్.

ఇగోర్‌కు ఇదంతా ఒక గమ్మత్తులాగా ఉంది. రస్లాన్ అలా అనగానే రైజికోవ్ తోకతొక్కిన త్రాచులా లేచాడు.

"ఏమిటి నీవనేది? ప్రతి వెధవాయీ నామీద పెత్తనం చెలాయిద్దామనే?"

"ఇవాళ సాధారణ సమావేశం జరుపుతున్నారు."

"[illegible]తే జరపనీ; ఎవడికి లెక్క?"

"[illegible]కాదు. సమావేశంలో నీవు సంజాయిషీ చెప్పుకోవాలి."

"చూద్దాం. నన్ను అక్కడికి ఏలా తీసుకెడతారో చూద్దాం"

"ఎలాగేమిటి? బాగానే తీసుకెడతారు."

"మాటలెందుకు? చూద్దాంలేవోయ్!"

రైజకోవ్ సమావేశానికి హాజరుకానని భీష్మించుకుని కూర్చోవడం ఇగోర్‌కు ఇష్టంగానే ఉంది.

"నీవు వెళ్ళకపోతే వ్యవహారం తమాషాగానే ఉంటుందోయ్! ఇంతకూ నీవు వెళ్ళవన్నమాట?"

"చచ్చినా వెళ్ళను - ప్రాణాలతో నన్ను పట్టుకపోలేరు."

"చాలా బాగుంది. అలాగైతే అద్భుతంగా ఉంటుంది!"

ఆ వేళల్లా రైజకోవ్, తానొక మహా స్వేచ్ఛాపరునివలె కాలనీఅంతా కలయ తిరిగాడు.

రాత్రి భోజనాలయిన తరువాత ఎనిమిది గంటలకు సాధారణ సమావేశం ప్రారంభమైంది. సభ్యులంతా, ఒక్కరూ మానకుండా హాజరైనారు. విశ్రాంతి మందిరం పిల్లలతో కిటకిటలాడుతోంది. ఒకరి ప్రక్కన ఒకరు ఇరుక్కొని కూచున్నారు. దివాసీమీద స్టాలిన్ విగ్రహం ఉన్నది. విగ్రహంచుట్టూ చిన్నపిల్లలు కూచున్నారు. వేదిక మెట్లమీదకూడా పిల్లలే. గదిలో ఒకమూల ప్రత్యేకంగా ఆడపిల్లలు కూచున్నారు. వేదికమీద అధ్యక్షుడికి, ఉపన్యాసకులకు మాత్రమే చోటుఉంచి, తక్కిన జాగాఅంత సభ్యులు ఆక్రమించుకున్నారు.

కొంతసేపటికి అధ్యక్షుడు టార్స్కీవచ్చి వేదికమీద ఆసీనుడైనాడు అప్పటికే వేదిక చివరన బ్లమ్ నిలుచున్నాడు. వేదికచుట్టూ పిల్లలు తేనెటీగల్లా ముసిరుకొని కూచున్నారు.

బ్లమ్ వేదికముందుకువచ్చి ఇలా ఉపన్యసించడం మొదలు పెట్టాడు:

"దుస్తులు కుట్టడమంటే ఎవరికైనా కష్టమే. ధరించడమంటే మాత్రం అందరికీ తేలికే. సెలవురోజునో, పండుగనాడో చక్కటి దుస్తులు వేసుకుని బయటికి వెళ్ళడమంటే మాకు సరదా. అంత

వరకూ బాగానే ఉంది. కాని వాటిని తయారుచేయడ మంటేమాత్రం మీకు తలనొప్పి. దుస్తులే కాదు. ఏవస్తువైనా ఇంతే. వాటిని కుట్టడం ఇక్కడివాళ్ళకు ఇష్టంలేదు మీలాగే బయటివాళ్ళకు కూడా ఇష్టం ఉండదని అనుకుందాం. అప్పుడు దుస్తులు ఎలావస్తాయి? తాపీపనివాళ్ళను 'నేను ఇల్లు కట్టుకుంటున్నాను. అది మీకిష్టమేనా?' అని అడిగి ఎవరైనా ఇల్లు కట్టించుకుంటారా? అలాగే వడ్రంగం పనిచేసేవాళ్ళను కాని, మరెవరినైనా ఇలా అడగరు. నీవు రొట్టె తింటున్నావు. ఆరొట్టె చేసింది నీవుకాదు-చేసినవాడు ఇంకొకడు. 'నేను రొట్టె తినడం నీకిష్టమేనా?' అని రొట్టెలవాణ్ణి నీవు అడగవు. లేదా 'ఆపని హాయిగా ఉందా?'' అని ప్రశ్నించవు. ఇక్కడ మీరు హాయిగా కూచున్నారు. కూచుని ఇలా ఆలోచిస్తున్నారు. 'మనం ఈ 'ఫస్టు ఆఫ్ మే' కాలనీలో ఉన్నాం. మనం చాలా గొప్పవాళ్ళం. గొప్ప వాళ్ళల్లోకల్లా గొప్పవాళ్ళం! దుస్తులు కుట్టడం మనకిష్టంలేదు. పాత్రలు అసలే తయారుచెయ్యం. ప్రదర్శన శాలల్లో సీట్లు, కుట్టు మిషన్లు, కర్రపనులు; ఇలాంటివేవీ మనం ముట్టుకోం.' ఇలా ఆలోచించడం భావ్యమేనా అని అడుగుతున్నాను కామ్రేడ్స్. కాలనీలో పాలు, పెరుగు, వెన్న, సమృద్ధిగా మీకు లభిస్తున్నాయి. ఇవి ఎక్కడ నుంచి వచ్చాయి? మనం పెంచుతున్న పశుగణమేకదా వీటిని ప్రసాదిస్తున్నది? ఆ పశుగణాన్ని పెంచేవాళ్ళు ఇక్కడి పిల్లలే. పశువులను పెంచుతున్నారని వాళ్ళను మనం పశుల కాపర్లని పిలుస్తున్నామా? లేదు. కాలనీ సభ్యులుగా పరిగణిస్తున్నాం, గౌరవిస్తున్నాం. ప్రతివాడూ ఆనందంగానే ఉన్నాడు. మీకుమాత్రమే అసంతృప్తి. అంతేనా? ఇక్కడ మీకు భవనాలు, పాఠశాల, ప్రదర్శనశాల, కార్ఖానాలు, పూలతోటలు; అన్నీ ఉన్నాయి. అయినా ఇవి మీకు సరిపోవు. ఆధునిక పారిశ్రామిక వస్తువులలో అపురూపమైనవేవో కావాలంటారు మీరు. విమానాలు, ఏవేవో మిల్లులు, అన్నీ మీకు కావలసినవే. నేను చెప్పేది తప్పని ఎవడూ అనలేడు. ఈ విషయం మిమ్మల్ని సవాలుచేసి అడుగుతున్నాను. నేను చెప్పింది

కాబట్టి ఎవరైనా అనదలుచుకుంటే అనమనే అంటున్నాను. అదేదో నేనూ వింటాను."

ఇలాఅని బ్లమ్ నవ్వుతూ వేదికదిగి ఒక బెంచీమీద కూచు న్నాడు. బెంచీమీద కూచున్న పిల్లలు కొంచెం సర్దుకుని అతనికి చోటిచ్చారు. బ్లమ్, పొట్టమీద రెండుచేతులూ ఆనించుకుని, మెడ త్రిప్పి సమావేశం వంక ఒకమాటు చూచాడు. సభ్యులు నవ్వుతూ కనిపించారు. కొందరుమాత్రం అసంతృప్తిగా అగుపించారు. ఇంకా కొందరు ఆశ్చర్యంగా చూచారు. తనప్రక్కన కూచున్న జకరోవ్ వంక తిరిగి బ్లమ్ ఇలా అన్నాడు:

"ఏమంటావ్ కామ్రేడ్! సభ్యులు ఏవేవో అభిప్రాయాలతో ఉన్నట్లున్నారు." ఇందుకు జకరోవ్ అదోలా నవ్వి, వేదికపైనున్న రెండో వక్తవంక చూచాడు. రెండో ఉపన్యాసకుడు శాంకో జోరిన్ పిడికిలిబిగించి ఆవేశంతో ఇలా ఉపన్యసించడం మొదలుపెట్టాడు:

"బ్లమ్ వట్టి కపటి. అతను చెప్పిందంతా కాపట్యంతో నిండి ఉంది. ఇహ ఈ కుతర్కాలకెవరూ మోసపోరు. కాలనీలో రోజుకు ఒక వెయ్యిజతల దుస్తులను ఆడపిల్లలు తయారు చేస్తున్నారు. దాని లాభం ముప్ఫయిరూబుళ్ళు. రోజుకు ముప్ఫయి అంటే, నెలకు తొమ్మిదివందలు. ఏడాదికి పదివేలు. మరి ఇది రాబడి అనిపించు కోదా? దుస్తులను ఎలా కత్తిరించాలో, కుట్టాలో ఆడపిల్లలు నేర్చు కుందామని అనుకుంటూఉండగానే, పాపం బ్లమ్ హఠాత్తుగా కుత ర్కాన్ని ప్రారంభించాడు. ఎందుకయ్యా బ్లమ్, అనవసరంగా పశుల కాపర్లను, ఇటికపనివాళ్ళను. వడ్రంగులను ఉపన్యాసంలో ప్రస్తా విస్తావు? మేం వాళ్ళకృషిని కాదంటున్నామా? కాదనడం లేదు. పైగా కృతజ్ఞులమై ఉన్నాం. ఇహ పశులకాపర్లమాట. సామ్యవాద ఆర్థికవిధానం రూపొందుతున్నప్పుడు, ఆ విధానం అమలులో ఉంటున్నప్పుడు మనకు అంతమంది పశులకాపర్లు అవసరంలేదు. పశువులను కొట్టాల్లోనే మేపుతాం. ఆమాటకొస్తే బూకోవిషయం చెప్పాలి. నేను ఒకప్పుడు పశులకాపరినే. అదికూడా ఒకపనే.

అంతేకాక ఆరోజుల్లో నేను ఒక ధనిక రైతుదగ్గర పనిచేశాను. మరి ఇప్పుడు? నేనొక వడ్రంగిని. రేపు నేనే ఒక వైజ్ఞానిక శాస్త్రజ్ఞుణ్ణి అవుతాను—మీరే చూద్దురుగాని. అంటే ఈ పద్ధతి మీకు ఏం బోధిస్తోంది! సోవియట్ ప్రభుత్వం, సోవియట్ విధానం ప్రతి వ్యక్తికీ కావలసిన అవకాశాలను కలిగిస్తుంది. అవును. రేపు మనమే ఫ్యాక్టరీలు, యంత్రాగారాలు, కర్మాగారాలు నిర్మిస్తాం! ఇప్పుడు నీవు పశువుల కాపరివైనంత మాత్రాన నీజీవితమంతా పశువులమధ్య గడపాలని ఎక్కడాలేదు. ఒకప్పుడు చేస్తావు. ఇంకొకప్పుడు కళాశాలలో చేరతావు. అంతేకదూ? మన కాలనీలో ఆడపిల్లలు దుస్తులుకుట్టడం నేర్చుకోవాలనుకుంటారు. నేర్చుకోనివ్వండి. దుస్తులు కత్తిరించేపద్ధతి చెప్పే బోధకుడు కావాలని వాళ్లు కోరితే, అతన్ని నియమించండి. అదే నాప్రతిపాదన. ఇప్పుడు నేర్చుకున్నది ముందుముందు అక్కరకు వస్తుంది. ఇంతకూ నాకొకవిషయం మరీ ఆశ్చర్యంగాఉంది. ఆడపిల్లలకు ఎప్పుడూ దుస్తులు కుట్టడమేనేర్పాలా? ఇతర పనులింకేమీ లేవా? వాండా స్టాడ్నిట్స్కయా మొన్ననే వచ్చింది. ఆపిల్లను చూస్తే నాకు అభినందించాలని ఉంది. ఇప్పుడు ఆవిడ యంత్ర పరికరాలు అతికించేచోట పనిచేస్తోంది. చాలా తెలివైన పిల్ల. సందేహం లేదు. అనుభవం లేకపోయినా, కుట్టుపని కాక ఇతరపనులు ఆడపిల్లలు ఎలా చేయగలరో తనుచేసి చూపిస్తోంది."

వాండా అయిదవదళ సభ్యుల ప్రక్కన కూచుంది. జోరిన్ అభివందన విని పొంగిపోయింది. ఆవిడ చెక్కిళ్ళు ఎర్రబారాయి. చెంతనున్న స్నేహితురాండ్ర భుజాలమధ్య తనమోము దాచుకుంది.

గదిలో మరోవైపు బల్లమీద ఇగోర్, రాస్లానులు కూచుని ఉన్నారు. వాళ్లముందు రైజకోవ్ కుర్చీలో కూచున్నాడు. వక్తల ఉపన్యాసాలను మహావీరునివలె వింటూ గంభీరంగా సభ్యులవదనాలను పరిశీలిస్తున్నాడు. అతనికి కొంచెం ఎడంగా మరొక బెంచీమీద మిషాగోంటార్ కూచున్నాడు. ముందుకు కొంచెంవంగి రస్లాన్, రైజకోవ్‌తో ఇలా అన్నాడు:

"నీ విషయం వాళ్ళకు గుర్తు తేవట్లేదోయ్. అదృష్ట వంతుడివి!"

"నా విషయం ఇక్కడ చర్చకు రాదని తెలిసే నేనిక్కడికి వచ్చాను." అన్నాడు రైజికోవ్.

గోంటార్, రైజికోవ్ వంక తిరిగి "తొందరపడకు. నీ విషయం వాళ్ళేం మరిచిపోలేదు. అంతా వాళ్లకు తెలుసును." అన్నాడు.

"ఏడిశారు! థూ, థూ!"

"అంత థూ థూ అనకోయ్ అబ్బాయ్! కాసేపట్లో వేదిక దగ్గరికి నీవే వెడతావు."

"వెడతాననుకుంటున్నావా?"

"ఎవరికోసం వెడతావు?"

"వెళ్ళను."

"వెళ్లకుంటే ఏమవుతుందో ఆలోచించుకో."

"ఏమవుతుందేం?"

"ఓరి వెర్రివాడా! ఇప్పటికే నీమీద నాకు జాలిగా ఉంది. అట్టే మొండికెత్తక పిలిచినప్పుడు వెళ్ళు."

"అంటే ఏమిటి నీ ఉద్దేశం? మెల్లమెల్లగా నన్ను ముంచుకు వెడదామనుకుంటున్నావా!"

"నేనేం నెట్టడంలేదోయ్, కొంచెంసేపట్లో అదే నెట్టు కొస్తుంది."

గోంటార్, రైజికోవ్ల సంభాషణ ఇగోర్‌కు చాలా ఆనందం కలిగించింది. చేతో తొడచరుచుకున్నాడు:

"నీవు వెళ్ళకపోతే ఏంచేస్తారో చూద్దాం. వెళ్లకు—" అన్నాడు.

కుట్టుపని నేర్పడానికి ఒకబోధకుడు కావాలని శాంకోజోరిన్ ప్రతిపాదించిన విషయం ఓటింగుకు పెట్టారు.

"రిపోర్టులు ఎలాఉన్నాయి క్లావా?" అనిఅడిగాడు బిట్యా టూరస్కీ.

రైజికోవ్, ఇగోర్, రస్లానోలు తలలు ఎత్తి ముందుకు చూశారు. తాను చెప్పిన జోస్యం నిజం కాబోతున్నదని గోంటార్ అతిశయం చూపించాడు. టార్‌స్కీ అడిగిన ప్రశ్నకు క్లావా ఇలా సమాధానం చెప్పింది.

"అన్నీ సవ్యంగానే ఉన్నాయి. కాని మొదటిదశలో మాత్రం కొంచెం కలవరం బయలుదేరింది. లీనా ఇవనోవ్నా ఆజ్ఞలను రైజికోవ్ పాటించలేదు. అంతేకాక ఆవిడను అవమాన పరిచాడు."

ఇలాంటి క్లావా అతనికొక కాగితంముక్క అందించింది. చీటీ అందుకుని తల ఆడించాడు టార్‌స్కీ.

"రైజికోవ్ !" అని పిలిచాడు.

హాలు నిశ్శబ్దమైంది.

"ఏమిటి సంగతి ?" అని అడిగాడు రైజికోవ్. అతని స్వరంలో వ్యంగ్యం స్ఫురించింది. సభ్యులు అతనివంక చూచారు. టార్‌స్కీ రైజికోవ్‌ను మధ్యకు రమ్మని చూపులతోనే ఆదేశించాడు. రైజికోవ్ కుర్చీ కదిలించాడు. కాని అక్కడనుంచి కదల్లేదు.

"నేనిక్కడనుంచి కదలను" అని అరిచాడు.

"ఏమంటున్నావు? రానంటున్నావా" అని గద్దించాడు టార్‌స్కీ.

రైజికోవ్ కుర్చీలో చేరగిలబడి కూచున్నాడు:

"నేను రానంటురాను! అంతే!" అన్నాడు.

దాంతో హాలులో బాంబు పేలినంత అలజడి చెలరేగింది. నాలుగుమూలలనుంచీ కేకలు వినిపించాయి. వేదికమీద పిల్లవాళ్ళు రైజికోవ్‌ను రమ్మని కేకలుపెట్టారు. అతను అటుచూచాడు. పిల్లలంతా తనవంక కోపంతో చూస్తుండడం గమనించాడు. అంతేకాదు ఇలా కేకలు వేస్తున్నారు:

"రాడట వాడు!"

"రావయ్యా, రా."

"శ్, లేచినిలుచో! అక్కడేముంది."

"ఇంతకూ ఎవరయ్యా ఈ రైజికోవ్? అతగాణ్ణి వేదికపైకి రమ్మనండి!"

"అతనేనా, ఆ ఘనకార్యంచేసిన వీరుడు!

జిరియాన్‌స్కీ లేచి నిలుచుని ఒక అడుగు ముందుకు వేశాడు.

"కూర్చో, కూర్చో. నీవెక్కడికీ వెళ్ళకు జిరియాన్‌స్కీ. నీ స్థలంలో నీవు కూచో." అని అతన్ని ఆజ్ఞాపించాడు టార్‌స్కీ.

అంతటితో జిరియాన్‌స్కీ ఆగిపోయాడు. కాని అతని ఆవేశం అతన్ని అలా కూచోనిచ్చింది కాదు. ముందుకు వెళ్ళి రైజికోవ్‌ను వేదికమీదికి పట్టుకొద్దామనుకున్నాడు. మళ్ళీ హాలులో కలకలం బయలుదేరింది.

"చూడండి, ఆ రైజికోవ్ మొండితనం!" అన్నారు ఒకరు.

"ఇంతకూ అతను రానంటాడా!" అన్నారు ఇంకొకరు.

"రాకపోతే నేవెళ్ళి లాక్కొస్తాను!" అన్నారు మరొకరు.

"తొందరపడకు అతనేవస్తాడు" అన్నారు వేరొకరు.

ఇదంతా ఇగోర్‌కు ఒక తమాషాగాఉంది, రైజికోవ్‌కు ఏదో చెప్పాలనిఉంది. కాని బయటికి చెప్పలేకపోతున్నాడు. అతని ముఖం ఎర్రబారింది. కాళ్ళు వణుకుతున్నాయి. అలాగే కుర్చీలో నుంచి లేచి నిలుచున్నాడు. అతను లేవగానే గోంటార్, అతను కూచున్న కుర్చీని ఒకచేత్తో అక్కడనుంచి తీసేసి, రెండోచేత్తో అతన్ని ముందుకు నెట్టాడు. ఆ తోపుకు రైజికోవ్ హాలుమధ్యకు వచ్చాడు. కాని తను మధ్యకు ఎలావచ్చాడో అతనికే తెలీదు! అయినా అతనిలో శక్తి సన్నగిలిపోతోంది. గాభరాపడుతూ ఒకచేయి జేబులోకి పోనిచ్చాడు. ఎదురుగా జిరియాన్‌స్కీ అగుపించాడు. ఇద్దరిచూపులూ కలిసేసరికి జిరియాన్‌స్కీ కోపంతో పళ్ళు కొరుకుతూ పిడికిలితో

బల్లమీద గ్రుద్దాడు. హాలులో నలుమూలల నుంచీ నవ్వులు వినిపించాయి. ఇప్పుడు తను ఏఅవస్థలో ఉన్నదీ తనకే తెలీదు పాపం రైజికోవ్‌కు. అనుకోకుండానే అతను జేబులో చేతులు పెట్టుకుని ఒక నృత్యభంగిమలో హాలుమధ్య ఆగిపోయాడు.

"సరిగ్గా నిలుచో." అని ఎవరో కేకవేశారు.

ఇప్పటికే రైజికోవ్ నవనాడులు క్రుంగిపోయాయి. రెండు కాళ్ళూ దగ్గరికి తీసుకుని నిటారుగా నిలుచున్నాడు. కాని జేబులో చేతులుమాత్రం అలాగేఉన్నాయి. అంతా నిశ్శబ్దంగా చూస్తున్నారు. అధ్యక్షుడు అతన్ని ఇలా ఆజ్ఞాపించాడు.

"ముందా జేబులోనుంచి చేతులు తీసెయ్యి!"

రైజికోవ్ ఒక్కతడవ అటూఇటూ చూచి జేబులోనుంచి చేతులు తీసేశాడు. ఇగోర్ ఇహ ఉండబట్టలేక "వాడొక పెంకెఘటం టార్‌స్కీ!" అని కేకవేశాడు.

"నీవు అనవసరంగా జోక్యం కలిగించుకోకు!" అని ఇగోర్‌ను హెచ్చరించాడు టార్‌స్కీ.

రైజికోవ్ కాలసీ సభ్యులవంక చూచాడు. కొందరు కోపంగా చూస్తున్నట్లు కనిపించారు. మరికొందరు ముందు ఏం జరుగనున్నదో అన్నట్లు నిరీక్షిస్తూ కూచున్నారు. తరువాత టార్‌స్కీ అతన్ని సూటిగా ఇలా ప్రశ్నించాడు:

"నీవు ఉన్నది మొదటిదళంలో నేనా?"

"అవును."

"కాపలా సైనికురాలు లీనా ఆజ్ఞను ఎందుకు ఉల్లంఘించావు? ఆమెను ఎందుకు అవమానించావు?"

"నేనా ఆమెను అవమానించింది? ఆమే నన్ను ముందుకునెట్టి అవమానించింది."

సభ్యులలో అక్కడక్కడా నవ్వులు వినిపించాయి.

"అయితే నీవు ఎవరినీ అవమానించలేదన్న మాట! మరి ఆమె ముఖంమీద చేతులు వేసింది నీవుకాదూ? అలా ఎందుకు వేశావు?"

"నే నలాంటిదేమీ చెయ్యలేదు. నేనలా చేసినట్లు ఎవరు చూచారో చెప్పమనండి?"

ఈ తడవ సభ్యులనవ్వులు ఆగినవికావు. టార్ స్కీ సహితం నవ్వసాగాడు. బొజ్జమీద చేతులానించుకుని బ్లుమ్ నిశ్వసించాడు. జికరోవ్ అటూ ఇటూ కదులాడాడు;

"నీవొక గాడిదలా ఉన్నావే! మాకు సాక్ష్యాలతో పనిలేదు." అన్నాడు టార్ స్కీ.

కాలనీ సభ్యులముందు తానొక మూర్ఖుణ్ణి కాబోతున్నానని రైజికోవ్ కు తెలుసును. కాని ఇలాంటి వివాదసమయంలో సాక్ష్యాలు అవసరమనికూడా అతనికి తెలీకపోలేదు. అవసరమేకాదు; ముఖ్యం కూడాను. నేరంచేసినా, అది రుజువయ్యేందుకు సాక్ష్యం అవసరం. ఆ సంగతి అతని జీవితమే అతనికి బోధించింది.

"అయితే ఆవిడ మాటలే మీరు నమ్ముతారన్నమాట? మరి నా మాట నమ్మరా?" అని అడిగాడు రైజికోవ్.

న్యాయశాస్త్రంలో ఒక సూత్రాన్ని తనకు అనువుగా చేసుకుంటున్నప్పుడు దాన్ని ఎలా వ్యక్తపరచాలో రైజికోవ్ కు తెలుసును. గద్గద స్వరంతో నిరపరాధివలే నటిస్తూ అతనిలా ప్రశ్నించేసరికి కాలనీ సభ్యులు మళ్ళీ పకపకా నవ్వారు.

"ఎందుకలా నవ్వుతారు? నవ్వడానికి ఇందులో ఏముందని? నేనలా చేస్తుండగా ఎవరు చూచారని నేనడుగుతున్నాను." అన్నాడు రైజికోవ్ మళ్ళీ గట్టిగా.

దీంతో కాలనీ సభ్యులు రైజికోవ్ వంక నివ్వెరపోయి చూచారు. టార్ స్కీ ఏమాత్రం తొణకకుండా, మళ్ళీ రైజికోవ్ ను ఇలా ప్రశ్నించాడు.

"సరే! నీవాపని చేస్తుండగా ఎవరూ చూడలేదనే అను కుందాం. అంతమాత్రంచేత నీవొక మనిషిని అవమానించడం తప్పు కాదా? ఒకరు చూడడంలేదు కదా అని నేరం చేయడం దోషం కాదా?"

ఇలాంటి ప్రశ్నకు జవాబు చెప్పడం ఎలాగో రైజికోవ్ కు తెలిసిందికాదు. మొదట మాట్లాడకుండా ఊరుకున్నాడు. తరువాత మెల్లగా కళ్ళెత్తి అధ్యక్షునివంక చూస్తూ ఇలా అన్నాడు:

"నే చెప్పేదల్లా ఒక్కటే, ఆపిల్ల అబద్ధమాడుతోంది. నేచేస్తున్నప్పుడు ఎవరు చూచారు?"

అంతట ఇగోర్ చెర్నియావిన్ లేచి నిలుచున్నాడు. టార్‌స్కీ తక్కిన సభ్యులు అతనివంక ప్రశ్నార్థకంగా చూచారు.

"పాపం. రైజికోవ్ పొరబడుతున్నాడు! తను చేసిన పని ఎవరూ చూడలేదనుకుంటున్నాడు. అప్పుడు నేనక్కడున్నాను. అదంతా చూచాను. ఆపిల్ల ముఖాన్ని చేతులతో కప్పి, ఆమె నోరు మూశాడు రైజికోవ్." అని చెప్పాడు ఇగోర్.

"నీవు చూచావా?" అని వెనక్కు తిరిగి అడిగాడు రైజికోవ్.

"అవును. నా కళ్ళారా చూచాను" అన్నాడు ఇగోర్.

"నీవు చూచాననా చెపుతున్నావు?"

"అవునయ్యా అవును! అదే చెపుతున్నాను."

ఇంతటితో హాలులో నవ్వులు ఆగిపోయాయి. అంతా నిశ్శబ్ద మైంది. సభ్యులంతా గంభీరవదనాలతో ఒకరివంక ఒకరు చూచు కున్నారు. ఒక నేరాన్ని చేసి అదెవ్వరూ చూడలేదుకదా అని రైజికోవ్ బుకాయిస్తున్నాడని అందరికీ అవగతమైపోయింది. చూచిన సాక్షి అతనిపక్కనే నిలువబడి ఉన్నాడు. ఇహ ఇప్పుడు ఇది నవ్వ దగిన విషయంకాదు. తీవ్రంగా ఆలోచించవలసిన విషయం. జెరియాన్‌స్కీ తాను మాట్లాడ బోతున్నానని సూచించడానికి చెయ్యెత్తాడు.

"నేనొక విషయం చెప్పాలనుకుంటున్నాను." అన్నాడు.

"చెప్పు."

"ఇందులో చర్చించడానికేముంది? అసలు ఆ రైజికోవ్ ఎవరు? ఎక్కడనుంచి వచ్చాడు? ఎందుకొచ్చాడు? వచ్చినవాడు తిన్నగా ఉండక, కాలనీ క్రమశిక్షణకు భంగం కలిగిస్తాడా? కలిగించడానికి అతనికి గల హక్కేమిటి?...నీ చేతులు ఆ పిల్ల ముఖంమీద వెయ్యడానికి నీకు ఎన్ని గుండెలున్నాయి?" అంటూ జిరియాన్స్కీ రైజికోవ్ మీదికి వెళ్ళాడు. రైజికోవ్ ప్రక్కకు తప్పుకున్నాడు.

"అతన్ని బయటికి గెంటెయ్యండి! ఆలస్యం దేనికి? తక్షణం గెంటెయ్యండి. తియ్యండి, తలుపు తియ్యండి. తీసి మెడపట్టుకొని అవతలికి నెట్టండి! సిగ్గూ ఎగ్గూ లేక సాక్ష్యం కావాలట, సాక్ష్యం!... అతన్ని ముందు అవతలికి పంపించాలి! ఇది నా ప్రతిపాదన!..."

"అవును, అతన్ని అవతలికి గెంటాల్సిందే!" అంటూ మరో కేక వినిపించింది.

జిరియాన్స్కీ తమాయించుకుని, నవ్వుతూ ఇలా అన్నాడు:

"నాకు తెలుసును, మీరు చాలా మంచివాళ్ళు; జాలి హెచ్చు. అతన్ని అవతలికి గెంటరు."

ఇలా అని ఒలెంకో వంక చూశాడు. ఒలెంకో అతని చూపుల్లోని భావం గ్రహించి తనూ మాట్లాడడానికి లేచాడు:

"రైజికోవ్ నాదళంలో సభ్యుడు. కొంచెం మోరటుగా చెప్పాలంటే అతనొక వింతమనిషి. అతనెలాంటివాడో రస్లాన్ కు బాగా తెలుసును. ఇద్దరూ కలిసి తిరుగుతూ ఉంటారు." అని చెప్పాడు ఒలెంకో.

వెంటనే రస్లాన్ "నన్నెందుకూ ఈ గొడవలోకి లాగడం?" అన్నాడు.

"బాగుంది, ఇవాళ కాకపోతే ఇంకొకప్పుడు - నీ గొడవా వస్తుంది చర్చలోకి!"

"రైజికోవ్‌ను బయటికి గెంటివేయవలసిన అవసరం అంతగా లేదనుకుంటాను. అతన్ని మంచిమార్గంలో పెట్టడానికి అవకాశ మున్నది. ఇదివరకు అతను జీవితం ఎలాగడిపితే మనకెందుకూ?... అయితే రైజికోవ్ తనతండ్రి ఎవరో చెపితేమంచిది..."

"అవును, సమాధానం చెప్పు రైజికోవ్? మీ నాన్నగారు ఏంచేస్తుండేవారు?" అని అడిగాడు టార్‌స్కీ.

"వర్తకం చేసేవారు."

"ఇప్పుడాయన బ్రతికున్నారా?"

"ఆ"

"ఏ ఊళ్ళో ఉంటున్నారు?"

"నాకు తెలీదు."

"తెలీదూ?"

"ఊహూ."

"పోనీ. ఊహించి చెప్పగలవా?"

"చెప్పలేను. ఆయన ఎక్కడికో పారిపోయాడు."

"అవును, మనం అతన్ని పంపించెయ్యక్కర్లేదు. తగుమాత్రం శిక్షించి కాలనీలో ఉంచుదాం. కొంతకాలానికి అతన్ని సోవియట్ మానవునిగా మనం తయారు చేయవచ్చును" అన్నాడు ఒలెంకో.

అంతట జకరోవ్ లేచి నిలుచున్నాడు.

"అవును. నేనూ అలాగే అనుకుంటున్నాను. అసలతన్ని శిక్షించనక్కర్లేదు. ఇంకా రైజికోవ్ పూర్తిగా నాగరికుడుకాడు" అన్నాడు.

"ఏమిటీ? పూర్తిగా నాగరికుడు కాకపోవడమా! అంటే ఏమిటి?" అని మూలిగాడు రైజికోవ్.

"నేచెప్పింది నీకింతలోనే అర్థంకాదు. అది అర్థం చేసుకునేందుకు ఇంకా కొంతకాలం పడుతుంది. ఎలా నాగరికుడవు కావాలో మొదటివిషయం నీకు నేర్పుతుంది. నాగరికత అంటే, మోటుగా ప్రవర్తించడంకాదు. ఆడపిల్లను అలాగ నాగరికులెవరూ అవమా

నించారు, ఆటవికులే అవమానిస్తారు......రైజికోవ్‌ను శిక్షించాల్సిన పనిలేదు ఈ సమావేశం తన సానుభూతిని లీనాకు అందచేయాలని నా ప్రతిపాదన.”

సమావేశం ఇంచుమించు సమాప్తం కావస్తోంది. జిరియాన్‌స్కీ తన ప్రతిపాదనను ఉపసంహరించుకున్నాడు.

“ఇహ నీవు వెళ్ళవచ్చు రైజికోవ్! కాని కొంచెం జాగర్తగా మసలుకో” అన్నాడు అధ్యక్షుడు టార్‌స్కీ.

రైజికోవ్ రెండడుగులు ముందుకు వేశాడు.

“ఆగు, ఒక్క నిముషం ఆగు. సాధారణ సమావేశానికి అభివాదం చెయ్యి”

టార్‌స్కీ ఇలా అనగానే రైజికోవ్ నవ్వుతూ సభ్యులకు నమస్కరించాడు. టార్‌స్కీ, లీనావంక తిరిగి ఇలా అన్నాడు.

“లీనా! సాధారణ సమావేశం ఈ దుస్సంఘటనకు ఎంతో దురపిల్లుతున్నది. నిన్ను ఆ దుస్సంఘటనను విస్మరించవలసినదిగా అభ్యర్ధిస్తోంది. నీకు తన హృదయపూర్వక సానుభూతిని అంద చేస్తోంది.”

మేడమెట్లు ఎక్కుతూ రైజికోవ్ ఆగి వెనక్కు చూచాడు. తన వెనకాలే వస్తున్న ఇగోర్‌ను చూచి ఇలా అన్నాడు.

“నీవు ఒక తాంత్రికుడిలా తయారయ్యావే ఇగోర్!”

“నేనేం చేశాను?”

“ఏంచేశానా? చూచినట్లు సాక్ష్యం చెపుతానన్నావుగా.”

ఇగోర్ సంతోషంతో భుజంమీద చరుచుకున్నాడు:

“ఏదో చేసేశాను. నీవు ముందుకువెళ్ళి నిలుచున్న తరువాత కాని, నీవే నిలుచున్నట్లు నాకు తెలిసిందికాదు అక్కడ నిలుచున్నది నిజంగా నీవేనా! నిజంగా నీవు సమావేశంలో పాల్గొన్నావా?”

ఇంతలో అక్కడ రస్లాన్ నవ్వు వినిపించింది. రైజికోవ్ కోపంగా ఇగోర్ వంక చూచాడు. వ్లాడిమిర్ కొలోన్ కూడా అక్కడికి వచ్చాడు. అతను రైజికోవ్ భుజాలను తట్టుతూ ఇలా అన్నాడు:

"అభినందనాలు! ఇప్పుడు జరిగింది చాలా ప్రధానమైన సంఘటన తమ్ముడూ. మొట్టమొదట సమావేశం మధ్యలో నిలుచోవడం. తరువాత జాగర్తగా నిలుచోవడం, చెప్పింది వినడం అవన్నీ సవ్యంగా సాగుతాయి. తెలిసిందా అబ్బాయ్?"

10

ముద్దు

వారానికొకమాటు కాలనీ ప్రదర్శనశాలలో సినిమా చూపిస్తూఉంటారు. ప్రదర్శనశాల చాలా పెద్దది. కాలనీలో తయారైన నాలుగువందల సింధూరపు చెక్క-కుర్చీలు అందులో వేశారు. కాలనీ ఉద్యోగుల కుటుంబస్థులు, గోష్టిలోవ్ కాలోని యువకులు; నగరంలోని వారివారి మిత్రులు ప్రదర్శనాలు చూడడానికి వస్తూ ఉంటారు. కాలనీలో చలనచిత్ర ప్రదర్శనలవల్ల, కాలనీసభ్యుల కార్యక్రమాలకు ఎలాంటి అంతరాయం కలుగదు. పైగా కాలనీ సభ్యుల్లో కొంతరికి సినిమా అంటే పిచ్చి. అందులో రెండవ పెట్రోవ్ ఒకడు. అతను చిన్నప్పటినుంచీ సినిమాల రంగడు. ఈ ఇరవయ్యో శతాబ్దంలో కనుగొనిన అపురూపమైన ఈ వింతకు తన జీవితమంతా అంకితం చేయాలనుకునేవాడు పెట్రోవ్. అతనిప్పుడు తొమ్మిదవ దళంలో పనిచేస్తున్నాడు. వయస్సు పదహారుసంవత్సరాలే అయినా, జీవితంలో ఇహ నేర్చుకోవలసిందేమీ లేదని అతని నమ్మకం. ఈ నమ్మకంతో అతనొక నిర్ణయానికి వచ్చాడు. జీవితంలో నేర్చుకోవలసిందంతా అయిపోయింది. ఇహ ఇప్పుడు కావలసిందల్లా చలనచిత్రకళను నేర్చుకోవడమే. అందుకని తానొక సినిమా ఆపరేటరు కావాలనీ, అవసరమైతే అందులో పరీక్ష ప్యాసుకావాలనీ నిశ్చయించుకున్నాడు. కాని కాలనీ అధికారులు అందుకు అంగీకరించ

లేదు. పద్ధెనిమిదేండ్లు రానిదే వరికైనా కూడా కాకూడదని అన్నారు. అందువల్ల పెట్రోవ్ వాళ్ళను 'నిరంకుశాధికార్లు' అని పిలవసాగాడు. వారానికి ఒకసారైయినా సినిమా ప్రదర్శించాలని అతను కోరాడు. నగరంలో ఉన్న ఇద్దరు ముగ్గురు చలనచిత్రాధికార్లు వారాని కొక మాటు ఏదో ఒక ఫిలిమును కాలనీకి పంపిస్తూ ఉంటారు. దాన్ని ప్రదర్శించేవాళ్లు కాలనీ ఆపరేటర్లే. ఈ ఆపరేటర్లతో పరిచయం ఏర్పరచుకున్నాడు పెట్రోవ్.

ఒకనాడు ప్రదర్శనం కాగానే ఫిలిమును తిరిగి తీసుకపోవడానికి నగరంనుంచి ఆ అధికార్లు కాలనీకి వచ్చారు. కాని ఫిలిముపెట్టెలు మామూలు స్థితిలో లేవు. దాన్ని ప్రదర్శించి చూపినవాళ్ళకు బొత్తిగా అనుభవం లేదని ఇట్టే తెలిసిపోయింది. దానికి ఆనాడు పెట్రోవే ఆపరేటరుగా పనిచేసి, ఫిలిము చుట్టను పాడుచేశాడు. ఆ అధికార్లకు పెట్రోవ్ చిరపరిచితుడే. రోజూ వాళ్ళదగ్గరికి వెళ్లి తనను సినిమా ఆపరేటరుగా చేస్కోమని గొడవ పెడుతుండేవాడు పెట్రోవ్. ఇప్పుడు ఫిలిమేకాదు. ప్రొజెక్టరుకూడా పాడుచేశాడు. కాని అందుకతనేమీ భయపడలేదు పైగా అధికార్లను దబాయించాడు. ఇందువల్ల కాలనీలో పెద్దగొడవ బయలుదేరింది. కొందరు పెట్రోవ్ వాదాన్ని అభిమానించారు. పదహారేండ్ల కుర్రవాడయిన అతని ఉపజ్ఞ ఏదో ఒక రంగంలో రాణించకపోదని అనుకోసాగారు. కాని ఆ వేళ సాధారణ సమావేశంలో జెరియాన్స్కీ అతన్ని మందలించాడు. ప్రొజెక్టరు చెడిపోవడంవల్ల మళ్ళీవారం సినిమాప్రదర్శనం ఆగిపోయింది. కాని మెలంకో ఆనాడు సినిమాకు మారుగా ఏదో ఒక ప్రదర్శనం ఉండాలని సూచించాడు. దానికి సభ్యులంతా అంగీకరించారు. కాని నాటకసమాజంలోని పాత సభ్యులకు రిహార్సల్సుకు హాజరుకావడమంటే తలనొప్పి. అందుకు కొత్తసభ్యులు ఉత్సాహపడ్డారు. ఇగోర్ చెర్నియావిన్, వాన్యా గల్చెంకో, ఓల్గా వొరోనవ్; మొదలైనవారు నాటకంలో వేషాలు వెయ్యడానికి ముందుకు వచ్చారు. నాటకం రిహార్సల్సు మొదలైనాయి. చక్కగా సాగి

పోతున్నాయి. రంగాలంకరణకూడా తయారయింది. ఒకటి అడవి సీను, రెండవది ఒక గ్రామంలోని భూస్వామిభవంతి.

నాటకంవేసే రోజు వచ్చింది. సభ్యులంతా ఉత్సాహంగా ఉన్నారు. ప్రదర్శనశాలలో రంగభూమిని అలంకరిస్తున్నారు. జట్లు జట్లుగా ప్రేక్షకులు ప్రదర్శనం చూడడానికి నాటకశాలకు వస్తున్నారు. అదేవేళకు పార్కులో ఒక బెంచీమీద ఒక్సానా ఒంటిగా కూచుంది. ఆజాడ కనిపెట్టాడు ఇగోర్. ఆనాడు ఇగోర్ ఎవ్వడూ లేనంత ఉత్సాహంగాఉన్నాడు. తను ఆనాడు నాటకంలో ధరించబోయే పాత్రను అమోఘంగా అభినయించగలనని అతని భావం. ఆ భావంతో- ప్రపంచమంతా అతనికి నూతనంగా కనిపించింది. ఒంటిగాకూచున్న ఒక్సానా దేవకన్యలా అతనికి కనిపించింది. కుంకుమరంగు జాకెట్టు వేసుకుంది. చేతిలో ఒక పూగుత్తి పట్టుకుంది. ఇగోర్ చరచరా ఆ అమ్మాయిచెంతకు వెళ్ళాడు.

"నీవు ఇవాళ ఎంత అందంగా అగుపిస్తున్నావు ఒక్సానా!" అన్నాడు.

ఆపిల్ల వెఱిగంది కొంచెందూరంగా జరిగింది. అతను మరి కొంచెం చేరువరకు వెళ్ళాడు. ఆమెలేచి ముందుకు నాలుగడుగులు వేసింది. అతను ఆమెకు అడ్డుగా నిలుచున్నాడు.

"నన్ను వెళ్ళనీయి. నీవు కాలనీసభ్యుడవు కావూ? అలా మీదిమీదికొస్తావేం?" అన్న దాపిల్ల.

"అబ్బ! నీకళ్ళు ఎంత సొగసుగాఉన్నాయి ఒక్సానా." అన్నాడు ఇగోర్.

ఒక్సానా తనచేతులను ముఖానికి అడ్డంపెట్టుకుంది.

"వెళ్ళిపో. నాదగ్గరుండకు- నీకుకాదూ చెప్పేదీ?" అన్నది.

కాని ఇగోర్ కదల్లేదు. ధైర్యంగా ఇంకా ముందుకువచ్చాడు, చేతులు చాచి ఆపిల్లను కౌగలించుకున్నాడు. మెడను, చేతులను, పెదవులను ఆవేశంతో ముద్దాడాడు ఆపిల్ల కెవ్వున కేక వేసి అతన్ని అవతలికి తోసివేసింది. ఆమె చేతిలో పూగుత్తి అతనికళ్ళకు తగిలింది.

ఇంతలో "ఇగోర్!" అని ఎవరో కోపంగా కేకవేశారు.

ఇగోర్ వెనుదిరిగి చూచాడు. క్లావా కమిరినా క్రోధావేశంతో అక్కడికి వచ్చింది.

"ఒక ఆడపిల్లను అలా అవమానించడానికి నీకెలా మనసొప్పింది?" అని అడిగింది.

"అది అవమానించడంకాదు" అన్నాడు ఇగోర్.

క్లావా మరీ రెచ్చిపోయింది:

"వెళ్ళిక్కణ్నుంచి. తిన్నగా కమాండర్ ఒలెంకో దగ్గరికి వెళ్ళి చేసినపని చెప్పు. తెలిసిందా?" అని గద్దించింది.

ఇగోర్‌కు ఏమీ అర్థంకాలేదు. అనుకోకుండానే అతను భవనం దగ్గరికి నడిచివెళ్ళాడు. భవనందగ్గర ఏడుస్తున్న ఒక స్త్రీకంఠం వినిపించింది. ఆ స్త్రీ ఎవరో చూడడానికి అతనికి ధైర్యం చాలలేదు.

11
నాటకప్రదర్శనం

గోర్ ధైర్యం చిక్కబట్టుకొని నాటకశాలవైపు నడిచాడు. ఎలాగో 'మేకప్‌రూం'లో ప్రవేశించాడు. ఇంత దురదృష్టకరమైన సంఘటన ఎన్నడూ జరగలేదు. ఆపిల్లను తను ప్రేమిస్తున్నాడు. కాని ఆ ప్రేమకు అవధులులేవు అవధులులేని ప్రేమకనుకనే తను అలా బలాత్కారంగా ఆవిడను ముద్దాడాడు. ఇంతటితో ఈ సంఘటన సమసిపోదు. నేడో రేపో సాధారణసమావేశంలో తను అందరిమధ్య నిలుచోవలసి ఉంటుంది. తన ప్రవర్తనకు సంజాయిషీ. చెప్పుకోవలసి ఉంటుంది. సాధారణసమావేశం విషయం జ్ఞాపకం వచ్చేసరికి ఇగోర్ భావనాజగత్తులో ఒక ప్రశ్న వినిపించింది. "ఇగోర్! ఎందుకలా ప్రవర్తించావు? అలా ప్రవర్తించ వచ్చునా?......"

కాని ఈ సంఘటన తన సంకల్పంతో పని లేకుండానే, దానంతట అదే జరిగిపోయింది. పార్కులో ఒంటరిగా ఆ పిల్ల; మెరిసే కళ్ళతో, చేతిలో పూలగుత్తితో కనిపించడం; ఆ కళ్ళను, ఆ పూగుత్తినీ చూచి తను ఆవేశవివశుడు కావడం; అన్నీ లిప్తలో జరిగిపోయాయి. ఈ సంఘటనను జ్ఞప్తికి తెచ్చుకోగానే ఒలెంకో అతని మనోదృష్టికి ఎదురయ్యాడు. ఒలెంకో తన దళానికి కమాండరు. తాను ఈవిషయం అతనితో చెప్పాలట, కాని చెప్పదలుచుకోలేదు ఇగోర్. చెప్పకపోతే ఏమవుతుంది? సాధారణ సమావేశంలో తాను నిలుచోవడం; ప్రతివాళ్ళూ తనను పరిహాసం చేయడం; అన్నీ అతనికి స్ఫురించాయి.

గదితలుపు తెరిచి లోపలికి వెళ్ళేసరికి ఒలెంకో అక్కడే ఉన్నాడు. ఇగోర్ అతనిమీద త్రుళ్ళిపడబోయాడు. ఒలెంకో అతని వంక తన సహజధోరణిలో తీక్షణంగా చూచాడు. ఇగోర్‌కు ముచ్చెమటలుపోశాయి.

"ఇంతసేపూ ఎక్కడున్నావు ఇగోర్? తెములనీయి, త్వరగా తెములనీయి" అన్నాడు ఒలెంకో.

మేకప్‌రూంలో అంతా సందడిగా ఉంది. నటులంతా వేషధారణలో నిమగ్నులై ఉన్నారు. మలంకీ, జకరోవ్, విట్యాటార్‌స్కీ-లు వేషాలంకృతిలో నటులకు సహాయపడుతున్నారు. కొందరు ఉద్యోగుల్లాగా, కొందరు సైనికాధికారులుగా, మరికొందరు దేశసేవకులుగా వేషాలు వేసుకుంటున్నారు. టార్‌స్కీ మతగురువు వేషం వేసుకున్నాడు. ఇగోర్ ఇంకా వేషం వేసుకోలేదు.

"చప్పున తయారవ్వు. దుస్తులు వేసుకో. నీవు హాడ్కో దేశభక్తుడి వేషంకదూ వేస్తున్నావు?" అని ఇగోర్‌ను అడిగాడు టార్‌స్కీ.

"అవును. కాని నేనీవేషం ఒప్పించగలనో, లేనో అని నా భయం" అన్నాడు ఇగోర్.

"ఏం?"

"నాకెప్పుడూ అలాంటిభావాలు రాలేదు."

"రానక్కర్లేదు. వేషంవేస్తే భావాలు అవేవస్తాయి...... అదేమిటి, ఆ కంటిమీద? దెబ్బతగిలిందేం?"

పూలగుత్తి గుచ్చుకోవడంవల్ల ఇగోర్ కుడికన్ను వాచింది. కంటివెంట నీరు కారుతోంది.

"ఆ, ఏమీలేదు- ఏదో గుచ్చుకుంది" అన్నాడు ఇగోర్.

"ఏమీలేదేమిటి? ఏదో తగిలిఉంటుంది. మహావీరుడిలా క్రిందా పైనా చూడకుండా దూసుకపోతుంటే ఏమవుతుంది. సరే, సరే. ముందు వేషంవేసుకో- ఈపట్టీ నడుముకు చుట్టుకో. కాళ్లకు ఈ గుడ్డ చుట్టుకో ఈజోళ్ళుతొడుక్కో."

ఇగోర్ బెంచీమీదకూచుని వేషం వేసుకోవడం మొదలు పెట్టాడు.

"ఇవన్నీ ఎలా కట్టుకోవడం? ఇదివరకు నేను ఏ వేషం వెయ్యాలేదు."

లెఫ్టినెంట్ జోరిన్ ఆఫీసరు వేషంలో తయారయ్యాడు. నడుముకు బెల్టు బిగించి, కాకీచొక్కా వేసుకున్నాడు.

"నాకుమాత్రం ఈ దుస్తులు వేసుకోవడం వచ్చునా ఏమిటి? భుజాలకు ఈ పట్టీ ఎవ్వరైనా తగిలించి ఎరుగుదురా!"

ఇగోర్ దుస్తులు ధరిస్తున్నాడు. అక్కడ ఉన్నాడన్నమాటే కాని అతని మనస్సు పరిపరివిధాల పోతున్నది. ఎదుట ఎవరున్నదీ కూడా అతను గమనించడంలేదు. తలుపు తెరుచుకుని క్లావా కషిరినా లోనికివచ్చింది. ఇగోర్ వంక కాసేపుచూచి, కోపంగా వెళ్ళిపోయింది.

మలంకీ పొడుగాటి కోటు వేసుకున్నాడు. ఎర్రటిపట్టీ చుట్టుకున్నాడు.

"అలా కుర్చీమీద కూచో ఇగోర్. నీవు వేసేవేషం ఏమిటి? అని అడిగాడు.

"మూడవ వీరుడివేషం." అని చెప్పాడు ఇగోర్.

"ఓహో, లేదా! అయితేసరే...ప్రదర్శనం బాగా ఇద్దాం. ఇదిగో! ఈ గడ్డం తగిలించుకో, ఇప్పుడు నీవు ఒక పేదరైతువన్న

మాట. ఆ రైతుకు తినడానికి తిండి లేదు. అష్టకష్టాలు పడుతున్నాడు. తెలిసిందా?"

అందరూ వేషాలు వేసుకుని నాటకం ప్రారంభించడానికి సంసిద్ధులయ్యారు..మలంకీ, టార్‌స్కీని పిలిచి ఇలా అడిగాడు:

"నే వేసుకునే మెడల్సు లేవీ?"

"ఒక్కక్షణంలో రొగోవ్ పట్టుకొస్తాడు. ఇంకా పతకాలకు మెరుగు ఆరలేదు. అదిగో రిబ్బను తయారుగా ఉంది."

జకరోవ్ ఎదురుగా ఉన్న రిబ్బనువంక చూచాడు. "ఆరిబ్బను బాగాలేదు. ఇప్పుడు మనం వేస్తున్న నాటకానికి అది పనికిరాదు. మనం వేస్తున్న నాటకం అంతర్యుద్ధానికి సంబంధించింది. నక్షత్రాలు, పతకాలుకూడా అక్కర్లేదు" అన్నాడు.

"అవి లేకపోతే ఇహ సైనికాధికారి ఏమిటి?" అని అశ్చర్యంతో అడిగాడు విక్టర్.

."అది ఆడపిల్లల రిబ్బనులా ఉంది!"

"కాదు. సెయింట్ ఆంద్రూ పతకానికి వేసే రిబ్బను. ఎంతో ప్రముఖులు మాత్రమే దీన్ని ధరించేవారు."

మలంకీ, ఆ రిబ్బను తీసుకుని బుజానికి తగిలించుకున్నాడు.

"గాభరాపడకు జకరోవ్. ఈ రిబ్బను నాటకంలో బాగానే ఉంటుంది. కాని అబ్బాయిలూ! ఒకమాట జ్ఞాపకం పెట్టుకోండి. మితిమీరి నటించకండి. ఆ సన్నివేశం ఉంది చూచారూ – నానిగాద ఓూరంతా పడ బోతారే - అది. మొన్న రిహార్సల్సులో నా గెడ్డం తెగింది. నన్ను గొంతుపట్టుకుని ఉక్కిరి బిక్కి చేసేశారు. ఇవాళ అలా మాత్రం చెయ్యకండేం?" అన్నాడు మలంకీ.

"ఉక్కిరిబిక్కి చెయ్యక ఇంకేంచేస్తాం? ముద్దుపెట్టుకుంటా మనుకున్నారా; నీవు వేస్తున్న వేషమే అలాంటిది- తెల్ల సేనాదిపతివి." అన్నాడు నవ్వుతూ.

ఇంతలో, వాకిలి దభీలున తెరుచుకుని వాన్యా, బిగోవక్ లు లోనికివచ్చి పడ్డారు

"శాశ్వతంబాగుండా ఆలేగ్జెట్ పిపానొవిచ్! ఎలా ఉంది? ఎలా ఉంది?" అంటూ బిగోనక్ పరవశుడవుతున్నారు.

బిగోనక్ వాన్యా విరువురూబొచ్చు కోటు తిరగవేసి తొడుక్కున్నారు. బిగోనక్ ,ముఖానికి కుక్క మూతితగిలించుకున్నాడు. కుక్కలాగా చేతులు నేలమీద ఆనించి నడుస్తూ, మొరుగుతూ జక రోవ్ బూట్లను పట్టుకున్నాడు. బిగోనక్ నటనకంటె వాన్యా నటన మరీ బాగుంది. అతను అచ్చంగా కుక్కలాగే అరవసాగాడు. అందరూ నవ్వుతూ ఆనందించారు.

"ఇహ ఆపండి! హాస్యాలకు హద్దూపద్దూ లేదు. ఇంకా మేం నాటకం వెయ్యనేలేదు, మీరిప్పుడే వేసేశారు. మూడు రోజులనుంచీ మీ హడావుడి పట్టలేక పోతున్నాం." అన్నాడు టార్‌స్కీ.

"ఎలావున్నాయి మా వేషాలు జకరోవ్ !" అని మళ్ళీ అడిగాడు బిగోనక్.

"మీ బొచ్చుకోట్లు చూస్తే పిల్ల ఎలుగుబంట్లులా ఉన్నారు. కాని కుక్కల్లా లేర్రా అబ్బాయిలూ! అయినా వేషాలు రక్తి కట్టాయిలే, పరవాలేదు" అన్నాడు జకరోవ్.

ఒక అరగంటపోయిన తరువాత నాటకం మొదలైంది. కుక్కల వేషాలు వేసుకున్న వాన్యా, బిగోనక్‌లు రంగస్థలంమీద చివోకవైపున, ప్రక్క తెరల వెనకాల కూచున్నారు. టార్‌స్కీ వాళ్ళనిలా హెచ్చరించాడు:

"జాగ్రత్తగా ఉండండి! మీరు భూస్వామి ఇంట్లో ఉండే కుక్కలు. మనుష్యుల అలికిడివిని మీరు మొరుగుతారు. తరువాత ఎవరిపనివారు చూచుకుంటారు., సన్నివేశం జాగ్రత్తగా, చెడకుండా చూచుకోండి."

"అలాగే కామ్రేడ్ కమాండరు" అంటూ ఆ "రెండు కుక్కలు" భూస్వామి తోటలో దాగిఉన్నాయి.

రంగస్థలంమీద అంతా సంసిద్ధంచేశారు! అదొకభవనం. ఆ భవనంలో బూర్జువాసమాజపు ప్రతినిధులు కొందరూ, తెల్లసైని

కులు కొంటూ కుర్చీలమీదకూచుని ఉన్నారు. కిటికీలు తెరిచి ఉన్నాయి. విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి. కిటికీ అవతలనుంచి చూస్తే గదిలో కూచుని ఉన్న మనుష్యులు కనిపిస్తున్నారు. కిటికీ ముందు కుడిప్రక్క మతగురువు కూచున్నాడు. తెర లేవగానే కని పించే దృశ్యం ఇది. టార్స్కీ తెరఎత్తమనగానే తెర రెండుగా చీలి పోయింది.

నాటకశాలలో ప్రేక్షకులు కిటకిటలాడుతున్నారు. దృశ్యం చూచేసరికి కనులపండువుగా ఉంది ప్రేక్షకులకు. ఎవరు ఏ వేషం వేసుకున్నారో గుర్తించడం కష్టంగా ఉంది. కిటికీదగ్గర కూచున్న మతగురువువేషం వేసుకున్నవాడు విట్యాటార్స్కీ. ఆ మతగురువు పేరు ఎలిట్స్కీ.

వెనుకప్రక్క తోట ఉంది. తోటలో ఉన్న చెట్లు కనిపిస్తు న్నాయి. చెట్లచాటునుండి దేశభక్తులు రంగస్థలంమీదికి దూసుకు వచ్చారు. అందులో ఒకడు ఇగోర్. వీరిలో కొందరు కిటికీపైనుంచి మరికొందరు తలుపులు తెరుచుకుని భూస్వామిభవనంలో ప్రవేశిం చారు. ఇనుపరు, తుపాకులు పట్టుకుని కిటికీకి రెండుప్రక్కలా నిలు చున్నారు. కాల్చడానికి సంసిద్ధులయినారు. కనురెప్పపాటు గడి చింది. తుపాకులు పేలాయి. నాటకంలో హృదయాన్ని కదిలించే ఘట్టం ఇది. కిటికీకి దూరంగా భవనంలో తుపాకులచప్పుళ్లు, అల జడి, అరుపులు, ఆడవాళ్ళ ఏడ్పులు వినిపించాయి. రెండుకుక్కలూ తోటలోనుంచి వచ్చి ఎలుగుబంట్లలా రంగస్థలంమీదికి దుమికాయి. కోపంతో ఆ గంతకులను చూచి మొరిగాయి. ఆ కుక్కలవేషాలు వేసిందెవరో ఇప్పుడు ప్రేక్షకులు గ్రహించారు కాని, వాళ్లదృష్టి రంగస్థలంపై జరిగే సన్నివేశంపై లగ్నమైఉన్నది. తెల్లసైనికులకూ దేశభక్తులకూ, పోరాటం సాగుతోంది. పోరాటంలో దేశభక్తులే విజయం పొందాలని ప్రేక్షకులందరి హృదయాలూ ఆరాటపడు తున్నాయి. దేశభక్తులపై పడుతున్న ఆ కుక్కలను నిజమైన కుక్క లుగానే భావించుకున్నారు. వాటిమీద అసహ్యంకూడా పుట్టింది

ప్రేక్షకులకు. ఇగోర్ చెర్నియావిన్ మూడవ దేశభక్తుడు. అతను మతగురువుతో ఘర్షణపడుతున్నాడు!

"నీవా, నీవు!" అని ఆగిపోయాడు. మతగురువు మెడలోని శిలువగుర్తును చేత్తో పట్టుకున్నాడు. మతగురువు పాత్రధారి విట్యాటార్స్కీ మెల్లగా ఇలా గొణిగాడు :

"నా శిలువ ముట్టుకోకు." దీనికి ఏం జవాబు చెప్పాలో, తన సంభాషణ మరిచిపోయాడు ఇగోర్.

రంగభూమి వెనకాలనుంచి పాత్రధారులకు సంభాషణలు అందిస్తున్న ప్రామ్టర్ మెల్లగా గొణుగుతున్నారు. కాని ఆమాటలు ఇగోర్‌కు అందక తబ్బిబ్బు అవుతున్నాడు.

"ఆ, పద, పద. నీ శిలువా, నీవు - ఎందుకిలా మోసం చేశావు? ద్రోహం ఎందుకు తలపెట్టావు? దేశానికి ద్రోహం చేస్తావా?" అని అరిచాడు ఇగోర్.

మతగురువును మరి ఇరువురు దేశభక్తులు బంధించి బయటికి తీసుకుని వెళ్ళారు. ఇదే సన్నివేశంలో ఇగోర్‌ను ఒక తెల్లసైనికుడు కాల్చడం జరుగుతుంది. ఆ దెబ్బకు వెంటనే అతను నేల కొరిగిపోవలసి ఉంటుంది. కాని ఇగోర్ తుపాకి పేలిన నాలుగైదు నిముషాలకు క్రింద వాలాడు. అదైనా "పడిపో, పడిపోరా. దెబ్బ తగిలితే పడక అలా నిలుచుంటావేం?" అని జోరిన్ గద్దించిన పిమ్మట అతనికి తెలిసింది.

కుక్కలు ఇగోర్ కాలిబూట్లను గీకుతూ మొరగడం మొదలు పెట్టాయి. అతను ఆలస్యంగా పడిపోవడం ప్రేక్షకులకు నవ్వు తెప్పించింది. ప్రేక్షకులు నవ్వడం విని ఇగోర్ గాభరా పడ్డాడు. రంగభూమి మీద ఏమి జరిగిందో, తానుచేసిన తప్పేమిటో, అంతా అయోమయంగా ఉంది అతనికి.

నాటకంలో మొదటిదృశ్యం అయిపోయింది. తెర వాలింది. ఇగోర్ గబగబాలేచి లోపలికి ఒక్కగెంతు గెంతాడు. అక్కడున్న చెట్టువద్ద క్లావా, జకరోవ్‌లు నిలుచున్నారు. వాళ్ళమీద తూలి పడి

పోయాడు ఇగోర్. ఇద్దరూ ఏదో తీవ్రమైన విషయాన్ని గురించి చర్చించుకుంటున్నారు. ఇగోర్‌కు అనుమానం పుట్టింది. తను ఆ పిల్లను ముద్దు పెట్టుకున్న సంగతే వారిరువురూ చర్చించుకుంటున్నారని అత నికి భీతి కలిగింది. చడీచప్పుడు లేకుండా వెంటనే కాలనీ బయటికి పారిపోవాలనుకున్నాడు. కాని అదే తరుణంలో విట్యాటార్స్కీ గబ గబ అక్కడికి వొచ్చాడు.

"ఏమిటయ్యా ఇది? తొడుక్కున్న బూటు జారిపోతే మళ్ళీ తొడుక్కుని రానక్కర్లేదూ?" అని అడిగాడు.

ఇగోర్ తనబూటు తొడుక్కున్నాడు. నాటకంలో ఇంకా తాను నటించవలసింది చాలా ఉంది, మూడు అంకాల్లోనూ తను వస్తాడు. అది మరీకష్టంగా తోచింది అతనికి. తొందరగా మేకప్ గది లోకి వెళ్ళాడు. అక్కడ నటులు నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటు న్నారు. వాన్యాగల్చెంకోమాత్రం నిరుత్సాహంగా ఉన్నాడు. బిగోనక్ ఒక బల్లమీద కూచున్నాడు. వాన్యా నిరుత్సాహంగా ఎందుకున్నాడో కొందరికి తెలిసిందికాదు.

"ఎందుకలా నిరుత్సాహంగా ఉన్నావు? కుక్కలా అరవడం మరిచిపోయి మనిషిలా అరిచావనా? పోనీలే - ఈసారి బాగాచేద్దువు గాని" అని ఊరడించాడు మలంకీ.

12
ఒక విచిత్ర సన్నివేశం

మేకప్ గదిలో బిగోనక్ చాలా ఉత్సాహంగా నవ్వుతు న్నాడు. కారణం అతను నాటకంలో బాగా నటించాడు. జకరోవ్ లోనికి వచ్చేసరికి, అతను సర్దుకున్నాడు. వాన్యా ఇంకా విచారంగా కూచుని ఉన్నాడు. నాటక దర్శకుడు జకరోవ్ వాన్యాదగ్గరికి, వెళ్ళి

"ఎందుకు విచారంగా ఉన్నావు వాన్యా?" అని అడిగాడు.

"అతను విచిత్రమైన కుక్క- మొదట నవ్వుతుంది, తరువాత మొరుగుతుంది!" అన్నాడు బిగోనక్.

వాన్యా తలవాల్చుకున్నాడు. జరగబోయే రంగాల్లో తాను బిగోనక్ కంటె బాగా నటించాలని నిశ్చయించుకున్నాడు. ఇదివరకు తాను అతనికంటె బాగానే నటించాడు. ఇప్పుడుమాత్రం తీరా సమయానికి చెడిపోయింది. తన పాత్రను తాను చక్కగా నిర్వహించలేకపోయాడు. ఇహ తాను కాలనీసభ్యుల ముఖాలు ఎలా చూడగలడు? ఇంతకూ చెడగొట్టింది తనుకాదు, ఇగోర్. తుపాకీచప్పుడు వినిపించగానే పడిపోక కాలిజోళ్ళు జార్చుకుని అలాగేనిలుచున్నాడు. ఆ విషయమే శాంకోజోరిన్ ఇగోర్‌తో ఇలా ప్రస్తావించాడు:

"ఏమిటది? ఎందుకలా చేశావు? తుపాకీతో నిన్ను కాల్చింది నేను దెబ్బ తగిలినవెంటనే క్రిందపడక అలాగే, పోతులా నిలుచున్నావు. నిలుచుని ఊరుకున్నావా- ఊరుకోక న్ను తిట్టావు. అంత మతిమరుపు అయితే ఎలాగయ్యా? నీ మెదడు ఏమైంది!"

మలంకీ ఈ సంభాషణంతా సంతోషంగా వింటున్నాడు.

"జోరిన్! అంత ఇదిగా మాట్లాడకు మెదడు ఉన్నా ఉపయోగించడం కష్టం!" అని చిన్న విసురువిసిరాడు మలంకీ.

"ఉంటే ఉపయోగించడం కష్టమా?" అని అడిగాడు జోరిన్.

"కాదూమరి. నీవిషయమే చూడు! నీవు ఏమన్నావు? తుపాకీ కాల్చాక క్రిందపడక పోతులా నిలుచున్నావేమని నీవతన్ని అడిగావు. పోతుమాత్రం నిలుచుంటుందా ఏమిటి?"

సంభాషణ కులాసాగా సాగుతోంది. ఇప్పుడు వాన్యాకు విచారం పోయింది.

"నీవు విచారపడకు వాన్యా. నీవు నవ్వావో లేక మొరిగావో అదంతా అలాఉంచు. కొన్నికొన్ని సన్ని వేశాల్లోనైతే అసలు కుక్కలు కూడా మీలాగే ఉద్రేకపడతాయి. బిగోనక్ ఏమీ ఉద్రేకం

లేకుండా నటించాడు. నీకేమో ఉద్రేకం మరీ ఎక్కువైంది. వెళ్ళండి ఇద్దరూ అలా పార్కువైపు వెళ్లి ఒకమాటు ముఖాలుకడుక్కొని రండి. అదే మీకుశిక్ష" అన్నాడు జకరోవ్

ఇరువురూ పార్కువైపు వెళ్లారు.

"విచారించకు వాన్యా. ఒకమాటు నాకుకూడా ఇలాంటి శిక్షపడింది. పని సక్రమంగా చేయలేదు. తుడిచిన నేలంతా మళ్లీ తుడిచి శుభ్రంచేశాను. చేసిన తప్పుకు శిక్ష అనుభవిస్తే విచారం పోతుంది." అని చెప్పాడు బిగోనక్.

"అయితే అప్పుడు నీవు మళ్ళీ విచారించలేదా?"

"లేదు."

ఇరువురూ ఒకభవనం దగ్గరికివచ్చి ఆగారు.

"అటుచూడు, అటుచూడు!" అన్నాడు బిగోనక్.

భవనంలో ఎడమప్రక్క గోడమీద ఒక వెలుగు కనిపించింది. ఎవరో నడుస్తున్న అలికిడి అయింది. ముఖాలు కనిపించాయి. మళ్లీ వెలుగు తళుక్కుమన్నది: "అది స్టోరుహౌస్." అని గొణిగాడు బిగోనక్

"ఏమిటది?" అని ప్రశ్నించాడు వాన్యా.

"ఫ్యాక్టరీ సామానులు ఆ ఇంట్లోనే దాచిపెడతారు. ఏమిటో ఆ అలికిడి. రా, చూద్దాం."

వాళ్ళిద్దరూ మెల్లగా నడుస్తూ స్టోర్‌హౌస్ దగ్గరికి వెళ్ళారు. గ్లామ్ ఫ్యాక్టరీ ఆవరణలో ఒకేఒక దీపం వెలుగుతోంది. స్టేడియమ్‌కు దూరంగాఉన్న స్టోర్‌హౌస్ గోడలమీద ఆ దీపపునీడ పడుతోంది. ఈ దీపపుకాంతే కాక అప్పుడప్పుడు గీస్తున్న అగ్గిపుల్లల వెలుగు ఉండి ఉండి కనిపిస్తోంది. ఆ అగ్గిపుల్లలు గీస్తున్నవాళ్ళు ఎవరై ఉంటారో అని ఇరువురూ ఆతృతగా చూశారు.

"అడుగో!...వాడే—రైజికోవ్" అన్నాడు వాన్యా భయపడుతూ.

"అవునవును, రైజికోవ్. సందేహంలేదు. మరి ఆ రెండోవా డెవడూ? చూడు, చూడు...ఆ, రస్లాన్, రస్లాన్! అవునవును, రస్లానే. లోపలికి దూరడానికి ప్రయత్నిస్తున్నారు."

కొద్దిక్షణాలు గడిచాయి. వాళ్ళకు రస్లాన్ గొంతుక వినిపించింది:

"అగ్గిపుల్లలు గీయకురా, ఎవరైనా చూస్తారు."

"ఇక్కడెవరూ లేంధే అంతా, నాటకానికి వెళ్ళారు." అని సమాధాన మిచ్చాడు రైజికోవ్.

తాళం తీస్తున్న చప్పుడు వినిపించింది.

"మీరు తాళాలు సంపాదించారు కాబోలు!" అన్నాడు బిగోనక్.

"లోపలికి దూరి సామానులు కాజేస్తారేమో!" అన్నాడు వాన్యా.

కాని రైజికోవ్‌కు తాళం తీయడం అంత సులభమనిపించ లేదు. ఎలాగైనా తెరవాలని నానా తంటాలు పడుతున్నాడు.

"గట్టిగా అరుద్దాం." అందరికీ వినిపించేలా అరుద్దాం." అన్నాడు బిగోనక్.

"ఏమని అరుద్దాం?" అని అడిగాడు వాన్యా.

"ఏమనా? మొదట నేను అరుస్తాను. 'రైజికోవ్‌ను పట్టుకోండి, రైజికోవ్‌ను పట్టుకోండి'...తరువాత నీవూ అలాగే అరుద్దువుగాని...కాదుకాదు. ఇద్దరం ఒకేసారి అరుద్దాం. గట్టిగా అరవాలి, తెలుసునా?"

"అరిచి పారిపోదామా?"

"ఊఁ అలాగైతే మనం వాళ్ళకు చిక్కం."

"అలాకాదు బిగోనక్. నాకో చిన్న ఆలోచన తట్టింది. నీవు చెప్పినట్లు కాక ఇలా కేకవేద్దాం. 'రైజికోవ్! సమావేశం మధ్యలోకిరా'..."

వాన్యా సరిగ్గా అలాగే అరిచాడు. ఇద్దరి అరుపులూ ఆవరణంతా ప్రతిధ్వనించాయి. ఆ అరుపులు ఎక్కణ్ణుంచి వినిపిస్తున్నాయో రైజికోవ్, రస్లాన్‌లకు అర్థమైందికాదు. అర్థంకాక తిన్నగా వాన్యా, బిగోనక్‌లు పొంచిఉన్న తుప్పల దగ్గిరికి వచ్చారు. అది చూచి వాన్యా, బిగోనక్‌లు ప్రక్కకు తప్పుకున్నారు.

"ఆగు, ఆగు రైజికోవ్!" అన్నాడు మెల్లగా రస్లాన్. రైజికోవ్ ఆగాడు. అతని చేతిలో తాళపుచెవుల గుత్తి ఉంది.

"ఆ అరిచిన వెధవ ఎవడు?" అని అడిగాడు రైజికోవ్.

"ఎవరూ లేరు రా, నాటకశాలకు వెళ్ళిపోదాం. మనం అక్కడ లేకపోతే అందరికీ తెలిసిపోతుంది."

"ఇదంతా నీ అగ్గిపుల్లలవల్లే వచ్చింది. నే చెపుతూనేఉన్నాను విన్నావుకావు."

ఇద్దరూ అక్కడనుంచి నడుస్తూ వెళ్లిపోయారు.

వాన్యా, బిగోనక్‌లు ఇవతలికి వచ్చి చూచారు:

"చాల తమాషాగా ఉంది! అమ్మ దొంగముండాకొడుకులు! ఎంత పనిచేశారు!"

"పద, జిరియాన్‌స్కీకి చెపుదాం." అన్నాడు వాన్యా.

"ఎందుకు లేద్దూ, లేనిపోనిరభస. మనం చెప్పామంటే అతను ఊరుకోడు. మళ్ళీ సమావేశం ఏర్పాటు చేస్తాడు. ఇద్దర్నీ బయటికి పంపిస్తాడు."

"పంపించనీ, పంపిస్తే ఏం?"

"ఓరి గాడిదా! నీకింకా తెలీదన్నమాట! వాళ్ళను బయటికి పంపరు. ఏమంటావా? సమావేశంలో వాళ్లిలా గద్దించి అడుగుతారు: 'ఎవరు చూచారు? సాక్ష్యమేది? మేం ఉట్టినే అలా షికారుకు వెళ్ళాం. తలుపులు తీయడానికి ప్రయత్నించలేదు అలా చేసినట్లు నిదర్శనం ఎక్కడ?' వాళ్ళిలా అడిగేసరికి అందరూ, ఎవరి

మటుకు వారు ఊరుకుంటారు. అందుకని వాళ్ళను మనం ఒకకంట కని పెడుతూ ఉందాం. అలాగైతే మరీ తమాషాగా ఉంటుంది కదూ? మనం చూచినట్లు వాళ్ళకు తెలీదు." అన్నాడు బిగోనక్.

13

నీకో ఉత్తరం

ఆ మరునాడు ప్రొద్దున్నే ఇగోర్ చెర్నియావిన్ చిరాకు పడుతూనే నిద్రలేచాడు. అతని మనస్సు ఏమీ బాగాలేదు. పరుపు మీద దొర్లుతూ ఆలోచించసాగాడు. వెంటనే కాలనీనుంచి బయటికి వెళ్లిపోవాలనిపించింది. అంతిమంది ఎదుట సమావేశంలో మధ్యన నిలుచుని తాను ఎందుకు ఆపనిచేశాడో, సంజాయిషీ చెప్పుకోవడం చాలాకష్టం. దానికితోడు ప్రొద్దున్నే నిద్రలేవగానే క్లావా కపిరినా కంటపడింది ఆవేళ ఆమెదే డ్యూటీ. క్రిందటి సాయంకాలం జరిగిన సంఘటన మరీ బాధాకరంగా కనిపించింది. క్లావా కిటికీలోనుంచి చూస్తూ సన్నని గొంతుకతో "అభివందనాలు కామ్రేడ్స్" అన్నది. దళసభ్యులు వరండాలను పరిశుభ్రం చేస్తున్నారు. అంతా ఉల్లాసంగా ఉన్నారు. మధ్యమధ్య క్లావా సన్నాయి గొంతుక వినిపిస్తోంది. అంతా ప్రశాంతంగా, నిర్మలంగా, దివ్యంగా ఉంది. నవ్వులు వినిపిస్తున్నాయి. అలాంటి ఆనందమయవాతావరణంలో ఎవరైనా హాయిగానేఉంటారు. ఇగోర్‌కు జీవితంమీద మళ్ళీ ఆశ జనించింది. క్లావా అంత మొరటుగా ప్రవర్తించే పిల్లకాదు. తన మీద లేనిపోని చాడీలు చెప్పదు. యువతీ యువకులు ప్రేమించుకోవడం సహజమని ఆవిడకూ తెలిసిఉంటుంది.

ఇగోర్ ఫలహారం చెయ్యడానికి వెళ్ళాడు. అక్కడ కాలనీ సభ్యులు అతన్ని అభినందిస్తూ పలకరించారు. నాటకంలో కుక్కలు

చేసిన హడావుడి, ఇగోర్ నటనా చాతుర్యం, నాటక ప్రదర్శనం ఎలాఉన్నదీ, ఇవన్నీ సభ్యులు మాట్లాడుకోసాగారు. ఎనిమిదవవకళవు సభ్యులు సరేసరి. బల్లచుట్టూ పోగయి ఫలహారాలు చేస్తూ కబుర్లు చెప్పుకుంటున్నారు. .

"ఇగోర్ చెర్నియావిన్!" అంటూ బిగోనక్ అక్కడికి పరుగెత్తుకవచ్చాడు. అతని చేతిలో తెల్లని అందమైన కవరు ఒకటి ఉంది.

"ఏం? ఎందుకూ?" అని అడిగాడు ఇగోర్.

"నీకేదో ఉత్తరం వచ్చింది."

"ఎక్కణ్ణుంచీ? నాకేనా ఆ ఉత్తరం?"

"అడ్రెసు చదువుకో- చూడు! 'కామ్రేడ్ ఇగోర్ చెర్నియావిన్' అని ఉంది-నీపేరే."

"ఏఊరినుంచి వచ్చింది?"

"ఈఊరినుంచే."

"ఇక్కడనుంచేనా?"

ఇగోర్ కవరు తీసుకుని చించి చూచాడు. అతనిచుట్టూ కూచున్నవాళ్ళు ఆతృతతో చూడసాగారు. బిగోనక్ తనఉద్యోగపు హోదాలో, బందోబస్తులో నిలుచున్నాడు. అతనికళ్ళు, బుగ్గలు, పెదవులు; అదోక వైఖరిని వహించాయి. ముఖంలో నవ్వు కనిపించింది.

కాగితం విప్పి ఇగోర్ చదువుకుంటున్నాడు: "కామ్రేడ్ చెర్నియావిన్! సాయంకాలం నీ పనులన్నీ అయ్యాక నన్నొకసారి కలుసుకో.

ఎ. జకరోవ్."

ఇగోర్, ఉత్తరం మళ్లి మళ్లీ చదివాడు. అతనిముఖం జేవురించింది. గుండెల్లో అనుముపుట్టింది శాంకోజోరిన్ లేచి నిలుచుని ఉత్తరంవంక చూస్తూ, ఇగోర్ భుజాలు తట్టి ఇలా అన్నాడు:

"నీ ఉత్తరంలో ఏముందో నాకెందుకు?"

ఇగోర్ బాధపడసాగాడు. నెస్ట్రింకో ఒకచేత్తో టీ త్రాగుతూ మరొకచేత్తో ఇగోర్ ఉత్తరాన్ని అందుకున్నాడు. ఉత్తరం చదువుకుని "ఓహో అదా సంగతి! ఎందుకు కలుసుకోమన్నాడో తెలుసునా? అని అడిగాడు.

బిగోనక్ నవ్వు ఆగిపోయింది. "అంతా స్పష్టమేకదూ?" అన్నాడు.

"నీవు ఊరుకో కామ్రేడ్." అన్నాడు నెస్ట్రింకో.

."అలాగే, అలాగే"

బిగోనక్ అక్కడనుంచి వెళ్ళిపోతూ ఇగోర్ వంక, తక్కిన సభ్యులవంక చూచాడు. అతనిచూపుల్లో ఏదో అర్థమున్నది.

"ఆ ఉత్తరం ఎందుకో తెలుసునా? అని అడిగాడు నెస్ట్రింకో

ఇగోర్ కుర్చీలో చలికిలబడి, భయంతో గోంటార్ వంక చూచాడు:

"అదా!......అందుకే అయి ఉంటుంది. ఆ పిల్ల......"

"ఓ! ఆపిల్లా! ఏపిల్ల?- నేంకూడా వింటున్నానయ్యా!"

దళసభ్యులు మెల్లగా మాట్లాడుకుంటున్నారు. ఫలహారశాలలో మిగతావాళ్ళకు, వాళ్ళమాటలు వినిపించడంలేదు గత సాయంకాలం జరిగిన సంఘటనను ఇగోర్, సభ్యులందరికీ ఎరుకపరిచాడు.

"ఇంతే జరిగింది" అన్నాడు ముగిస్తూ.

నెస్ట్రింకో కొంచెంసేపు ఆలోచించాడు: "కొంపమీదికి తెచ్చుకున్నావే! జిరోవ్ అసాధ్యుడు. ఇలాంటి విషయాలను ఊరికే వదిలిపెట్టడు."

గోంటార్, ఇగోర్ తనకథ చెప్తున్నప్పుడే కోపంతో ఉడికిపోయాడు:

"ఏం మనిషివయ్యా నీవు? ఆ పిల్ల కాలిగోటితో సరితూగవు. జకరోవ్ దాకా ఈ వ్యవహారం వెళ్ళడం బొత్తిగా బాగాలేదు."

ఇగోర్. బల్లమీదికి వంగి.

"నే నిక్కడనుంచి వెళ్ళిపోతున్నాను. అప్పుడు ఏగొడవా ఉండదు." అన్నాడు.

"అలా వెళ్ళడం నీతరంకాదు! పారిపోతావని తెలిసుంటే జకరోవ్ నిన్ను తీసుకరమ్మని మనిషిని పంపించును."

"అలా నిన్ను పారిపోనిస్తారటయ్యా? దళమంటే తమాషా అనుకున్నావా? పారిపోవడానికి ప్రయత్నించకు."

ఫలహారాలు ముగిశాయి. ఇగోర్ విచారంగా పార్కులోకి వెళ్ళాడు. అటూ ఇటూ తిరుగుతున్నాడు. అతని మనస్సులో జకరోవ్ మెదులుతున్నాడు దూరంగా ఆఫీసులో జకరోవ్ కూచుని ఉన్నాడు. అతనికి తీరుబడిలేదు. బ్లమ్, మలంకీ, క్లావా, మొదలైన వాళ్ళు ఒక్కొక్కరేవచ్చి అతనితో మాట్లాడిపోతున్నారు.

పూలతోటకు వెళ్ళేత్రోవలో వాన్యా బిగోనక్ లు కలుసుకున్నారు:

"ఏం జరిగిందో తెలుసునా?" అని అడిగాడు బిగోనక్.

"ఏమైంది?" అన్నాడు వాన్యా.

"ఇగోర్ ను ఆఫీసులో హాజరు కమ్మన్నారు."

"ఎప్పుడు?"

"రాత్రి- జకరోవ్ ఎదుట. వాడేంచేశాడో నీకు తెలుసునా? ఆ పిల్లను- ఒక్సానాను ముద్దుపెట్టుకున్నాడు!"

"ముద్దు పెట్టుకున్నాడా!"

"అవును- మూడుసార్లు- ముచ్చటగా మూడుముద్దులు!"

"ఊరికే ముద్దుపెట్టుకున్నాడు, అంతేకదా?"

"అది చాలదా ఏమిటి? ఇక్కడ ముద్దులు నిషేధమని నీకు తెలీదా? పోనీ ఒకసారి ఊరికేముద్దాడాడని అనుకుందాం. మరి మూడుతడవలాయె!..."

"అందు కేమిటయింది?"

"ఏమిటయితే నాకెందుకు, వాడిగోడవ!"

భవంతిదగ్గర దారిలో ఇగోర్‌కు జకరోవ్ తారసపడ్డాడు. ఇగోర్ అతనికి నమస్కరించాడు. జకరోవ్ ఠీవిగా ప్రత్యభివాదం చేశాడు:

"గుడ్‌మార్నింగ్ చెర్నియావిన్."

కాని అంతకుమించి జకరోవ్ ఏమీ మాట్లాడలేదు. ఇగోర్ నెమ్మదిగా ఇలా అన్నాడు:

"మీరు పంపినకబురు అందింది అలెగ్జీ స్తెపానొవిచ్. మీతో ఇప్పుడు నేను మాట్లాడవచ్చునా?"

"ఇప్పుడెందుకు? నిన్ను రమ్మన్నది ఇవాళసాయంత్రం కదా"

"అలా అయితే మరీమంచిది. సాయంత్రం నాకు తీరుబడిగా ఉంటుంది.

మళ్ళీ ఇగోర్ పార్కులోకి వచ్చాడు ఆవరణలో తిరిగాడు. విశ్రాంతి మందిరంలోకి వెళ్ళాడు. అతనికిప్పుడు పారిపోవాలని లేదు. ఎందుకు పారిపోవడం? ఇంతకూ ఆ ఉత్తరం మర్యాదగానే ఉంది. ఇంతాచేసి జకరోవ్ ఏంచేయగలడు? రెండుమూడు శిక్షలు విధిస్తాడు. వాటిని సంతోషంగా అనుభవించవచ్చును. అతనికి అనేక ఆలోచనలు వస్తున్నాయి, పోతున్నాయి. అవి తృప్తినిచ్చే ఆలోచనలే, అయినా అతను సంతుష్టుడుకాలేడు. ఇంకా సాయంకాలం కావడానికి చాలా వ్యవధి ఉంది. భోజనం, ఫ్యాక్టరీపని, రెండుగంటలకు విశ్రాంతి, కమాండర్ల నివేదికలు, ఇవన్నీ అయ్యాక నిద్రకు వేళయిందని బిగిల్ ఊదుతారు. కాని ఇప్పుడు వినిపించే బిగిలు అతనికి మామూలుగా వినిపించదు. ఆ బిగిలువిని అందరూ ఇలా ఉల్లాసంగా పాడుకుంటారు:

"నిదుర వేళయింది, నిదుర వేళయింది!
కష్టాలుపోయాక కలతనిద్దుర ఏల?

పనిపంతులకు ఎప్పుడు పండుగ లేక దా!

నిదుర వేళయింది, నిదుర వేళయింది."

సాయంకాలం భోజనాలయ్యాక చాలా సేపటికి నెస్టెర్గింకో ఆనాటి నివేదిక సమర్పించి తిరిగివచ్చాడు. బిగోనక్ బిగిలు పట్టుకుని వరండాలో తిరుగుతున్నాడు. ఇప్పుడు బిగోనక్ కు ఇగోర్ పట్ల అంత వ్యతిరేక భావం లేదు. మరి కొంతసేపు గడిచింది. బిగోనక్ బిగిల్ ఊదాడు.

జోరిన్ ఇగోర్ దగ్గరికివచ్చాడు: "పదపయ్యా చెర్నియావిన్" అన్నాడు. అప్పుడు నెస్టెర్గింకో అక్కడే ఉన్నాడు.

"నీవు అన్నీ ఆలోచించుకునే ఉంటావు. వెళ్ళు" అన్నాడతను ఇగోర్ తో.

ఇగోర్ విచారంగా ముఖంపెట్టాడు. నోటివెంట మాటవచ్చింది కాదు. తల వాల్చుకున్నాడు.

"ఎందుకు నీకా భయం? అలెక్జీ చాలామంచివాడు. నిన్నేమీ అనడు. అతనితో మాట్లాడితే నీకు మరీహాయిగా ఉంటుంది"అన్నాడు జోరిన్.

"సరే, నేనూ వస్తాను. ముగ్గురం వెడదాం'' అన్నాడు నెస్టెర్గింకో.

ముగ్గురూ కార్యాలయానికి బయలుదేరారు. మధ్యలో వాన్యాగల్చెంకో వాళ్ళ కెదురుపడ్డాడు. ముగ్గురినీచూచి ముసిముసి నవ్వులు నవ్వుతూ, తనూ వాళ్ళవెంట బయలుదేరాడు.

. కమాండర్ల కౌన్సిలుగదిలో ఎవరూలేరు. బ్లమ్, బిగోనక్ లు తలుపు తెరుచుకుని ఇవతలికొచ్చారు.

"లోపలికి వెళ్లు చెర్నియావిన్'' అన్నాడు బిగోనక్.

ఇగోర్ ద్వాకిలిదగ్గరికి వెళ్ళాడు: "కోపంగా ఉన్నాడా?" అని అడిగాడు.

"ఆ; విరుచుకపడుతున్నాడు! ఇంతా అంతా కోపమా! కళ్లల్లోనుంచి నిప్పులు కురిపిస్తున్నాడు! పాములా బుసలు కొడుతున్నాడు!"

ఇలా అంటూ బిగోనక్ కాలితో నేలమీదతన్నాడు. బ్లమ్, జోరిన్‌లు పకపకనవ్వారు. వాన్యా నిశ్చేష్టుడై నిలుచున్నాడు. నస్ట్రెంకో ఇగోర్‌ను దీవిస్తున్నట్లు చెయ్యి పైకెత్తి "క్షేమంగా వెళ్ళి లాభంగా రానాయనా!" అన్నాడు.

ఇగోర్ తలుపు తెరిచాడు. లోపల జకరోవ్ వ్రాతబల్లముందు కూచున్నాడు. ఇగోర్ తొంగిచూడగానే లోపలికి రమ్మని సైగ చేస్తూ కుర్చీ చూపించాడు. ఇగోర్ లోనికివెళ్ళాడు.

"కూర్చో."

ఇగోర్ ఊపిరి బిగబట్టి కూచున్నాడు. ముందున్న కాగితాలు బల్లమీదసర్ది ముఖంమీద చెమట తుడుచుకున్నాడు. జకరోవ్:

"అంతా నీకు తెలుసుననుకుంటాను. నేను వేరే ఏం చెప్పక్కర్లేదు."

ఇగోర్ లేచి నిలుచున్నాడు, అతని కాళ్లు వణికాయి. గుండెల మీద చేతులు పెట్టుకున్నాడు. సిగ్గుతో అతనిముఖం కుంచించుకుపోయింది.

"మీ రేమీ చెప్పక్కర్లేదు అలెగ్జీస్టెపానొవిచ్ ...నన్ను క్షమించండి." అన్నాడు.

జకరోవ్ అతనివంక తేరిపారచూచాడు. గంభీరంగా ఇలా అన్నాడు:

"సరే. నీకంతా అర్థమైందికదూ మంచిది. నీవు మర్యాదస్థుడివని అనుకుంటూవచ్చాను. ఇహనుంచీ జాగ్రత్తగా మసలుకుంటావు కదూ?"

"మర్యాదగా నడుచుకుంటాను."

"మరి జరిగినదానికి ఏంచేస్తావు?"

"ఏంచెయ్యాలో తోచడంలేదు. నన్ను క్షమించమని ఒక్కసారి నాను వేడుకుంటాను."

"సరే, బాగుంది. ఇహ నీవు వెళ్ళవచ్చు."

బ్రతుకు జీవుడా అని ఇగోర్ బయటపడ్డాడు. "మళ్ళీ మీకు కనిపించి ఏంజరిగిందో చెప్పమంటారా?"

"అక్కర్లేదు. అన్నమాట నిలబెట్టుకుంటే చాలు."

బయట అతనికోసం మిత్రులు ఆతృతతో వేచిఉన్నారు. అతను రాగానే "ఏం జరిగింది?" అనిఅడిగాడు వాన్యా. "ఏవు పగిలిందా?" అన్నాడు నెస్టెర్రింకో.

"నాలుగు చివాట్లు తగిలిఉంటాయి!" అన్నాడు బిగోనక్.

ఇగోర్ లేదన్నట్లు తలఊపాడు. ఆహా, ఏంమనిషి! ఎంత మంచి,..."అంటూ ఆశ్చర్యంగా నిలుచున్నాడు.

"ఇంతకూ ఏమన్నాడయ్యా!"

"ఏమీ అనలేదు. జరిగినదంతా నేనే చెప్పాను. చాలా సజావుగా నడిచింది వ్యవహారం."

"సజావుగా ప్రవర్తించావన్నమాట!"

"ఉన్న తెలివితేటలు ఉపయోగించావు కదూ?"

"కాదు. అక్కడికి వెడితే లేని తెలివితేటలు వస్తాయి. ఆ గోడలమధ్య నిలుచుంటే చాలు! పెడసరంగా ప్రవర్తించరు ఎవ్వరూ."

"అవును, ఆగోడల మహిమే అంత!" అంటూ నవ్వాడు నెస్టెర్రింకో.

మొదటి భాగం సంపూర్తి

ఆంధ్రా ప్రింటర్సు,
విజయవాడ-2.